# శైవ వాఙ్మయం – ఉపశ్రేణి వర్గాల అధ్యయనం

పరిశోధన

పి. నీరజ

పర్యవేక్షణ

ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు

తెలుగులో పి.హెచ్.డి. పట్టా కొరకు

హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన

సిద్ధాంత గ్రంథం

**2009**

# శైవ వాఙ్మయం –
# ఉపశ్రేణి వర్గాల అధ్యయనం


*పరిశోధన*

పి. నీరజ

*పర్యవేక్షణ*

ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు


తెలుగులో పి.హెచ్.డి. పట్టా కొరకు

హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన

సిద్ధాంత గ్రంథం

2009

# ŚAIVA VĀṄMAYAṂ -

## UPAŚRĒṆI VARGĀLA ADHYAYANAṂ


*Researcher*

**P. NEERAJA**

*Supervisor*

**Prof. NADUPALLI SRIRAMA RAJU**


A Dissertation submitted in partial fulfilment of the requirements for the award of the degree of

**DOCTOR OF PHILOSOPHY IN TELUGU**


**DEPARTMENT OF TELUGU**

**UNIVERSITY OF HYDERABAD**


**2009**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad - 500 046.

Date :

# CERTIFICATE

This is to certify that I, P. NEERAJA have carried out this research work embodied in the present thesis for the full period prescribed under Ph.D. ordinance of the University of Hyderabad. My topic of the Ph.D. programme is

**Śaiva Vāṅmayaṃ - Upaśrēṇi Vargāla Adhyayanaṃ**

I declare to the best of my knowledge that no part of the dissertation was earlier submitted for the award of any research degree of any University or Institution.

(P. NEERAJA)
Regd. No. 02 HT PH 03
Researcher

(Prof. N. SRI RAMA RAJU)
Supervisor

(Prof. MOHAN G RAMANAN)
Dean
School of Humanities
University of Hyderabad.

(Prof. B. RAMABRAHMAM)
Head
Department of Telugu
School of Humanities.

# కృతజ్ఞతలు

నేను హైదరాబాదు విశ్వవిద్యాలయంలోనే ఎం.ఎ., ఎం.ఫిల్. కోర్సులు పూర్తి చేశాను. అలాగే ఈ విశ్వవిద్యాలయంలోనే పి.హెచ్.డి. కూడా చేయాలనుకున్నాను. నా ఆసక్తికి తగ్గట్లుగానే పి.హెచ్.డి లో నాకు సీటు వచ్చింది. ముందుగా హైదరాబాదు విశ్వవిద్యాలయానికి నా కృతజ్ఞతలు.

నా పర్యవేక్షకులైన ఆచార్య శ్రీరామరాజుగారు నాకు పరిశోధనలో ఎన్నో సూచనలు చేసి పరిశోధన పూర్తికావడానికి ఎంతో తోడ్పడి నన్ను ప్రోత్సహించారు. వారికి నా కృతజ్ఞతలు.

నా పరిశోధనలో ఎంతో సహాయ సహకారాలందించి నాకు తోడ్పడిన తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి, ఇంకా మిగతా అధ్యాపకులైన ఆచార్య పరిమి రామనరసింహం గారికి, ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, డా॥ అరుణ కుమారి గారికి, డా॥ ఆర్.వి. రామకృష్ణ శాస్త్రి గారికి, డా॥ రాములు గారికి, డా॥ పవన్ కుమార్ గారికి, డా॥ దార్ల వెంకటేశ్వరరావు గారికి, డా॥ డి. విజయలక్ష్మి గార్లకు నా కృతజ్ఞతలు.

తెలుగుశాఖలో నాన్‌టీచింగ్ సభ్యులైన విష్ణువర్ధన్‌రెడ్డి గారు, శ్రీధరన్‌గారు, కిషన్‌గారు కూడా నాకు సహకారన్నందించారు. వారికి నా కృతజ్ఞతలు.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ వారు నాకు ఫెలోషిప్‌ను అందించి ఆర్థికంగా నా పరిశోధనకు ఎంతగానో సహాయపడ్డారు. వారికి నా కృతజ్ఞతలు.

అలానే నేను పరిశోధనలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ గ్రంథాలయం, ఆంధ్రా విశ్వవిద్యాలయ గ్రంథాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయ గ్రంథాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయం, హైదరాబాదు విశ్వవిద్యాలయ గ్రంథాలయాలను సందర్శించాను. అన్ని విధాల సహకరించిన ఆయా విశ్వవిద్యాలయ మరియు గ్రంథాలయ నిర్వహణ అధికారులందరికీ నా కృతజ్ఞతలు.

వ్యక్తిగతంగా నా అభివృద్ధికి అన్ని విధాలా కారణమై నన్ను ఎంతగానో ప్రోత్సహించిన నా తల్లిదండ్రులు శ్రీమతి కృష్ణవేణి, శ్రీ శ్రీరామమూర్తి గార్లకు నేను సర్వదా కృతజ్ఞురాలిని.

నా పరిశోధనకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చి నాకు బాగా సహాయ సహకారాలందించిన నా భర్త శ్రీ రామనారాయణ మూర్తి గారికి, నా అత్తమామలు శ్రీ వెంకటలక్ష్మి, శ్రీ సత్యనారాయణ మూర్తి గార్లకు నా కృతజ్ఞతలు. అలాగే అల్లరి చేయకుండా నన్ను పరిశోధన చేసుకోనిచ్చిన నా ముద్దుల కూతురు హర్షితకు నా ఆశీస్సులు.

నా అక్క, బావ శ్రీదేవి, వెంకటశాస్త్రీ గారు కూడా నా పరిశోధనకు ఎంతో ప్రోత్సాహాన్నందించారు. వారికి నా కృతజ్ఞతలు. వారి కొడుకైన హర్ష తన చెల్లెలు హర్షితను ఆడించి నా పరిశోధన సజావుగా సాగేందుకు సహాయపడ్డాడు. వాడికి నా ఆశీస్సులు.

నా మిత్రులైన బాజి, రవి, రవీంద్రబాబులు నా పరిశోధనలో ఎంతగానో సహాయపడ్డారు. వారికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని అందంగా తీర్చిదిద్దిన రవికి కృతజ్ఞతలు.

**- నీరజ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| **1. పరిచయం** | - | **01 - 03** |
| **2. సాహిత్యం - సమాజం - మతం** | - | **04 - 12** |
| 2.1. సాహిత్యం - సమాజం | - | 04 |
| 2.1.1. రచయిత - సమాజం | - | 05 |
| 2.2. తెలుగు సాహిత్యం - సమాజం | - | 06 |
| 2.2.1. ప్రాచీన సాహిత్యం - సమాజం | - | 07 |
| 2.2.2. ఆధునిక సాహిత్యం - సమాజం | - | 08 |
| 2.3. సాహిత్యం - మతం | - | 08 |
| 2.4. తెలుగు సాహిత్యం - మతం | - | 09 |
| 2.4.1. ప్రాచీన సాహిత్యం - మతం | - | 10 |
| 2.4.2. ఆధునిక సాహిత్యం - మతం | - | 12 |
| **3. శైవమతం - శైవసాహిత్యం** | - | **13 - 31** |
| 3.1. శైవమతం - తత్త్వం | - | 13 |
| 3.2. శైవమతం - దక్షిణ భారతదేశంలో వ్యాప్తి | - | 15 |
| 3.3. శివకవియుగము | - | 16 |
| 3.3.1. శివకవియుగం నాటి రాజకీయ పరిస్థితులు | - | 17 |
| 3.3.2. శివకవియుగం నాటి మత పరిస్థితులు | - | 17 |
| 3.3.3. శివకవియుగం నాటి భాషా పరిస్థితులు | - | 18 |
| 3.4. శివకవులు | - | 19 |
| 3.4.1. శివకవులు - తెలుగు సాహిత్యం | - | 20 |
| 3.4.2. శైవసాహిత్యం - లక్షణాలు | - | 24 |

3.4.3. శివకవులు - రచనల పరిచయం - 25

3.4.3.1. మల్లికార్జున పండితారాధ్యుడు - 25

3.4.3.2. పాల్కురికి సోమనాథుడు - 27

**4. క్రీ.శ. 12, 13 శతాబ్దాల సమాజం - ఉపశ్రేణి వర్గాల పరిచయం**

4.1. మతం - 32

4.1.1. శైవం - 32

4.1.2. వైష్ణవం - 34

4.1.3. జైనం - 36

4.1.4. బౌద్ధం - 37

4.2. జానపద దేవతలు - 38

4.3. మంత్రాలు - తాంత్రిక విద్యలు - నమ్మకాలు - 40

4.4. వర్గం - కులం - 42

4.4.1. బ్రాహ్మణులు - 42

4.4.2. క్షత్రియులు - 43

4.4.3. వైశ్యులు - 44

4.4.4. శూద్రులు - 45

4.4.5. బోయలు - 46

4.4.6. చెంచులు - 47

4.4.7. పుళిందులు - 47

4.4.8. గొల్లలు - 47

4.4.9. కాపు/రెడ్డి - 48

4.4.10. కమ్మ - 48

4.4.11. కుమ్మరి - 48

4.4.12. కాసె - 49
4.4.13. సాలెలు - 49
4.4.14. మేదరులు - 49
4.4.15. మంగలి - 49
4.4.16. చాకలి - 50
4.4.17. వడ్రంగి - 50
4.4.18. పిచ్చుక కుంట్లు - 50
4.4.19. దూదేకులు - 50
4.4.20. కాయస్థులు - 50
4.4.21. కుట్టుపనివారు - 51
4.4.22. పంచములు/దళితులు - 51
4.5. అలంకార సామాగ్రి - 53
4.6. ఆహార పదార్థాలు - 54
4.7. తూనికలు - కొలతలు - 54
4.8. ఆటలు - వినోదాలు - 55
4.9. పండుగలు - ఉత్సవాలు - జాతర్లు - 56
4.10. వైద్యం - 58
4.11. చెరువులు - 59
4.12. నేరాలు - శిక్షలు - 60
4.13. సాంఘిక దురాచారాలు - 61
4.13.1. దొంగతనం - 61
4.13.2. వేశ్యావృత్తి - 61
4.13.3. మద్యపానం - 62

5. శైవ వాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల జీవనం - 63 - 145
5.1. కులవ్యవస్థ - 63
5.1.1. కులాలు - వృత్తులు - 64
5.1.1.1. బోయలు - 66
5.1.1.2. వెట్టి - 67
5.1.3. కులం - విద్య - 68
5.1.4. కులం - దేవాలయం - 69
5.1.5. కులం - అస్పృశ్యత - 70
5.1.6. అంత్యకులజులు - 72
5.1.6.1. సూరసానమ్మ - 72
5.1.6.2. చాకలిమాచయ్య - 73
5.1.6.3. శివనాగయ్య - 74
5.1.7. కులం - శైవం - 75
5.2. స్త్రీ - 76
5.2.1. వేశ్యలు - 77
5.2.2. వేశ్యావృత్తి - 79
5.3. దొంగతనాలు - 80
5.4. కొలతలు - 83
5.5. దానాలు - 85
5.6. ఆర్థిక సంబంధాలు - 88
5.6.1. మేదరులు - వ్యాపారం - 90
5.6.2. కూలీలు - 91
5.6.3. వ్యవసాయం - 93
5.6.4. ఉత్పత్తులు - 98

5.7. ఉపశ్రేణి వర్గాలు - సంస్కృతి - 101

5.7.1. క్రీడలు - 102

5.7.2. పండగలు - వినోదాలు - 106

5.7.3. నోములు - వ్రతాలు - 107

5.7.4. తిరునాళ్లు - జాతరలు - 109

5.7.5. వ్యాధులు - వైద్యం - 112

5.7.6. కళలు - 115

5.7.7. ఆహారం - 120

5.7.8. గృహవాతావరణం - 124

5.7.9. మూఢనమ్మకాలు - 126

5.8. ఉపశ్రేణి వర్గాలు - మతం - 132

5.8.1. వీరశైవం - ఆంధ్రదేశం - 135

5.8.2. వీరశైవం - ఉపశ్రేణి వర్గాల భక్తులు - 137

5.8.3. అన్యమత నిరసన - 140

5.8.4. మతస్వేచ్ఛ - 142

5.9. మిండజంగాలు - 145

**6. ముగింపు** - 146

**ఉపయుక్తగ్రంథసూచి** - 153

* * *

# 1. పరిచయం

# 2. సాహిత్యం - సమాజం - మతం

# 3. శైవమతం - శైవసాహిత్యం

# 4. క్రీ.శ. 12, 13 శతాబ్దాల సమాజం - ఉపశ్రేణి వర్గాల పరిచయం

# 5. శైవ వాఙ్మయం -
# ఉపశ్రేణి వర్గాల జీవనం

# 6. ముగింపు

# 2.సాహిత్యం - సమాజం - మతం

# 3. శైవమతం - శైవసాహిత్యం

# 4. క్రీ.శ. 12, 13 శతాబ్దాల సమాజం - ఉపశ్రేణి వర్గాల పరిచయం

# 5. శైవ వాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల జీవనం

# 2. సాహిత్యం - సమాజం - మతం

సాహిత్యం, సమాజం రెండూ ఒకదాని ప్రభావానికి మరొకటి గురి అవుతుంటాయి. సాహిత్యం పుట్టడానికి సమాజం భూమిక. అదే విధంగా సమాజంలోని కొన్ని అంశాలను సాహిత్యం ప్రభావితం చేస్తుంది.

## 2.1. సాహిత్యం - సమాజం

ఆదిమ గణ సమాజాలలో శ్రమలో భాగంగా గానం, నృత్యం కలిసే పుట్టాయని పరిశోధకులు భావిస్తారు. నృత్యగానాలతో కూడిన భాష క్రమంగా పరిణామం చెంది పాట పుట్టిందని వీరి అభిప్రాయం. ఆవిధంగా సాహిత్యం సమాజం నుండి ఉద్భవించిందని తెలుస్తోంది. అందువల్ల సాహిత్య మూలాలను సమాజంలో చూడవలసిన అవసరం ఉంది. పరిణామ దశలో మనిషి పశుపోషణ, వ్యవసాయం అలవాటు చేసుకొన్నాడు. పని చేసేటప్పుడు శ్రమలో భాగంగా పాటలను పాడుకొనేవాడు. ఇవి వ్యవసాయం చేసే విధానాన్ని చెప్పడంతో పాటు, మానసిక ఆనందాన్ని కూడా ఇచ్చేవి. ఈ విధంగా సాహిత్య మూలాలు సమాజంలో ముడిపడి ఉన్నాయని చెప్పవచ్చు.

లిఖిత సాహిత్యం ప్రారంభమైన తర్వాత మౌఖిక సాహిత్యం కింది తరగతులకు పరిమితమవగా, లిఖిత సాహిత్యం పాలక వర్గాల అండదండలతో ప్రధానశాఖగా అభివృద్ధి చెందింది.

సమాజంలో మౌలికమైన మార్పు వచ్చినప్పుడల్లా సాహిత్యంలోనూ మార్పు వస్తుంది. అదే విధంగా ఆ మార్పు రావడానికి సాహిత్యమూ కారణమవుతుంది. ఉదాహరణకు భూస్వామ్య వ్యవస్థలో వచ్చిన పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు ఎక్కువ రాచరిక స్వభావాన్ని తెలుపుతూ ఉంటాయి. ఆధునిక కాలంలో వస్తున్న కవిత, కథ, నవల వంటి ప్రక్రియా భేదంతో ఉన్న సాహిత్యం సామాన్య మానవుని జీవితాన్ని వర్ణిస్తుంది.

ఆధునిక సాహిత్యంలోనైనా, ప్రాచీన సాహిత్యంలోనైనా సమాజంలోని వివిధ అంశాలు సాహిత్యంలో ఎలా ప్రతిఫలిస్తాయి ?, అలా ప్రతిఫలించిన అంశాలు సమాజం ప్రగతిపథంవైపు నడవడానికి ఎలా కారణం అవుతాయి ? అనే రెండు ప్రధాన ప్రశ్నలు సాహిత్యానికి సమాజానికి గల సంబంధాన్ని తెలియజేస్తాయి.

## 2.1.1. రచయిత - సమాజం

రచయిత సమాజానికి, సాహిత్యానికి మధ్య వాహిక లాంటి వాడు. రచయితపై సమాజంలోని అనేకాంశాల ప్రభావం ఉంటుంది. వీటి నేపథ్యంలో రచయిత సాహిత్యాన్ని సృష్టిస్తాడు. అంటే ఒక నిర్దిష్ట కాలంలో ఉన్న సమాజాన్ని అనుసరించి సాహిత్య సృష్టి జరుగుతుందని గమనించాలి.

*"కవిని తీర్చిదిద్దే అంశాలు మూడు ఉన్నాయంటాడు టెన్. (i) జాతి (Race) (ii) సామాజిక పర్యావరణం (milien) (iii) క్షణం (moment). ఒకానొక కావ్యాన్ని వ్రాసే కవి ఒక జాతికి చెంది ఉండడం వల్ల ఆ జాతి లక్షణాలు అతనిలో ప్రతిఫలిస్తాయి. తర్వాత, ఆ జాతికి, దేశానికి సంబంధించిన సాంస్కృతిక, నాగరికతా వాతావరణంలో పెరుగుతుంటాడు. వాటి ప్రభావం అతని రచన మీద పడుతుంది. ఈ రెండూ గాక కావ్య రచనా క్షణం ఒకటి ఉంటుంది. ఇక్కడ క్షణం అంటే కావ్య రచనా కాలమందు రచయితను పురిగొల్పే అంశం (impulse). అది ఆ యుగ లక్షణానికి సంబంధించినదై ఉంటుంది. అంతకు ముందు నుంచీ కవి సంగ్రహించుకున్న శక్తులన్నీ తత్కాల మందలి తీవ్ర ప్రేరణ వల్ల నిర్దేశింపబడిన దిశలో విజృంభిస్తాయి."*

(మందేశ్వరరావు, వడలి 1994: 172).

అందువలననే సాహిత్యం సమాజంలోని అంశాలనే కళాత్మకంగా ప్రతిఫలింపజేస్తుంది. అయితే ఇలాంటి సాహిత్యం వలన సమాజానికి ప్రయోజనమేమిటి అన్నది రెండోవ ప్రశ్న. అంటే *"సాహిత్యం ఎందుకు? విశ్వ శ్రేయస్సుకా? రసానుభూతికా? అనే ప్రశ్నలకు సమాధానం రెండింటికీ అని. రసం సమాజ నిష్ఠం కాబట్టి పాఠకులే రచనకి సమర్థులైన వ్యాఖ్యాతలు. కానీ రచయిత తన కాలానికంటే ముందుండాలి. కాబట్టి కాలాన్ని ముందుకు తీసుకొని వెళ్లే చైతన్యాన్ని చూపాలి. అవసరం వస్తే తన సిద్ధాంతాలని, దర్శనాన్ని ఊతగా చేసుకొని సంఘానికి ఎదురు తిరగాలి.*

*మేథావులంతా ఏదో విధంగా నిబద్ధమైన వ్యవస్థకి ఎదురు తిరిగినవారే. సత్యాన్వేషిగా, జిజ్ఞాసువుగా, తార్కికుడిగా, పరిశీలకుడిగా, పండితుడిగా ఇలా బహుముఖీనుడై రచయిత సమాజాన్ని ప్రగతివైపు మళ్లించాలి. అజ్ఞానాన్ని, అబద్ధాన్ని, అధర్మాన్ని ఖండించాలి. ఆకలికేకలూ, అసహాయాలాపనలూ వినగలగాలి. దీనుల, హీనుల కన్నీరు తుడవాలి.”*

(కె.అరుణావ్యాస్ 1988: 186)

ఇటువంటి లక్షణాలతో రచన చేసిన రచయిత సాహిత్య ముఖ్య ప్రయోజనమైన సమాజాన్ని ముందుకు తీసుకెళ్తాడు. ఇటువంటి రచన సమాజ, సాహిత్య సంబంధాలను సంపూర్ణంగా వివరించగలదు. సమాజంలోని ప్రజలకు సాహిత్యం మానసికానందంతో పాటు భౌతికావసరాలను తీర్చే అవకాశాలను చూపాలి.

సాహిత్యం ప్రజలను జ్ఞానవంతులుగా తీర్చి, తద్వారా సమాజ పురోభివృద్ధికి తోడ్పడుతుంది. “*సాహిత్యం ప్రజలను జ్ఞానవంతులుగా చేస్తుంది. వారు ఇతః పూర్వం కన్నా బాగా జీవించడానికి తోడ్పడుతుంది. వారి భావోద్రేకాలను ఉన్నత పథానికి కొని పోతుంది. తమ బంధువుల, స్నేహితుల ఇతర ప్రజలందరిని గురించి ఎక్కువగా ఆలోచించేటట్లు చేస్తుంది. నవలలు, కథలు, కవిత సమాజాన్ని బంధించే భావోద్రేక బంధనాలు.*” (ఇల్యా ఎహ్రెన్ బర్గ్ 1955: 54).

ఈ విధంగా సాహిత్యం సమాజానికి మేలు చేస్తుంది. అదే విధంగా సాహిత్యం సమాజం నుండే పుడుతుంది. ఇవి రెండూ ఈ విధంగా ఒకదాని ప్రభావానికి మరొకటి లోనవుతూ ఉంటాయి.

## 2.2. తెలుగు సాహిత్యం - సమాజం

కొన్ని రచనల్లో ఆ కాలం నాటి మానవుల జీవితం ముడిపడి ఉంటుంది. రచయిత ఎన్నుకున్న వస్తువు సమకాలీనంగాని కల్పితంగాని అయితే దాని ప్రభావం సమాజంపై ఎక్కువగా ఉంటుంది. ప్రాచీనమైనదైతే సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాలు ఆ కాలానికి చెందినవై ఉంటాయి. అంతే కాకుండా అప్పటివరకు వచ్చిన సాహిత్య ప్రభావం కూడా రచయితపై ఉంటుంది.

## 2.2.1. ప్రాచీన సాహిత్యం - సమాజం

తెలుగు సాహిత్యంలో లిఖితరూపంగా వెలువడిన మొదటి రచన నన్నయ భారతం. నన్నయ సంస్కృత వ్యాస భారతాన్ని వస్తువుగా ఎన్నుకున్నా ఎక్కువ భాగం స్వతంత్రంగా రచించాడు. నన్నయ భారత రచనకు ఉపక్రమించడానికి ఆనాటి సమాజ స్థితిగతులే కారణం. ముఖ్యంగా "*పదకొండవ శతాబ్దంనాటి తెలుగు దేశంలోని అస్థిర రాజకీయ పరిస్థితులలో భూస్వామ్య పాలక వర్గంపైన బ్రాహ్మణ మతంపైన విశ్వాసాన్ని కలిగించే ప్రయత్నంలో జరిగిన కళాత్మక రచనే తెలుగు భారతం.*" (రంగనాథాచార్యులు 1990: 11). అందువలననే భారతం ఈ పాలక వర్గానికి చెందినదిగా కనిపిస్తుంది. రచన ఉద్భవించడానికి రాజపోషణ, నన్నయ వైదిక మత అనుయాయుడు కావడం వంటివి ముఖ్య కారణాలు. అందువల్లనే నన్నయ భారతం "*బ్రాహ్మణ మత ధర్మానికి ప్రతీకగా, ఉపాఖ్యానాలతో పాటు అనువర్తించిన ధార్మిక కావ్యంగా రాచరిక వ్యవస్థను కీర్తించే గ్రంథంగా, సంస్కృతీ కరణకు ప్రతీకగా, దేశీయ రచనా మార్గానికి భిన్నంగా భారతం దర్శనమిస్తుంది.*" (రంగనాథాచార్యులు 1990: 11). ఇవన్నీ నన్నయ భారత రచన వెనుక ఉన్న సమాజ పరిస్థితులు.

తిక్కన ప్రవేశపెట్టిన హరిహరనాథ తత్వం ఆ కాలంనాటి సమాజంలో శైవ, వైష్ణవ మత విభేదాలను తెలియజేస్తుంది. శ్రీనాథుడి భోగలాలస జీవితం, రాజులను ఆశ్రయించడం, ఆనాటి రాజపోషణ, కవుల జీవితాలను తెలియజేస్తాయి. పోతన భక్తితత్త్వం, రాజాశ్రయ నిరాకరణ కవులకు దైవంపై, భక్తిపై గల అపార భక్తి శ్రద్ధలను తెలియజేస్తాయి. అయితే ఇవన్నీ సమాజంలోని ఉన్నత లేక పాలక వర్గానికి చెందినవై వారి జీవన విధానాలను తెలియజేసేవిగా కనిపిస్తాయి. భక్తిని కింది వర్గానికి, అన్ని తరగతుల వారికి దగ్గర చేయడానికి ప్రయత్నించిన వారు పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితుడు. వీరి రచనలు శైవ సాహిత్యం.

ప్రబంధ కాలం నాటికి సాహిత్యం ఎక్కువగా అలంకారిక లక్షణాలతో కూడుకొని శృంగారాది రసాలకు ప్రాధాన్యతనిచ్చి, వర్ణనాత్మకంగా వెలువడింది. ఈ లక్షణాలు కొంతవరకు సమాజానికి సాహిత్యాన్ని దూరం చేశాయి. అయినా

రాయవాచకం లాంటి రచనలూ ఈ కాలంలో వచ్చాయి. ప్రబంధ యుగం కొనసాగింపుగా దక్షిణాంధ్రయుగ సాహిత్యం కనిపిస్తుంది. ప్రబంధ సాహిత్య లక్షణాలను వేలం వెర్రిగా అనుసరించినట్లు కనిపిస్తుంది. అయితే ఈ కాలంలోనే యక్షగానాల వంటి దేశి సాహిత్యం కూడా వెలువడింది.

## 2.2.2. ఆధునిక సాహిత్యం - సమాజం

వలస పాలన ప్రారంభమయ్యాక, ఆంగ్ల విద్యావ్యాప్తి, ముద్రణా యంత్రాలు, ప్రయాణ సౌకర్యాలు, ఇతర దేశాల సాహిత్య ప్రభావం, సమాజంలోని మధ్య తరగతి అభివృద్ధి చెందడం, స్వాతంత్ర్య కాంక్ష ప్రారంభమవడం మొదలైనవన్నీ సమాజంలో గుర్తించదగిన మార్పులుగా కనిపిస్తాయి. వీటి ప్రతిఫలమే ఆధునిక కాలంలో వచ్చిన సంఘసంస్కరణ సాహిత్యం, భావకవిత్వం, జాతీయవాద సాహిత్యం, అభ్యుదయ, విప్లవ రచయితల సంఘాల ఆవిర్భావం మొదలైనవి. ఇవి అన్నీ కూడా తెలుగు సాహిత్యానికి, సమాజానికి మధ్య ఉన్న పరస్పర ప్రభావాన్ని తెలియజేసేవే.

ముఖ్యంగా ప్రపంచీకరణ ప్రారంభమయ్యాక ఎక్కువగా వచ్చిన దళిత, స్త్రీ, ప్రాంతీయ, మైనారిటీ సాహిత్యాలు సమాజంలోని వివిధ అస్తిత్వ మూలాలను ప్రకటిస్తున్నాయి. ఈ విధంగా సాహిత్యంలో సమాజం అంతర్గతంగా కాని, బాహ్యంగా కాని కనిపిస్తూనే ఉంటుంది. తెలుగు సాహిత్య, సమాజాలు రెండూ పై అంశాల ఆధారంగా పరస్పర ప్రభావానికి గురి అయినవేనని తెలుస్తోంది.

## 2.3. సాహిత్యం - మతం

సాహిత్యం వలే మతం కూడా సమాజంలో ఒక ప్రధానాంశం. ఇది కూడా సమాజం మారడానికి ప్రధాన పాత్ర పోషిస్తుంది. అదే విధంగా మతమూ, సాహిత్యము సమాజంలో ఉంటూ ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేసుకొంటూ, సమాజ పరిణామంలో ముఖ్యమైనవిగా ఉంటాయి.

*"మతమూ సాహిత్యమూ ఒకే కుదురు నుంచి పుట్టాయి గనుక సాహిత్యంలోనూ తొలిదశలో సర్వాత్మ వాద లక్షణం కనపడుతుంది. దీనిలో మానవ*

*సంబంధాలు కూడా ప్రవేశించాయి. దాంతో బాహ్య వాస్తవికత మానవీకరణం చెందింది. కాబట్టి పౌరాణిక జానపద గాథల్లో పశువులూ, పక్షులూ మాట్లాడతాయి. అడవులూ (వనదేవతలు), కొండలూ మాట్లాడుతాయి."* (శివశంకర్ 1996: 19).

మతంలోను, సాహిత్యంలోను కొన్ని సామ్యాలూ, కొన్ని భేదాలు కనిపిస్తాయి. మత వ్యాప్తి కోసం, విశ్లేషణ కోసం సాహిత్యం సహాయపడింది. సాహిత్యం మత వ్యాప్తికి ఉపయోగపడుతూనే సమాజ ప్రయోజనానికి ఉపయోగపడుతుంది.

మతం అనేది హేతువుకు, శాస్త్రీయతకు లొంగని అంశాలను నమ్మేటట్లు చేస్తుంది. ప్రజలు వీటిని వారసత్వంగానో, సంప్రదాయంగానో ఆచరిస్తూ ఉంటారు. సమాజంలో మత సంబంధ విషయాలలో తీవ్ర ఉద్రిక్తత కలిగినప్పుడో, ఎక్కువ మందికి ఆచరణీయంగా కాక పోయినప్పుడో మతంలోని మౌలికాంశాలలో మార్పులు వస్తాయి, లేదా నూతన మతాల పుట్టుక జరుగుతుంది. ఉదాహరణకు వైదికమతం హింసకు, కర్మకాండకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి సామాన్యులకు దూరమైనప్పుడు బౌద్ధ, జైన మతాలు ఆవిర్భవించాయి. సాహిత్యం వలే మతం కూడా పాలక వర్గానికి లేదా అధికార వర్గానికి అనుకూలంగానే ఉంటుంది. అందువల్ల మత సంబంధిత అంశాలు సాహిత్యంలో చోటు చేసుకుంటాయి. మత లక్షణాలు, నియమాలు పాత్రలతో, వర్ణనలతో కళాత్మకంగా సాహిత్యంలో చెప్పబడతాయి.

## 2.4. తెలుగు సాహిత్యం - మతం

సాహిత్యానికి, మతానికి ఉన్న సంబంధాలు తెలుగు సాహిత్యంలోనూ కనిపిస్తాయి. తెలుగులో లిఖిత సాహిత్యం మత ప్రమేయంతోనే పుట్టిందని విమర్శకుల అభిప్రాయం.

తెలుగు సాహిత్యాన్ని చారిత్రక విమర్శకులు ఆస్థానేతర సాహిత్యంగా విభజించి వివరిస్తారు. అయినా "*ఆస్థాన సాహిత్యానికైనా, ఆస్థానేతర సాహిత్యానికైనా మతమే ప్రధాన ప్రాతిపదికగా కనిపిస్తుంది."* (రంగనాథాచార్యులు 1981: x).

## 2.4.1. ప్రాచీన సాహిత్యం - మతం

మత ప్రాతిపదికన కనిపిస్తున్న సాహిత్యం నన్నయ నుండి ఆధునిక దశ ప్రారంభం వరకు ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. నన్నయ తర్వాత తిక్కన వరకు ఉన్న శైవ సాహిత్యం మత ప్రచారంలో భాగంగా హింసను కూడా బోధించడానికి వెనుకాడలేదు. అయినా శైవం ప్రజలకు దగ్గరవడానికి కొంత ప్రయత్నించింది. ఆ తర్వాత శైవ వైష్ణవాల మధ్య సామ్యాన్ని కుదర్చడానికే తిక్కన హరిహరనాథుణ్ణి సృష్టించినట్లు పరిశోధకుల అభిప్రాయం.

*"సామాజిక భావరంగాన్ని అకలుషితం/అక్లిష్టం చేయకపోతే, సమాజానికి/ దేశానికి భద్రత లేదని గుర్తించిన తిక్కనగారు దాని కోసం చేసిన ప్రయత్నమే హరిహరనాథ తత్త్వ ప్రతిపాదన. 'భక్తజనంబు వైదికధ్యాయిత కిచ్చమెచ్చ పరతత్వము గొల్చెద నిష్టసిద్ధికిన్' అన్నారు తిక్కనగారు ప్రారంభంలో. ఇక్కడ ప్రత్యేకంగా పేర్కొనబడ్డ 'భక్తజనం' ఎవరు ? వీరి ఏ విధమైన ధ్యానాన్ని పరతత్త్వం మెచ్చుతుంది. అనేక విధ నామ - రూపవంతమైనా గూడా పరమార్థతః పరతత్త్వమొకటే అన్న భావనతో ధ్యానించే భక్తజనం వీరు. ఈ విధమైన ధ్యానరీతి వైదికమైంది."*

(రంగనాథాచార్యులు 1981: 66).

ఈ విధంగా తిక్కన వైదిక మతంలోని భిన్నత్వాన్ని ఏకతాటి మీద నడపడానికి ఈ అభేద తత్త్వాన్ని తీసుకొనివచ్చారు.

శ్రీనాథుడి రచనలు కాశీఖండం, భీమఖండం, హరవిలాసం మొదలైనవన్నీ శైవమత సంబంధితమైనవి. శివుని తత్త్వాన్ని, శివభక్తుల గొప్పతనాన్ని తెలుపుతాయి. అదే విధంగా పోతన భాగవతంలో విష్ణువు అవతారాలుగా చెప్పబడే రామ, కృష్ణులను కీర్తించడం, కృష్ణతత్వానికి కాల్పనికత జోడించి వివరించడం కనిపిస్తుంది.

పోతన, శ్రీనాథులు ఒకే కాలానికి చెందినవారు, అయినా వారి సాహిత్యంలో శైవ, వైష్ణవ మతాల ప్రాముఖ్యం కనిపిస్తుంది.

ప్రబంధ సాహిత్య పోషకుడైన శ్రీకృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్తమాల్యదలో' విష్ణుభక్తుల కథలే ప్రధానంగా ఉన్నాయి. మిగిలిన కవులు కూడా శైవ, వైష్ణవ మతాలకు సంబంధించిన రచనలే చేశారు.

"*నంది తిమ్మన, పింగళి సూరన శ్రీకృష్ణునికి సంబంధించిన ఇతివృత్తాలు స్వీకరించగా, తెనాలి రామకృష్ణుడు విష్ణు ప్రశంసా పరమైన 'పాండురంగ మాహాత్మ్యం' వివరించాడు. అయ్యలరాజు రామభద్రుడు రామావతార గాథను అభివర్ణించాడు. అయితే నాటి కవులందరూ వైష్ణవులు కారు. శైవులైన మల్లన, ధూర్జటి కృష్ణదేవరాయల ఆశ్రితులు కావటం, ఆయన పరమత సహనానికి నిదర్శనం. కాని మతమార్పిడి నాడు వాడుకలో ఉన్నట్లు సాక్ష్యాలు లేకపోలేదు. విశిష్టాద్వైతి అయిన పెద్దన మొదట అద్వైతిగా ఉండినట్లు, తెనాలి రామలింగడు రామకృష్ణుడుగా మారినట్లు కొన్ని ఐతిహ్యాలు ప్రచారంలో ఉన్నాయి.*" (రంగనాథాచార్యులు 1981: 125).

ధూర్జటి కాళహస్తీశ్వర శతకం, కాళహస్తీశ్వర మాహాత్మ్యం శైవమత సంబంధిత రచనలు. ఏది ఏమైనా ప్రబంధాలు శైవం కాని, వైష్ణవం కాని వైదిక మత ప్రాముఖ్యాన్ని తెలియజేసేవిగా కనపడతాయి. కృష్ణదేవరాయలు, భట్టుమూర్తి లాంటి కొందరు తప్ప మిగిలిన కవులందరూ బ్రాహ్మణ కులానికి చెందినవాళ్లు. అంటే మతాచారాల పట్ల ఎక్కువ ఇష్టం ఉన్నవాళ్లు అని అర్థం చేసుకోవచ్చు.

దక్షిణాంధ్రయుగ సాహిత్యాన్ని సాహిత్యకారులు క్షీణయుగంగా చెప్తారు. అందుకు కారణం సాహిత్యం రూప పరంగా విస్తృతమైన మార్పులకు లోనుకావడం. అయినా ఆ సాహిత్యం మతానికి దూరం కాలేదు. దక్షిణాంధ్రయుగంలో ప్రధాన రాజాస్థానాలైన తంజావూరు, మధుర, చెంజి పరమత సహనాన్ని పాటించినా, మత ప్రాముఖ్యం ఉన్న సాహిత్యం ఆ కాలంలో వెలువడింది.

విజయ రాఘవుని బ్రాహ్మణ భక్తిని చెంగళ్వ కాళ కవి రాజగోపాల విలాసంలో చెప్పాడు. రంగాజమ్మ ఉషాపరిణయంలో మతాలు ఎన్ని ఉన్నా వైష్ణవమతమే శాశ్వతమని చెప్పింది. ఈ కాలంలోనే భారతదేశానికి క్రైస్తవ మతం వచ్చింది. ఈ మత ప్రచారంతోపాటు మహమ్మదీయ కవులు కూడా ఈ యుగ సాహిత్యంలో కనిపిస్తారు.

## 2.4.2. ఆధునిక సాహిత్యం - మతం

ఆధునిక యుగంలో సాహిత్యంపై మత ప్రభావం కొంత తగ్గిందని చెప్పవచ్చు. గురజాడలాంటి వాళ్లు 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచిపోవును' అని మత సామరస్యానికి జ్ఞానం తోడ్పడుతుందని చెప్పారు. జాతీయోద్యమ సాహిత్యంలో భాగంగా పూర్వ సాహిత్యాన్ని కాల్పనిక దృష్టితో చూడడం జరిగింది. అలాంటి సాహిత్యంలో కొంత మత ప్రాముఖ్యత కనిపిస్తుంది. విశ్వనాథ సత్యనారాయణలాంటి కవుల రచనలు ఇందుకు నిదర్శనం.

సాహిత్య చరిత్రలో ఒక ప్రధానశాఖగా భక్తి ఉద్యమ సాహిత్యాన్ని పరిశీలించాలి. పాల్కురికి సోమన, అన్నమయ్య, వేమన, పోతులూరి వీరబ్రహ్మం మొదలైన వాళ్లను భక్తి కవులు లేదా సామాజిక కవులుగా చెప్పవచ్చు. అయితే వీరు మతాన్ని, మత సంబంధిత సాహిత్యాన్ని అధికార వర్గంతో పాటు కింది తరగతుల వాళ్లకు దగ్గర చేయడానికి సాహిత్యం ద్వారా కృషి చేశారు. ఆనాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఇది గొప్ప పరిణామంగా చెప్పాలి.

లిఖిత సాహిత్య శాఖకు భిన్నంగా శ్రామిక జనుల నోళ్లలో జానపద సాహిత్యం బతికింది. అయితే వీరి సాహిత్యంలో మత సంబంధిత అంశాలు తక్కువ. కాని అధికార వర్గ సాహిత్యాన్ని అనుకరించాలనే ప్రయత్నం జరిగినప్పుడు మాత్రం మత సంబంధమైన అంశాలు కనిపిస్తాయి. ఉదాహరణకు జానపదుల పాటలలో, కళారూపాల ప్రదర్శనలో రామాయణ, భారత కథాంశాలు ఉండడం వంటివి. ఇవి కొంత వైదిక మత ప్రశస్తిని తెలియజేసేవిగా ఉంటాయి.

* * *

# 2. సాహిత్యం - సమాజం - మతం

సాహిత్యం, సమాజం రెండూ ఒకదాని ప్రభావానికి మరొకటి గురి అవుతుంటాయి. సాహిత్యం పుట్టడానికి సమాజం భూమిక. అదే విధంగా సమాజంలోని కొన్ని అంశాలను సాహిత్యం ప్రభావితం చేస్తుంది.

## 2.1. సాహిత్యం - సమాజం

ఆదిమ గణ సమాజాలలో శ్రమలో భాగంగా గానం, నృత్యం కలిసే పుట్టాయని పరిశోధకులు భావిస్తారు. నృత్యగానాలతో కూడిన భాష క్రమంగా పరిణామం చెంది పాట పుట్టిందని వీరి అభిప్రాయం. ఆవిధంగా సాహిత్యం సమాజం నుండి ఉద్భవించిందని తెలుస్తోంది. అందువల్ల సాహిత్య మూలాలను సమాజంలో చూడవలసిన అవసరం ఉంది. పరిణామ దశలో మనిషి పశుపోషణ, వ్యవసాయం అలవాటు చేసుకొన్నాడు. పని చేసేటప్పుడు శ్రమలో భాగంగా పాటలను పాడుకొనేవాడు. ఇవి వ్యవసాయం చేసే విధానాన్ని చెప్పడంతో పాటు, మానసిక ఆనందాన్ని కూడా ఇచ్చేవి. ఈ విధంగా సాహిత్య మూలాలు సమాజంలో ముడిపడి ఉన్నాయని చెప్పవచ్చు.

లిఖిత సాహిత్యం ప్రారంభమైన తర్వాత మౌఖిక సాహిత్యం కింది తరగతులకు పరిమితమవగా, లిఖిత సాహిత్యం పాలక వర్గాల అండదండలతో ప్రధానశాఖగా అభివృద్ధి చెందింది.

సమాజంలో మౌలికమైన మార్పు వచ్చినప్పుడల్లా సాహిత్యంలోనూ మార్పు వస్తుంది. అదే విధంగా ఆ మార్పు రావడానికి సాహిత్యమూ కారణమవుతుంది. ఉదాహరణకు భూస్వామ్య వ్యవస్థలో వచ్చిన పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు ఎక్కువ రాచరిక స్వభావాన్ని తెలుపుతూ ఉంటాయి. ఆధునిక కాలంలో వస్తున్న కవిత, కథ, నవల వంటి ప్రక్రియా భేదంతో ఉన్న సాహిత్యం సామాన్య మానవుని జీవితాన్ని వర్ణిస్తుంది.

ఆధునిక సాహిత్యంలోనైనా, ప్రాచీన సాహిత్యంలోనైనా సమాజంలోని వివిధ అంశాలు సాహిత్యంలో ఎలా ప్రతిఫలిస్తాయి ?, అలా ప్రతిఫలించిన అంశాలు సమాజం ప్రగతిపథంవైపు నడవడానికి ఎలా కారణం అవుతాయి ? అనే రెండు ప్రధాన ప్రశ్నలు సాహిత్యానికి సమాజానికి గల సంబంధాన్ని తెలియజేస్తాయి.

## 2.1.1. రచయిత - సమాజం

రచయిత సమాజానికి, సాహిత్యానికి మధ్య వాహిక లాంటి వాడు. రచయితపై సమాజంలోని అనేకాంశాల ప్రభావం ఉంటుంది. వీటి నేపథ్యంలో రచయిత సాహిత్యాన్ని సృష్టిస్తాడు. అంటే ఒక నిర్దిష్ట కాలంలో ఉన్న సమాజాన్ని అనుసరించి సాహిత్య సృష్టి జరుగుతుందని గమనించాలి.

*"కవిని తీర్చిదిద్దే అంశాలు మూడు ఉన్నాయంటాడు టెన్. (i) జాతి (Race) (ii) సామాజిక పర్యావరణం (milien) (iii) క్షణం (moment). ఒకానొక కావ్యాన్ని వ్రాసే కవి ఒక జాతికి చెంది ఉండడం వల్ల ఆ జాతి లక్షణాలు అతనిలో ప్రతిఫలిస్తాయి. తర్వాత, ఆ జాతికి, దేశానికి సంబంధించిన సాంస్కృతిక, నాగరికతా వాతావరణంలో పెరుగుతుంటాడు. వాటి ప్రభావం అతని రచన మీద పడుతుంది. ఈ రెండూ గాక కావ్య రచనా క్షణం ఒకటి ఉంటుంది. ఇక్కడ క్షణం అంటే కావ్య రచనా కాలమందు రచయితను పురిగొల్పే అంశం (impulse). అది ఆ యుగ లక్షణానికి సంబంధించినదై ఉంటుంది. అంతకు ముందు నుంచీ కవి సంగ్రహించుకున్న శక్తులన్నీ తత్కాల మందలి తీవ్ర ప్రేరణ వల్ల నిర్దేశింపబడిన దిశలో విజృంభిస్తాయి."*

(మండేశ్వరరావు, వడలి 1994: 172).

అందువలననే సాహిత్యం సమాజంలోని అంశాలనే కళాత్మకంగా ప్రతిఫలింపజేస్తుంది. అయితే ఇలాంటి సాహిత్యం వలన సమాజానికి ప్రయోజనమేమిటి అన్నది రెండోవ ప్రశ్న. అంటే *"సాహిత్యం ఎందుకు? విశ్వ శ్రేయస్సుకా? రసానుభూతికా? అనే ప్రశ్నలకు సమాధానం రెండింటికీ అని. రసం సమాజ నిష్ఠం కాబట్టి పాఠకులే రచనకి సమర్థులైన వ్యాఖ్యాతలు. కానీ రచయిత తన కాలానికంటే ముందుండాలి. కాబట్టి కాలాన్ని ముందుకు తీసుకొని వెళ్లే చైతన్యాన్ని చూపాలి. అవసరం వస్తే తన సిద్ధాంతాలని, దర్శనాన్ని ఊతగా చేసుకొని సంఘానికి ఎదురు తిరగాలి.*

*మేథావులంతా ఏదో విధంగా నిబద్ధమైన వ్యవస్థకి ఎదురు తిరిగినవారే. సత్యాన్వేషిగా, జిజ్ఞాసువుగా, తార్కికుడిగా, పరిశీలకుడిగా, పండితుడిగా ఇలా బహుముఖీనుడై రచయిత సమాజాన్ని ప్రగతివైపు మళ్లించాలి. అజ్ఞానాన్ని, అబద్ధాన్ని, అధర్మాన్ని ఖండించాలి. ఆకలికేకలూ, అసహాయాలాపనలూ వినగలగాలి. దీనుల, హీనుల కన్నీరు తుడవాలి."*
(కె.అరుణావ్యాస్ 1988: 186)

ఇటువంటి లక్షణాలతో రచన చేసిన రచయిత సాహిత్య ముఖ్య ప్రయోజనమైన సమాజాన్ని ముందుకు తీసుకెళ్తాడు. ఇటువంటి రచన సమాజ, సాహిత్య సంబంధాలను సంపూర్ణంగా వివరించగలదు. సమాజంలోని ప్రజలకు సాహిత్యం మానసికానందంతో పాటు భౌతికావసరాలను తీర్చే అవకాశాలను చూపాలి.

సాహిత్యం ప్రజలను జ్ఞానవంతులుగా తీర్చి, తద్వారా సమాజ పురోభివృద్ధికి తోడ్పడుతుంది. *"సాహిత్యం ప్రజలను జ్ఞానవంతులుగా చేస్తుంది. వారు ఇతః పూర్వం కన్నా బాగా జీవించడానికి తోడ్పడుతుంది. వారి భావోద్రేకాలను ఉన్నత పథానికి కొని పోతుంది. తమ బంధువుల, స్నేహితుల ఇతర ప్రజలందరిని గురించి ఎక్కువగా ఆలోచించేటట్లు చేస్తుంది. నవలలు, కథలు, కవిత సమాజాన్ని బంధించే భావోద్రేక బంధనాలు."* (ఇల్యా ఎహ్రెన్ బర్గ్ 1955: 54).

ఈ విధంగా సాహిత్యం సమాజానికి మేలు చేస్తుంది. అదే విధంగా సాహిత్యం సమాజం నుండే పుడుతుంది. ఇవి రెండూ ఈ విధంగా ఒకదాని ప్రభావానికి మరొకటి లోనవుతూ ఉంటాయి.

## 2.2. తెలుగు సాహిత్యం - సమాజం

కొన్ని రచనల్లో ఆ కాలం నాటి మానవుల జీవితం ముడిపడి ఉంటుంది. రచయిత ఎన్నుకున్న వస్తువు సమకాలీనంగాని కల్పితంగాని అయితే దాని ప్రభావం సమాజంపై ఎక్కువగా ఉంటుంది. ప్రాచీనమైనదైతే సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాలు ఆ కాలానికి చెందినవై ఉంటాయి. అంతే కాకుండా అప్పటివరకు వచ్చిన సాహిత్య ప్రభావం కూడా రచయితపై ఉంటుంది.

## 2.2.1. ప్రాచీన సాహిత్యం - సమాజం

తెలుగు సాహిత్యంలో లిఖితరూపంగా వెలువడిన మొదటి రచన నన్నయ భారతం. నన్నయ సంస్కృత వ్యాస భారతాన్ని వస్తువుగా ఎన్నుకున్నా ఎక్కువ భాగం స్వతంత్రంగా రచించాడు. నన్నయ భారత రచనకు ఉపక్రమించడానికి ఆనాటి సమాజ స్థితిగతులే కారణం. ముఖ్యంగా "*పదకొండవ శతాబ్దంనాటి తెలుగు దేశంలోని అస్థిర రాజకీయ పరిస్థితులలో భూస్వామ్య పాలక వర్గంపైన బ్రాహ్మణ మతంపైన విశ్వాసాన్ని కలిగించే ప్రయత్నంలో జరిగిన కళాత్మక రచనే తెలుగు భారతం.*" (రంగనాథాచార్యులు 1990: 11). అందువలననే భారతం ఈ పాలక వర్గానికి చెందినదిగా కనిపిస్తుంది. రచన ఉద్భవించడానికి రాజపోషణ, నన్నయ వైదిక మత అనుయాయుడు కావడం వంటివి ముఖ్య కారణాలు. అందువల్లనే నన్నయ భారతం "*బ్రాహ్మణ మత ధర్మానికి ప్రతీకగా, ఉపాఖ్యానాలతో పాటు అనువర్తించిన ధార్మిక కావ్యంగా రాచరిక వ్యవస్థను కీర్తించే గ్రంథంగా, సంస్కృతీ కరణకు ప్రతీకగా, దేశీయ రచనా మార్గానికి భిన్నంగా భారతం దర్శనమిస్తుంది.*" (రంగనాథాచార్యులు 1990: 11). ఇవన్నీ నన్నయ భారత రచన వెనుక ఉన్న సమాజ పరిస్థితులు.

తిక్కన ప్రవేశపెట్టిన హరిహరనాథ తత్వం ఆ కాలంనాటి సమాజంలో శైవ, వైష్ణవ మత విభేదాలను తెలియజేస్తుంది. శ్రీనాథుడి భోగలాలస జీవితం, రాజులను ఆశ్రయించడం, ఆనాటి రాజపోషణ, కవుల జీవితాలను తెలియజేస్తాయి. పోతన భక్తితత్త్వం, రాజాశ్రయ నిరాకరణ కవులకు దైవంపై, భక్తిపై గల అపార భక్తి శ్రద్ధలను తెలియజేస్తాయి. అయితే ఇవన్నీ సమాజంలోని ఉన్నత లేక పాలక వర్గానికి చెందినవై వారి జీవన విధానాలను తెలియజేసేవిగా కనిపిస్తాయి. భక్తిని కింది వర్గానికి, అన్ని తరగతుల వారికి దగ్గర చేయడానికి ప్రయత్నించిన వారు పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితుడు. వీరి రచనలు శైవ సాహిత్యం.

ప్రబంధ కాలం నాటికి సాహిత్యం ఎక్కువగా అలంకారిక లక్షణాలతో కూడుకొని శృంగారాది రసాలకు ప్రాధాన్యతనిచ్చి, వర్ణనాత్మకంగా వెలువడింది. ఈ లక్షణాలు కొంతవరకు సమాజానికి సాహిత్యాన్ని దూరం చేశాయి. అయినా

రాయవాచకం లాంటి రచనలూ ఈ కాలంలో వచ్చాయి. ప్రబంధ యుగం కొనసాగింపుగా దక్షిణాంధ్రయుగ సాహిత్యం కనిపిస్తుంది. ప్రబంధ సాహిత్య లక్షణాలను వేలం వెర్రిగా అనుసరించినట్లు కనిపిస్తుంది. అయితే ఈ కాలంలోనే యక్షగానాల వంటి దేశి సాహిత్యం కూడా వెలువడింది.

## 2.2.2. ఆధునిక సాహిత్యం - సమాజం

వలస పాలన ప్రారంభమయ్యాక, ఆంగ్ల విద్యావ్యాప్తి, ముద్రణా యంత్రాలు, ప్రయాణ సౌకర్యాలు, ఇతర దేశాల సాహిత్య ప్రభావం, సమాజంలోని మధ్య తరగతి అభివృద్ధి చెందడం, స్వాతంత్ర్య కాంక్ష ప్రారంభమవడం మొదలైనవన్నీ సమాజంలో గుర్తించదగిన మార్పులుగా కనిపిస్తాయి. వీటి ప్రతిఫలమే ఆధునిక కాలంలో వచ్చిన సంఘసంస్కరణ సాహిత్యం, భావకవిత్వం, జాతీయవాద సాహిత్యం, అభ్యుదయ, విప్లవ రచయితల సంఘాల ఆవిర్భావం మొదలైనవి. ఇవి అన్నీ కూడా తెలుగు సాహిత్యానికి, సమాజానికి మధ్య ఉన్న పరస్పర ప్రభావాన్ని తెలియజేసేవే.

ముఖ్యంగా ప్రపంచీకరణ ప్రారంభమయ్యాక ఎక్కువగా వచ్చిన దళిత, స్త్రీ, ప్రాంతీయ, మైనారిటీ సాహిత్యాలు సమాజంలోని వివిధ అస్తిత్వ మూలాలను ప్రకటిస్తున్నాయి. ఈ విధంగా సాహిత్యంలో సమాజం అంతర్గతంగా కాని, బాహ్యంగా కాని కనిపిస్తూనే ఉంటుంది. తెలుగు సాహిత్య, సమాజాలు రెండూ పై అంశాల ఆధారంగా పరస్పర ప్రభావానికి గురి అయినవేనని తెలుస్తోంది.

## 2.3. సాహిత్యం - మతం

సాహిత్యం వలే మతం కూడా సమాజంలో ఒక ప్రధానాంశం. ఇది కూడా సమాజం మారడానికి ప్రధాన పాత్ర పోషిస్తుంది. అదే విధంగా మతమూ, సాహిత్యము సమాజంలో ఉంటూ ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేసుకొంటూ, సమాజ పరిణామంలో ముఖ్యమైనవిగా ఉంటాయి.

"*మతమూ సాహిత్యమూ ఒకే కుదురు నుంచి పుట్టాయి గనుక సాహిత్యంలోనూ తొలిదశలో సర్వాత్మ వాద లక్షణం కనపడుతుంది. దీనిలో మానవ*

*సంబంధాలు కూడా ప్రవేశించాయి. దాంతో బాహ్య వాస్తవికత మానవీకరణం చెందింది. కాబట్టి పౌరాణిక జానపద గాథల్లో పశువులూ, పక్షులూ మాట్లాడతాయి. అడవులూ (వనదేవతలు), కొండలూ మాట్లాడుతాయి.*" (శివశంకర్ 1996: 19).

మతంలోను, సాహిత్యంలోను కొన్ని సామ్యాలూ, కొన్ని భేదాలు కనిపిస్తాయి. మత వ్యాప్తి కోసం, విశ్లేషణ కోసం సాహిత్యం సహాయపడింది. సాహిత్యం మత వ్యాప్తికి ఉపయోగపడుతూనే సమాజ ప్రయోజనానికి ఉపయోగపడుతుంది.

మతం అనేది హేతువుకు, శాస్త్రీయతకు లొంగని అంశాలను నమ్మేటట్లు చేస్తుంది. ప్రజలు వీటిని వారసత్వంగానో, సంప్రదాయంగానో ఆచరిస్తూ ఉంటారు. సమాజంలో మత సంబంధ విషయాలలో తీవ్ర ఉద్రిక్తత కలిగినప్పుడో, ఎక్కువ మందికి ఆచరణీయంగా కాక పోయినప్పుడో మతంలోని మౌలికాంశాలలో మార్పులు వస్తాయి, లేదా నూతన మతాల పుట్టుక జరుగుతుంది. ఉదాహరణకు వైదికమతం హింసకు, కర్మకాండకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి సామాన్యులకు దూరమైనప్పుడు బౌద్ధ, జైన మతాలు ఆవిర్భవించాయి. సాహిత్యం వలే మతం కూడా పాలక వర్గానికి లేదా అధికార వర్గానికి అనుకూలంగానే ఉంటుంది. అందువల్ల మత సంబంధిత అంశాలు సాహిత్యంలో చోటు చేసుకుంటాయి. మత లక్షణాలు, నియమాలు పాత్రలతో, వర్ణనలతో కళాత్మకంగా సాహిత్యంలో చెప్పబడతాయి.

## 2.4. తెలుగు సాహిత్యం - మతం

సాహిత్యానికి, మతానికి ఉన్న సంబంధాలు తెలుగు సాహిత్యంలోనూ కనిపిస్తాయి. తెలుగులో లిఖిత సాహిత్యం మత ప్రమేయంతోనే పుట్టిందని విమర్శకుల అభిప్రాయం.

తెలుగు సాహిత్యాన్ని చారిత్రక విమర్శకులు ఆస్థానేతర సాహిత్యంగా విభజించి వివరిస్తారు. అయినా "*ఆస్థాన సాహిత్యానికైనా, ఆస్థానేతర సాహిత్యానికైనా మతమే ప్రధాన ప్రాతిపదికగా కనిపిస్తుంది.*" (రంగనాథాచార్యులు 1981: x).

## 2.4.1. ప్రాచీన సాహిత్యం - మతం

మత ప్రాతిపదికన కనిపిస్తున్న సాహిత్యం నన్నయ నుండి ఆధునిక దశ ప్రారంభం వరకు ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. నన్నయ తర్వాత తిక్కన వరకు ఉన్న శైవ సాహిత్యం మత ప్రచారంలో భాగంగా హింసను కూడా బోధించడానికి వెనుకాడలేదు. అయినా శైవం ప్రజలకు దగ్గరవడానికి కొంత ప్రయత్నించింది. ఆ తర్వాత శైవ వైష్ణవాల మధ్య సామ్యాన్ని కుదర్చడానికే తిక్కన హరిహరనాథుణ్ణి సృష్టించినట్లు పరిశోధకుల అభిప్రాయం.

*"సామాజిక భావరంగాన్ని అకలుషితం/అక్లిష్టం చేయకపోతే, సమాజానికి/ దేశానికి భద్రత లేదని గుర్తించిన తిక్కనగారు దాని కోసం చేసిన ప్రయత్నమే హరిహరనాథ తత్త్వ ప్రతిపాదన. 'భక్తజనంబు వైదికధ్యాయిత కిచ్చమెచ్చ పరతత్వము గొల్చెద నిష్టసిద్ధికిన్' అన్నారు తిక్కనగారు ప్రారంభంలో. ఇక్కడ ప్రత్యేకంగా పేర్కొనబడ్డ 'భక్తజనం' ఎవరు ? వీరి ఏ విధమైన ధ్యానాన్ని పరతత్త్వం మెచ్చుతుంది. అనేక విధ నామ - రూపవంతమైనా గూడా పరమార్థతః పరతత్త్వమొకటే అన్న భావనతో ధ్యానించే భక్తజనం వీరు. ఈ విధమైన ధ్యానరీతి వైదికమైంది."*

(రంగనాథాచార్యులు 1981: 66).

ఈ విధంగా తిక్కన వైదిక మతంలోని భిన్నత్వాన్ని ఏకతాటి మీద నడపడానికి ఈ అభేద తత్త్వాన్ని తీసుకొనివచ్చారు.

శ్రీనాథుడి రచనలు కాశీఖండం, భీమఖండం, హరవిలాసం మొదలైనవన్నీ శైవమత సంబంధితమైనవి. శివుని తత్త్వాన్ని, శివభక్తుల గొప్పతనాన్ని తెలుపుతాయి. అదే విధంగా పోతన భాగవతంలో విష్ణువు అవతారాలుగా చెప్పబడే రామ, కృష్ణులను కీర్తించడం, కృష్ణతత్వానికి కాల్పనికత జోడించి వివరించడం కనిపిస్తుంది.

పోతన, శ్రీనాథులు ఒకే కాలానికి చెందినవారు, అయినా వారి సాహిత్యంలో శైవ, వైష్ణవ మతాల ప్రాముఖ్యం కనిపిస్తుంది.

ప్రబంధ సాహిత్య పోషకుడైన శ్రీకృష్ణదేవరాయలు రాసిన 'ఆముక్తమాల్యదలో' విష్ణుభక్తుల కథలే ప్రధానంగా ఉన్నాయి. మిగిలిన కవులు కూడా శైవ, వైష్ణవ మతాలకు సంబంధించిన రచనలే చేశారు.

"*నంది తిమ్మన, పింగళి సూరన శ్రీకృష్ణునికి సంబంధించిన ఇతివృత్తాలు స్వీకరించగా, తెనాలి రామకృష్ణుడు విష్ణు ప్రశంసా పరమైన 'పాండురంగ మాహాత్మ్యం' వివరించాడు. అయ్యలరాజు రామభద్రుడు రామావతార గాథను అభివర్ణించాడు. అయితే నాటి కవులందరూ వైష్ణవులు కారు. శైవులైన మల్లన, ధూర్జటి కృష్ణదేవరాయల ఆశ్రితులు కావటం, ఆయన పరమత సహనానికి నిదర్శనం. కాని మతమార్పిడి నాడు వాడుకలో ఉన్నట్లు సాక్ష్యాలు లేకపోలేదు. విశిష్టాద్వైతి అయిన పెద్దన మొదట అద్వైతిగా ఉండినట్లు, తెనాలి రామలింగడు రామకృష్ణుడుగా మారినట్లు కొన్ని ఐతిహ్యాలు ప్రచారంలో ఉన్నాయి.*" (రంగనాథాచార్యులు 1981: 125).

ధూర్జటి కాళహస్తీశ్వర శతకం, కాళహస్తీశ్వర మాహాత్మ్యం శైవమత సంబంధిత రచనలు. ఏది ఏమైనా ప్రబంధాలు శైవం కాని, వైష్ణవం కాని వైదిక మత ప్రాముఖ్యాన్ని తెలియజేసేవిగా కనపడతాయి. కృష్ణదేవరాయలు, భట్టుమూర్తి లాంటి కొందరు తప్ప మిగిలిన కవులందరూ బ్రాహ్మణ కులానికి చెందినవాళ్లు. అంటే మతాచారాల పట్ల ఎక్కువ ఇష్టం ఉన్నవాళ్లు అని అర్థం చేసుకోవచ్చు.

దక్షిణాంధ్రయుగ సాహిత్యాన్ని సాహిత్యకారులు క్షీణయుగంగా చెప్తారు. అందుకు కారణం సాహిత్యం రూప పరంగా విస్తృతమైన మార్పులకు లోనుకావడం. అయినా ఆ సాహిత్యం మతానికి దూరం కాలేదు. దక్షిణాంధ్రయుగంలో ప్రధాన రాజాస్థానాలైన తంజావూరు, మధుర, చెంజి పరమత సహనాన్ని పాటించినా, మత ప్రాముఖ్యం ఉన్న సాహిత్యం ఆ కాలంలో వెలువడింది.

విజయ రాఘవుని బ్రాహ్మణ భక్తిని చెంగల్వ కాళ కవి రాజగోపాల విలాసంలో చెప్పాడు. రంగాజమ్మ ఉషాపరిణయంలో మతాలు ఎన్ని ఉన్నా వైష్ణవమతమే శాశ్వతమని చెప్పింది. ఈ కాలంలోనే భారతదేశానికి క్రైస్తవ మతం వచ్చింది. ఈ మత ప్రచారంతోపాటు మహమ్మదీయ కవులు కూడా ఈ యుగ సాహిత్యంలో కనిపిస్తారు.

### 2.4.2. ఆధునిక సాహిత్యం - మతం

ఆధునిక యుగంలో సాహిత్యంపై మత ప్రభావం కొంత తగ్గిందని చెప్పవచ్చు. గురజాడలాంటి వాళ్లు 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచిపోవును' అని మత సామరస్యానికి జ్ఞానం తోడ్పడుతుందని చెప్పారు. జాతీయోద్యమ సాహిత్యంలో భాగంగా పూర్వ సాహిత్యాన్ని కాల్పనిక దృష్టితో చూడడం జరిగింది. అలాంటి సాహిత్యంలో కొంత మత ప్రాముఖ్యత కనిపిస్తుంది. విశ్వనాథ సత్యనారాయణలాంటి కవుల రచనలు ఇందుకు నిదర్శనం.

సాహిత్య చరిత్రలో ఒక ప్రధానశాఖగా భక్తి ఉద్యమ సాహిత్యాన్ని పరిశీలించాలి. పాల్కురికి సోమన, అన్నమయ్య, వేమన, పోతులూరి వీరబ్రహ్మం మొదలైన వాళ్లను భక్తి కవులు లేదా సామాజిక కవులుగా చెప్పవచ్చు. అయితే వీరు మతాన్ని, మత సంబంధిత సాహిత్యాన్ని అధికార వర్గంతో పాటు కింది తరగతుల వాళ్లకు దగ్గర చేయడానికి సాహిత్యం ద్వారా కృషి చేశారు. ఆనాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఇది గొప్ప పరిణామంగా చెప్పాలి.

లిఖిత సాహిత్య శాఖకు భిన్నంగా శ్రామిక జనుల నోళ్లలో జానపద సాహిత్యం బతికింది. అయితే వీరి సాహిత్యంలో మత సంబంధిత అంశాలు తక్కువ. కాని అధికార వర్గ సాహిత్యాన్ని అనుకరించాలనే ప్రయత్నం జరిగినప్పుడు మాత్రం మత సంబంధమైన అంశాలు కనిపిస్తాయి. ఉదాహరణకు జానపదుల పాటలలో, కళారూపాల ప్రదర్శనలో రామాయణ, భారత కథాంశాలు ఉండడం వంటివి. ఇవి కొంత వైదిక మత ప్రశస్తిని తెలియజేసేవిగా ఉంటాయి.

* * *

# 3. శైవమతం - శైవసాహిత్యం

ఆదిమ మానవుడు ప్రకృతిని అర్థం చేసుకొనే క్రమంలో ఒక అతీంద్రియ లేదా అలౌకిక శక్తిని సృష్టించుకున్నాడు. అధికార వర్గం బలపడిన తర్వాత మానవ జీవన క్రమంలో అర్థం కాని అంశాలను అతీంద్రియ శక్తికి ఆపాదించడంతో పాటు దేవుడి పేర కొన్ని క్రతువులు చేయడం ప్రారంభమైంది. కాలక్రమంలో కొన్ని రకాల కార్యక్రమాలు ఏర్పడి మతంగా రూపొందాయి. దేవుడి రూపకల్పన, మతాల ఆవిర్భావం వేరు వేరు మానవ తెగలలో, వేరు వేరు ప్రాంతాలలో భిన్న రకాలుగా ఏర్పడ్డాయి.

ప్రజలలోని మత ప్రాధాన్యతను గుర్తించిన అధికార వర్గం, మత కార్యక్రమాలను నిర్దేశిస్తూ, కొన్ని సైద్ధాంతిక నియమాలను బ్రాహ్మణులచే ఏర్పాటు చేయించింది. అవి కాల క్రమంలో బలపడుతూనే మార్పులనూ పొందాయి. ఇలా మతం దైనందిన జీవితాల నుండి విడదీయలేని ప్రాధాన్యతను సంతరించుకొంది.

మతాల పరిణామంలో భాగంగా వాటిలో అనేక శాఖలూ ఏర్పడ్డాయి. మతం ప్రజల జీవితాలను నిర్దేశించే శక్తిగా కూడా ఎదిగింది. మతం సమాజంలో ఒక ప్రధాన భాగమైంది. హిందూ, బౌద్ధం, జైనం, క్రైస్తవం, ముస్లిం ఇలా వివిధ రకాల మతాలు నేటి సమాజంలో ఉన్నాయి.

## 3.1. శైవమతం - తత్త్వం

13 వ శతాబ్దానికి శైవమతం ప్రధాన మతంగా పరిణామం చెందినా మూలాలు మాత్రం వేదకాలం నుండి ఉన్నట్లు తెలుస్తుంది. వైదిక మతంలో ఒక శాఖగా శైవ మతాన్ని అర్థం చేసుకోవాలి. ప్రకృతిని, దాని తత్త్వాన్ని అర్థం చేసుకోవడంలో భాగంగా శైవసిద్ధాంతం ప్రారంభమైంది.[1]

---

1) "The Philosophy in the philosophy of Saiva Siddhanta requires an understanding of the nature of the general ethos of Philosophical thinking in the Indian Setting."
(K.Siva Raman 1973: 1)

మనిషి వ్యవసాయ ప్రాధాన్యతను గుర్తించి పశువులను వాడుకలోకి తెచ్చుకున్న తర్వాత ఆవు పూజనీయమైన జంతువైంది. అలా పశుపతి కూడా దేవుడిగా పూజింపబడ్డాడు. 'పశుపతి'ని ప్రకృతికి లేక పశువులకు లేక ప్రాణులకు అధిపతి అనే అర్థంలో భావించి పూజించేవారు. తర్వాత కాలంలో పశుపతి, శివ అనేవి పర్యాయపదాలుగా దేవునికి ప్రతీకలుగా అయ్యాయని చెప్పవచ్చు, మరియు పశుపతి, శివ, రుద్ర, శంకర మొదలైన శబ్దాలు ప్రకృతిని అదుపు చేసే అధిపతికి సంకేతాలుగా ఉన్నాయి.(2)

వేదకాలం తర్వాత శైవంలో దేవుడు, ప్రకృతి వంటి అంశాలలో భిన్న వాదాలు, సిద్ధాంతాలు వచ్చాయి. అయితే వీటిని సమాజ పరిణామ క్రమంలో వచ్చిన భిన్న ఆధ్యాత్మిక దృక్పథాలుగా అర్థం చేసుకోవచ్చు. వాటిలో శైవ సిద్ధాంత ప్రాధాన్యతను తెలియజేస్తూ, శైవమత తాత్త్విక దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేవి 'ఆగమాలు'. వీటినే శైవతాత్త్విక సాహిత్యంగా చెప్పవచ్చు. ఇవి శైవ మత సంబంధిత అంశాలను సవివరంగా వివరిస్తాయి. ఇవి వేదాలను, మత సంబంధ రచనలను శైవ తత్త్వంతో వివరణాత్మకంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి.(3)

---

2) The term Pasupata means pertaining to Pasupati. Pasupati is 'The Lord of Pasus (bound or enchained Jevas). In Vedic literature, Pasupati or Pasunam paith is the name of 'Siva (Taitt. Sam, 4.5.2.1. Vaj. Sam. Chs 16,17. Maitrayani Sam 2.9.3) and obeisance is paid to him. The Asvalayana Grhya Sutra (2.2) specifically mentions that Siva, Pasupati and Sankara are the names of the deity." (G.V. Tagore 1996: 31)

3) The scriptural source of the siddhanta comprise items of unequal impartance, and can be put into three categories. Vedas, Siva Agamas and mystical writings of these, the most characteristic are the Saiva Agamas, for it is through them that all other revelations, including the vedic, are judged, experience of Siva. Hence, the Saiva Agamas are believed to be normative to the understanding of the vedas and the mystical writings." (Rohan A. Dununicla 1985: 45)

అందువలన ఆగమాలను శివుడు పార్వతికి చెప్తున్నట్లు సర్వజనులకు ఉపదేశించినట్లు శైవ మత సిద్ధాంతం చెప్తుంది. పైగా ఇవన్నీ శాస్త్ర సంబంధ అంశాలతో కూడుకొనడంచేత వ్యుత్పత్త్యర్థాలతో తెలుసుకోవలసి రావడం కూడా ఒక కారణం.

## 3.2. శైవమతం - దక్షిణ భారతదేశంలో వ్యాప్తి

దక్షిణ భారతదేశంలో భాగంగా ఆంధ్రదేశంలో ప్రాచీన కాలం నుండి శైవం ఉన్నట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. "*పాశుపత శైవం క్రీ.శ. ఒకటవ శతాబ్ది నుంచి తెలుగుదేశంలో కనిపిస్తుంది. ఉత్తర భారతంలో పాశుపతశైవం బౌద్ధాన్ని అణచిరాగా, పాశుపత శైవానికి వ్యతిరేకంగా భక్తి ప్రధానమైన వైష్ణవం వ్యాపించింది. దక్షిణంలో జైనానికి పోటీగా శైవం అనేకశాఖలతో, రూపాలతో వ్యాపించింది. తమిళదేశంలో భక్తి ప్రధానంగా ప్రారంభమైన నయనార్ల శైవం తరువాత కాలంలో కర్ణాటక, తమిళ దేశాలలో కాలాముఖ శైవంగా రూపొందింది. ఆ కాలంలో సైద్ధాంతికంగానైనా సర్వ సమానత్వాన్ని బోధిస్తూ, భోజన, వైద్య, విద్యావసతి సౌకర్యాలను కలిగిస్తూ జనంపైన పలుకుబడి కలిగి పాలకుల అండ కూడా పొందిన జైనులకు పోటీగా కాలముఖ శైవ మఠాలు ఏర్పడ్డాయి. నయనార్ల భక్తి శైవానికి 8, 9 శతాబ్దాల నాటికి రాజ పోషణ కూడా లభించే సరికి దీనికి అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. కాలాముఖులు వర్ణప్రాధాన్యాన్ని అంగీకరిస్తూనే బ్రాహ్మణేతరులకు కూడా స్థానాన్ని కల్పించారు. జైనంలో లాగే స్త్రీలకూ స్థానం ఇచ్చారు. శూద్రులు దాస్య భావంతో తగిన స్థానాన్ని పొందవచ్చు. 'కుమార సంభవ' కర్త నన్నెచోడుడు 'కుమార సంభవం' లోని దారిద్ర్య విద్రావణ దశకంలో కనిపించే రామేశ్వర పండితుడు కాలాముఖానికి చెందినవారే. కాకతీయులలో గణపతిదేవ చక్రవర్తి వరకు కాలాముఖ శైవం ఉంది. శ్రీశైలం, అలంపురం కాలాముఖ శైవానికి కేంద్రాలుగా ఉండేవి.*"

(రంగనాథాచార్యులు 1981: xix-xx)

ఈ విధంగా కాలాముఖ శైవం తెలుగుదేశంలో ఉండగా కర్ణాటకలో బసవడి ప్రభావంతో వీరశైవం బాగా వ్యాప్తిలో ఉండేది. వీరశైవంలో కులభేదం లేకపోవడం, స్త్రీలకు స్థానం కల్పించడం సాధారణం. వైదిక మతంలోని కర్మకాండను నిరసించడం, జంతు బలులను వ్యతిరేకించడం కూడా ఉంది.

సామాన్య ప్రజలను ఆకర్షించడానికి వీరశైవ కవులు సామాన్య జన భాషకు దగ్గరగా వచనాలను రచించారు. అందువలన కాలాముఖ శైవానికి చెందిన వారిలో ఎక్కువమంది వీర శైవాన్ని అనుసరించారు.

తెలుగు దేశంలోని శైవమతస్తులు పూర్తిగా వీరశైవ శాఖకు చెందిన వారుగా చెప్పలేము. వీర శైవ మతాన్ని అనుసరిస్తూనే వైదిక మతంపై అభిమానాన్ని వదులుకోలేక పోయారు.

*"శైవమతంలో పండిత త్రయంగా గుర్తింపు పొందిన శ్రీపతి, మల్లికార్జున, మంచన పండితులు ముగ్గురూ శైవం సవైదికమని నిరూపించే ప్రయత్నం చేశారు. మొదటి శైవ కవిగా చెప్పుకోదగిన మల్లికార్జున పండితారాధ్యుడు వర్ణాశ్రమ ధర్మాలను తిరస్కరించి కూడా ఆరాధ్య శైవ మార్గాన్ననుసరించాడు. బసవడి వీరశైవ భక్తిమీద ఆసక్తి. వర్ణవ్యవస్థ పైన అభిమానం ఈ రెంటినీ సమన్వయం చేయలేక "భక్తిమీఁది వలపు బ్రాహ్మంబుతోఁబొత్తు పాయలేను నేను బసవలింగ" అని మొర పెట్టుకున్నాడు పండితుడు."* (రంగనాథాచార్యులు 1981: xx)

దీనిని బట్టి తెలుగు ప్రజలపై, తెలుగు సాహిత్యంపై వీర శైవమత ప్రభావం తక్కువ అని చెప్పవచ్చు. బసవ పురాణంలో వివరించిన భక్తుల కథలు, జైన, శైవమతాల మధ్య జరిగిన ఘర్షణల వివరణలు ఎక్కువ తమిళ, కర్ణాటక ప్రాంతాలకు చెందినవి కావడం పై అంశానికి బలాన్ని చేకూరుస్తుంది.

## 3.3. శివకవి యుగము

తెలుగుదేశంలో ఆర్య విజ్ఞానము, వైదికమత ధర్మాలను ప్రచారం చేయాలనే ఉద్దేశ్యంతో నన్నయ భారతాంధ్రీకరణకు చేయాలనుకున్నాడు. కాని రాజరాజనరేంద్రుని మరణానంతరం భారతానువాదము నిలిచిపోయింది. ఇది మళ్ళీ ప్రారంభమవడానికి 200 సంవత్సరాల కాలం పట్టింది. తర్వాత తిక్కన మళ్ళీ భారతానువాదాన్ని మొదలు పెట్టాడు. ఈ నన్నయ, తిక్కనల నడుమకాలంలో శైవవాఙ్మయం వెలువడింది. కాబట్టి ఈ కాలాన్ని 'శివకవి యుగము' అంటారు.

## 3.3.1. శివకవియుగం నాటి రాజకీయ పరిస్థితులు

రాజరాజనరేంద్రుడు చనిపోయిన తర్వాత అతని కుమారుడైన కులోత్తుంగచోళుడు చోళదేశంలో మాతామహ రాజ్యంలో ఉండడం వల్ల రాజరాజనరేంద్రుని తమ్ముడైన విజయాదిత్యుడు వేంగి రాజ్యాన్ని ఆక్రమించెను. కాని కులోత్తుంగుడు వేంగి దేశంపై దండెత్తి విజయాదిత్యుని జయించెను. ఈ సమయంలోనే పశ్చిమ చాళుక్య చక్రవర్తి అయిన ఆరవ విక్రమాదిత్యుడు వేంగి దేశంపై దండెత్తెను. కులోత్తుంగుడు అతన్ని కూడా జయించెను.

తర్వాత కులోత్తుంగుడు చోళరాజకుమారుని చంపి మాతామహారాజ్యమైన చోళరాజ్యాన్ని ఆక్రమించి వేంగిరాజ్యానికి తన పినతండ్రియైన విజయాదిత్యునినే రాజును చేసెను. విజయాదిత్యుడు చనిపోయిన తర్వాత కులోత్తుంగ చోళుని పుత్రులు వేంగిరాజ్యాన్ని పరిపాలించారు. కులోత్తుంగ చోళుని కాలంలోనే వెలనాటి చోళులు వేంగిరాజ్యానికి రాజప్రతినిధులకు సహాయోద్యోగులుగా నియమించబడ్డారు. కులోత్తుంగుడు మరణించిన తర్వాత అతని కుమారుడైన విక్రమచోళుడు దక్షిణదేశానికెళ్ళి సింహాసనం ఆక్రమించాడు. విక్రమచోళుడు చోళరాజ్యానికి వెళ్ళిన తర్వాత వెలనాటి చోళులు వేంగిరాజ్య ప్రతినిధులై దాదాపు వందేళ్ళు పరిపాలించారు. ఈ విధంగా తూర్పు చాళుక్యరాజ్యము చోళరాజ్యంలో కలిసిపోయి, వేంగిరాజ్య పరిపాలన క్రమంగా చాళుక్యుల నుండి వెలనాటి చోళులకు సంక్రమించింది. ఈ సమయంలోనే కాకతీయుల విజృంభణ(ప్రవేశం) జరిగింది.

## 3.3.2. శివకవియుగం నాటి మతపరిస్థితులు

రాజరాజ నరేంద్రుని తర్వాత పరిపాలించిన రాజులందరూ ఎక్కువగా వైదిక, శైవ మతస్థులైనప్పటికీ సామంతులు, దండనాయకులు, రాజకీయోద్యోగులు జైనులై జైనమత పోషకులవ్వడంవల్ల జైనం జనసామాన్య మతమైంది. జైన మండలేశ్వరులు, జైన దండనాథులు స్వరాజ్య సంపాదనకు ప్రయత్నం చేశారు. వైదిక, శైవమతాచార్యులు జైనమతాన్ని నాశనం చేయడానికి ప్రయత్నించారు. వైదికమతం ఈ కాలంలో చాలా సంస్కారాలను పొందింది.

దక్షిణదేశానికి వచ్చిన ఆర్య బ్రాహ్మణులు శైవులైనప్పటికీ కర్మప్రధానమైన వైదిక మతస్థులుగా ఉండేవారు. శైవమతము కాలాన్ననుసరించి పాశుపతము, యోగశైవము, కాపాలికము, కాలముఖము, లాకులము మొదలైన భేదాలను పొందింది. శైవమత భేదములేర్పడుతున్నడే మంథానభైరవుడను శివాగమాచార్యుడు, కాలముఖయోగియైన మల్లికార్జునుడు మొదలైనవారు మధుర, అలంపురము, శ్రీశైలము, బలిగ్రామము మొదలైన క్షేత్రాలను నిర్మించుకొని శైవమత ప్రచారం చేశారు.

కర్మప్రధానమైన కుమారిలభట్టు పూర్వమీమాంసగాని, జ్ఞానప్రదమైన శంకరుని అద్వైతముగాని ప్రజలకు ఈ కాలంలో అందుబాటులో లేవు కాబట్టి దక్షిణ హిందూదేశంలో భక్తిప్రధానమైన వైష్ణవమతాన్ని యమునాచార్యుడు, రామానుజాచార్యుడు ప్రచారం చేశారు. ఈ వైష్ణవమతము అభివృద్ధిచెంది వీరవైష్ణవంగా పరిణమించింది. జైన బౌద్ధాలు వైష్ణవులకు అపకారం చేయడానికి ప్రయత్నించినపుడు రామానుజుడు మాలమాదిగల సాయాన్ని తీసుకుని వారిని గెలిచి వారకి వైష్ణవాలయాలలో ప్రవేశం కలిగించి వానిని వైష్ణవమతంలోకి చేర్చుకున్నాడు.

12వ శతాబ్ధంలో కళ్యాణకటక రాజైన బిజ్జలుని దండనాయకుడు, ధనాగారాధిపతి ఐన బసవేశ్వరుడు వీరశైవ మతాన్ని స్థాపించి ప్రచారం చేశాడు. వీరశైవులకు అద్వైత, జైన, బౌద్ధ మొదలైన పరమతంలపై ద్వేషం ఎక్కువ. వీరశైవం, వైష్ణవం రెండూ భక్తి ప్రధానమైనవే. ఈ రెండు మతస్థులవారు వారి సిద్ధాంతాలే మంచివని, మిగిలిన మతములను చులకన చేయడం వలన ప్రజలలో అసహనం పెరిగి మతయుద్ధములు రక్తపాతం జరిగింది.

### 3.3.3. శివకవియుగం నాటి భాషా పరిస్థితులు

నన్నయ మార్గ పద్దతిని అవలంభించి తత్సమ పదజాలంలో సంస్కృత సమాస భూయిష్ఠమైన శైలిలో, వ్యవహారిక భాషా ప్రయోగాలతో భారతాన్ని ఆంధ్రీకరించాడు. కానీ నన్నయ తర్వాత సాహిత్య ప్రపంచంలో మార్పు వచ్చింది. మార్గపద్దతిలో కాక దేశిపద్దతిలో జాను తెలుగు మాటలలో, సామాన్య జన

భాషా ప్రయోగాలలో కావ్యరచన జరిగింది. అంతేకాకుండా కథావస్తువును కూడా కేవలం సంస్కృత పురాణాల నుండి కాకుండా దేశియ సాంప్రదాయాల నుండి తీసుకోవడం జరిగింది.

నన్నయ, తిక్కనల మధ్య కాలంలో శైవమతం వృద్ధి చెందింది. ఈ కాలాన్ని చరిత్రకారులు, 'శివకవియుగం' అన్నారు. ఈ శివకవులు మతప్రచారం కోసం రచనలే సాధనంగా వాడుకొన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యేరీతిలో రచనలు చేశారు. సరళమైన భాషని ఉపయోగించారు.

## 3.4. శివకవులు

ఆగమాల తర్వాత శైవ వాఙ్మయానికి చెందిన రచనలు 11వ శతాబ్ది వరకు వెలువడలేదు. 11వ శతాబ్దం నాటికి శైవమతం ప్రచార దృక్పథంతో పూర్తిగా వెలుగులోకి వచ్చాక శైవ వాఙ్మయం, శైవమత కవులు కనిపిస్తారు. ఈ కాలం నాటికి వీర శైవం వ్యాప్తిలోకి వచ్చింది. ఈ కాలం నుండే బసవన లాంటి రచయితలు, మత ప్రచారకులుగా ముందుకు వచ్చారు. మొత్తంగా 11వ శతాబ్ది నుండి 18వ శతాబ్ది వరకు ఈ శైవమత వాఙ్మయానికి సంబంధించిన కవులు, కావ్యాలు ఉన్నట్లు తెలుస్తుంది. వీరు 213 మంది వరకు ఉంటారని పరిశోధకులు గుర్తించారు.[(4)]

వీరు రచించిన వచన శాస్త్రాలు లేక కావ్యాలు సామాన్య ప్రజలకు అర్థం కావడానికి, మతం వైపు ఆకర్షణకు గురి కావడానికి అనుకూలంగా రచింపబడ్డాయి. అందువల్లే ఈ మతం కొంత వరకైనా ప్రజల దగ్గరకు వెళ్లింది. జానపద సాహిత్య ధోరణులను వీరు రచనలలో స్వీకరించారు. ద్విపద, రగడలు

4) "For the authentic history of Virasaivisam we have to go back to the 11th century, about a century before Basava for we know definitely that some of the vacana writer lived in that century. As mentioned above, the Vacana-Sastra literature is the available reliable source for Virasaivism. It is very vast, and ranges from the 11th to 18th century A.D. The writer are numerous, as many as 213 of them being know" (S.C.Nandimath. 1979 : 11)

వంటివి ఇందుకు నిదర్శనాలు. సమాజంలోని కింది తరగతుల వారికి వీరు మతంలో పాల్గొనే అవకాశం కల్పించారు. రచనలలో స్త్రీలను, కింది తరగతుల వారిని శైవభక్తులుగా చిత్రించడం, వారిని శైవమతం స్వీకరించేటట్లు చేయడం ఈ మతంలో గుర్తించదగిన అంశం. ఉదాహరణకు బసవపురాణంలో కింది తరగతులకు చెందిన అనేక మంది భక్తుల కథలు చెప్పబడి ఉన్నాయి.

## 3.4.1. శివకవులు - తెలుగు సాహిత్యం

తెలుగు సాహిత్యంలో శివకవులుగా ఎవరు చెప్పబడుతున్నారు ? అందుకు శాస్త్రీయ లక్షణ సమన్వయం ఉందా? మొదలైన ప్రశ్నలు శివకవులను పరిగణించడానికి ఉపకరిస్తాయి. సాహిత్య చరిత్రకారులు ఏ కవులను శివకవులుగా పరిగణించారు? అందుకు వారు ఏర్పరచుకున్న పరిధి ఎటువంటిది అన్న అంశాలను ముందు చర్చించవలసిన అవసరం ఉంది.

"*శివకవుల రచనల ఆధారంగా సామాజిక స్వరూపం తెలుసుకోడానికి ముందు శివకవులెవరు? ఏ కాలంవారు? వాళ్ళ రచనలేవి? అనే ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు రాబట్టుకోవాలి. అప్పుడు ఆ రచనలలో సామాజిక స్థితిగతులు తెలుసుకోడానికి ఆకారాలు ఏ రూపంలో ఎంతవరకూ ఉన్నాయో గుర్తించి, వాటిని క్రోడీకరించాలి. ఆ కాలంనాటి సమాజానికున్న చారిత్రక నేపథ్యం ఏమిటో పరిశీలించాలి. ఈ భూమిక మీద శివకవుల రచనల ద్వారా తెలియవచ్చే సామాజిక లక్షణాలను సమన్వయించి, ఆ రచనలు వెలువడిన కాలంనాటి సామాజిక స్వరూపాన్ని నిరూపించాలి.*" (శ్రీరామరాజు 1991: 1).

ఈ దృక్పథమే ప్రస్తుత పరిశోధనకు ప్రామాణికం. కావున ఉపశ్రేణి వర్గాల జీవితాన్ని శివకవుల రచనల ఆధారంగా నిరూపణ చేయడానికి శివకవులను నిర్ధారించడం ముఖ్యం. ఈ విధమైన చర్చను ప్రారంభించినది నడుపల్లి శ్రీరామరాజుగారు.

గురజాడ శ్రీరామమూర్తి రాసిన 'కవిజీవితము అనే గ్రంథంలోగాని, కందుకూరి వీరేశలింగం రాసిన ఆంధ్రకవుల చరిత్ర' లో గానీ శివకవులు అనే

పద ప్రయోగంగాని, శివకవుల పరిగణన కాని లేదు. పాల్కురికి సోమనాథుని, మల్లికార్జున పండితారాధ్యుని రచనల గురించి వారు చేసిన చర్చ మాత్రమే కనపడుతుంది.

కాశీనాథుని నాగేశ్వరరావు గారు రాసిన 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర'లో తెలుగు సాహిత్యంపై 12, 13 శతాబ్దాలలో వీర శైవమత ప్రభావం ఉందని, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథులు శివభక్తులని రాశారు. కవిత్వవేది కె. వెంకట నారాయణరావు 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము'లో యుగ విభజనలో భాగంగా 'వీరశైవ కవిత' అనే ఉప విభాగాన్ని సూచించారు. మల్లికార్జున పండితుడిని "శైవ వాఙ్మయానికి బ్రహ్మవంటివాడు" అని కీర్తించాడు.

వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 1924 జనవరి, భారతిలో 'శివకవులు' అనే వ్యాసం రాశారు. దీనిలో శాస్త్రిగారు మల్లికార్జున పండితారాధ్యుని శివతత్త్వ సారాన్ని, పాల్కురికి సోమన బసవపురాణాన్ని, నన్నెచోడుని కుమార సంభవాన్ని శివకవుల గ్రంథాలలో ప్రాచీనమైనవిగా పేర్కొన్నాడు. దీనిని ఆధారంగా చేసుకొని శ్లిష్టా రామకృష్ణశాస్త్రి 'వీరశైవాంధ్ర వాఙ్మయము' (1948) అనే గ్రంథంలో మల్లికార్జున పండితారాధ్యుడిని, పాల్కురికి సోమనాథుడిని వీరశైవ కవులుగా పరిగణించారు. నన్నెచోడుని, శ్రీనాథుని సామాన్య శైవకవులుగా పరిగణించి విశ్లేషించారు. వీరు మతానికిచ్చిన ప్రాధాన్యత, రచనలకు ఇచ్చినట్లు కనపడదు.

నిడదవోలు వెంకటరావుగారు 'తెలుగు కవుల చరిత్ర' ముందుమాటలో నన్నయ, తిక్కన యుగాల మధ్య కాలాన్ని (1100-1250) శివకవి యుగం అని సూచించారు.

పింగళి లక్ష్మీకాంతంగారు 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' లో 1200 నుండి 1323 వరకు గల కాలాన్ని శివకవి యుగం అని ప్రతిపాదించి, కారణాలను కూడా ఇలా చెప్పారు. "*ఈ కాలంలో తెలుగుదేశమున అవైదికములైన బౌద్ధ, జైన మతములనే కాక వైదికమైన అద్వైతమును కూడా తిరస్కరించుచు, శివుడు తప్ప వేరు దేవుడు లేడు అని శివ పారమ్యమున బోధించెడి శైవమతము తలెత్తి విజృంభింప*

*సాగెను. ఆ మతమును వాఙ్మయము ద్వారా విస్తరిల్లజేసిన తెలుగు కవులు ఆ శతాబ్దిలో ముఖ్యముగా ముగ్గురు కలరు. వారే నన్నెచోడుడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు."* (లక్ష్మీకాంతం 1976: 73).

దీనిని బట్టి వీరు శివకవులు అనే వారిని గుర్తించడానికి రెండు ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తోంది. శైవమత ప్రాముఖ్యాన్ని గుర్తించడం మొదటిది, దాని ప్రచార నిమిత్తం రచనలు చేయడం రెండవది.

ఇదే విధంగా గంటిజోగి సోమయాజిగారు 'తెలుగు వాఙ్మయము సంగ్రహ చరిత్ర' అనే గ్రంథంలో శివకవులను గుర్తించడానికి కొన్ని స్పష్టమైన ప్రతిపాదనలు చేసినట్లు కనపడుతుంది.

"*ఈ శైవ వాఙ్మయము ముఖ్యలక్షణము శివుని లీలలు, శివుని ఆధిక్యము శైవమతానుయాయుల ఆచారములు, శివభక్తుల కథలు, శివ దీక్ష మొదలగు వానిని సులభముగా సామాన్యులకు బోధపడునట్లు రచించుట. దేశీయుల ఆదరణ ముఖ్యముగా కావలసిన మత మగుటచే గ్రొత్తగాననేకులను మతమున జేర్చుకొనవలసిన యవసరముండుట చేతను ఈ గ్రంథములు, సామాన్యుల యందుబాటులో నుండునట్లు జాను తెనుగున ప్రసన్నతా గుణముతో వ్రాయబడినవి.*"

(సోమయాజి, గంటిజోగి : 33)

వీరి అభిప్రాయములో మూడు లక్షణాలు కనిపిస్తున్నాయి. శైవమత ప్రచారము, దేశీ రచనకు ప్రాధాన్యత ఇవ్వడము, శివలీలను వర్ణించడము.

దివాకర్ల వేంకటావధాని, ఆరుద్రగార్లు సాహిత్య చరిత్రరాస్తూ ప్రత్యేకంగా శివకవుల లక్షణాలనుగాని, వారి సాహిత్య స్వభావాలను గాని విడమరచి చెప్పలేదు. కాని నన్నయ, తిక్కన మధ్య కాలాన్ని శివకవి యుగమని చెప్తూ నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు వంటివారిని శివకవులుగా పేర్కొన్నారు. ఆరుద్రగారు యధావాక్కుల అన్నమయ్యను కూడా శివకవిగా పేర్కొన్నాడు.

పై విధంగా సాహిత్య చరిత్రకారులు శివకవుల గురించి, శివకవుల యుగ సాహిత్య చరిత్ర గురించి ఒక నిర్దుష్టమైన లక్షణాలను చూపలేదు. సాహిత్యచరిత్ర పరిణామ క్రమంలో ఆ పేరు స్థిరపడినట్లు అర్థమవుతుంది.

'శివకవుల రచనలు - సమాజం' అనే గ్రంథం రాసిన శ్రీరామరాజు గారు శివకవులకు లక్షణ ప్రతిపాదన చేశారు. వీరు ప్రతిపాదనగా కింది విషయాన్ని వారి గ్రంథం నుంచే ఇలా చూపవచ్చు.

"*12, 13 శతాబ్దుల్లో శైవం బాగా విజృంభించింది. దానికి మల్లికార్జున పండితారాధ్యుడు ఉద్యమస్ఫూర్తిని కలిగించాడు. జనసామాన్యంలో ప్రచారం చేసి విస్తరింప చేయడానికి పూనుకొన్నాడు. వేదవేదాంగ పండితుడయియు, మతం కోసం అవసరమైతే హత్యకైనా వెనుదీయవద్దని ప్రబోధించాడు. సమకాలీనంగా కర్ణాటకలో బసవన ప్రభోధనలతో వీర శైవమతం విప్లవాలను సృష్టిస్తోంది. బసవన ప్రభావంతో ఆంధ్రదేశంలో వీర శైవమత పవనాలు వీచాయి. ఈ ఉద్యమానికి లోనై మత ప్రచారం ప్రధాన లక్ష్యంగా రచనలు చేసినవారు ఆ కాలంలో కనిపిస్తారు. కాకతీయుల పరిపాలన చివరి రోజులకు శైవమత విజృంభణ చల్లబడింది. అటు తర్వాత ఉద్యమ స్ఫూర్తితో ప్రచారం కోసం వాఙ్మయం వెలువడలేదు. శివపారమ్యమైన సారస్వతం ఇక్కడ ప్రస్తుతం కాదు. ఇలా ఒకరకమైన వాఙ్మయానికి కాలగతమైన ఉద్యమ ప్రభావమూ, ప్రచారలక్ష్యమూ అనే రెండు లక్షణాలున్నాయి. మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమనాథుడు ఇటువంటి నేపథ్యంతో రచనలు చేయడం చేత వీరిద్దరూ శివకవులు.*" (శ్రీరామరాజు 1991: 9, 10).

నన్నెచోడుడు, వేములవాడ భీమకవి, యథావాక్కుల అన్నమయ్య, శివదేవయ్య మొదలగు వారి రచనలను పరిశీలిస్తే వారు శైవమత ప్రచారం కోసం శైవమత వ్యాప్తే లక్ష్యంగా రచనలు చేసినట్లు చెప్పలేము. నన్నెచోడుడు తన కుమార సంభవాన్ని సహజ కవిత్వంగా పేర్కొన్నాడని తెలుస్తోంది.[5] వీరి

(5) "నన్నెచోడ మహాకవి కుమార సంభవ కావ్యము శైవమత ప్రచారార్థము వ్రాయబడిన, ప్రచారగ్రంథము కాక కవితయెడ గవికి సహజముగా గల ప్రీతిచే వ్రాయబడిన యుత్తమ కావ్యము" (అమరేశం రాజేశ్వర శర్మ. నన్నెచోడుని కవిత్వం. 1988 : 43)

వస్తుకవిత, దేశి మార్గ, జాను తెలుగు వంటి పదాలు సాహిత్య నిర్మాణానికి సంబంధించిన పదాలు, వస్తువు సంబంధించినవి కావు.

మిగిలిన కవులైన వేములవాడ భీమకవి, యధావాక్కుల అన్నమయ్య, శివదేవయ్యలు శైవమతస్థులు. అందువల్ల మత సంబంధమైన రచనలు చేశారు కాని, ముందు చెప్పినట్లు మత ప్రచార లక్ష్యంతో కాదు. దీనిని బట్టి పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు మాత్రమే శివకవులుగా ఈ పరిశోధనలో గుర్తించి వారి రచనలను మాత్రమే పరిశోధనకు తీసుకోవడం జరిగింది.

## 3.4.2. శైవసాహిత్యం - లక్షణాలు

శివకవులు ఎవరు అన్న అంశం నిర్ధారితం అయ్యాక వారి రచనలకున్న ప్రత్యేక లక్షణాలను తెలుసుకోవలసిన అవసరం ఉంది.

బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, శివతత్త్వసారం, వృషాధిపశతకం మొదలైన పాల్కురికి సోమనాథుని, మల్లికార్జున పండితారాధ్యుని రచనలు ప్రత్యేక లక్షణాలను కలిగి ఉన్నాయి. అందువల్లే సాహిత్య చరిత్రకారులు శైవసాహిత్యంగా వీరి రచనల సముదాయాన్ని అభివర్ణించారు.

"*ఇలా ఇవి తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక ప్రక్రియ కిందకు వస్తాయి. ఈ రచనల అంతఃస్వభావాన్ని పరిశీలిస్తే వీటిలో తత్సమ పదాధిక్యత, ప్రౌఢి రచనా విన్యాసమూ, గహనమైన తాత్త్విక విషయ ప్రతిపాదనమూ కనిపిస్తాయి. దీనికి భిన్నంగా ఈ రచనల్లో పాడుకోటానికి అనువైన సరళమైన ద్విపదచ్ఛందస్సు అధిక భాగాన్నాక్రమిస్తుంది. జానపద గేయ సాహిత్యంలో కనబడే పునరుక్తులు సుపరిచితమైన వస్తువర్ణనం కనిపిస్తాయి. ఇలా శైవ వాఙ్మయం మార్గదేశి మిశ్రలక్షణాలు కలిగినదవుతోంది.*" (శ్రీరామరాజు 1991: 13).

పై విధంగా వీరి సాహిత్యంలో మార్గ, దేశి లక్షణాలు కనపడడం వలన వీరి సాహిత్యాన్ని మిశ్రసాహిత్యంగా చెప్పాలి. అయితే ఇందుకు కొన్ని సామాజిక, చారిత్రక కారణాలు ఉన్నాయి.

మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు పండిత వర్గానికి చెందినవారు. వీరు మత తాత్త్వికాంశాలను రచనలలో చెప్పడానికి ప్రాధాన్యతనిచ్చారు. వీరి రచనలలో తత్సమ పదప్రయోగం, భూస్వామ్య వ్యవస్థ స్వభావం కనిపిస్తాయి. ఇవన్నీ ఆస్థాన సాహిత్య లక్షణాలు. వీరి సాహిత్యంలో దేశీ లక్షణాలు కూడా కనిపిస్తాయి. వాటిలో వైదిక మతంలోని కర్మవాదాన్ని ఖండించడం, కింది కులాల వారిలో, స్త్రీలలో భక్తి మార్గాన్ని వ్యాప్తి చేయడం, కులవ్యవస్థను నిరసించి సమకాలీన సామాజిక ఇతివృత్తాలను రచనలలో స్వీకరించడం వంటి వాటిని దేశీ లక్షణాలుగా గుర్తించవచ్చు. ఇవి ఆస్థానేతర సాహిత్య లక్షణాలు.

పై విధంగా వీరి సాహిత్యం ఆస్థాన, ఆస్థానేతర సాహిత్య లక్షణాలను కలిగి ఉంది. దీనికి వీరు ఉన్నత వర్గానికి చెంది, భక్తి ఉద్యమ ప్రభావంతో సామాన్యులలో మతవ్యాప్తి చేయాలనుకోడాన్ని కారణంగా చెప్పవచ్చు. వీరి జీవితాలను ఇందుకే అంకితం చేయడం కూడా గమనించదగిన మరో ముఖ్యాంశం.

## 3.4.3. శివకవులు - రచనల పరిచయం

పైన చేసిన పరిశీలనను అనుసరించి మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమనాథులను మాత్రమే ఈ పరిశోధనలలో శివకవులుగా నిర్ణయించుకోడం జరిగింది.

### 3.4.3.1. మల్లికార్జున పండితారాధ్యుడు

'మల్లికార్జున పండితారాధ్యుడు గౌరాంబిక, భీమపండితుల పుత్రుడు. వీరిది దాక్షారామం. వీరశైవ మత విషయాలలో అనేక అనైతిక కార్యక్రమాలు చేయడానికి కూడా మల్లికార్జున పండితుడు వెనుదీయలేదని ఇతని చరిత్ర చెప్తుంది.[1] ఇలా ఇతని కార్యకలాపాలకు కోపించి వెలనాటి చోళుడు ఇతని

1) ఇతని శిష్యులు బౌద్ధపండితుని హత్య చేస్తారు. ఆ హత్య నేనే చేయించానని రాజు ఎదుట పండితారాధ్యుడు ఒప్పుకుంటాడు.

కళ్లను తీసేయిస్తాడు. పండితారాధ్యుడు బసవని మహిమలను విని అతనిని కలవడానికి వెళ్తాడు. కానీ మార్గ మధ్యంలో ఆరోగ్యం సహకరించక శ్రీశైలం వెళ్లి సమాధి పొందాడు.(2) ఇతను బసవనికి సమకాలికుడు. (ఆరుద్ర 1989: 278, 283).

మల్లికార్జున పండితుడు శిష్యులతో సంచారం చేస్తూ శివభక్తిని, మతాన్ని ప్రచారం చేశాడు. మల్లికార్జున పండితుడు చందవోలులోని వెలనాటి చోడరాజు (క్రీ.శ. 1163 - 1180) ఆస్థానంలో ఉన్న బౌద్ధులను ఓడించి శైవమతాన్ని స్థాపించాడని పండితారాధ్య చరిత్ర ద్వారా తెలుస్తుంది.

మల్లికార్జున పండితుణ్ణి పాల్కురికి సోమన శివకవి అని, శివమల్లుడని పేర్కొన్నాడు. మల్లికార్జున పండితుడు సంస్కృతాంధ్ర కన్నడ భాషలలో కృతులను రచించినట్లు సాహిత్యకారుల ద్వారా తెలుస్తోంది. అవి.

సంస్కృతంలో

1. రుద్రమహిమ
2. అమరేశ్వరాష్టకం
3. గుణసహస్రమాల
4. లింగోద్భవ గద్యం
5. పంచగద్య

కన్నడంలో

1. బసవగీతం
2. ప్రభులింగ స్తోత్రాలు

తెలుగులో

1. శివతత్వసారం

---

2) బసవన చనిపోయాడన్న వార్త తెలుస్తుంది.

మల్లికార్జున పండితుని శివతత్వసారంలో 489 కంద పద్యాలున్నాయి. ఇందులో అతను శివభక్తుల కథలను, శివలీలలను, శైవమత సిద్ధాంతాలను వర్ణించాడు. ఇతను చెప్పిన శైవమత సిద్ధాంతాలు వీరశైవమత సిద్ధాంతాలను పోలి ఉన్నాయి. వీరశైవులు జాతిభేదాన్ని పాటించలేదు. జాతిబేధం లేకుండా బ్రాహ్మణుల కన్నా శివభక్తులను ఎక్కువగా ఆదరించారు. మల్లికార్జున పండితుడు అన్ని విషయాల్లోనూ వీరశైవ సిద్ధాంతాలను ప్రభోదించినా, భక్తిమీద వలపు బ్రాహ్యంబులో పొత్తుపాయకను నేను "బసవలింగ" అని చెప్పుకున్నాడు. వీరశైవులకు శివతత్వసారం ఒక ప్రామాణిక గ్రంథం.

## 3.4.3.2. పాల్కురికి సోమనాథుడు

'శైవ సాహిత్యానికి మకుటాయమానం లాంటి వ్యక్తి పాల్కురికి సోమనాథుడు. వరంగల్లుకు సమీపంలో ఉన్న పాల్కురికి ఈయన గ్రామం. ఈయన తండ్రి విష్ణురామిదేవుడు. తల్లి శివదేవమ్మ. సోమనాథుడు యుక్త వయసువచ్చేనాటికే కరస్థలం విశ్వనాథయ్య అనే గురువు దగ్గర కవిత్వ రహస్యాలు నేర్చుకున్నాడు. ఇతనిని వీరశైవ లక్షణాలు ఆకర్షించడం చేత, ఆ మతవ్యాప్తికి పూనుకొన్నాడు. అందుకొరకు సాహిత్య రచనకు పూనుకొన్నాడు. శివభక్తుల జీవితాలను, శివతత్త్వాన్ని తెలియజేసే రచనలను చేశాడు.

పాల్కురికి సోమనాథుని రచనలు

1. అనుభవసారం
2. అష్టోత్తర శతనామగద్య
3. అక్షరాంక గద్య
4. అక్షరాంక పద్యములు
5. గంగోత్పత్తి రగడ
6. చతుర్వేద సారం
7. చెన్నబసవ రగడ
8. చెన్నమల్లు సీసములు
9. నమస్కార గద్య
10. పంచ రత్నములు
11. పంచ ప్రకారగద్య

12. పండితారాధ్య చరిత్ర
13. బసవపురాణం
14. బసవాష్టకం
15. బసవోదాహరణం (తెలుగు)
16. బసవోదాహరణం (సంస్కృతం)
17. మల్లమదేవీ పురాణం
18. రుద్రభాష్యం (సంస్కృతం)
19. వృషాధిప శతకం
20. వృషాధిభాష్టకం (సంస్కృతం)
21. శరణు బసవగద్య
22. సద్గురు రగడ (కన్నడం)
23. సోమనాథ భాష్యం (సంస్కృతం)
24. సోమనాథస్తవం

పాల్కురికి సోమన లఘుకృతులకన్నా ద్విపద కావ్యాలు, శతకాలు తెలుగులో ప్రసిద్ధమయ్యాయి. వీరశైవ మతాచార్యుడైన బసవన చరిత్రను ఈ కవి బసవపురాణంగా వ్రాశాడు. జైనులు తీర్థంకరుల చరిత్రలకు పురాణం అని పేరు పెట్టడం సంస్కృత, కన్నడ సాహిత్యాల్లో ఉంది. జైనులు సంస్కృతంలో ఇరవైనలుగురు తీర్థంకరుల చరిత్రలను పురాణాలుగా వ్రాశారు. ఆ సాంప్రదాయాన్ననుసరించి సోమన బసవన చరిత్రకు పురాణం అని పేరు పెట్టి బసవన్నకు పురాణ పురుషునిగా స్థానాన్ని ఇచ్చాడు. బసవన చరిత్రతోపాటు కన్నడ, ఆంధ్ర, మహారాష్ట్ర దేశాలకు చెందిన 75 మంది భక్తులకథలు దీనిలో చెప్పబడ్డాయి. ఈ కావ్యంలో 6,288 ద్విపదలున్నాయి.

పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో మల్లికార్జున పండితారాధ్యుని చరిత్ర వ్రాశాడు. దీనిలో శివభక్తుల కథలు కూడా చెప్పబడ్డాయి. దీనిలో 11,910 ద్విపదలున్నాయి. పాల్కురికి సోమన బసవపురాణం, పండితారాధ్యచరిత్రలు స్వతంత్రమైన దేశియమైన ఇతివృత్తాలు కలవి. సోమన

రచనల్లో భక్త్యావేశం, శివపక్షపాతంతో కూడిన మతోద్రేకం కన్పిస్తుంది. సోమన తన కృతుల్లో శివపారమ్యాన్ని చెప్పడం, శివభక్తుల కథలను చెప్పడం, పరమత ఖండనం చేసి శైవమత ఉత్కృష్టతను ప్రతిపాదించడం చేశాడు. సోమన సంస్కృతాంధ్ర, కన్నడ, మరాఠీ మొదలైన అనేక భాషలను తెలిసినవాడు. సంగీత, నాట్య, రసవాది వైద్యాది శాస్త్రపరిజ్ఞానం కలవాడు. అపార సంస్కృత శబ్ద పరిజ్ఞానం కలవాడు. ద్విపదలను పాఠకులకు విసుగు పుట్టించకుండా ఉరకలు వేసే శైలితో ఉచితమైన వర్ణనలతో వ్రాశాడు. బసవపురాణంలో ముగ్ధ సంగయ్య, బెజ్జ మహాదేవి, గోడగూచి, కన్నప్ప మాదిరాజయ్య, మడివాలు మాచయ్య మొదలైన భక్తుల కథలను సోమన రమ్యంగా రాశాడు. ఈ కథల్లో మూఢ వాత్సల్యాది భక్తి విశేషాలను కవి చక్కగా ప్రస్తుతీకరించాడు.

ఈ విధంగా పాల్కురికి సోమనాథుడు శైవమతవ్యాప్తి కోసం తెలుగు, సంస్కృతం, కన్నడ భాషలలో రచనలు చేశాడు.

అయితే చివరి రోజులలో సోమనాథుడు కన్నడ దేశానికి వెళ్ళి అక్కడే జీవ సమాధి పొందినట్లు తెలుస్తుంది.

(ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్యం. రెండవ సంపుటం 1989: 192 - 210)

పై రచనలో ప్రధానంగా పరిశోధనా వస్తువు దృష్ట్యా పండితారాధ్య చరిత్ర , బసవపురాణాన్ని పరిశోధనలో తీసుకోవడం జరిగింది.

తెలుగులో నన్నెచోడుడు, యథావాక్కుల అన్నమయ్య మొదలైనవారు శివుని ఇతివృత్తంగా తీసుకొని రచనలు చేశారు. వీరిలో మత ప్రచారదృష్టి లేదు. పైగా వీరి రచనలలో ఉన్నతశ్రేణికి చెందిన వారి ప్రస్తావన కనిపిస్తుంది. కాని ఉపశ్రేణి వర్గాలకు చెందిన ప్రజల ప్రస్తావన కనపడదు. అందువలన వీరి రచనలను పరిశోధనకు గ్రహించడం లేదు.

* * *

# 4. క్రీ.శ.12,13 శతాబ్దాల సమాజం - ఉపశ్రేణి వర్గాల పరిచయం

దక్షిణ భారతదేశంలో 12 వ శతాబ్దం చివరి కాలానికి చాళుక్యులు, చోళులు తమ ప్రాభవాన్ని కోల్పోయారు. అందువల్ల కొంత మంది ప్రాంతీయ పాలకులు విజృంభించడం ప్రారంభమైంది. కాకతీయ వంశానికి చెందిన గణపతి దేవుడు, వెలనాటి వంశానికి చెందిన పృథ్వీశ్వరుడు ప్రాంతీయ రాజ్యాలను స్థాపించిన వారిలో ముఖ్యులు. గణపతిదేవుడు పృథ్వీశ్వరున్ని ఓడించి ఆ రాజ్యాన్ని కాకతీయ రాజ్యంలో కలుపుకొన్నాడు. అయితే గణపతి దేవుడు రాజ్యానికి వచ్చినా అనేక అవరోధాలను ఎదుర్కొన్నాడు. "*గణపతి దేవుడు 12 ఏళ్లపాటు (క్రీ.శ. 1198 - 1209) యాదవుల చేతిలో బందీగా ఉన్నాడు. ఈయన ఈ రాజకీయ కుటుంబంలోకెల్ల ప్రసిద్ధుడు. తన రాజ్యాన్ని కంజీవరం వరకు విస్తరింప జేశారు. పిఠాపురాన్ని పాలిస్తూండిన వెలనాటి చోడుల్ని, అమరావతి పాలకులు కోటరాజుల్ని, మీడ్వల్లి పాలకులు నేతవాదుల్ని, కొలనిరాజుల్ని, చాగిరాజుల్ని, పొత్తపి నెల్లూరు ప్రాంతాన్ని పాలించిన తెలుగు చోడుల్ని, కళింగ గంగరాజుల్ని ఈయన జయించాడు.*

*యుద్ధాలలో జయించడంతోనే గాక, బంధుత్వాలు కలుపుకోవడం ద్వారా కూడా గణపతి దేవుడు తన పాలనాధికారాన్ని విస్తరింప చేసేడు. ఆయన తన కూతురు రుద్రాంబను (ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు) నిరవద్యప్రోలు రాజైన వీరభద్రునికి ఇచ్చి పెళ్లి చేశాడు. కోటరాజు తన కూతురు గణపాంబను కాకతీయ యువరాజు చేతనకిచ్చాడు. గణపతి దేవుని చెల్లెలు మేలాంబికను నేతవాడి కుటుంబంలో ఇచ్చాడు. కొవ్వూరు ప్రభువు జాయపనాయకుని ఓడించి, ఆయన చెల్లెళ్లు నాగమ్మ, వేరమ్మాలను తాను వివాహమాడాడు. ఆ విధంగా ఆయన ఉత్తరాన గంజాం జిల్లా నుంచి దక్షిణాన కంజీవరం వరకు తెలంగాణా, కోస్తా, ఆంధ్ర, రాయలసీమలుగా చెప్పబడే నేటి ఆంధ్ర దేశాన్నంతనూ తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు.*"

(సత్యనారాయణ, కంభంపాటి 1993:2).

గణపతి దేవుని తర్వాత రాజ్యాన్ని విస్తరించి ఆయన కూతురు రుద్రాంబ 1296 వరకూ పాలించింది. తర్వాత రుద్రాంబ మనుమడు రెండవ ప్రతాపరుద్రుడు (1296-1323) ఎక్కువ కాలం రాజ్యపాలన చేశాడు.

చివరకు ఇతని సేనాధిపతులు, దేవగిరి యాదవులు, మధుర పాండ్యులు, కళికోటలోని చేరరాజులు దండయాత్రలు చేశారు. అయితే మాలిక్‌కాఫరు, ఉల్లాఖాను వంటి తురుష్కుల దండయాత్ర వలన కాకతీయ సామ్రాజ్యం అంతమైంది.

13 వ శతాబ్దిలో ఆంధ్రదేశ సమాజ స్థితిగతులను నిర్దేశించిన రాజవంశం కాకతీయులది. వీరి శాసనాలు, నాణాలు, సాహిత్యం ద్వారా ఆనాటి సమాజాన్ని తెలుసుకోవచ్చు. వీరి కాలంలోని క్షత్రియులు, బ్రాహ్మణులు వంటి ఉన్నత వర్గం గురించి కాకుండా కింది వర్గాల, కులాల ప్రజల జీవన స్థితిని తెలుసుకోవలసి ఉంది. సమాజ స్వరూప స్వభావాలను తెలుసుకోవాలంటే ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేయాలి. సమాజంలో ఎప్పుడూ పై వర్గ సంస్కృతే ఆ సమాజ సంస్కృతిగా ప్రచారంలో ఉంటుంది. పై వర్గాల సంస్కృతికి కొంత భిన్నంగాను, కొంత సమానంగాను కింది వర్గాల సంస్కృతి ఉంటుంది. సమాజంలో జీవలక్షణం కలిగి, ఎక్కువ మంది ఆచరణీయాలను కలిగిన సంస్కృతి కింది వర్గాలవారిది.

ఆర్థిక, రాజకీయ అంశాలపై ఆధిపత్యం పై వర్గాలకే ఉన్నా సంస్కృతి ప్రజల జీవన విధానంలో పూర్తిగా ముడిపడి ఉంటుంది. అప్పటి చరిత్ర, సాహిత్యం (లిఖిత) ఎక్కువ భాగం పై వర్గాల జీవితాలను ప్రతిబింబించే విధంగా ఉంది.

13 వ శతాబ్ది ఆంధ్రదేశ చరిత్ర కూడా ఎక్కువగా పై వర్గాలకు సంబంధించినదిగా కనపడుతుంది. అయితే ఉపశ్రేణి (కింది వర్గాల) తరగతుల చరిత్రను తెలుసుకోవలసిన అవసరాన్ని ఆధునిక పరిశోధనలు ముందుకు తెచ్చాయి. ఈ పరిణామంలో భాగంగా సాహిత్యాన్ని, లభ్యమవుతున్న శాసనాలను, చారిత్రక అంశాలను దృష్టిలో ఉంచుకొని 13 వ శతాబ్ది ఉపశ్రేణి వర్గాల స్వరూప స్వభావాన్ని అంచనా వేయడానికి ప్రయత్నించవచ్చు.

కాకతీయుల పాలనలోని సామాన్య ప్రజల మతం, కులం, వృత్తులు, ఆహార పదార్థాలు, సాహిత్యం, జీవన విధానం మొదలైన అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. దీనివలన ఉపశ్రేణి వర్గాల ప్రజల సంస్కృతిని తెలుసుకోవచ్చు.

## 4.1. మతం

మానవుని ఆలోచనలకు అందని ప్రకృతి కార్యాలకు కారణాలను ఊహించే క్రమంలో మనిషి దేవున్ని సృష్టించుకున్నాడు. క్రమంగా దానికి కొన్ని ఆచారాలు జోడించి మతంగా పరిణమించింది. సమాజాల పరిణామ క్రమంలో భాగంగా కొన్ని మతాలు పుట్టాయి. అవి ప్రజల జీవన విధానంలో భాగమయ్యాయి. సమాజాన్ని నిర్దేశించడంలో ప్రధాన భూమికను పోషించాయి. 13 వ శతాబ్దంనాటికి ముఖ్యంగా ఆంధ్రదేశంలో జైన, బౌద్ధ, వైష్ణవ, శైవ మతాల ప్రభావం ఎక్కువైంది. సాధారణంగా రాజు ఒక మతాన్ని అవలంబించి, దాని ప్రచారానికి పూనుకొంటాడు. వివిధ మతాల మధ్య సైద్ధాంతిక చర్చలు జరగడం, ఒక మతంపై వేరొక మతంవారి ఆధిపత్యానికి పోరు జరగడం ఈ కాలంలో కనిపిస్తుంది.

*"కాకతీయుల కాలంలో జైన, శైవ, వైష్ణవ మతాలు పరస్పర ప్రాబల్యం కోసం పోరాడాయి. శైవ, వైష్ణవాలలో కుల భేద నిర్మూలనం ఒక సామాన్య ధర్మంగా వ్యక్తమవుతుంది. వైదిక మతం అగ్రవర్ణాల వారి హక్కుగా ఉంది. ప్రజాదరణ కోసం కేవలం యజ్ఞయాగాదుల వరకే భక్తి పరిమితం కాకుండా సామాన్యులు కూడా అందులో భాగస్థులుగా ఉండే విధంగా శైవ మత పద్ధతులు తోడ్పడటంతో ఆ మతం ప్రజలలో విరివిగా వ్యాప్తి చెందింది. దీనికి రాజాదరణ తోడై శైవమతం అప్రతిహతంగా వెలిగింది. ఏ శిల్ప రూపమైనా ప్రధానంగా మతమే ఆలంబనగా మత ప్రచారమే లక్ష్యంగా వర్ధిల్లింది."*

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 3)

### 4.1.1. శైవం/ వీరశైవం

శైవమతం ఆ రోజుల్లో సామాన్య ప్రజలకు కూడా కొంత దగ్గరైంది. వైదిక మతంలోని కొన్ని లక్షణాలను త్రోసి పుచ్చడం వల్ల ఇది సాధ్యమయింది. శైవం రాజపోషకుల దగ్గరనుండి సామాన్యుల వరకు ప్రజలను ఆకర్షించింది.

కులభేదాలు లేకుండా శైవ భక్తులందరూ శివునితో సమానమని చెప్పింది. స్త్రీ పురుషుల మధ్య అభేదం పాటించింది. కుల, మత, వర్ణ, లింగ భేదం లేకుండా శైవులందరూ సమానమని చెప్పింది. అందువల్ల కింది వర్గాలవారు కూడా శైవులుగా మారి శైవమత వ్యాప్తికి తోడ్పడ్డారు. వారి వారి స్థాయిలలో శివాలయాలకు విరాళాలు కూడా ఇచ్చారు.

*"రాజులు, రాణులు, సామంతులు, అధికార్లు, వర్తకులు, గ్రామపెద్దలు గాక వివిధ కులాలకు, వివిధ వృత్తులకు చెందిన ప్రజాసామాన్యం కూడా శివాలయాల నిర్మాణానికి, పోషణకు ధారాళంగా విరాళాలనిచ్చారు. దాచేపల్లి (గుంటూరు) కుమ్మరులు, వరంగల్లు రైతులు, కుడతిని (బళ్ళారి) కూలీలు 60 కుటుంబాలవారు, మోటుపల్లి గొల్ల జొన్నలగడ్డ సైనికుడు, కోటదారు అంతఃపురంలోని పాలదాడి కొడుకు, త్రిపురాంతకంలోని (కర్నూలు) గుర్రపురౌతు ఎడవల్లి (గుంటూరు) తాపీమేస్త్రీలు ముగ్గురు, "మొత్తం గ్రామప్రజలంతా" "అష్టాదశ వర్ణాల వారూ" - వీర శైవోద్యమంలో పాల్గొన్నారు. వ్యభిచారిణి తన వృత్తిని కొనసాగిస్తూ శివునికి అనేక బహుమతులిచ్చి ఆరాధన చేసింది."*

(సత్యనారాయణ, కంభంపాటి 1993: 38)

అయితే ఆ కాలంలో రాజకుటుంబాలు శైవులుగా ఉన్నా విష్ణుపూజకు అభ్యంతరం చెప్పలేదు. వీరశైవాన్ని రాజులు ఆదరించినట్లు కనపడదు. కాని శివారాధన జరిపి, ఆలయాలు కట్టించారు. శైవమతంలోని పాశుపత, కాలముఖ, ఆరాధ్య శైవశాఖలను ఆదరించారు. ఉదాహరణకు గణపతిదేవుని మత గురువు విశ్వేశ్వర శివుడు. ఇతను పాశుపత శాఖకు చెందినవాడు. రాజులు శైవ వైష్ణవ మతాల మధ్య ఉన్న విభేదాలను పొగొట్టడానికి కొంత ప్రయత్నించారు. శివకేశవుల ఆలయాలను నిర్మించడం ఇందుకు నిదర్శనం. గణపతి దేవుని సమకాలీకుడైన తిక్కన హరిహరనాథుడు కూడా మరొక ఉదాహరణగా చెప్పవచ్చు.

అయితే వీర శైవమత స్వభావాన్నిబట్టి, ప్రచారాన్నిబట్టి అది ఎక్కువ మంది ప్రజలకు దగ్గరవడానికి ప్రయత్నించిందని చెప్పవచ్చు. కానీ ఈ మత ప్రభావం కర్ణాటక రాష్ట్రంలో ఎక్కువ. ఆంధ్రదేశంలో దాని చాయలు మాత్రమే కనిపిస్తున్నాయి అన్నది నిజం.

కర్ణాటకలో కింది వర్గాల వారిని మతవ్యవస్థ దూరం చేయడం, వారిని వర్ణ వ్యవస్థ తక్కువగా చూడడం వలన వీరశైవం పుట్టింది. 12 వ శతాబ్దానికి ఉద్యమరూపం పొందింది. ఈ మతం జైనానికి పోటీగా నిలబడింది. బసవడు దీనికి నాయకుడు.

## 4.1.2. వైష్ణవం

కాకతీయుల కాలంలో శైవంతో పాటు వైష్ణవం కూడా ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. రాజులు ఒకమతాన్ని అవలంబించినా మరొక మతాన్ని తిరస్కరించలేదు. అయితే శివునికి ఉన్నంత ప్రాధాన్యం విష్ణువుకు లేదు. కాకతీయుల శాసనాలు ఎక్కువభాగం వరాహ ప్రార్థనతోనే ప్రారంభించబడి ఉన్నాయి. కాకతీయరాజులది కూడా వరాహ ముద్రికే. వీరు గరుడ కేతనం కలిగి ఉండేవారు. అలయాలలో శివునితో పాటు విష్ణువు, సూర్యున్ని కూడా ప్రతిష్ఠించారు. వీరి శాసనాలలో ప్రసన్నకేశవ, గోపాలదేవ, కేశవదేవ, చెన్నకేశవ, విష్ణు మొదలైన పేర్లతో ఉన్న వైష్ణాలయాలకు విత్తంఇచ్చినట్లు ఉంది. వీరి సామంతులు విరియాల, చాని, నెల్లూరు చోడులు వైష్ణవులు. అయినా ప్రజలలోకి శైవం చొచ్చుకొని పోయినంతగా వైష్ణవం వెళ్లలేక పోయింది.

ఈ కాలంలో వైష్ణవ మత ప్రచారానికి పూనుకొన్న వ్యక్తి బ్రహ్మనాయుడు. ఇతను వైష్ణవ మతం ద్వారా కుల, లింగ, వర్ణ అభేదమైన సిద్ధాంతాలను ప్రచారం చేసి ఆచరించాడు. ఇది ఆ కాలానికి వైష్ణవంలో చెప్పుకోదగిన మార్పు. ఈ మార్పును కింది తరగతుల వారికి మతం దగ్గరవడానికి చేసిన ప్రయత్నంగా చెప్పవచ్చు.

క్రీ.శ. 11వ శతాబ్దంలో పలనాడులో హైహయరాజుల మంత్రి బ్రహ్మనాయుని నాయకత్వంలో వీరవైష్ణవం ప్రారంభమైంది. రామానుజుని శ్రీవైష్ణవం, బసవేశ్వరుని వీరశైవం వల్ల ప్రభావితుడయిన బ్రహ్మనాయుడు వీరవైష్ణవాన్ని ప్రబోధించాడు. ఇచట 'వీర' అనే పదం వీరశైవుల వలె మత

ప్రచారంలో హింస, అన్య వాదన దూషణ, నిరసన తెలియజేయదు. కేవలం వీర శైవంలోని మతపరమైన కుల, వర్గరహిత సమానత్వాన్ని భక్తి ప్రపత్తులను సూచిస్తుంది. మాచర్లలోని చెన్నకేశవుని దేవాలయంలో పంచములకు ప్రవేశం కల్పించాడు. స్వయంగా పంచముడయిన కన్నమదాసుని పుత్ర సమానంగా ఆదరించాడు. అన్ని కులాల వారికి చాపకూడు పెట్టి తాను నమ్మిన సిద్ధాంతాలను ప్రయోగాత్మకంగా మలిచినాడు. అంతేకాకుండా నిమ్న జాతుల వారికి దాసనామాన్ని, వృచ్ఛిష్ఠాన్నిచ్చి వైష్ణవులుగా మార్చినాడు. ఈ విధమైన ప్రపత్తి "ఆచార్యులు" లేదా గురువులను చేరేందుకు మార్గంగా నమ్ముతారు."

(కనకదుర్గ, పి 1992: 97-98).

ఈ విధంగా వైష్ణవం కొంత మత సంస్కరణ దృష్టితో కింది తరగతులకు దగ్గరయిందని చెప్పవచ్చు. అయితే సమాజంలో ఎవరో ఒకవ్యక్తి ఈ విధమైన కార్యాలకు పూనుకొంటే సమాజం మొత్తం ఇలానే ఉందని అంచనాకు రావడం సరైంది కాదు. రాజులు, మతాచార్యులు, బ్రాహ్మణుల వంటి వారే ఈ మత విషయ చర్చకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు.

వీరశైవం కాని, వైష్ణవం కాని ఆంధ్ర రాష్ట్రంలో పుట్టి వ్యాప్తి చెందినవి కావు. ఈ కాలమున కొత్తగా ఏర్పడ్డవి కావు. "*అవి అరవ దేశమందు ప్రాచీనము నుండియే స్థిరపడి యుండెను. వైష్ణవము కన్నా శైవమే అరవదేశమందు ప్రాచీనతరమైనట్టిది. ఆ రెండు మతాలు తెలుగుదేశములోనికి వచ్చెను. ఉభయ మత ప్రబోధకులును పరస్పర స్పర్థతో శూద్రాది జన సామాన్యమునకు మూఢభక్తిని ఒంట బట్టించి వారు మరల జారి పోకుండుటకై శివలింగాలు కట్టి లేక వైష్ణవ ముద్రలు వేసి నామాలు పెట్టించిరి.*" (ప్రతాపరెడ్డి, సురవరం 1992: 17).

ఈ విధంగా మతాధికారులు సామాన్య ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకొని వారి జీవితాలలో మతమౌఢ్యాలను నింపడానికి ప్రయత్నించారు.

## 4.1.3. జైనం

ఆంధ్రదేశములో క్రీ.శ. 12వ శతాబ్దానికి జైనమతం క్షీణదశకు చేరుకొందని చెప్పవచ్చు. కాకతీయులు ప్రోలరాజు వరకు జైనమతాన్ని అవలంబించినవారే. ప్రోలరాజు కుమారుడు శైవమతాన్ని అవలంబించాడు.

*"హనుమకొండలోనూ, వరంగల్లులోను ఉన్న కాకతీయ దేవాలయాలలో జైనచ్ఛాయలు కనబడతాయి. ఒకప్పుడు జైనమతం రాజాదరణ పొందింది. కాని శైవుల ఉన్నత మతాభిమానం దానిని ధ్వంసం చేసింది. బెజవాడలోని కనకదుర్గ - మల్లేశ్వరస్వామి దేవాలయంలో కూడా అటువంటి చిహ్నాలే కనిపిస్తాయి. కరీంనగర్ జిల్లా కాళేశ్వరంలో జైన, బౌద్ధమత ఛాయలు కనిపిస్తాయి".*

*"జైనమతం జైన పరివ్రాజకులకు ఒకవిధమైన నియమావళిని (పంచమహా వ్రతాలు), గృహస్థులకు ఒకరకమైన నియమావళిని (12 నియమాలు) నిర్దేశించింది. అయితే ఇవి కష్టమైనవి కావు. ఈ మతం అస్పృశ్యత గురించి, లింగభేదం గురించి, వర్ణ, కుల మొదలైన అంశాల గురించి ఏమీ చెప్పలేదు. అందువల్లనే కింది తరగతులకిది దూరమైంది. నిగ్రహం కలిగి ఉండి నియమాలను పాటించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. ఈ మతం ఎక్కువ వర్తకులకు దగ్గరైంది. విరాళాలు వచ్చినా సామాన్యులకు దూరమై ఆస్థానాలకు, రాజులకు దగ్గరైంది జైనమతం. ప్రపంచ సంబంధాలను వదులుకోమని చెప్పడం వలన విద్యావంతులకు మాత్రమే ఈ మతం దగ్గరైంది. అంటే జైనమతం ముఖ్యంగా ఉన్నత వర్గాలవారికి మాత్రమే అందుబాటులో ఉంది."* (సత్యనారాయణ, కంభంపాటి 1993: 43).

"మొదటి బేతరాజు యుద్ధమల్లుని జైనాలయానికి దానం ఇచ్చాడని శనిగారం శాసనం వల్ల తెలుస్తుంది. రెండో బేతరాజు జైనబసదికి దానం ఇచ్చాడని మొదటి మేడరాజు వేయించిన బానాజిపేట శాసనంలో ఉంది. రెండో ప్రోలరాజు మొదట జైనుడు. తర్వాత శైవమతం స్వీకరించాడు." (కనకదుర్గ, పి 1992: 85 - 107).

## 4.1.4. బౌద్ధం

కాకతీయుల కాలంనాటికి బౌద్ధం చాలావరకు కనుమరుగయింది. రాజులు మంత్రులు కొంత ఆదరించినట్లు శాసనాలవల్ల మాత్రం తెలుస్తుంది. అమరావతి, నాగార్జునకొండ బౌద్ధమతానికి ప్రధాన కేంద్రాలు.

*"ధరణికోటను ఏలిన కోటకేతరాజు, అతనివేశ్యలు క్రీ.శ* ***1182*** *బుద్ధదేవునికి దీపస్తంభాలు ఎత్తించినట్లు అబ్బూరిశాసనం చెబుతుంది. అమరావతిలో మరికొన్ని ఆరామాలలో కూడా బుద్ధదేవునికి దీపస్తంభాలు ఎత్తించినట్లు శాసనాధారాలున్నాయి. ఆరామాలు - దాక్షారామం, క్షీరారామం(పాలకొల్లు), భీమారామం(సామర్లకోట), కొమరారామం(భీమవరం). ఈ ప్రదేశాలలో సోమన పెగ్గడ దీపస్తంభాలెత్తించాడు.*

*క్రీ.శ.* ***1171****లో కాకతీయ మంత్రి గంగాధరుడు పట్టశాల అనేచోట బుద్ధుని ప్రతిష్ఠించినట్లు కరీంనగర్ శాసనం తెలుపుతున్నది. అందులో అసుర సంహారం కోసం విష్ణువే బుద్ధుడి అవతారం ఎత్తినట్లు ఉంది. అంటే బౌద్ధం హిందూ మతంలో విలీనం అయినట్లు తెలుస్తుంది. కాకతి రుద్రుని సేనానులలో ఒకడైన మల్లిరెడ్డి కూడా బుద్ధుని ప్రతిష్ఠించినట్లు బెక్కల్లు శాసనం వల్ల తెలుస్తుంది."*

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 26)

పండితారాధ్య చరిత్ర మహిమ ప్రకరణంలో రెండో వెలనాటి రాజేంద్రచోళుని ఆస్థానంలో క్రీ.శ. 1162-81 లో మల్లికార్జున పండితునికి, బౌద్ధభిక్షువుకు వివాదం జరిగినట్లుగా ఉంది. తర్వాత మల్లికార్జునుని శిష్యులు బౌద్ధబిక్షువును చంపినట్లు కూడా ఉంది. దీని వలన శైవం బౌద్ధంపై కూడా ఆధిక్యాన్ని సాధించే క్రమం ఆకాలంలో ఉందని చెప్పవచ్చు. అయితే జైనం వలే, బౌద్ధం కూడా సామాన్య ప్రజల ఆచరణకు అనుకూల నియమావళి లేకపోవడం వల్ల కింది వర్గాలకు పూర్తిగా చేరలేదు. పైగా కాకతీయుల కాలానికి శైవమత విజృంభణ ప్రభావానికి నిలబడలేక పోయిందని తెలుస్తుంది.

## 4.2. జానపద దేవతలు

"కాకతీయుల కాలంలో వర్ణవ్యవస్థ ఉంది. అయితే ఈ వర్ణవ్యవస్థతో పాటు తెగల సంస్కృతికి చెందిన స్త్రీ దేవతారాధన కూడా కనిపిస్తుంది. అంటే ఒకవిధమైన మిశ్రమ సంస్కృతి ఈ కాలంలో ప్రారంభమైందని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ దేవతలను ప్రజలు కొలిచేవారు. అందువల్ల రాజులూ ఈ దేవతలను ఆదరించి దానాలు ఇచ్చినట్లు తెలుస్తుంది. ఒంగోలు తాలూకా నన్నూరులో గ్రామదేవత హెంకరిదేవికి రాజాదరణ లభించిందని తెలిపే మూడు శిలా లేఖలు దొరికాయి. రెండవ అమ్ముదేవుని శాసనంలో ఊరి సరిహద్దులు తెలిపేచోట గ్రామ దేవత పేరు ప్రథమంగా శాసనాలలోకి ఎక్కింది." (సత్యనారాయణ, కంభంపాటి 1993: 40 - 45).

ఈ విధంగా కాకతీయుల కాలంలో మల్లన్న, మైలారు, వీరప్ప, కాకతి, ఏకవీర, ఎల్లమ్మా, మలాంబి వంటి స్థానిక దేవతలు, దేవుళ్లు ఉండేవాళ్లు. వీరి చుట్టూ పౌరాణిక గేయగాథలు అల్లబడేవి. దిగువ తరగతి ప్రజలలో కర్మకాదుల వంటి క్రతువులు కనపడవు. వారి పూజావిధానం అంతా తెగల సంస్కృతికి దగ్గరగా ఉంది.

"*ఆనాటి సాహిత్యంలో దిగువ తరగతి ప్రజల మతాచార పద్ధతులు మనకు విశదంగా కనిపిస్తాయి. వారిలో ప్రార్థనలు, ప్రాయశ్చిత్త కర్మకాండలు ఉండవు. గరిడీలు, మల్ల ప్రదర్శనలు ఎక్కువ. జాతరలూ, తిరుణాళ్లూ జరుపుతారు. దిగువ తరగతుల ప్రజలు కాకతమ్మ, ఏకవీర, మైలారు, దేవ, ముసానమ్మ వగైరా దేవతలను కొలుస్తారని వల్లభరాయని 'క్రీడాభిరామం' వర్ణిస్తుంది. కామేశ్వరి, ఏకవీర, ముహరమ్మ మొదలైన దేవతల కథలను పాటలుకట్టి వరంగలులో పాడేవారు. పల్నాడులోని వీరుల గుడిలో వీరపూజ చేస్తారు.*" (సత్యనారాయణ, కంభంపాటి 1993: 42).

ఇది గ్రామ సంస్కృతి. మత సంబంధమైన ఆచారాలలో ఇటువంటివి దిగువ తరగతి ప్రజల జీవనవిధానంలో కనపడతాయి. వీరికి రాజులు, బ్రాహ్మణులు వంటి అగ్రవర్ణాల మతాచారాలతో అంతగా సంబంధం ఉండేది కాదని దీనివలన తెలుసుకోవచ్చు. ఈ గ్రామదేవతలు, దేవుళ్లు ఒక్కొక్కరు దిగువ తరగతి వారి సంస్కృతిలో కలిసి పోయి ఉన్న విధానం తెలుస్తుంది.

'ఏకవీర కాకకతమ్మతో పాటు వీరి కాలంలో పూజలందుకున్న మరో స్త్రీ దేవత, పరశురాముని తల్లి రేణుక. పరశురాముడు తల్లి రేణుక శిరస్సు నరకగా అది మాలవాడలో పడిందట. మొండెమునే అక్కడ స్థానికులు పూజిస్తున్నారు. పిల్లలులేనివాళ్లకు ఈమె పిల్లలనిస్తుందని *'ఆలంపురీ మాహాత్మ్యం'* అను స్థానిక లిఖిత గ్రంథంలోని కథ. ఈమెకే ఎల్లమ్మా అను నామాంతరం కలదు. ఎల్లమ్మ అనగా ఎల్లరకూ అమ్మ అని కన్నడంలో అర్థం. అలంపూరులో బ్రహ్మేశ్వరాలయంలో తలలేక నగ్నంగా ఉన్న శిలను ఎల్లమ్మ అని, రేణుక అని స్థానికులు పిలుస్తారు.

ఈమెను స్థానిక దేవతగా అన్ని కులాలవారు పూజిస్తారు. గ్రామీణులు తిరునాళ్లు, జాతర్లు, పొలి పెట్టడం, బోనాలు వంటి ఉత్సవాలు ఈమెకు చేస్తారు. తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో ఈ జాతర్లు నేటికీ ఉన్నాయి. ఈ ప్రాంతాల పల్లెల్లో రేణుక కథను బవనీండ్లు (మాదిగజాతివారు) జవనిక (జమిడికి) వాయిస్తూ చేస్తారు.

భైరవుడు అనే దేవుని గూర్చి శాసనాలలోను, *'క్రీడాభిరామం'*లోను ఉంది. దక్షయజ్ఞం ధ్వసం చేయడానికి పుట్టిన వీరభద్రుడినే భైరవుడు అని పిలుస్తారు. మాచెర్ల చెన్నకేశవుడను దేవుడు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. పల్నాటి కథలో బాలచంద్రుని తల్లి ఐతమ్మ సంతానం కోసం మాచర్లలోని చెన్నకేశవ ఆలయంలో గజనిమ్మా అనే నోము నోచిందని చెప్పబడి ఉంది.

గ్రామంలో ఏదైన వీరకార్యం చేసి మరణించిన వారిని పూజించు ఆచారం ప్రజలలో ఉంది. వారికి చిహ్నంగా వీరపూజలు చేస్తారు. ఇది సుమారు పల్నాటి యుద్ధం క్రీ.శ. 1132 తర్వాత ప్రారంభమై ఉండొచ్చని *'పలనాటి వీరచరిత్ర'* పీఠికలో అక్కిరాజు ఉమాకాంతం గారన్నారు. *'క్రీడాభిరామం'*లో కూడా దీనికి సంబంధించిన అంశాలున్నాయి. కలని పోతులయ్య, గురజాల గంగ ఇటువంటి వారే.

మైలారు దేవతను శివ ప్రతిరూపంగా భావించి ఉత్సవాలు చేస్తారు. ఈమె మైలారులో ఉండడం వలన మైలారు దేవతగా పిలవబడుతున్నది అని చెప్పవచ్చు. ఈ ఉత్సవంలో చాలా మంది మద్యం తాగి నృత్యం చేస్తారు.

*"స్థానిక గ్రామదేవతలను పార్వతి అవతారాలుగా భావించి శివుని భార్యలుగా చెప్పుకునే సంప్రదాయం ఈ కాలంలో కనిపిస్తుంది. తెగలసంస్కృతి, వర్ణాశ్రమ సంస్కృతుల మిశ్రమం ఈ కాలంనాటికి ప్రారంభమైనట్లు దీనివలన తెలుస్తుంది."*

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 47-56)

## 4.3. మంత్రాలు - తాంత్రిక విద్యలు - నమ్మకాలు

మంత్రాలను, మానవాతీత శక్తులను నమ్మడం జానపదులలో కనిపిస్తుంది. అతీంద్రియ శక్తులతో నమ్మించడం కొంతమందికి జీవనోపాధిగా ఆకాలంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇవి కింది తరగతుల ప్రజలలో ఎక్కువగా ప్రచారం అవుతూ ఉంటాయి. వీటి ప్రభావానికి ఎక్కువలోనయ్యేది కూడా సామాన్య ప్రజలే.

మనిషిని వివిధ రకాల కట్లతో మంత్రించి చనిపోయేలా చేసేవారట. పల్నాటి వీరచరిత్రలో ఈ కట్టుబోతులు 18 రకాల కట్లు తెలుసని నాయకురాలితో చెప్తారు. దయ్యాల మల్లయ్య వీరికి గురువని కూడా చెప్పుకుంటారు.

పండితారాధ్య చరిత్ర, బసవపురాణాలలో ఎక్కువగా శివభక్తులు ప్రదర్శించే మహిమలు ఉన్నాయి. వంకాయలు లింగాలుగా మారడం, జొన్నలు ముత్యాలవడం, కాళ్లు, చేతులను మరలా తెప్పించడం, కళ్లు పోయి రావడం, చనిపోయిన వారిని బతికించడం ఇటువంటివి శివభక్తులు చేయడం పై రచనలలో కనిపిస్తుంది.

'తాంత్రిక విద్యలు బాగా ప్రచారంలో ఉన్నట్లు, వీటిని సామాన్య ప్రజలు ఎక్కువగా నమ్మేవారని '*క్రీడాభిరామం, పల్నాటి వీరచరిత్ర, పండితారాధ్య చరిత్ర*' వంటి వాటి ద్వారా తెలుస్తుంది. భూతాలు, ప్రేతాల వంటి గాలులు సోకకుండా చిన్నపిల్లలకు తాయత్తులు కట్టించే అలవాటు కూడా ఉంది. తాంత్రిక విద్యలలో మరొకటి అంజనం. ఇది ఆకాలంలో ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది.

దొంగతనాలు జరిగినప్పుడు, పశువులు, పిల్లలు తప్పిపోయినప్పుడు అంజనం వేసి చూస్తారు. బోకి పెంకులపై మంత్రించి కాటుకను పూసి చిన్న పిల్లలకు చూపిస్తారు. దానిలో పోయినవి కనపడతాయని ప్రజల నమ్మకం.

ఆ రోజులలో సిద్ధులు, శైవోపాసకులు మామూలు లోహాలను బంగారం చేసేవారట. '*కుమార సంభవం*'లోను, '*పండితారాధ్య చరిత్ర*'లోను ఈ విద్య తెలిసిన సిద్ధులున్నారని చెప్పబడి ఉంది. నవనాథులలో ఒకరైన నాగార్జునాచార్యుడు రసయోగ శాస్త్ర నిర్మాత అని '*నవనాథ చరిత్ర*'లో ఉంది.

భైరవుడు, కాపాలిక వంటి క్షుద్రదేవతలకు పూజలు చేయడం వంటివి కూడా ఉన్నాయి. వీరావేశంతో దేవతలకు అవయవాలను, ప్రాణాలను అర్పణ చేయడం, నరబలులు ఇవ్వడం కూడా ఉన్నట్లు తెలుస్తుంది. నరబలులిచ్చే దేవాలయాలను చంపుడుగూళ్లు అనేవారు. ఈ తాంత్రిక శక్తులు కలిగినవిగా కాలాముఖ, కాపాలక, సిద్ధ శైవాలు గుర్తించబడ్డాయి. కాలముఖ శైవంలోని ఒక శాఖైన సింహపరిషత్తు బెజవాడ, చేబ్రోలు, తాడికొండ, వేములవాడలలో స్థాపించబడింది. అదే విధంగా కాలముఖ శైవంలోని మరో శాఖైన శక్తి పరిషత్తు అలంపురం త్రిపురాంతకం, శ్రీశైలం, గంగవరం మొదలగు చోట్ల స్థాపించబడింది.

ఈ తాంత్రిక శక్తులు ప్రజలకు కొంత మేలు చేయడం కూడా జరిగింది. "*మొదట్లో తాంత్రిక మతం పంచను కారములకు స్థానమిచ్చినా, దైనందిన మత, క్రతువులే కాక పాముకాటు, తేలుకాటు, విషపురుగుల కాటు మొదలగు వాని నుండి ప్రజలను కాపాడటం, చేతబడులు తిప్పడం, పంటలను క్రిమికీటకాదుల బారి నుండి, కరువు కాటకాలనుండి రక్షించడం లాంటి అనేక సమాజహిత కార్యక్రమాలు నెరవేర్చేది. అంతేకాక మానవ జీవితంలో ముఖ్యమైన భక్తి, ముక్తి, కామముల సిద్ధికోసం ప్రయత్నాలు చేసింది. రసవాదం లాంటి విద్యలు ఇత్తడిని కూడా బంగారం చేయటానికి ఉపయోగించేది. శైవ, వైష్ణవ దేవాలయాల్లో శక్తిని, గ్రామదేవతలను పూజించటంతో తాంత్రిక మతము ఒక వ్యవస్థగా రూపొందేందుకు అవకాశం కలిగింది.*"

(కనకదుర్గ, పి 1992: 85-100)

## 4.4. వర్గం - కులం

13 వ శతాబ్దం నాటికి వర్ణ వ్యవస్థ బలంగా కనిపిస్తుంది. కాలక్రమంలో వృత్తులు కులాలుగా మారి కొన్ని నీచవృత్తులుగా గుర్తింపును పొందాయి. అస్పృశ్యత ఆ కాలం నాటికి ఉంది. కులాలలో నుండి ఉపకులాలు విడివడ్డాయి. రాజులు బ్రాహ్మణుల సైద్ధాంతిక విషయాలకు ప్రాధాన్యత ఇస్తూ కుల వ్యవస్థను, వర్ణ వ్యవస్థను కాపాడే అధికారం కలిగి ఉన్నారు.

'పురుషసూక్తం'లో ఉన్నట్లుగానే బ్రహ్మముఖం నుండి బ్రాహ్మణులు, భుజాలనుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు పాదాల నుండి శూద్రులు పుట్టారనే విషయాన్ని ఈ కాలానికి (క్రీ.శ. 1189) చెందిన పానుగల్లు శాసనం తెలియజేస్తుంది.

### 4.4.1. బ్రాహ్మణులు

కాకతీయుల కాలంలో బ్రాహ్మణులు విద్యా, మత సంబంధమైన విషయాలలో తమ ఆధిక్యాన్ని నిలుపుకొన్నారు. రాజుల నుండి అగ్రహారాలు, దేవభోగాలు ఎక్కువగా పొందారు. వీరు దేవాలయాలలో పూజారులుగాను, భక్తులకు పురాణాలను, వేద వేదాంగాలను బోధించేవారిగాను, శుభ ముహూర్తాలు నిర్ణయించేవారిగాను, రాజ్యంలో మత సంబంధ విధులు సక్రమంగా జరిగే విధంగా రాజుకు సలహాలు ఇవ్వడంలోను ఇలా మొదలైన పదవులను, కార్యాలను నిర్వహించేవారు.

"*క్రీ.శ. 1197 లో రెండవ కేతరాజు గుంటూరు, పాలసమిర్రు, కాచ్చెర, వంగిపురం, ఇనుంగల్లు, ఉప్పటూరు, కారంచేడు అనబడే ఏడు అగ్రహారాల మధ్య ఉన్న ప్రాంతాన్ని బాగుచేసి బ్రాహ్మణులకు ఇచ్చాడు. గణపతి దేవుడు అధికారాన్ని వెలనాడు, కమ్మనాడు, కొలను ప్రాంతాలకు వ్యాపింపచేసి అగ్రహారాలను ఏర్పాటు చేశాడు. క్రీ.శ. 1250లో సకల ధాన్యాలు పండే సుభిక్షమైన కోలవెన్ను అనే గ్రామాన్ని శుక్ల యజుర్వేద పండితులైన బ్రాహ్మణులకు వృత్తులుగా ఇచ్చారు.*" (కనకదుర్గ, పి 1992: 25, 26).

ఈ విధంగా బ్రాహ్మణులు రాజుల నుండి ఆస్తులను పొంది వారి క్రతువులను నిర్వహించేవారు. ఆకాలం నాటికి బ్రాహ్మణ, అగ్రహారాలను 'నల్లిళ్లు' అని పిలిచేవారు. 'నల్ల' అనగా అందమయిన అని, ఇల్లు అనగా ప్రదేశం అని అర్థం. దీనిని బట్టి ఆనాటి బ్రాహ్మణుల జీవితాలను తెలుసుకోవచ్చు. పురోహితులుగా (గణపతిదేవుని పురోహితుడు భట్టోపాధ్యాయుడు) దూతలుగా (తిక్కన) రాజగురువులుగా (రామేశ్వరుడు), ధ్రువేశ్వరము చంద్రభూషణ శివాచార్యుడు, విశ్వేశ్వర శివాచార్యులు మొదలగు వారు కాకతీయుల గురువులు రాజ్యంపై, పరిపాలనాధికారంపై వీరికి పట్టు ఉండేది.

పై విధంగా రాజ్యంలో బ్రాహ్మణులు గొప్ప స్థితిలో ఉన్నారు. వీరికి శిక్షలు కూడా తక్కువగా ఉండేవి. శిరచ్ఛేదన వంటి శిక్ష బ్రాహ్మణులకు ఎంత తప్పు చేసినా విధించేవారు కాదు. రుసుం చెల్లింపు, దేశబహిష్కరణ వంటివి వీరికి విధించే శిక్షలు. (కనకదుర్గ, పి 1992: 25-35).

## 4.4.2. క్షత్రియులు

దక్షిణ భారతదేశంలో రాజ్యాన్ని చేపట్టి, క్షాత్ర ధర్మాన్ని నిర్వర్తించిన వారందరూ క్షత్రియులమని చెప్పుకున్నారు. పరిపాలనా వ్యవస్థలో మధ్యయుగం నాటికి అనేక మార్పులు వచ్చాయి. ప్రభువులు, సామంతులు అనే భేదం 11, 12 శతాబ్దాల నాటికి ఉచ్ఛస్థితిలో కనపడుతుంది. తూర్పు వేంగీ చాళుక్యుల పతనం తరువాత అధికారం శూద్రులైన కాకతీయుల చేతిలోకి వచ్చింది. ముఖ్యంగా క్షత్రియులు తక్కువ కులం స్త్రీలను వివాహం చేసుకోవడం వల్ల వారి పిల్లలు కూడా క్షత్రియులుగా వ్యవహరింపబడ్డారు.

రాజులు రాజ్యాధికారాన్ని కలిగి ఉండి రాజ్య పరిపాలనకు సంబంధించిన విధులన్నీ స్వయంగా చూసుకొనేవారు. యుద్ధాలు, శిక్షలు, దానాలు, ఆర్థిక పరిస్థితుల పరిరక్షణ మొదలగునవి చూసుకొనేవారు. "*కాకతీయుల సామ్రాజ్యం రాజ్యం, దేశం, మండలం, నాడు, సీమ, స్థలం, వాడి, భూమి (గ్రామం, అగ్రహారం) మొదలగు భూ భాగాలుగా విభజింపబడటమే కాకుండా అధికారం కేంద్రం, రాష్ట్రం స్థానిక స్వపరిపాలనా సంస్థలకు వికేంద్రీకరింప బడినది. మహా*

*మండలేశ్వర, మాండలి, మహా ప్రధాని, మహా సామంత, సామంత దండ నాయక, సమస్త సేనాపతి, గజ సాహిణి, అశ్వసాహిణి, సుంకాధికారి, గ్రామ కరణం, గ్రామ పెద్ద మొదలయిన స్థాయిలలో పరిపాలనాధికారం పంచిపెట్టబడింది."* (కనకదుర్గ, పి 1992: 42). అయితే వీటన్నిటిపై రాజు అధికారం కలిగి ఉండేవాడు.

కాకతీయ ప్రభువులు అడవులు నరికించి నూతన గ్రామాలు ఏర్పరిచారు. వర్ణవ్యవస్థను రక్షించి, దానికి ప్రాధాన్యమిచ్చారు. వీరు సార్వభౌమాధికారాన్ని తెలియ జేసుకొనేందుకు సూర్యవంశ రాజులమని చెప్పకొని పంచమహాశబ్దాలు, చక్రవర్తి, రాజాధి రాజు, పృథ్వీ వల్లభుడు వంటి బిరుదులు ధరించారు. మోటుపల్లి (క్రీ.శ. 1244-45), గారవపాడు (క్రీ.శ. 1260), మల్కాపురం (క్రీ.శ. 1260) శాసనాలు ఈ అంశాలనే తెలియజేస్తున్నాయి.

## 4.4.3. వైశ్యులు

బ్రాహ్మణులు, క్షత్రియుల తర్వాత వైశ్యులు ఈ కాలంలో కూడా మూడవ వర్ణంగా గుర్తింపు పొందారు. ఈ కాలానికే వీరికి 'కోమటి' అనే పదం వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తుంది. వైశ్యుల పేర్ల చివర 'శెట్టి' ఉన్నట్లు కాకతీయుల శాసనాల వల్ల తెలుస్తుంది. కాకతీయుల కాలంలో స్వదేశీ, విదేశీ వర్తకం కూడా జరిగింది. బ్రాహ్మణులలో వలె వీరిలో కూడా శాఖా భేదాలు ఉన్నాయి. కమ్మ కోమట్లు, కమ్మ వైశ్యులు అని శాసనాలలో వీరి పేర్లు ఉన్నాయి. వర్తక కేంద్రాలను నకరం అనేవారు. అంటే వైశ్యులు నకరాలుగా ఏర్పడి వ్యాపారం చేసేవారు.

సాధారణంగా వ్యాపారస్తులు విలువగల వస్తువుల క్రయ విక్రయాలలో మోసాలు చేయడం, అందుకు తగిన శిక్షలు అనుభవించడం కూడా ఉంది. వైశ్యులు దేవాలయాలకు, బ్రాహ్మణులకు దానాలు ఇచ్చేవారు. కొందరు వైశ్యులు బ్రాహ్మణుల వలె ఋషిగోత్రాలను కూడా ధరించేవారు.

*"దేశీ-స్వదేశీ నకరాలు పోక, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, ఆవాలు, గోధుమలు, వివిధ ధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనెలు, నెయ్యి మొదలైన వస్తువుల్లో వ్యాపారం జరిగేది. పరదేశి, నానాదేశి నకరాలు వస్త్రాలు, తమలపాకులు,*

*ఉప్పు, బెల్లం, నువ్వులు, చక్కెర, వెల్లుల్లి, కొయ్య వాము, అల్లం, జీలకర్ర, జనుము వంటి సరుకుల్లో బేరాలు చేసేవారు. ఉభయ నానాదేశివారు చందనం, కర్పూరం, కస్తూరి, మిరియాలు, లక్క, రాగి, సీసం, ఇత్తడి, వెలిగారం, ఉన్ని, సున్నితమైన వస్త్రాలు, సవరాలు, పూసలు, ముత్యాలు, పగడాలు, వెండి బంగారాలు, నవరత్నాలు మొదలైనవే కాకుండా గుర్రాలు, ఎద్దులు, గొర్రెలు వంటి జంతువులతో కూడా వ్యాపారం చేసేవారు."*

(కనకదుర్గ, పి 1992: 48)

ప్రజల దైనందిన జీవితంలో వాడే ఈ వస్తువులను బట్టి ఆనాటి ప్రజల, జీవితాలను అంచనా వేయవచ్చు.

## 4.4.4. శూద్రులు

వర్ణవ్యవస్థలో పేర్కొనబడిన శూద్ర వర్ణం ముఖ్యంగా వ్యవసాయం, వడ్రంగం, కుమ్మరం, కమ్మరం మొదలైన వృత్తులు చేస్తూ ఉండేవారు. శూద్ర అనే పదం క్షుద్ర శబ్దం నుండి వచ్చిందని క్షుద్ర శబ్దానికి చిన్న లేదా తక్కువ అని అర్థాలున్నాయని పండితుల విశ్లేషణ. మిగిలిన వర్ణాలవారికి సేవ చేయడం, వారికి అవసరమైన వనరులను చేకూర్చడం వీరి ప్రధాన విధులుగా ఉండేవి.

కాకతీయుల కాలంలో శూద్రుల్లో మహా మండలేశ్వరుల నుండి వ్యవసాయకూలీల వరకు, సత్‌శూద్రుల నుండి అంటరాని వారి వరకూ ఉన్నారు. శైవమత ప్రభావం వల్ల వర్ణ వ్యవస్థ కొంత సడలింది. శూద్రులు కూడా పరిపాలనా వ్యవహారాలలో భాగం కల్పించుకొన్నారు. ముందే చెప్పినట్లు ఈ కాలం నాటికి వర్ణ సంకరం వల్ల కులాలు వృత్తిని బట్టి ఏర్పడి వారిలో అనులోమ విలోమ వివాహాలు జరగడంవల్ల భిన్నత్వాన్ని పొందడం వల్ల వివిధ వృత్తులు నిర్వహించేవారు. కులాల వారీగా స్థిరీకరింపబడ్డారు.

గ్రామవ్యవస్థకు ప్రధానాధికారి గ్రామాధికారి. ఇతను గ్రామంలోని వివాదాలను పరిష్కరించేవాడు. కరణం భూ సుంకాలు, పన్నులు మొదలైనవి చూసేవారు. వ్యవసాయ సంబంధితాంశాలపై అధికారం కలిగి ఉండేవారు. గ్రామ

రక్షకునిగా తలారి ఉండేవాడు. జ్యోతిష్కుడు, ఉపాధ్యాయుడు కూడా ఉండేవాళ్లు. మిగిలిన వృత్తులవాళ్లు వారి వారి వృత్తులు చేస్తూ ఉండేవాళ్లు.

ఆనాటి శాసనాలు, సాహిత్యం వలన 'పంచాణం' వారు, 'అష్టాదశ ప్రజ' అనేవారు ఉండేవారని తెలుస్తుంది. పంచాణం అంటే వడ్రంగి, కమ్మరి, కంచరి, కంసాలి, కాసె అనే కులాలవారు. అష్టాదశప్రజ అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, వ్యావహారిక, గోరక్షక శిల్పక పంచాణ, కుంబాకార, తంతునాయ, క్షౌరక, రజక, వస్త్రచ్ఛేదన, చర్మకార, తిలఘాతుక, లబ్ధక, చండాల, మాతుంగులు అని శాసన శబ్దకోశం వలన తెలుస్తుంది.

## 4.4.5. బోయలు

'బోయలు వేటే ప్రధాన వృత్తిగా కలవారు. అడవులు నరికి నూతన వ్యవసాయ పద్ధతులు చేపట్టడం ద్వారా బలపడ్డారు. పల్లవ, చాళుక్యుల యుద్ధాలలో కీలక పాత్ర పోషించారు. పల్లవుల తర్వాత 12 బోయకొట్టాగా ఏర్పడి దుర్గ నిర్మాణం చేసుకొన్నారు. చాళుక్య రాజగు గుణగ విజయాదిత్యుని కాలంలో బోయకొట్టాలు చాళుక్యులు వశమయ్యాయి (క్రీ.శ. 848-891). అయితే 11, 12 శతాబ్దాలలో జరిగిన చాళుక్య, చోళ సంఘర్షణల వల్ల కొంత మంది బోయలు రాజకీయాలలోకి వచ్చారు. అనేక ఉన్నత పదవులను నిర్వహించారు. వెలనాటి రెండవ గొంకని కొలువులోని గుండయ బోయమాండలిక శేఖరుడని, భాదన భీముడని, అహవ రక్షకుడని బిరుదులు పొందారు. కులోత్తుంగ రాజేంద్రచోడుని సర్వాధికారి ఎంజలి బోయడుతాను చతుర్థ కులానికి చెందినవాడినని చెప్పుకున్నాడు.

బోయలలో ఊరు బోయలని, న్యాస బోయలని రెండు వర్గాలు ఉండేవాళ్లు. వీరిలో కొంతమంది దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు కూడా నిర్వహించేవాళ్లు. రేణుక, అంకాలమ్మ, పోతురాజు వంటి స్థానిక గ్రామదేవతలు సంస్కృతీకరించి పార్వతి, శివుడు రూపంలో పూజా విధానంలో చేర్చబడ్డారు.' (కనకదుర్గ, పి 1992: 56-57).

## 4.4.6. చెంచులు

చెంచులు ఆటవిక తెగలకు చెందినవారు. వేట ద్వారా ఆహారసేకరణ చేస్తారు. దుంపలు, ఆకులు మొదలైన శాఖాహారంతో పాటు నెమళ్లు, కోతులు, ఎలుకలు, ఉడుతలు, కుందేళ్లు లాంటి మాంసాహారాన్ని కూడా తింటారు. శ్రీశైల మల్లికార్జున స్వామిని పూజిస్తారు. నృసింహస్వామి, భార్య చెంచిత సంతానంగా చెప్పుకుంటారు. మల్లికార్జునుడిని చెంచుమల్లన్న అని కూడా అంటారు.

శ్రీశైలంలో తిరునాళ్లు జరిగేటప్పుడు భక్తులను క్రూరమృగాల నుండి రక్షించడం, వారికి అవసరమైన అన్ని వసతులు కల్పించడం వీరి పని. ఈ అంశాలు పండితారాధ్య చరిత్రలో వివరించబడి ఉన్నాయి.

వీరు తర్వాత విజయనగర రాజుల పరిపాలనా కాలానికి పాలెగాళ్ళుగా, తలార్లుగా, కావలి వాళ్లుగా మారినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

## 4.4.7. పుళిందులు

కాకతీయుల కాలంలో సమాజంలో చేరి ఉన్నతస్థితికి చేరుకొన్న తెగలలో పుళిందులు ఒకరు. వీరు వైశ్య తండ్రి, క్షత్రియ తల్లికి పుట్టిన వారని ప్రతీతి. కాయలు, పండ్లు, వ్రేళ్లు మొదలైన ఆహార పదార్థాల సేకరణ వీరి ప్రధాన వృత్తి. వెనబోల వంశానికి చెందిన కాకతి ప్రాలని దండనాయకుడైన బాచన పుళింద తెగకు చెందినవాడు. మాటేడు శాసనంలో పుళిందులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను రక్షించడానికి సృష్టించబడ్డారని చెప్పబడింది.

## 4.4.8. గొల్లలు

పచ్చికబయళ్ళ మీద, పశుపోషణ మీద ఆధారపడినవాళ్లు గొల్లలు. వీరు శ్రీకృష్ణుని తమ మూలపురుషునిగా చెప్పుకొంటారు. పశుపోషణ వలన వీరు గ్రామ జీవనంలో ప్రధాన పాత్ర పోషించేవారు. వీరిలో రాచ గొల్ల, పాలకనాటి గొల్ల, కర్ణ గొల్ల, పెద్దేటి గొల్ల అనే రకాల వాళ్లు ఉన్నారు. రాచకుటుంబాల వాళ్లు వీరిని అరణంగా తెచ్చుకొనే ఆచారం ఉంది.

వీరు శ్రీకృష్ణుని మూల పురుషునిగా చెప్పుకున్నా మైలారు చీరప్ప, ఎల్లప్ప, రేణుక మొదలైన దేవుళ్ల చుట్టూ పౌరాణిక కథలు అల్లి వారిని కూడా పూజించేవారు. వీరి గురించిన ప్రస్తావన పల్నాటి వీర చరిత్రలో కనపడుతుంది.

## 4.4.9. కాపు/రెడ్డి

వెలమలు రాజ ప్రసాదాలలో ఉన్నతవర్గంగా ఉండి కీర్తి ప్రతిష్టలను పొందారు. కాకతి గణపతిదేవుడు యాదవుల దగ్గర బందీగా ఉన్నప్పుడు రాజ్యంలో అల్లర్లను అదుపుచేసిన రేచర్ల రుద్రా రెడ్డి కులానికి చెందినవాడు. కాకతీయుల సామంతులు పిల్లల మర్రి-బెరకు వంశీయులు రెడ్డి కులానికి చెందినవారు. వీరి శాసనాల్లో రెడ్డి, రట్టడి అనే పదాలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో రెడ్లను కాపులు అంటారు. ఇది ప్రాంతీయ విభజన. పలనాటి నాగమ్మ, పంట రెడ్ల ఆడపడుచు. ఈ విధమైన కాపు కులవిభజన క్రీ.శ. 11వ శతాబ్దం నాటికే జరిగి ఉండవచ్చు. కాపు అనగా కావలి కాచేవారని అర్థం. వీరు బలమైన రైతు కుటుంబాలకు చెందిన వారుగా భూస్వామ్య వ్యవస్థలో ఆనాటికి గుర్తింపు ఉంది.

## 4.4.10. కమ్మ

కమ్మవారు, కమ్మనాడు అనే ప్రసక్తి ఇక్ష్వాకుల కాలం (క్రీ.శ. 2, 3 శతాబ్దాల) నాటికే శాసనాలలో కనిపిస్తుంది. కాకతీయుల కాలంలో కమ్మ కోమట్లు, కమ్మ వైశ్యులు అని పేర్కొనబడి ఉంది. వ్యవసాయం వీరి ప్రధాన వృత్తి. కాని వీరి కాలానికి సంబంధించిన ఆధారాలు ప్రముఖంగా దొరకడం లేదు.

## 4.4.11. కుమ్మరి

ఓరుగల్లు నగరంలో వీరికి 4500 ఇళ్లు ఉన్నట్లు ప్రతీతి. వీరిని భాండాగారులు అని పిలిచేవారట. వీరు సారె ద్వారా గ్రామాలలో ఏ శుభకార్యం జరిగినా అందుకు అవసరమైన మట్టి పాత్రలను సరఫరా చేసేవారు. వీరికి సంబంధించిన ప్రశస్థి 'బసవపురాణం'లో కనిపిస్తుంది.

### 4.4.12. కాసె

కాసె అంటే రాళ్ళుకొట్టే వృత్తి పని అని అర్థం. ఆనాడు దేవాలయాలు చెరువులు, కట్టడాల నిర్మాణం ఎక్కువ కాబట్టి వీరికి సమాజంలో ఎక్కువ పనిదొరికేదని చెప్పవచ్చు. వీరు ప్రధానంగా రోళ్ళు, తిరగళ్ళు, రాతిచిప్పలు, శిల్పాలు చెక్కడం, శిలాశాసనాలు రాయడం వంటి పనులు చేసేవారు. 'ప్రతాపరుద్ర చరిత్ర'లో వీరివి 15, 900 ఇళ్లు ఉండేవని రాయబడి ఉంది. వీరు జందెం, తలపాగా ధరించి ఇనుప కమ్మీలు చేతిలో పట్టుకొని ఉండేవారు. వీరి దగ్గర వాస్తు శిల్పశాస్త్రం కూడా ఉండేదని తిరువేంగళనాథుని 'పరమయోగి విలాసం'లో చెప్పబడింది.

### 4.4.13. సాలెలు

వ్యవసాయం తర్వాత దుస్తులు నేయడం ప్రధాన పరిశ్రమ. వీరిని దేవాంగులు అని కూడా అనేవారు. వీరు నూలు పట్టు నేయడం, అద్దకం పని ప్రధానంగా చేసేవారు. '*శుకసప్తతి, హంసవింశతి*' వంటి కావ్యాలలో వీరి గురించి విపులంగా ఉంది. రాట్నం ఆ రోజులలో దారం తీయడానికి ఉపయోగించే పరికరం.

### 4.4.14. మేదరులు

వీరిని కటకారవృత్తి వారని కూడా అంటారు. బుట్టలు, తడకలు, తట్టలు, గూడబళ్ళా, విసనకర్రలు మొదలైనవి వీరు తయారు చేసే వస్తువులు. వీటిని ఊరూరా తిరుగుతూ అమ్ముకొనేవారు.

### 4.4.15. మంగలి

ఆ రోజులలో క్షుర కర్మ వీరి ప్రధాన వృత్తి. పెళ్లిళ్ల సమయంలో పురుడు వంటి కార్యాలలో వీరు వృత్తి పరమైన పనులు చేసేవారు.

### 4.4.16. చాకలి

వీరి గురించి '*శుక సప్తతి, బసవ పురాణం*' వంటి వాటిలో చక్కగా వర్ణింపబడి ఉంది. వీరిని రజకులు అని కూడా అంటారు. గ్రామాలలో తిరిగి బట్టలు తీసుకెళ్లి ఉతికి శుభ్రం చేయడం వీరి ప్రధానవృత్తి.

### 4.4.17. వడ్రంగి

గృహాలలో అవసరమైన సామాగ్రిని తయారుచేసి ఇవ్వడం వీరి ప్రధాన వృత్తి. '*బసవ పురాణం*'లో వీరి గురించిన ప్రస్తావన ఉంది. వీరు పట్టెమంచం, సకినల మంచం, దోమతెర మంచం, పందిర మంచం, ఉయ్యేల పట్టె మంచం, గంటల ఉయ్యేల మొదలైనవి తయారు చేయగలరని, వీటి తయారీకి కట్టెను మాత్రమే ఉపయోగించేవారని తెలుస్తుంది.

### 4.4.18. పిచ్చుక కుంట్లు

వీరు రెడ్ల యొక్క గోత్రాలను తంబూరాపై పాడుతూ, వారిని కీర్తిస్తూ ఉండేవారు. చాపలు అల్లడం, ఇంటింటికి తిరిగి వాటిని అమ్ముతూ భిక్షమెత్తుకోవడం వీరి ప్రధాన జీవనం. వీరిని గురించి 'పండితారాధ్య చరిత్ర'లో రాయబడి ఉంది.

### 4.4.19. దూదేకులు

దూది ఏకే వృత్తి వారిని పింజారులు అంటారు. వీరు హిందువుల ఆచార సంప్రదాయాలను పాటిస్తారు. ఆయుధపూజ బక్రీదు పండుగకు చేస్తారు. హిందూస్థానీ భాషలు కూడా మాట్లాడతారు. ఇప్పటికీ వీరు ఎక్కువగా దూది ఏకే పనిని చేస్తుంటారు. వీరి గురించి '*క్రీడాభిరామం*'లో చెప్పబడి ఉంది.

### 4.4.20. కాయస్థులు

కాకతీయుల కాలంలో కనపడే ఒక ప్రత్యేక కులం ఇది. వీరిది దస్తావేజులు రాసే వృత్తి. వీరి గురించి శాసనాలలో వైశ్యులని, బ్రాహ్మణులని,

క్షత్రియులని చెప్పుకున్నట్లు కనిపిస్తుంది. కావున వీరు చాతుర్వర్ణ వ్యవస్థలో భాగంగా చెప్పుకున్నారని భావించవచ్చు. వీరు ఎక్కువగా అశ్వదళాధిపతులుగా ఉన్నట్లు తెలుస్తుంది.

## 4.4.21. కుట్టు పనివారు

బట్టలు కుట్టేవారు. వీరికి ఓరుగల్లు నగరంలో ఒక ప్రత్యేకవాడ ఉంది. సైనికుల దుస్తులు కుట్టడం వీరి పని. వీరినే దర్జీపనివారని కూడా అంటారు. 'క్రీడాభిరామం'లో వీరి గురించి ప్రస్తావన ఉంది.

"*ఇంకా కాకతీయుల కాలంలో కర్రపనివారు, బెస్తవారు, కల్లుగీసే ఈడిగవారు, గాండ్లవారు, పూసల అమ్మేవారు, బొంతలు కుట్టి జీవించేవారు, కాటికాపరులు, వెట్టి/కూలి పనులు చేసేవారు, ఎరుకలు, బవనీలు, చర్మకారులు ఇలా వివిధ రకాలైన వృత్తులు చేసేవారు ఉన్నారు. కుల, వర్ణ సంకరాల వలన భిన్న కులాలు ఏర్పడిన సమాజం.*" (ప్రమీలారెడ్డి, ఎం 2000: 136-150).

## 4.4.22. పంచములు/ దళితులు

నాలుగు ప్రధానమైన వర్ణాలతో పాటు చండాలురు అనే మరొక కులం కూడా ఉన్నట్లు కాకతీయ శాసనాల వలన తెలుస్తుంది. మల్కాపురం శాసనం చండాలురకు భోజన సౌకర్యాలు కల్పించినట్లు తెలుపుతుంది.

వేదకాలం నాటికి నాలుగు వర్ణాలు ఉన్నా స్మృతుల కాలం నాటికి పంచములు ఒక ప్రత్యేక వర్ణంగా కనిపిస్తుంది. వీరు వృత్తిరీత్యా గ్రామం వెలుపల ఉండి జంతువులను చంపడం, మాంసాన్ని అమ్మడం, చర్మంతో చెప్పులు కుట్టడం ప్రధాన వృత్తిగా ఉండేవారు. చెడువాసన రావడం వలన ఊరి బయట ఈ వృత్తి చేయడానికి అనుకూలంగా ఉండేది. బ్రాహ్మణులు మాంసాహారాన్ని మానిన తర్వాత వీరి నివాస ప్రాంతాలు మాలవాడ, మాదిగవాడలుగా మారినట్లు చంద్రకారులు చెప్తారు.

వీరశైవం చండాలురకు ఆధ్యాత్మిక సమానత్వం కల్పించింది. 'బసవపురాణం' ఈ విషయాన్నే చెప్తుంది. బ్రహ్మనాయుడు మాల కన్నమదాసును పెంచుకొన్నాడు. ఒకరిద్దరి ప్రస్తావన వలన చండాలురందరి జీవితం బాగుందని సంస్కరింపబడ్డారని చెప్పడం సరైనదికాదు. వీరు గ్రామాలలో దూరంగా నీచ వృత్తులను చేస్తూ జీవించేవారు. బవనిరు, పంబలివారు, డక్కలివారు, మాల మాదిగలు మొదలైన వారిని చండాలురు అని ఆకాలంలో పిలిచేవారని తెలుస్తుంది.

వీరు చండి అనే గ్రామదేవతను పూజించడం వల్ల చండాలురు అని పిలవబడ్డారని ఒక వాదన ఉంది. అయితే వీరు ఎల్లమ్మ, రేణుక, మైసమ్మ లాంటి గ్రామదేవతల గుళ్లలో పూజారులుగా ఉన్నారు. బ్రాహ్మణులు వీరిని దూరంగా ఉంచడం వల్ల ఇలాంటి ఆచారం వచ్చిందని చెప్పవచ్చు.

"*సమాజంలో అట్టడుగు వర్ణాలకు చెందినవారిని పంచములు లేదా అంటరానివారుగా లేదా చండాలురుగా పరిగణించేవారు. వీరిలో మాల, మాదిగలు ముఖ్యులు. వెట్టివారు లేదా బానిసలుగా వీరు వ్యవహరింపబడేవారు. సమాజంలో వీరు అస్పృశ్యులుగా, వెలివాడలో నివసించేవారు. చండాల మిశ్రమం దోషంగా పరిగణింపబడేది. నెల్లూరుజిల్లాకు చెందిన అనేక శాసనాల్లోని వీరి స్థానం నిమ్నంగా చెప్పబడ్డది. శాసనాల్లో చెప్పబడ్డ దానాలు ఎవరయినా విఘ్నం చేస్తే వారి భార్యలకు ఆ వూరి వెట్టివాడు మాల లేదా మాదిగ లేదా వడ్డరి వానితో సంగమించిన దోషం కలుగునని వివరించారు.*" (కనకదుర్గ, పి 1992: 74).

సమాజంలో చండాలుర జీవన విధానాన్ని తెలుసుకోడానికి ఇదొక ఉదాహరణ.

ముఖ్యంగా ఆనాటి సమాజాన్ని ఇలా అర్థం చేసుకోవాలి. నూతన జాతులను, తెగలను, కులాలను సమాజం తనలో విలీనం చేసుకొంది. అదే సమయంలో వర్ణాశ్రమ ధర్మాలను, భూస్వామ్య వ్యవస్థా స్వభావాలను సామాన్యులలో పునరుద్ధరించి, వాటిని కాపాడుకోవడం కనిపిస్తుంది. శూద్ర

కులాలను, చండాలురని వీరశైవం తమ మతంలో చేర్చుకోడానికి ప్రయత్నించినా అది సంస్కరణలో భాగంగా లేదా సంస్కృతీకరించడానికి చేసిన ప్రయత్నంగా అర్థం చేసుకోవాలి. అయితే ఆ కాలంనాటికి కింది తరగతులను గూర్చి అంతవరకైనా వీరశైవం ఆలోచించడం గొప్ప పరిణామంగా గుర్తించాలి.

## 4.5. అలంకార సామాగ్రి

'ఆర్థికంగా ఉన్నత వర్గానికి చెందిన స్త్రీ, పురుషులిద్దరు బోగలాలస జీవితాన్ని గడిపేవారు. స్నానానికి పన్నీరు, పునుగు జవ్వాది రసాలను వాడేవారు. స్త్రీలు సంపెంగ నూనెలతో తలంటుకొని స్నానాలు చేసేవారు. వివిధ రకాలైన చెప్పులు వాడేవారు. చర్మం, దంతం లోహంతో అవి చేయబడి ఉండేవి. కులాలనుబట్టి వేషధారణ మారుతూ ఉండేది. శిల్పాలు, సాహిత్యం ముఖ్య ఆధారంగా ఆనాటి ప్రజల అలంకారాలను తెలుసుకోవచ్చు. అలంకార సామాగ్రి ఎక్కువగా బంగారం, వెండి, ఇనుము, కంచు, ఇత్తడి, తగరం, దంతం, స్ఫటికం మొదలైన వాటితో తయారు చేయబడి ఉండేవి. ధనవంతులైనవారు రత్నాలు, ముత్యాలు, వజ్రాలు పొదగబడినవి అలంకరించుకొంటే పేదవారు పూసలు, శంఖులు ఉన్నవి వాడేవారు.

కాకతీయుల రుద్రమదేవి కాలంలో ఓరుగల్లున దర్శించిన వెన్నిస్ యాత్రికుడు మార్కోపోలో కాకతీయుల కాలంలో సన్నని వస్త్రాలు నేయబడేవని, అవి శ్రేష్ఠంగా ఉండేవని రాశాడు. సోమనాథుని రచనల వల్ల ఆ కాలంనాటి సామాన్య ప్రజల వస్త్రవిధానం కొంత తెలుస్తుంది. స్త్రీ, పురుషులిద్దరూ వక్షస్థలాన్ని కప్పి ఉంచడానికి కంచుకము' అనే వస్త్రాన్ని ధరించేవారట. ఇంకా నాట్యగత్తెలు చల్లడము ధరించేవారు. కచ్చడము, కుప్పసము, తలచుట్టు, కోక, చీర, పుట్టము, ధోవతి, బల్లియ, పచ్చడము, దుప్పటి మొదలైనవి ధరించేవారు. పట్టువస్త్రాలు కూడా ధరించేవారని తెలుస్తుంది.

కస్తూరి, సంపెంగ నూనె, చందనం, శ్రీగంధం, పచ్చకర్పూరం, పన్నీరు, జవాది మొదలైన సుగంధ ద్రవ్యాలను ఆనాడు ఉన్నతవర్గం వారు వాడినట్లు తెలుస్తుంది. (ప్రమీలారెడ్డి, ఎం 2000: 171-179).

## 4.6. ఆహార పదార్థాలు

ముఖ్యంగా ఆనాటి శాసనాలు, సాహిత్యం వలన ప్రజల ఆహార పదార్థాల గురించి తెలుస్తుంది.

ఆకుకూరలు, వంగ కాయలు, పులగం, నెయ్యి, పెరుగు, చల్ల, ఆవు పాలు, పులియంబ, నూనె, ఉప్పు, మిరియాలు, అల్లం, ఉల్లి, జాజి, పేలాలు, చెరకు పానకం, అంబలి, తంగేటి జున్ను మొదలైనవి శాసనంలో చెప్పబడ్డాయి. పోలెలు, బూరెలు, కజ్జములు మొదలైన పిండి వంటలు చేసుకొని తినేవారని 'బసవపురాణం' వల్ల తెలుస్తుంది.

గొర్రె మాంసం, చేపలు, పెయ్య మాంసం అనే మాంసాహారం ప్రస్తావన కూడా 'బసవపురాణం'లో కనిపిస్తుంది.

*"అన్నాన్ని ముద్దలుగా చేసుకొని తినేవారు. పళ్లాలను వాడినట్లు ఆధారాలు ఉన్నాయి. భోజనం తర్వాత తాంబూలం వేసుకొనే అలవాటు కూడా ఉండేది. రాజనాల బియ్యం శ్రేష్ఠమైనవిగా, వెదురుల బియ్యం తక్కువ అయినవిగా భావించేవారు."*

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 193 - 207)

## 4.7. తూనికలు - కొలతలు

ఆంధ్రదేశంలో మెట్రిక్ పద్ధతి వచ్చేవరకు కాకతీయుల కాలం నాటి కొలతలే కొనసాగినవి. కుంచం, మానిక, సోల, తూము, పుట్టి, పందుం మొదలైన కొలతలు వ్యవహారంలో ఉండేవి. ద్రవపదార్థాలకు, ఘనపదార్థాలకు ఒకే కొలతలు ఉన్నట్లు తెలుస్తుంది. 12 మానికలు ఒక తూము, 20 తూములు ఒక ఖందువు లేదా పుట్టి అని గట్టు తిమ్మన శాసనంలో చెప్పబడింది. మెట్ట భూమిని సాధారణంగా ఖందువు లేదా పుట్టితో కొలిచేవారు.

*"పొలాలను కొలవడానికి ఉపయోగించిన గడల కొలతలు కాకతీయుల శాసనాలలో రకరకాలుగా కనిసిస్తున్నాయి. క్రీ.శ. 1314 శాసనాలలో 24 మూరలుగాను, క్రీ.శ. 1261 శాసనాలలో 13 జానెల కోలగాను, క్రీ.శ. 1287 శాసనాలలో 30 అడుగుల*

*కొలగాను కన్పిస్తాయి. గణపతిదేవ చక్రవర్తి కాలంనాటి (క్రీ.శ. 1239) ఒక శాసనంలో 12 బారలగడ కన్పిస్తుంది.*

*పెరూరు శాసనంలో - ఇరస, ముక్కు న, కుంచము, సోల, అర్ధతవ్వ అనేవి కన్పిస్తాయి. అదే శాసనంలో 'సట్టిగమ' అనే మరొక కొలత కూడా ఉన్నది. సట్టిగము మహబూబ్ నగర్ జిల్లాలోని వర్ధ మానపుర శాసనంలోను కన్పిస్తుంది."*

(ఆచార్య హరి శివకుమార్ 2000: 41-42)

*"సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో (పర్వత - పు 336-337) ఒక కొలమానమునిచ్చాడు. అది*

| | | |
|---|---|---|
| *60 శ్వాసములు* | - | *1 ప్రాణము* |
| *6 ప్రాణములు* | - | *1 గడియ* |
| *5 గడియలు* | - | *1 లగ్నము* |
| *12 లగ్నములు* | - | *1 దినము* |
| *20,600 స్వరములు* | - | *1 సంవత్సరము"* |

(హరిశివకుమార్ 2000 : 43)

## 4.8. ఆటలు - వినోదాలు

ఆటలు, వినోదాలు సాధారణంగా సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఒకటిగా ఉండవు. కింది వర్గం అంటే శ్రమించి ఉత్పత్తిని తయారు చేయు వర్గంయొక్క వినోదాలు ఆటలు ఒకరకంగా, ఉత్పత్తికి దూరంగా ఉంటూ విశ్రాంతితో పాటూ అజమాయిషీ కలిగి ఉన్న వర్గంయొక్క వినోదాలు ఆటలు ఒకరకంగాను ఉంటాయి. అదే విధంగా స్త్రీలు, పురుషులు, చిన్న పిల్లల యొక్క ఆటలు, వినోదాలు వేరు వేరు రకాలుగా ఉంటాయి. కాలాలను బట్టి, శ్రమను బట్టి ఒక్కో ప్రత్యేకమైన ఆటలు వినోదాలు సమాజంలో ఉంటాయి. అయితే వీటన్నిటిని వివరంగా విశదపరచి చూడడం కష్టం.

కాకతీయుల కాలంలో చిన్నపిల్లలు బొమ్మల పెళ్లిళ్ళు, చెండాట, సొగటాలాట, చెమ్మచెక్క, ఓమన గుంటలు, అష్టాచెమ్మా, దాగుడు మూతలు, చింతపిక్కలాట, అచ్చనగుండ్లు మొదలైనవి ఆడేవారు.

నాగ స్వరాన్ని ఉదుతూ పాములు ఆడించడం, జాతర్లు, ఉత్సవాలు జరిగినప్పుడు కోలాటం వేయడం, తోలుబొమ్మలు ఆడించడం, జూదం, గాలిపడగ అనే పేరుతో పిలిచే గాలిపటాలు ఎగరవేయడం, అడవులకు వెళ్లి జంతువులను వేటాడడం మొదలైనవి కూడా ఆకాలంలో ఉన్నాయి. సిడి ఆట, వినోదం కోసం మల్లుల మధ్య జరిగే మల్ల యుద్ధం, గదా యుద్ధం లాంటి ఆటలు, కోడి పందాలు, ఎద్దులను అలంకరించి గ్రామం వెలుపల వాటికి పరుగు పందాలు పెట్టి వృషభ క్రీడలు, గంగిరెద్దులు ఆటలు ఆనాడు కన్పించే మరికొన్ని ఆటలు.

స్థిరనివాసంలేని దొమ్మరులు గడాటలు ఆడేవారు. ఇవన్ని ఆనాటి సాహిత్యం (*పండితారాధ్య చరిత్ర, క్రీడాభిరామం, బసవపురాణం*) ద్వారా తెలుస్తున్నాయి. "*రాగుంజు పోదంజులాట, వెడయాలు, చిందులాట, కోడంగి ఆట, వెడ్డంగం, సరిగుంజులాట, గుందెనగుడి, గుంజంబులాట, అప్పలవిందులాట, పల్మారు చప్పట్లు పెట్టడం, సేరబొంతల ఆట, గుమ్మడికాయల ఆట, గిల్లదండ ఆట, ఉప్పెన పట్టెలాట, సిట్ల పాట్లాట, గోరంటలాట, దాగుడు మూతలాట, బొంగరాల ఆట, మొదలైనవి వ్యక్తి బలాన్ని తెలిపేవి.*

*చెరుకు పందేల ఆట, పోకలాట, బంతి ఆట, గుంతమాలకం, రూకకుప్ప ఆట, రాచిల్క చదువు పేరైన డేగలు, పికిలి పిట్టలు మొదలైనవి శృంగార పరమైన ఆటలు.*"

(ఎం. ప్రమీలారెడ్డి, ఎం 2000: 208)

ఈ విధంగా ఆనాడు అన్ని రకాల వినోదాలు, ఆటలు ప్రజలలో ఉన్నాయి.

## 4.9. పండుగలు - ఉత్సవాలు - జాతర్లు

ఆచారాలు, సంప్రదాయాల వలే పండగలు, ఉత్సవాలు లేక జాతర్లు సంస్కృతిలో భాగం. ఇవి ప్రజలను కలపడానికి, ఐకమత్యాన్ని తెలియజేయడానికి ఉపకరిస్తాయి. హిందూ మతంలో ఇవి ఎక్కువ. కాకతీయుల కాలంలో కూడా ఇవి ఉన్నాయి.

దరిద్రాన్ని పోగొట్టుకోవడానికి, స్త్రీలు సంతానం కలగడానికి నోములు ఎక్కువగా నోచేవారు. '*సిద్దేశ్వర శతకం*'లో, '*ప్రతాపరుద్ర చరిత్ర*'లో ఉన్న సోమదేవరాజు పుత్రకామేష్టియాగం, బాలచంద్రుని తల్లి కొడుకు కోసం ఐతాంబ నోచిన నోములు, రుద్రమదేవి కూతురు చేత నోయించిన నోములు మొదలైనవి ఆ కాలంలో తెలిసివచ్చే నోములు.

ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాలలో జరిగే దేవతల ఉత్సవాలు తిరునాళ్లు అంటారు. ఇవి ఆకాలంలో ఐదు, తొమ్మిది లేదా నెల రోజులు జరిగేవట. శ్రీశైలంలో శివరాత్రికి, శ్రీకాకుళంలో దవన పున్నమికి, దసరాకు తిరునాళ్ళు జరిగేవని తెలుస్తుంది. పాల్కురికి సోమనాథుడు '*పండితారాధ్య చరిత్ర*'లో శ్రీశైలం తిరునాళ్లకు వచ్చే భక్తుల కోలాహలాన్ని చక్కగా వర్ణించాడు. శైవ మతవ్యాప్తి వలన శివరాత్రి ఆ కాలంలో ప్రత్యేకత సంతరించుకున్నట్లు చెప్పవచ్చు. శివరాత్రికి జాగరణ చేసే భక్తులు అక్కడ ప్రదర్శించే యక్షగాన నాటకాలతో పాటు, వెడయాటలు, కొడంగాటలు, పేరిణి నృత్యాలు, బొమ్మలాటలు, కోలాటాలు చూసేవారని సోమనాథుడు వర్ణించాడు.

గ్రామాలలో ఉండే గ్రామదేవతకు ప్రజలు జాతర చేస్తారు. ఇది సామూహిక ఉత్సవం. '*ప్రతాపరుద్ర చరిత్ర, సిద్ధేశ్వర చంద్ర, పల్నాటి వీర చరిత్ర*' గ్రంథాలలో కాకతీయుల కాలంనాటి జాతర్ల ప్రసక్తి ఉంది. గ్రామ దేవతను ధనిక, పేద తేడా లేకుండా మేళ తాళాలతో కలిసి పూజిస్తారు.

*"గ్రామదేవతలకు కోళ్లను, మేకలను, గొర్రెలను బలి ఇవ్వడం అనేది ఆచారం. కొన్ని జాతరలలో 'తొట్టెల' అంటే రంగు రంగుల కాగితాల తొట్టెలాగా అలంకరించి తీసుకెళతారు. ఇంకా కొన్ని ప్రాంతాలలో తెరచాపల వంటి వస్త్రాల ప్రభలను నిర్మించి మోకులపై ఎత్తి ఊరేగించే ఆచారం ఉంది. కొందరు స్త్రీలు శివమెత్తి వేప మండలు పట్టుకొని పిచ్చిగంతులు వేస్తూ, ఊరేగింపులతో బాటు గుళ్ల దగ్గరకు వస్తారు. వీరిలో కొందరు జరిగిన, జరగబోయే విశేషాలు చెబుతారని ప్రజలు వారి చుట్టూ గుమిగూడి వింటారు. ఇట్లా ఈ ఉత్సవాన్ని అతి వైభవంగా జరుపుకొంటారు. ఈ వేడుకల గురించి ఆనాటి సాహిత్యం చెబుతుంది. ఆనాడు జాతరలు విరివిగా జరుగుతుండేవని,*

*అందులో బోనగావళ్ళు, కుంభం, దున్నపోతుల బలి ఉండేవని కాకతీయ సంచిక చెబుతున్నది."* (ప్రమీలారెడ్డి, ఎం 2000: 236).

పై విధంగా కాకతీయుల కాలంనాటి పండగలు, జాతర్లు, తిరునాళ్ల గురించి తెలుసుకోవచ్చు.

## 4.10. వైద్యం

'కాకతీయుల కాలంనాటికి కూడా అంతవరకు ఉన్న సంస్కృత వైద్య గ్రంథాలను బట్టి రోగులకు వైద్యం చేసేవారు. సైదాపూర్ (క్రీ.శ. 1054), మల్కాపూర్ (క్రీ.శ.1261) శాసనాలను బట్టి జైన బసదులు, శైవ మఠాలు వైద్య కేంద్రాలుగా ఉండేవని తెలుస్తుంది. మల్కాపుర శాసనం వలన గణపతిదేవుడు విశ్వేశ్వర గోళకి పేరు మీద మఠం స్థాపించి సామాన్య ప్రజల ఆరోగ్యం కోసం ఒక కాయస్థ వైద్యుణ్ణి కూడా నియమించినట్లు తెలుస్తుంది. అదేవిధంగా రుద్రమదేవి వెలగపూడి గ్రామాన్ని వైద్యం కోసం దానం చేసి వైద్యుణ్ణి నియమించినట్లు శాసనాధారాలు ఉన్నాయి.

పాల్కురికి సోమనాథుని రచనలు '*బసవపురాణం, పండితారాధ్య చరిత్ర*'లలో ఆనాటి మూలికా వైద్యం గురించి, చెట్ల గురించి చెప్పబడింది. శ్రీశైలం చుట్టూ అనేక రకాలైన ఔషద మొక్కలు ఉండేవని పండితారాధ్య చరిత్ర చెప్తుంది. అదే విధంగా దీనిలోని పర్వత ప్రకరణంలో కంటికి వచ్చే రోగాలు పేర్కొనబడ్డాయి మరియు పాము కాటువేస్తే చేయవలసిన వైద్యంకూడా చెప్పబడింది.

రోగాలు వచ్చినప్పుడు పథ్యం పెట్టడం, దెబ్బలు తగిలినప్పుడు కాపడం పెట్టడం ఆరోజులలో సామాన్య ప్రజలలో ఎక్కువగా ఉండేది. వావిలి, ఉమ్మెత్త, దక్కేడి, ఆముదం మొదలైన మొక్కల చివుళ్లు కోసి వెచ్చచేసి శరీరానికి కాపడం పెట్టేవారు. బాలింతరాలు తీసుకోవలసిన జాగ్రత్తలు, తినవలసిన ఆహారపదార్థాలు, ఆమెకు చేసే వైద్యం గురించి కూడా సాహిత్యంలో చెప్పబడింది.

పశువులు వ్యవసాయంలో ప్రధానపాత్ర పోషించడం వలన వాటిని ఆనాడు సంపదగా భావించేవారు. నారయ మంత్రి 'పశువైద్యం' ఆనాడు రాయబడిన ఒక గ్రంథం. పశువులకు కప్పలు కరవడం వలన కప్పనారువు అనేవ్యాధి వచ్చేదట, సరిజి రోగం గల పశువులకు గుండెలు ఉబ్బరించేవట, ముకుబంతులు అనేవ్యాధి ఆవులకు మాత్రం వచ్చేదట, గొరిజలు పగిలి పురుగులు పడేవట అని ఆనాటి సాహిత్య గ్రంథమైన నాచన సోమన '*ఉత్తర హరివంశం*'లో కనిపిస్తుంది." (ప్రమీలారెడ్డి, ఎం 2000: 262-269).

## 4.11. చెరువులు

ఆనాడు ప్రజా జీవనం ఎక్కువ వ్యవసాయం మీద ఆదారపడి జీవించడం వలన దానికి ప్రాముఖ్యం ఇవ్వాల్సిన బాధ్యత పాలకులపై ఉండేది. కాకతీయులు వ్యవసాయాభివృద్ధి కోసం అనేక చెరువులు త్రవ్వించారు. అవి నేటికీ ప్రసిద్ధమైనవి. చెరువులను సముద్రములని పిలిచేవారని ఆనాటి శాసనాల వలన తెలుస్తుంది.

రెండు కొండల మధ్య లేదా ఎతైనా గుట్టల మధ్య నీటి వాలును బట్టి మట్టిపోసి చెరువులను నిర్మించేవారు. పాల సముద్రం, నామ సముద్రం, ఎరక సముద్రం, కేసరి సముద్రం, కాట సముద్రం, సబ్బి సముద్రం వంటి తటాకాలు వ్యవసాయాభివృద్ధిలో భాగంగా త్రవ్వించినవే. గణపతి దేవుని ముఖ్యమంత్రి బయ్యన నాయకుని కుమారుడు జగదల ముమ్మడి నాయకుడు పాలకాల చెరువును తవ్వించాడు. రామప్ప దేవాలయం కట్టించిన రేచెర్ల రుద్రరెడ్డి రామప్ప చెరువును తవ్వించాడు. దీని ఆయకట్టు 5,000 ఎకరాలు. వీరి రాజ వంశానికి చెందిన మైలాంబ బయ్యాల చెరువును తవ్వించింది. కొప్పూరి బ్రహ్మయ్య 700 జైన బసములను కూలగొట్టి పొట్ల చెరువును తవ్వించినట్లు '*పండితారాధ్య చరిత్ర*' చెప్తుంది.

ఈ విధంగా వ్యవసాయాభివృద్ధి కోసం ఆనాడు చెరువులను ఎక్కువగా తవ్వించారు. బావులు, కాలువల సాయంతో కూడా వ్యవసాయం జరిగేది.

## 4.12 నేరాలు - శిక్షలు

కాకతీయుల కాలం నాటికి అంతకు పూర్వమే వెలుగుచూపిన 'మనుస్మృతి' ధర్మశాస్త్ర గ్రంథంగా పరిగణనలో ఉంది. కేతన కవి మొదటి సారిగా 'విజ్ఞాన శాస్త్రమనే' ధర్మశాస్త్ర గ్రంథాన్ని తెలుగులో రాశాడు. అంతే కాకుండా ఆకాలంలో శాసనాలలో, సాహిత్యంలో శిక్షలకు సంబంధించిన విషయాలు కొన్ని చర్చించబడ్డాయి.

న్యాయ వ్యవస్థలో ప్రథమస్థానం కులన్యాయ స్థానం. తర్వాత వృత్తి న్యాయస్థానం, ఆపై గ్రామ న్యాయస్థానం, ఆపై రాజాధికారులు, చిట్టచివరి న్యాయస్థానం చక్రవర్తి ఈ విధమైన ఆరోహణను కలిగి న్యాయవ్యవస్థ ఉండేది.

కొరవిశాసనాన్నిబట్టి వ్యభిచారం, దొంగతనం, లేవదీసుకుపోవడం వంటి నేరాలకు ఆడవారికైతే చెవి ముక్కు కోయడం, మగవారికైతే జీవన భృతిని లాగేసుకోవడం శిక్షగా ఉండేది. బ్రాహ్మణుడు ఎటువంటి నేరం చేసిన అతనికి మరణశిక్షలేదు.

"*దొంగ బ్రాహ్మణుడైతే అతని నుదుట కుక్క బొమ్మ ముద్రవెయ్యాలి. దొంగతనము చేస్తుంటే దొరికిన వానిని చచ్చేవరకూ కొట్టాలి అంటాడు. దానిలోనే* మురికినాటి వాళ్ళు మోటువాళ్ళు అని, తమిళులు జగడ గొండులని, బ్రాహ్మణులు స్వార్థపరులని అంటూ ఇతర దేశాల్ని, భాషల్ని, కులాన్ని నిందించిన వానికి నూరు పణములు జరిమానా వెయ్యాలంటాడు. ఒక మాంసమని చెప్పి ఇంకొక మాంసం అమ్మినా, నకిలీ బంగారం వెండి, మణులు అమ్మినా వానికి వేయి పణములు జరిమానా వెయ్యాలి. వాని చేతులు, చెవులు, ముక్కు కోసెయ్యాలన్నారు."

(సత్యనారాయణ, కంభంపాటి 1993: 12.)

వర్ణాలనుబట్టి, కులాలను బట్టి శిక్షలు మారుతూ ఉండేవి. కొన్ని ఉన్నత కులాలకు శిక్షలలో మినహాయింపు కూడా ఉండేది.

## 4.13. సాంఘిక దురాచారాలు

ఆనాటి సమాజంలో అనేక దురాచారాలు ఉన్నవి. అవి సాధారణ ప్రవృత్తిలో కొన్ని ఉండగా నేరాల కింది కొన్నిటిని పరిగణించేవారు. వాటికి శిక్షలు ఉండేవి.

### 4.13.1. దొంగతనం

ఆ రోజులలో దొంగతనం ఎక్కువగా ఉన్నట్లు ఆనాటి సాహిత్యం వల్ల తెలుస్తుంది. *'పల్నాటి వీరచరిత్ర'* వంటి వాటిలో చోరకళ గురించి చెప్పబడింది. దొంగలు ఇంటికి గడి కన్నం, గడప కన్నం, గోడ కన్నం, నేల కన్నం వేసే వాళ్లని సోమన రాశాడు. అదే విధంగా 'బసవపురాణం'లో దొంగలు ఎటువంటి సాధనా సామాగ్రిని తనవెంట తీసుకొని వెళ్లేవారో కూడా రాయబడి ఉంది. ఆనాడు జారత్వం కూడా ఎక్కువగా ఉండేదని, వీరశైవం దానిని ప్రోత్సహించిందని తెలుస్తుంది.

### 4.13.2. వేశ్యావృత్తి

ప్రాచీన కాలంలో భారతదేశంలో వేశ్యావృత్తికి గౌరవం ఉంది. ఈ వృత్తి సమాజంలో అవసరంగా భావించి రాజులే పెంచి పోషించేవారు. మతం పేరుతో, మోక్షం పేరుతో దేవుళ్ళ కోసం సృష్టించిన దేవదాసీ వ్యవస్థ పరిణామ క్రమంలో పడుపు వృత్తిగా మారిపోయింది. కాకతీయుల కాలంలో ప్రతి గ్రామంలోను వేశ్యలు ఉండేవారు. వేశ్యలను ఉంచుకోవడం, దానిని ప్రకటించుకోవడం సామాన్య ప్రజలకు కూడా ఘనంగా భావించేవారు. 'ప్రతాపరుద్ర చరిత్ర'లో అరణ్య వస్తువాహన శోభితాలైన వేశ్యాగృహాలు 1,27,000 ఉండేవని ఏకామ్రనాథుడు చెప్పాడు. టిట్టిభసెట్టి మొదలు ప్రతాప రుద్రాదులు, బ్రహ్మనాయుడు, బాలచంద్రుడు అందరూ జారులై ఉండడం ఆనాటి జారత్వ ప్రాబల్యాన్ని చాటుతుంది.

వేశ్యలు రోగాల కుంపట్లు, గయ్యాళ గచ్చులు, మచ్చు కన్నెలు, మందులవార్లు, రొచ్చుకుంటలు, మాటల ముచ్చులు, భ్రమితలు, మాయావులు

అని 'పండితారాధ్య చరిత్ర'లో సోమనాథుడు చెప్పారు. వీరశైవం వేశ్యలను, వేశ్యావృత్తిని ప్రోత్సహించింది. వారు విభూతి పూసుకొని, ఎర్రనిజెడలు వేసుకొని, రుద్రాక్షలు వేసుకొని వాటికి తగిన వస్త్రాలు కట్టుకొనేవారని 'బసవపురాణం' వలన తెలుస్తుంది.

*"కాకతీయ యుగంలో వేశ్యాలోలత్వం ఒకవైపు, బహుభారత్వం మరోవైపు కులస్త్రీలకది ప్రాణ సంకటమయింది. స్త్రీకి భర్తే సర్వస్వం. ఆమెకు మాంగల్యమే కవచం. ఆమె దాన్ని కాపాడుకోవడానికి వేయి దేవుళ్ళకు మొక్కుకుంటుంది."*

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 306)

## 4.13.3. మద్యపానం

పురాణ ఇతిహాసాల కాలం నుండి సోమరసం గురించిన ప్రస్తావన ఉంది. కాకతీయుల కాలం నాటికి మద్యం సేవించడం, తిరునాళ్లు, జాతరలో తాగడం ఉన్నాయని తెలుస్తుంది. తాగి తందనాలు ఆడతారనే సామెతలు కూడా ఆనాటికే ప్రచారంలో ఉన్నట్లు రచనలవల్ల తెలుస్తుంది. '*క్రీడాభిరామం*' వంటి రచనలలో అనేకచోట్ల మద్యవర్ణన కనిపిస్తుంది. ఆటవికులు కల్లు తాగడం, అపహాస్యంగా మాట్లాడుకోవడం కూడా ఉంది.

ఇంకా ఆ రోజుల్లో సతీసహగమనం, బాల్యవివాహాలు కూడా ఉన్నట్లు తెలుస్తుంది.

* * *

# 5. శైవవాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల జీవనం

శైవవాఙ్మయంలో ఉపశ్రేణి వర్గాల జీవితం ప్రతిఫలించిన విధానం ఈ అధ్యాయంలో చర్చించవలసిన అంశం. శైవవాఙ్మయం వెలువడిన 12, 13 శతాబ్దాల కాలంనాటి సమాజంలోని కింది కులాలు, వారి జీవితం, వారి సంస్కృతి వంటి అంశాలను పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుల రచనలలో ఏవిధంగా ఉన్నాయో చూపడం ఇక్కడ జరుగుతుంది.

కింది కులాలతో పాటు వ్యవసాయంలో కూలీలుగా ఉంటూ, జీవితాన్ని దుర్భరంగా అనుభవించేవారు, అంటరాని కులాలుగా జీవితాన్ని గడిపేవారు, వేశ్యలుగా ఉంటూ కష్టాలు అనుభవించే స్త్రీలు ఇలా మొదలైనవారి వాస్తవ జీవితాలు శైవ వాఙ్మయంలో కనిపిస్తున్నాయి.

## 5.1. కుల వ్యవస్థ

ప్రాచీనకాలం నుండి వస్తున్న వర్ణ వ్యవస్థ కాకతీయుల కాలంలో కూడా ఉంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే వర్ణాలు సమాజంలో క్రమంగా ఆర్థిక, సాంస్కృతిక స్థాయిని కలిగి ఉన్నాయి. అడవులను నరికి భూమిని సాగులోకి తేవడం, చెరువులు లాంటివి తవ్వించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థలో కొంత పరిణామం వచ్చింది. దీనికి మతం తోడయ్యింది. అంటే వర్ణవ్యవస్థను కాపాడటానికి మతం తోడయ్యింది. దీని వలన వంశానుగతంగా వస్తున్న వృత్తులకు ప్రాధాన్యం పెరిగింది. జనాభా పెరగడం, సంపద కేంద్రీకృతం కావడం, భూమి కేంద్రీకృతం కావడం వల్ల ఒకరి వృత్తులను మరొకరు చేపట్టవలసిన అవకాశం కూడా ఏర్పడింది.

ఒకవైపు వృత్తులు కులాలుగా మారిన తర్వాత అవి కట్టుబాట్లుగా మారాయి. ఆర్థిక కేంద్రీకరణ వల్ల కొత్త కులాలూ ఏర్పడ్డాయి. సాధారణంగానే వృత్తిని బట్టి దానికి గౌరవము, సామాజిక హోదా కలిగాయి. ఇందువల్ల తక్కువ గౌరవం కలిగిన కులాలు పై వారిని అనుసరించడానికి, ఎదగడానికి

ప్రయత్నించారు. ఈ క్రమంలో కొత్త కులాలు పుట్టాయి. జనాభా పెరగడం, సమాజం అభివృద్ధి వలన "*కొత్త వృత్తులు రావడం, ఇతర ప్రాంతాలవారు తరలి రావడం వంటివి కూడా కొత్త కులాలు పుట్టడానికి కులవ్యవస్థ స్థిరపడటానికి కారణమయ్యాయి. కులాలు అవిచ్ఛిన్నంగా కొనసాగటానికి వృత్తితోపాటు వివాహసంబంధమైన కట్టుబాటు కూడా తోడ్పడింది. మౌఖిక విద్య మహిమ కలదనే భావము, మతము కారణం కాగా అగ్ర కులజులం కావాలనే ప్రయత్నం అంత్యకులజుల్లో కనిపిస్తుంది. ఆర్థికపరమైన మతపరమైన హేతువుల వలన అగ్రకులజుల్లో అంత్యకులజుల పట్ల చులకన భావం పుట్టింది. ఇలా ఈ కాలంనాటి కుల పరిస్థితులు తూర్పు చాళుక్యకాలం నుంచి కొనసాగుతున్నవే పొడిగించబడ్డాయి.*" (రాజ, ఎన్. ఎస్ 1991 : 65)

విద్య, మత విధులు లాంటివి దక్కించుకున్న బ్రాహ్మణులు, అధికారాన్ని దక్కించుకున్న క్షత్రియులు సమాజంలో ఉన్నతశ్రేణిగానే గుర్తింపబడ్డారు. వ్యవసాయభూమి నుండి వ్యాపారానికి మారి ఆర్థికంగా స్థిరపడినవారు వైశ్యులుగా స్థిరపడ్డారు. వ్యవసాయం చేసుకొంటూ, వృత్తులను చేస్తూ, వస్తూత్పత్తికి శ్రమించిన వారు శూద్రులుగా (కమ్మరి, కుమ్మరి, చాకలి మొ॥) గుర్తింపబడ్డారు.

వృత్తులకు నీచత్వం, ఉన్నతత్వం ఆపాదించడం వల్ల కొన్ని వృత్తులు చేసేవారు మరీ తక్కువ వాళ్లుగా గుర్తింపబడ్డారు. వృత్తిరీత్యా గ్రామం లేదా పట్టణం వెలుపల ఉంటూ జంతువులను చంపి మాంసాన్ని అమ్మడం, తోలుతో చెప్పులు కుట్టడం వంటి పనులు చేసేవారు పంచములుగా చండాలురుగా సమాజంలో గుర్తింపబడ్డారు. తర్వాత వీరిని అంటరానివారుగా, వీరు నివాసముండే ప్రాంతాలు మాలపాలెం, మాదిగ వాడలుగా గుర్తింపబడ్డాయి. ఇది చరిత్ర పరిణామంలో వచ్చిన మార్పు. కాకతీయుల కాలంనాటికే ఇది జరిగింది.

## 5.1.1. కులాలు

కాకతీయుల కాలం నాటికి వృత్తులన్నీ శూద్రులే చేసేవారు. గ్రామంలో అవసరమైన అన్ని వస్తువులను తయారుచేయడంలో శూద్ర కులాలు ముందుండేవి. గ్రామం యొక్క ఆర్థిక స్థిరత్వం వీరిపై ఆధారపడి ఉండేది.

శైవ వాఙ్మయంలో వివిధ వృత్తులు చేస్తూ జీవనాన్ని గడిపే అనేక శూద్ర కులాల ప్రస్తావన కనిపిస్తుంది.

బసవపురాణంలోని మడివాలు మాచయ్య కథలో పాల్కురికి సోమనాథుడు ఆ కాలంలోని కులాలను, వారి వారి వృత్తులను ప్రస్తావనకు తెస్తాడు. ఇవి బహుశా కాకతీయుల సమకాలీన సమాజంలో ప్రధానమైనవి కావచ్చు. వాటి వివరణ బసవపురాణంలో ఇలా ఉంటుంది.

*“ ‘చాకిచా’ కని యేల సందడించెదవు*
*చాకియే యతఁడు సాక్షాల్లింగమూర్తి*
*కాక యేటికిఁ గనుకనిఁ బలికెదవు*
*కులజుండు నతఁడె యకులజుండు నతఁడె*
*కులము లేకయు నన్ని కులములు నతఁడె*
*యానీలగళు నపరావతారంబు*
*గాన యాతఁడు సర్వగతుఁడెట్టులనిన*
*సరసిజ భవుజడల్ జన్ని దంబులుగఁ*
*బరగ భిక్షించిన బ్రాహ్మణుఁడత డ*
*మహితాపవర్గ సామ్రాజ్య పట్టంబు*
*కడఁగి దుర్భవకర్మ ఘటవహిత్రంబు*
*వడి భవాంబుధిఁ ద్రిప్ప వైశ్యుండు నతఁడ*
*యిల సత్క్రయారంభ ఫలములుగోసి*
*సొలవక నూర్చెడు శూద్రుండు నతఁడ*
*యాది శక్తియ మున్ను పాదానముగను*
*నాద బిందులు గారణంబుగఁ దగిలి*
*వేడుక బ్రహ్మాండ వివిధ భాండముఁ*
*గూడ వానెడు నాంటి కుమ్మరి యతఁడ*
*హరి యెమ్ము దండంబు నహిపతి ద్రాడు*
*నరసింహు పెనుపగు నఖరంబు గ్రాంకి*
*యవని మోచినరాహం బెఱిగాఁగ*
*నవనిఁ గూర్మంబును నల్ల మత్స్యంబు*
*గాలమిట్లే కోదకంబునఁ దిగిబి*

*లీల నటించునా జాలరి యతడ*
*చటుల సంస్కృతి జీవఘట చక్రకర్మ*
*పటువరి వర్తన భ్రమణంబుఁగూర్చి*
*కీలు వొందించి యాక్రియ రాటనముల*
*వాలి యాడించు నా వడ్రంగి యతఁడ*
*మును జీవమను లోహమునకు జ్ఞానాగ్ని*
*నొనరఁగఁ బదనిచ్చు కనుమరి యతఁడ*
*యిచ్చుచో నెఱింగి కల్లచ్చుల నూకి*
*యచ్చుల నొరగొను నగపాలి యతఁడ*
*హరిణమై రమియించు నజుని శిరంబు*
*శరమునఁ ద్రెంచిన శబరుండు నతఁడ*
*హరి ముఖ్యకృమి కీటకాది పశువుల*
*వెరవునఁ చాలించు క్రిఱేడు నతఁడ*
*ప్రకటిత కపట నాటక సూత్రములను*
*వికృతి ప్రకృతులార్చు వెండీఁడు నతఁడ*
*కులనగంబుల నూకి జధులనల్లి*
*పాలముపోడేర్చు నాబోయమున తఁడ*
*యే కార్లవంబైన యెడ నజా చ్యుతులం*
*జేకొన కుదికేడు చాకియు నతఁడే"*

(బసవపురాణము, చతుర్థాశ్వాసము)

పై వాక్యాలలో పేర్కొనబడిన కులాలు, ఆయా వృత్తులు ఎక్కువ భాగం సామాజికంగా కింది వర్గానికి చెందినవి. శ్రమకు సంబంధించినవి. ఆర్థిక విధానంలో ప్రధానపాత్ర వహించేవి. ఇటువంటి ఉపశ్రేణి వర్గానికి చెందిన కులాల ప్రస్తావన ఆనాటి సాహిత్యంలో శైవసాహిత్యంలో ఎక్కువగా కనిపిస్తుంది.

## 5.1.1.1. బోయలు

కాకతీయుల కాలంనాడు 'బోయలు' అనే కులం కూడా ఉంది. వీరిలో కొందరు పల్లకీలు మోసేవారు కాగా, మరికొందరు ఆలమందలను

రక్షించేవారు. దేవాలయంలోని ప్రసాదాలను అమ్మే వృత్తి వీరిది. అయితే వీర శైవులు దేవాలయ ప్రసాదాలను అమ్మడానికి ఒప్పుకోలేదు. ప్రసాదాన్ని ప్రజలకు ఉచితంగా పంచిపెట్టాలని అన్నారు. దీనివల్ల ప్రసాదం అమ్మే 'మడిగూడి' వృత్తి నిర్వహించడం వీరికి చాలా కష్టమైంది. ఈ విషయం బసవపురాణంలో వివరించబడి ఉంది.

> *"దొడగి ప్రసాదంబు గుడుచు చున్నారు*
> *నడరఁగ మా కించు కైనను నిడరు*
> *నూరక కుడుచుట యుచితమే యనిన*
> *జియ్యయు నత్తురే చెల్లునే యిట్లు*
> *విను మహారాజ! మావృత్తి నిర్మూల్య*
> *మొనరగ మాకు వచ్చిన తొంటి విధము"*
>
> (బసవపురాణం, ఏడవ ఆశ్వాసం)

ఈ విధంగా వీరి వృత్తిని గురించి, వీరశైవుల మత పద్ధతుల గురించి బసవపురాణంలో చెప్పబడింది.

ప్రసాదం అమ్మకంపై వీరి జీవితం ఆధారపడి ఉంది. కాని దేవుని ప్రసాదాన్ని అమ్మడమనేది భక్తిని ధనంతో ముడిపెట్టడం వంటిది. అందుకే వీరశైవం దీనిని ఖండించింది.

### 5.1.1.2. వెట్టి

శైవ వాఙ్మయంలో కనిపించే మరొక ఉపశ్రేణి వర్గానికి సంబంధించిన వృత్తి 'వెట్టి'. వెట్టి అంటే కూలికి డబ్బులు లేకుండా చేసే పని. అంటే శ్రమకు ప్రతిఫలం ఉండదు. అది ఒక కులంవారి వృత్తి. దీనిని బట్టి వారి జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో అవగాహన చేసుకోవచ్చు. ఇటువంటి వారి జీవితాలు కూడా శైవ సాహిత్యంలో పేర్కొబడింది. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో, బసవపురాణంలో ఈ వెట్టి గురించి ఇలా చెప్పాడు.

*"వెట్టిగా దెచ్చిన యట్టివి సభలె*
*వెట్టి కేగెడు తట్టబట్టి యెత్తెడు"*

(పండితారాధ్య చరిత్ర, పురాతన పురాణం)

*"వెట్టి చేసేడు నీకు వెయ్యేడులైన"*

(బసవపురాణం, ఆరవ ఆశ్వాసం)

ఇంతే కాకుండా శైవమతం బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించింది. దేవాలయంలో, రాజుల ఆస్థానాలలో, శుభకార్యాలలో, విద్యలలో వారి ప్రాముఖ్యాన్ని ప్రశ్నించింది.

## 5.1.3. కులం - విద్య

కింది కులాల వారిని విద్యకు దూరం చేయడాన్ని, ఒక పనిని వీరే చేయాలి, వీరే అర్హులు అనే విధానాన్ని ఖండించింది. కుల వైషమ్యాలకు కారణమైన బ్రాహ్మణ కుల ఆధిక్యతను, వేదవిద్యా మహిమలను ప్రశ్నించింది. ఈ అంశాలు బసవపురాణంలోని కల్లి దేవయ్యగారి కథలో పాల్కురికి సోమనాథుడు ఈ విధంగా చెప్పాడు.

*"కావున బ్రహ్మమార్గం బెద్దివామ్ము*
*భావింపముట్ట సంభాషింపఁదగునె"*
*"అక్కటా యిది యేల యందఱు మమ్ము*
*గక్కల కంటెను దక్కువగాఁగ"*
*"చదివింతుగాక మీశ్వాసంబు నొక్క*
*వరఖండ వర్గంబు పనస యెందైన"*
*"అనియె రోకఁటి పాటలట్ల వేదములు*
*పనుగొన మా శివభక్తుల యిండ్ల*
*సోమే యములకు ధారణి ననుచు"*

(బసవపురాణం, సప్తమాశ్వాసం)

వేద విద్యలకంటే మనిషి జీవితంలో కనిపించే భౌతిక వాస్తవాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అంశం పై వాక్యాలలో ఉంది. ఆధునికత వల్ల కలిగిన ఈ దృక్పథాన్ని శైవ సాహిత్యం ఆనాడే చెప్పింది.

## 5.1.4. కులం - దేవాలయం

వీరశైవం వల్ల బ్రాహ్మణేతరులు శివాలయాలలో పూజారులు అయ్యారు. ఇది సంస్కృతి పరంగా వచ్చిన గొప్ప మార్పుకు వీరశైవం మూల కారణమైంది. కాని ఇది ఎక్కువ కాలం ఉండలేదు. ప్రతాపరుద్రుని కాలంలో శివాలయాలలో పూజారులైన తంబక్షను తొలగించి వెలనాటి వారు పూజారులు అయ్యారని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బసవపురాణం పీఠికలో చెప్పారు.

అయితే ప్రతి దేవాలయానికి కొంత మాన్యం ఉండేది. దాని మీద ఆధారపడి దేవాలయ సంబంధమైన పనులు చేసేవారు ఉండడం ఆనాటికి ఉంది. "*ఈనాడు దేవుని మాన్యం కింద బతికేవారు ఎంతోమంది ఉండేవారు. వారంతా భగవంతుని సేవలు చేసేవారు. దేవుణ్ణి జలకమాడించే వారు, పూలమాలలు సమర్పించేవారు, విభూతి పెట్టేవారు, గంధమర్పించేవారు, గంటలు కొట్టేవారు, మంగళ హారతినిచ్చేవారు, పళ్లెరమివారు, కాపటివారు, పాలు పిదికేవారు, అడపంవారు, పూజారి, వైద్యుడు, పౌరాణికులు, పాఠకులు, పరిహాసకులు, కవిపండితులు, కరణ ప్రధాని, గజసాహిణి, అశ్వసాహిణి, దివ్వెలవార, పల్లకి బోయలు, చాకలి, మంగలి మొదలైన వారున్నట్లు బసవపురాణం చెబుతుంది.*

*ఈ విధంగా ఏర్పడిన కులాలే అనేకం ఉన్నాయి. వారి పిల్లలకు కూడా అవి సంక్రమించాయి. మునసబు కొడుకు మునసబు, కరణం కొడుకు కరణం, తలారి కొడుకు తలారి, వెట్టివాని కొడుకు వెట్టివానిగా గుర్తింపుకు వచ్చారు. వృత్తులను బట్టి కాకుండా వారు చేసే తక్కిన పనులను బట్టి కూడా కొత్త కులాలు పుట్టుకొచ్చాయి. వారి పనులను బట్టి అదే పేరు మీద పిలిచేవారు.*" (ప్రమీలారెడ్డి, ఎం 2000 : 148)

ఈ విధంగా ఆనాటి వృత్తివిధానాలు గ్రామంలో ఉండేవి. దేవాలయం చుట్టూ వృత్తులు అల్లుకపోయినట్లు గ్రామాలలో కనిపిస్తుంది. కాని

దేవుని దగ్గర పనులలో కూడా బ్రాహ్మణులు దేవునికి సంబంధించిన పనులు చేయడం, మిగిలిన కులాలవారు అతని ఆజ్ఞ ప్రకారం నడుచుకొనే పరిస్థితి ఆనాటికే ఉంది.

## 5.1.5. కులం - అస్పృశ్యత

వర్ణ వ్యవస్థ గుర్తించని నిమ్న కులాలవారు ఊరికి వెలుపల ఉండేవారు. వీరు ఆర్థికంగా కూడా పూర్తిగా వెనుకబడి ఉండేవారు. వీరి వృత్తిని బట్టి వీరు సాంఘికంగా తక్కువగా చూడబడడం జరిగింది. సమాజంలో భూస్వామ్య వ్యవస్థా లక్షణాలు(ఫ్యూడల్ వ్యవస్థా లక్షణాలు) ఏర్పడుతున్న కాలంలో ఈ కులాలను అస్పృశ్యులుగా చూడడం మొదలైంది. అది కాలక్రమంలో బలపడింది. కాని వీరశైవం దీనిని ఖండించింది. శివభక్తులు అందరూ సమానమేనని ప్రభోదించింది. మనషుల మధ్య ఈ అస్పృశ్యతను హేతువాద దృక్పధంతో ప్రశ్నించింది. ఈ విషయం శైవ వాఙ్మయంలో ఇలా ఉంది.

*"ఎచట బ్రాహ్మణులకు నితరుల ముట్ట*
*నుచితంబు గాదుగా కారలకు ద్విజుల*
*ముట్టఁగ రాదను నిట్టి ధర్మములు పుట్టునె"*
*'వినుము శూద్రులు ముట్టినను బ్రాహ్మణులకు*
*మను సచేల స్నానములు సేయవలయు*
*నని చెప్పఁగాక యీూ యధమ వంశజుల*
*కును ద్విజులను ముట్టఁజన దని కలదె*
*యేనీతి యేధర్మ మేపురాణోక్తి*
*యేనాటి భక్తి సహింపఁగం దగునె"*

(బసవపురాణం, సప్తమాశ్వాసం)

ఇటువంటి అస్పృశ్యతను, దాని విధానంవల్ల సమాజంలోని అసమానతలను, అస్పృశ్య చర్యలను శైవవాఙ్మయం చెప్పడమే కాక ఆకాలంనాటికే ఖండించడం గొప్ప విషయం.

అంతే కాకుండా ఏ కులం వాళ్లు ఆ కుల ధర్మాన్నే నిర్వర్తించాలి. ఒక కులంవారు వేరే కులంవారి వృత్తిని స్వీకరించకూడదు, వేరే కులం వారిని వివాహం చేసుకోకూడదు అన్నది ఆనాటి సాంఘిక ధర్మం. దీనిని కూడా వీరశైవం ఖండించింది. కుల సంకరం బసవడు చేయడాన్ని మిగిలిన వాళ్ళు సహించలేక పోయారు.

ఈ అంశం బసవపురాణంలో ఉన్నది.

*"కులసంకరము సేయంగూడునే మాల*
*గలపతి కల్యాణ కటకమంతయు"*

(బసవపురాణం, ఏడవ ఆశ్వాసము)

కులసంకరం చేయడాన్ని ఒప్పుకోలేనివాళ్ళు బసవడిని ఎదిరించడానికి ప్రయత్నించినట్లు బసవపురాణం వల్ల తెలుస్తుంది.

శివభక్తి ముఖ్యం కాని కులం కాదు. శివభక్తులైన వారికి కులంతో పనిలేదు. అస్పృశ్యత వంటివి వారికి చెందవు. కులహీనత, కుల ఆధిక్యత, కుల ధర్మాలను పాటించడం శివభక్తులకు వర్తించదు అని చెప్తూ బసవడు తండ్రితో వడుగే వద్దంటాడు.

*"వడు గనియిది యేమి గడియించె దీవు*
*జడుఁడ వెట్లయితి వీశ్వరునిఁగిల్చియును*
*బరమాత్ము గురునిగాఁబడసి దుర్గురుల*
*గురులని కొలుచుట నరకంబు గాదె?*
*గత పూర్వజన్మ సంస్కారుఁడై తలఁప*
*వితత ద్విజత్వంబు వతితంబు గాదె?*
*నిర్మల గురుకృపాన్వి తజన్మునకుఁ*
*గర్మజన్మంబు దుష్కర్మంబు గాదె?*
*యగ్గురు పాదంబు లర్చించునతని*
*కగ్గిలో హవి వేల్పుటది దప్పుగాదె?"*

(బసవపురాణం, ప్రథమాశ్వాసము)

ఈ విధంగా శైవవాఙ్మయంలో కులాల వ్యవస్థను ఖండించడమే కాకుండా ఆనాడే అస్పృశ్యతా సమస్యను కూడా ప్రశ్నించడం జరిగింది.

## 5.1.6. అంత్య కులజులు/ పంచములు

వర్ణవ్యవస్థలోని నాలుగు వర్ణాలకు చెందకుండా గ్రామాల వెలుపల నీచవృత్తులు చేసుకుంటూ జీవించేవారిని అంత్యకులజులు అంటారని ముందే చెప్పడం జరిగింది. వీరు సాంస్కృతికంగా అస్పృశ్యులుగా చూడబడ్డారు. కాని వీరశైవం దీనిని ఖండించింది. దీనికి సంబంధించిన కథలు శైవ వాఙ్మయంలో ఉన్నాయి.

### 5.1.6.1. సూరసానమ్మ

పండితారాధ్య చరిత్రలో సూరసానమ్మ కథ ఉంది. ఈ కథలో సూరసనమ్మ నిమ్నకులజుడైన జంగముని భోజనానికి ఆహ్వానిస్తుంది. మిగిలిన బ్రాహ్మణులు రాజు దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేస్తారు. కులం కట్టుబాటును అతిక్రమించిన వారికి ఆ రోజులలో వెలి ఉండేది. కాని సూరసానమ్మ వెలికి భయపడదు. అంత్యకులజులను హీనంగా చూడడం తప్పని వారిని ఎదిరించి మాట్లాడుతుంది. దీనిని బట్టి ఆనాడు కులం కట్టుబాట్లు ఎంత ఎక్కువగా ఉండేవో అర్థంచేసుకోవచ్చు. సూరసానమ్మ ఇంట్లో మాదిగ జంగముడు ఉన్నాడని తెలిసి బ్రాహ్మణులు వచ్చి 'ఏదీ! మాదిగవాణ్ణి ఎక్కడ దాచావో చెప్పు!' అన్నప్పుడు దానికి కోపించి ఆమె ఇలా సమాధానమిస్తుంది.

*"మాటి మటికిఁ గ్రావ్వి మాదిగయనుచు*
*నేటికిఁబలుక ధర్మేతరులార!*
*మాదింగియే తొల్లి మహియెల్ల నెఱుఁగ*
*మాదేవుఁ డంత్యజుమార్గంబుఁ దాల్చి*
*చెచ్చెర మఱి యొక్క చచ్చిన పెయ్య*
*నచ్చుగా మెడనిడి యరిగికేంబావి*
*భోగయ్య యింటికిఁ బోవుడునతఁడు"*

(పండితారాధ్య చరిత్ర, దీక్షప్రకరణము)

ఇలా ఆనాటి కుల వ్యవస్థను నిరసించి ఉపశ్రేణి వర్గానికి ఆసరాగ నిలిచింది వీరశైవ మతం. మనిషి శివభక్తుడైతే చాలు కులంతో పనిలేదని చెప్పింది వీరశైవ సాహిత్యం. బసవపురాణంలోని ఈ ద్విపదలు పై భావాన్నే తెలియజేస్తాయి.

"*జాతి గోత్రక్రియాశ్రయు జేసెదెట్టు?*
*ల కులస్థుడైయున్న యభవుని భక్తు*
*ని కి నే కులంబని నిర్ణయించెదవు?*
*కావున నెన్ని మార్గములను వడుగు*
*గావింపగా రాదు కథలేమి చెప్ప?*"

(బసవపురాణం, ప్రథమాశ్వాసం)

బసవడు తండ్రితో వడుగు వద్దని, శివభక్తుల కులం నిర్ణయించడం సాధ్యం కాదని పై విధంగా చెప్తాడు.

## 5.1.6.2. చాకలి మాచయ్య

బసవపురాణంలోని మడివాలు మాచయ్య శివభక్తుడు. చాకలి వృత్తి చేస్తూ ఉంటాడు. ఇతడు ఏనుగును చంపే సందర్భంలో సోమనాథుడు అంత్య కులజుల వృత్తులను ప్రస్తావిస్తాడు.

"*మాలకు మారిసంబు మతిగొడారికిని*
*దోలును గాకూడఁ దాలఁగంగ వైచి*
త్రోవ నేతెంచుచోఁ దాలఁగని బాస
గావున న తుల వీరావతారుండు
నిమ్మార్గమున భక్తులైల నుప్పొంగ
నమ్మదకరి పొడవడఁచి యాక్షణము
యెవ్వండు నామీఁద నేనుంగుఁ గొలిపె

నవ్వసుధేశుక్రొ వ్వడఁతుఁ బొమ్మనిన
నింత వృత్తాంతంబు నెఱిఁగి బిజ్జలుఁడు
నంతకమున్న మో మల్లన వంచి
బసవని దెసఁ జూడఁబరమహర్షమున
వసుధేశునకు బసవనమంత్రి యనియె”

(బసవపురాణం, చతుర్థాశ్వాసము)

కాకతీయుల కాలం నాటికే అంత్యజుల వృత్తులు పూర్తిగా స్థిరపడ్డాయని, మాలలు మాంసాన్ని తినేవారుగా, అమ్మేవారుగా, మాదిగలు తోలుతో చెప్పులు తయారు చేసే వారిగా స్థిరపడిపోయారని పై వాక్యాలవల్ల తెలుస్తుంది.

## 5.1.6.3. శివ నాగయ్య

బసవపురాణంలోని శివనాగయ్య గొప్ప శివభక్తుడు. మాలకులానికి చెందినవాడు. బసవడు అతడిని తనతో పాటు రాజాస్థానానికి తీసుకొచ్చి తన పక్కనే కూర్చోనిస్తాడు. దానికి అక్కడివారంతా విస్తుపోతూ ఇలా రాజుకు చెప్తారు.

“*యదిగో మహారాజ! యంతటఁ బోక*
*కదియవచ్చెడు మాలఁగలపనిచ్చటికి*
*డెందంబు నను భయం బందమిసూడు*
*మందలం చెక్కించి యతనిఁ దెచ్చెడిని*
ఇంక నేరి కితండు శంకించు నని నఁ
గింకలో నగరివాకిలి సొరకుండ
వెలుపలి కాల్వున విభుఁడన్న యెడను
నలుకక బసవయ్య యున్నతంబు గను
శివ నాగుమయ్యకు సింహాస నముగ
భువిఁ దనపై చీర వుచ్చి పెట్టుచును
బిలిచిన పని యేమి పృథివీశ యనినఁ”

(బసవపురాణం, సప్తమాశ్వాసము)

మాలలకు రాజాస్థానంలో ప్రవేశించే అర్హతలేదని పై వాక్యాల వల్ల తెలుస్తుంది. రాజు ఆస్థానం వెలుపల కొలువును ఏర్పాటు చేస్తాడు. అంటే ఆ రోజుల్లో నిమ్న కులాల స్థితి ఎలా ఉండేదో శైవవాఙ్మయం తెలియజేస్తుంది.

## 5.1.7. కులం - శైవం

ఇదే విధంగా బసవపురాణంలో వీరశైవ మతస్థులకు కులంతో పనిలేదని, బ్రాహ్మణుడైనా శివ భక్తుడైన మాల కులస్థుడు బ్రాహ్మణుని కంటే గొప్పవాడని సోమనాథుడు చెప్తాడు. అంటే కులం కంటే శివుని భక్తుడవడమే ముఖ్యమని వీరశైవ మతం చెప్తుంది.

"*మొన్నటి వార్తయిం కిన్నియునేల*
*యసమాక్షుఁ గొలువని యగ్రజాండైన*
*వసుధ మాలలమాల వాడ కాకెట్లు*
*మాలఁదు శివుఁగొల్చి మాలఁడు వెంపు*
*మాలఁడు రెంటికి మాలఁడీయుక్తి*
*మాలఁడే యీతని మాఁడల్ త్రాటి*
*మాలలు భువఁ బచ్ఛిమలుగాక*" (బసవపురాణం, సప్తమాశ్వాసం)

'బసవపురాణం'లోని 'ఉద్భటుడి కథ'లో ఉద్భటుడు చండాల యువతి అయిన జామ్మవ్వను వివాహం చేసుకొంటాడు. ఆ నగరంలోని జనులంతా ఈ పనికి ఆశ్చర్యపోతారు. అంటే ఆనాడు అనులోమ వివాహాలు ఉన్నట్లు తెలుస్తుంది. కాని దీనిని ఉన్నతశ్రేణికి చెందినవారు ఒప్పుకోలేక పోయేవారు.

ఈ విధంగా కులవ్యవస్థ దాని పూర్తి స్వరూపాన్ని సంతరించుకుంది. వృత్తులు కులాలుగా స్థిరపడ్డాయి. మాల మాదిగలు నిమ్న కులాలుగా గుర్తించబడి సమాజంలో గౌరవాన్ని పొందలేకపోగా సమానత్వాన్ని కోల్పోయి సాంస్కృతికంగా నీచులుగా, అస్పృశ్యులుగా చూడబడ్డారు. కుల కట్టుబాట్లు ఎక్కువగా ఉండడం

వల్ల, అతిక్రమించిన వారికి కులవెలి ఉండేది. ఆర్థిక పరమైన స్థిరత్వం లేక వృత్తి కులాలు అంటే ముఖ్యంగా శూద్రకులాలు కష్టాలను అనుభవించేవారు. ఆనాటి సమాజం పటిష్టమైన కులవ్యవస్థ మధ్య, వర్ణాశ్రమ ధర్మాల పరిరక్షణ మధ్య నిలబడిపోయింది. బ్రాహ్మణులు, రాజులు వీటి పరిరక్షణే ధ్యేయంగా పెట్టుకొన్నట్లు కనిపిస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో మత ప్రమేయం ఎక్కువగా ఉంది.

ఈ విధంగా ఆనాటి సమాజంలో గల కుల వ్యవస్థ యొక్క స్వరూప స్వభావాలను తెలిపిన సాహిత్యమే శైవ సాహిత్యం. దీనికి కారణం అది వీరశైవ మతంతో ముడిపడి ఉండడమే. సాహిత్యం మత ప్రచార దృక్పథాన్ని కలిగి ఉండడమే. అంతేకాకుండా మత లక్షణాలన్నీ సాహిత్యంలో ప్రతిఫలించేటట్లు ఉండడం. ఆనాటి సమాజంలోని ఉపశ్రేణి వర్గాల గురించి ఇంత విపులంగా శైవ వాఙ్మయంలో ఉంది.

## 5.2. స్త్రీ

కాకతీయుల కాలంనాటి స్త్రీ పూర్తిగా పురుష స్వామ్య భావజాల చట్రంలో ఇరుక్కుపోయింది. కులస్త్రీలకు అనేకమైన ఆంక్షలు ఉండేవి. పాతివ్రత్యం తప్పనిసరిగా ఉండేది. రాజరికపు స్త్రీలు సామ్రాజ్యాన్ని పరిపాలించినా సామాన్య స్త్రీలు సాధారణ జీవితాన్ని గడుపుతూనే శ్రమలో భాగం అయ్యారు.

"*చేలపని, చెరుకు - నూనె గానుగ లాడించడం, ఇంటిపని, వంటపని, పిల్లల పెంపకం. అనేక వృత్తి పనులతో పాటు కొన్నిసార్లు బేరసారాలు సైతం నిర్వహించేవారని నాటి సాహిత్యం వల్ల తెలుస్తున్నది*". (మలయశ్రీ 1990 : 96)

ఈ విధంగా ఉపశ్రేణికి సంబంధించిన స్త్రీ ఇటు కుటుంబ పనులను, వృత్తి పనులను చేసేవారు. కాని పురుషాధిక్యత వలన ఆంక్షలలోనే జీవించేవారు. క్రీ.శ. 1210 నాటి నిడుబ్రోలు శాసనంలో ఒక మహిళ భర్తతో శివసాన్నిధ్యం చేరినదని, సతీ సహగమనం చేసిన ప్రస్తావన ఉంది. కాని మిగిలిన వితంతువులలో ఈ భావాలు కనిపించవు.

"*సామాన్య కుటుంబాలకు చెందిన మహిళల జీవితం గురించి తెలిసికొనుటకు తగినంత ఆధారాలు లేవు. మధ్య తరగతికి చెందిన స్త్రీలు, పిల్లల పాలనపోషణ స్వయంగా చూసెడివారు. బసవపురాణంలో పాల్కురికి సోమనాథుడు పిల్లల పెంపకం పట్ల తల్లి శ్రద్ధ వహిస్తుందని హృద్యంగంగా వివరించాడు. మహిళలు భర్తలతో మత కార్యక్రమాలలో పాల్గొనేవారు. శివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో జరిగే ఉత్సవాలకు మహిళలు భర్తలతో శివుని మహిమలు పాడుచూ పాల్గొనేవారని పండితారాధ్య చరిత్ర తెలియజేస్తుంది.*" (కనకదుర్గ, పి 1992 : 194, 195)

ఆనాడు దేవాలయలలో నృత్యగాన కార్యక్రమాలతో రంగభోగములు జరిపే శాశ్వత ఉద్యోగులు ఉండేవారు. మోపర్రు (క్రీ.శ. 1170), వేల్పూరు (క్రీ.శ. 1254) శ్రీకూర్మం (క్రీ.శ. 1280) ఈ శాసనాలలో చోడీశ్వరం, రామేశ్వరం, మొదలైన దేవాలయాలలో భోగములకై సానులు ఉండేవారని చెప్పబడింది. "*వీరికి దేవాలయ ఉద్యోగులతో పాటు దేవాలయములకు భక్తులొసగిన దానములలో, భాగమిచ్చెడివారు. దేవాలయములలో నృత్య ప్రదర్శనలకు రంగమండపము లేదా నటమండపము లుండేవి. శివరాత్రి మహోత్సవ సందర్భంలో శ్రీశైల మల్లిఖార్జునుని దేవాలయాలలో దేవదాసీలు కుండలి, దండలానకము, పేరణి, ప్రేంఖణం, చిందు మొదలైన దేశీ నృత్యాన్ని, భారత, కోహలాదుల మార్గ నృత్యాన్ని మనోరంజకంగా అభినయించేవారని పండితారాధ్య చరిత్ర తెలియజేస్తున్నది.*"

(కనకదుర్గ, పి 1992 : 197)

ఈ విధంగా ఆనాటి సమాజంలో స్త్రీలను రాచరికపు స్త్రీలు, శ్రమచేసి, కుటుంబ వ్యవహారాలు చూసే ఉపశ్రేణి వర్గంలోని శూద్ర, నిమ్న కులాలకు చెందిన స్త్రీలు, దేవాలయాలలో సానులుగా ఉండే స్త్రీలు, వేశ్యలు ఈ విధంగా వివిధ కోణాలలో ఆనాటి స్త్రీల జీవితం కనిపిస్తుంది.

### 5.2.1. వేశ్యలు

అందరికంటే వేశ్యల జీవితం ఎక్కువ కష్టంగా ఉండేది. వ్యభిచారం గురించి, వేశ్యల జీవన పరిస్థితుల గురించి బసవపురాణంలో చాలా చోట్ల ప్రస్తావించబడింది.

బసవపురాణంలోని వేశ్యల జీవితాల గురించిన కొన్ని సందర్భాలు ఇలా కనిపిస్తాయి.

*"బసవ! యేమని చెప్ప భర్గుడే మెఱుంగు*
*నెసగలంజెఱికమే నీ రాత్రి సేత*
*నీవును మాతోడరావైతి గాని*
*దేవునంతకు నొక్క విధమైన సుఖము*
*ఐనను లంజెర్క మచ్చోట జేయు*
*చో నిన్ను దలచితి జుమ్మయ్య బసవ*
*పుట్టితిగాని మున్నిట్టి సుఖంబు*
*నిట్టి లంజెఱికంబు నెఱంగ నెన్నడును*
*మలహరు కృపలేని మత్తి నాంధ్రకును*
*గలుగునే లంజెఱికం బట్లు వేయ*
*బగలు రాత్రియు నెడబడక లంజెఱిక*
*మొగి నెన్నియుగములిట్లొప్పగ జేసి*
*--------------------------------*
*సడిసన్న శివభక్తి సౌభాగ్య మహిమ*
*--------------------------------*
*చేకూరె నిట్టి లంజెఱికమీరాత్రి"*

(బసవపురాణం, మూడవ ఆశ్వాసము)

ఈ విధంగా వేశ్యలు కూడా మిండజంగాలు ఏది కోరితే అది తెచ్చివ్వాలని వీరశైవం చెప్తుంది. దీనివలన వారి జీవితం మరింత దౌర్బల్యంగా ఉండేది.

బసవపురాణంలో వర్ణించిన కథలలో బెజ్జమహాదేవి, సంగళవ్వ, పిట్టవ్వ, గుడ్డవ్వ, సూరసానమ్మ మొదలైన స్త్రీ భక్తురాళ్ల కథలు ఉన్నాయి. నిమ్న కులాలకు చెందిన స్త్రీల కథలూ ఉన్నాయి. అయితే ఇవన్ని వారి జీవన పరిస్థితి కంటే వీరశైవ మతం యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తున్నాయి. ఏది ఏమైనా ఆనాటి సమాజంలోని వివిధ రకాల స్త్రీ జీవితాల గురించి శైవవాఙ్మయం కొంతవరకు తెలియజేసింది.

## 5.2.2. వేశ్యావృత్తి

ఇంతకు పూర్వ కాలం నాటికి ఏర్పడిన దేవదాసి వ్యవస్థ ఈ కాలం నాటికి వేశ్యావ్యవస్థగా మారింది. కాకతీయుల కాలంలో వేశ్యలను వెలియాలు, భోగస్త్రీలు, లంజియ పెండ్లాలు, వారాంగనలు, వ్యభిచారిణిలు అని వ్యవహించేవారు. వీరికి సంఘంలో గౌరవమైన స్థానం ఉండేది. రాజులు వేశ్యలను వివాహం చేసుకొనేవారు.

ఆనాడు ప్రధాన పట్టణాలలో వేశ్యావాటికలు ఉండేవని, అవి విటులతో నిండి ఉండేవని శైవ రచనల వల్ల తెలుస్తుంది. కాకతీయుల కాలంనాటి శాసనాలు కూడా ఈ విషయాన్నే తెలియజేస్తున్నాయి.

*"క్రీ.శ.1254 నాటి వేల్పూరు శాసనంలో కోటబయ్యల దేవి కుమారుడైన గణపతి దేవరాజు రామేశ్వర దేవరకు భాండారము అక్కమసానికి దానము చేసెను. క్రీ.శ.1213 నాటి చేబ్రోలు శాసనంలో గణపతి దేవుని బావమరిది జాయపసేనాని మహాసేనుని దేవాలయమునకు 300 మంది సానులను 8సంవత్సరాల వయస్సులో ఉన్న వారిని దానంచేసి నృత్య గానాదికములు బోధించే అధ్యాపకుని నియమించినాడని తెలుస్తుంది. వీరు మార్గ, దేశీ రీతులలో నృత్య గానాదికములలో ఆరితేరి దేవాలయములలో నిత్యమేకాక ప్రత్యేక పర్వదినములలో ప్రదర్శనలిచ్చెడివారు."*

(కనకదుర్గ, పి 1992: 198)

అంతేకాకుండా యుద్ధాలలో ప్రభువులకు, సైనికులకు నూతన ఉత్సాహాన్ని కలిగించడానికి కూడా వేశ్యలు ఉండేవారని తెలుస్తుంది.

*"పండితారాధ్య చరిత్ర పురాతన ప్రకరణం గురుభక్తాండ కథలో ఒక వేశ్యావాటిక వర్ణించబడింది. అక్కడ వేశ్యల చూడ్కులు, విటుల ప్రవర్తన ఎంతో సహజంగా పాల్కురికి సోమనాథుడు వర్ణించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రతి కళా విశేషాలను కూడా వర్ణించాడు. ఆనాడు వేశ్యా వ్యవస్థ సమాజంలో ఒక భాగం. కాబట్టి శైవ వాఙ్మయంలో ఇతరాంశాలతో పాటు వేశ్యల వ్యవహారాలు కూడా నిస్సంకోచంగా వర్ణించబడ్డాయి."* (రాజు, ఎన్. ఎస్ 1991: 46)

పై విధంగా సమాజంలో ఒక భాగమైన వేశ్యల జీవితాలను కూడా శైవ వాఙ్మయం ద్వారా తెలుసుకోవచ్చు. ఆ రోజులలో వృత్తి వల్ల వేశ్యలకు వివిధ రోగాలు వచ్చేవని, వారి ఆర్థిక స్థితి దయనీయంగా ఉండడం వల్ల వైద్యం చేయించుకోలేక పోయేవారని పేర్కొనబడింది.

వేశ్యల దగ్గరకు వచ్చే విటులలో కవులు కూడా ఉండేవారని పండితారాధ్య చరిత్రలోని మలహణుని కథ వల్ల తెలుస్తుంది.

శివకవుల రచనలలో కనిపిస్తున్న లంజ అనే మాట ఆనాటి వేశ్యకు పర్యాయ వాచకంగా వాడబడినదని కాలక్రమేణా అర్థపరిణామానికి లోనై తిట్టుగా మారి ఉండవచ్చునని ఎన్.ఎస్.రాజు గారు తన 'శివకవుల రచనలు - సమాజం'లో తెలిపారు.

## 5.3. దొంగతనాలు

మధ్యయుగ ప్రారంభంలో ఏర్పడిన భూస్వామ్య వ్యవస్థ లక్షణాలు 12వ శతాబ్దానికి చెందిన కాకతీయుల కాలం నాటికి బాగా బలపడ్డాయి. భూమి కొంతమంది చేతుల్లోకి వెళ్లడం వల్ల కూలీలుగా కొంతమంది జీవనం సాగించవలసి వచ్చింది. ఈ ఆర్థిక వ్యత్యాసం వలన, వృత్తి పనులు చేసే వారికి సరైన సంపాదన లేకపోవడం వలన కొంతమంది బిచ్చగాళ్లుగా కొంతమంది దొంగలుగా మారారని చెప్పవచ్చు.

సమాజంలో బ్రాహ్మణ కులం మాత్రం విద్య ద్వారా, మతపరమైన క్రతువులు నిర్వహించడం ద్వారా శ్రమకు దూరంగా ఉండేది. వీరు ఉత్పత్తిలో భాగం కానప్పటికి రాజాశ్రయం వలన, మత కార్యక్రమాల వలన సమాజంలో గుర్తింపు పొంది దానాలు పొందేవారు. ఆర్థికంగా కూడా ఎక్కువ స్థాయిలో ఉండేవారు.

ఇటువంటి అసమానతలున్న సమాజంలో దొంగతనాలు సాధారణంగా జరుగుతుండేవి. దొంగతనాల గురించి శివకవుల రచనలలో ప్రత్యేకంగా చెప్పబడి ఉంది.

పాల్కురికి సోమనాథుడు వర్ణించిన ఈ క్రింది చిన్న కథవలన ఆనాడు దొంగతనాలు ఎలా ఉండేవో తెలుస్తుంది. దొంగలు దేవాలయంలో దొంగతనానికై ప్రవేశిస్తారు. బసవదండ నాయకుడ్ని చూసి వంకాయల్ని కట్టుకొంగుల్లో శివ లింగాలవలే దాచుకొంటారు. అవి బసవన మహిమవల్ల శివలింగాలవలే మారిపోతాయి.

*"జల్లన గుండె దిగుల్లన నవయ*
*భావించి "మనమెట్ట బంది(జిక్కితిమి*
*దేవర గలిగెనా చావుదప్పెడిని*
*మనకింక నెమ్మెయి మగిడి పోఁబోల"*
*దని కృతి నిశ్చయులై కూరుచుండి*
*సరసరమును లింగ సహితుల పోలెఁ*
*గరములు సాఁచుడు(గట్టు కొంగులను*
*భంగి నాబసవయ్య భావ సంగతిని*
*వంగకాయలు ప్రాణ లింగబులయ్యె"*

(బసవపురాణం ద్వితీయాశ్వాసము)

పై వాక్యాలు వలన ఆ రోజులలో దొంగతనం ఎంత సర్వసాధారణమైన విషయమో తెలుస్తుంది.

ప్రతాపరుద్ర చరిత్రలో వివరింపబడిన ఈ సన్నివేశం శైవులు దొంగల పట్ల ఎలా ఉండేవారు అనే అంశాన్ని తెలియజేస్తుంది.

" *'చోర రూపంబు దాల్చి గణపతి దేవుని నగలికి కన్నంబు వేసి సమస్త వస్తువులు సామాగ్రీ మ్రుచ్చిలి వచ్చుచుండెను'. ఆ కాలంలో శైవులు చోరులకు కూడా అభయమిచ్చేవారు. ఒక చోరుడు గుండబ్రయ్యమ్మ శరణుజొచ్చినప్పుడు రాజు అతన్ని పట్టి ఇమ్మని అడగగా 'నేను అతన్ని ఇవ్వను కాని దొంగకు వేసే శిక్ష నాకే వెయ్యమని' అంటాడు. అప్పుడు రాజు అతనికే కొరత వేయించాడు."*

పై సన్నివేశం వలన శివభక్తులు దొంగలపట్ల జాలితో ప్రవర్తించేవారని అర్థమవుతుంది. దొంగతనం చేసైనా జంగమార్చన చేయడం తప్పు కాదని బసవపురాణంలోని కన్నద బ్రహ్మయ్య కథ వలన తెలుస్తుంది. కన్నద బ్రహ్మయ్య తన ఇంటికి వచ్చిన జంగముల కొరకై బసవని సాయంతో రాజుగారి యొక్క కోశాగారానికి కన్నం వేస్తాడు. మహిమ వలన అంతా బంగారం అవుతుంది. చివరకు రాజైన బిజ్జలుడు శివభక్తుడైన కన్నద బ్రహ్మయ్య గొప్పతనాన్ని బసవని ద్వారా తెలుసుకొంటాడు.

ఈ కథ వలన శివభక్తులు దొంగలైనప్పటికి వారి మహిమ వలన శివ సంభూతులని తెలుస్తుంది. ఈ కథలో దొంగతనం చేసే పద్ధతిని, సాధనాలను పాల్కురికి సోమనాథుడు కింది విధంగా వర్ణించాడు. ఇవి దొంగల పరిజ్ఞానాన్ని, సమయోచిత వివేకాన్ని తెలియజేస్తున్నాయి. ఇవన్నీ వారు కన్నం వేసేటప్పుడు వెంట తీసుకొనిపోవు వస్తు సముదాయం.

*"కత్తియు, బలవంపు, కావి చీరయును*
*కత్తెర, యిసుము, అక్షతలును, ముండ్ల*
*బంతియు, నీలి కప్పడమును, ద్రిండు,*
*ముంతర కాటుక, మరి చండవేది*
*సెలగోల, యొంటట్టు చెప్పులు, పీకె,*
*యొలుకుల బూడిదయును, వాటురాలు,*
*కుక్కల వాకట్టు, కొంకి నారసము,*
*గ్రుక్కన కంకటి రజ్జావు నమర*
*సూచీ ముఖంబైన జొనుపంగరాని*
*యేచిన చీకటి నిండ్ల పంచలకు*
*జిడిముడి పలుకుల జేరి యుల్వరసి*
*గడియ కన్నంబును గడవ కన్నంబు*
*గోడకన్నంబును గురి నేల కన్న*
*మోడక త్రవ్వియిల్లొయ్యన జొచ్చి"*

(బసవపురాణం - పంచమ ఆశ్వాసం)

ఇంతే కాకుండా దొంగల రహస్య చోర విధానం ఈ విధంగా ఉంది. "*దీపమార్పు బుర్పులు, గద్దగోరు, గునపం వంటి వస్తువులు కొన్ని కొన్ని కావ్యాల్లో వర్ణించబడినవి. వాటురాలు కొట్టడానికి మనుషులు - తాళాల బుర్రల కాటి బూడిద చల్లితే కాపరులు నిద్రలేవరట!*

*మంత్రపు కాటుక పెట్టుకుంటే చీకట్లోనూ వస్తువులు కనిపించుతాయట. ఇసుక విసరితే ఇంట్లో వాళ్ళు నిద్రలో ఉన్నది లేనిది తెలుస్తుంది. ముండ్లబంతి కొరికి బాణం వస్తువుల తగిలించి సమీపానికి చేరుకోవడానికి, బాణం కత్తి ఎదిరించే వాళ్ళను పొడవడానికి, నల్ల బట్ట కప్పుకొంటే కనిపించకుండా చీకటిలో దాగవచ్చు. కుక్కల వాకట్టు చిక్కాలు (మందులు) అవే వాటి రక్షక భటులు కనుక, గడియ కడప గోడ కన్నాలు స్పష్టం. నేల కన్నం ఏమిటంటే బయట నిర్జన ప్రదేశం నుంచి గురిచూసి సొరంగం తవ్వి ఆ ఇంటిలో ప్రవేశించడం అదో పెద్దపని. గట్టి రక్షణ బందోబస్తు కల భవనాలకు అలా చేసే వారేమో బంటట్ట చెప్పులు చప్పుడు కాకుండా ఉండడానికి, కావి బట్ట వస్తువులు మూట కట్టడానికేమో, చిడిముడి పలుకులతి వెళ్తారంటే వెంట సావాసగాళ్ళున్నారన్నమాట.*" (మలయశ్రీ 1990: 169)

అప్పటి కావ్యాలలోనే ఈ విధంగా చోర వర్ణన జరిగి ఉన్నదంటే ఆనాటి సమాజంలో దొంగతనాలు ఎంత ఎక్కువగా ఉండేవో తెలుసుకోవచ్చు. సామాజిక పరిణామంలో భాగంగా ఏర్పడిన ఆర్థిక వ్యత్యాసాలను ఈ దొంగతనాలు హెచ్చు మీరడాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

## 5.4. కొలతలు

ఒక ప్రదేశం లేదా చరిత్రలో ఒక నిర్దిష్ట కాలం అభివృద్ధి సాధించింది అనడానికి ఆర్థికస్థితి గతులను ప్రామాణికంగా తీసుకోవచ్చు. ఆర్థిక పరిస్థితి ప్రధానంగా వాణిజ్యంపై ఆధారపడి ఉంటుంది. అంటే వీటిని బట్టి ఆ దేశ కాల పరిస్థితులను అంచనా వేయవచ్చు.

కాకతీయుల కాలంలో ప్రామాణికంగా చలామణి అవుతున్న తూనికలు కొలతలు తూర్పు చాళుక్యుల కాలంనుంచి ఉన్నవేనని చెప్పవచ్చు. ద్రవ పదార్థాలకు, ఘన పదార్థాలకు ఒకే కొలతలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి.

"త్రిపురాది గుడి తూర్పు దేస నేఱునేలఁ
గపిలీశ్వరంబందుఁ దపసి యొక్కరుఁడు
ఆలింగమునకు నిత్యము నాఱుపుట్ల,
పాలమజ్జన మార్పఁగాలువల్ గట్టి
వీది వీదుల వెల్లి విరియ నేనుఁగుల
పాదఘట్టనములఁ బంకంబు రేఁగ"

(బసవపురాణం - ద్వితీయాశ్వాసం)

పై వాక్యాలలో 'పుట్లు' అనేది ద్రవపదార్థానికి కొలమానంగా వాడినట్లు తెలుస్తుంది.

"మొక్కవు దఱుగవు నేను మానికలు"

(పండితారాధ్య చరిత్ర, పర్వత ప్రకరణం)

"గుడివేగి నిత్యంబు గుంచెడు పాటు"

(పండితారాధ్య చరిత్ర, పర్వత ప్రకరణము)

"తూమున దూమె దిక్షురసము"

(పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్రకరణము)

"నిచ్చగుంచెడు పాలు నిన్నుఁద్రావింప"

(పండితారాధ్య చరిత్ర, మహిమ ప్రకరణము)

"గగ్గ-లమును మూడేసి పలంబులర్పించి"

(పండితారాధ్య చరిత్ర, పర్వత ప్రకరణము)

"పాటి తూమునకును బాటియౌనే
బాటింప సోలయుఁబాటియకాదె"

(బసవపురాణము - ప్రథమాశ్వాసము)

"కుంచెడె గోరతో గొలిచి చేపట్టి"

(బసవపురాణము, తృతీయాశ్వాసము)

పై వాక్యాలలో చెప్పబడిన కొలతలు ఆనాడు సమాజంలో చలామణిలో ఉన్నవని తెలుస్తుంది.

ధాన్యానికి పుట్టె, కుంచం అనే కొలతలు తూము, సోల అనేవి ద్రవ, ఘన, పదార్థాలకు కొలతలు. 'కుంచెం' అనే కొలమానం ఆనాడు విరివిగా ప్రమాణంగా ఉన్నట్లు రచనల వల్ల తెలుస్తుంది. ధాన్యాల కొలమానాలు ఎక్కువ వాడుకలో ఉండడం వల్ల ఆనాడు వ్యవసాయాభివృద్ధితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బాగా ఉన్నట్లు చెప్పవచ్చు. మొత్తం మీద కుంచం, మానిక, సోల, తూము, పుట్టి, పందుం వంటి కొలతలు వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తోంది. శాసనాలవల్ల తులం, పలం, వీశె వంటి తూకాలు కూడా ఉన్నట్లు కనపడుతున్నాయి.

## 5.5. దానాలు

ఆనాడు బ్రాహ్మణులు సంఘంలో గౌరవమైన స్థానంలో ఉన్నట్లు కాకతీయుల కాలం నాటికే పూర్తిగా కనిపిస్తుంది.

*"సంఘంలో మరోవైపున బ్రాహ్మణ కులం అగ్రహారాల మీదా, మతపరమైన కార్యాకలాపాలను ఆచరిస్తూ వాటిని నిర్వహించే వారి సత్కారాల మీద బతుకుతూ శ్రమకు దూరమయ్యారు. విద్యకు చేరువయ్యారు. వ్యవసాయ పరమైన ఆర్థిక సంబంధాల ఫలితంగానూ, ఉత్పత్తిలో భాగస్వాములు కాలేకపోయిన ఫలితంగాను బ్రాహ్మణకులం పూర్తిగా ఇతరులపై ఆధారపడ వలసి వచ్చింది. ఈ సందర్భంలో మత పరంగా బ్రాహ్మణ కులానికున్న స్థానాన్ని బట్టి వారికి భూ, ధన, కనక, వస్తు, వాహన దానాలు చేయడం పుణ్య కార్యంగా భావించబడింది."*

(రాజు, ఎన్. ఎస్ 1991: 43)

గ్రహణ కాలంలోను, పండుగలప్పుడు, శుభకార్యాలప్పుడు, యుద్ధంలో గెలిచినప్పుడు రాజులు దానాలు చేసేవారు. దానాలు బ్రాహ్మణులకే కాక వేశ్యలకు, దేవాలయాలకు కూడా చేయడం చరిత్రలో కనిపిస్తుంది. ఈ కాలంలో వేయబడిన అనేక శాసనాలు రాజులు చేసే దానాలను తెలుపుతాయి. దానంగా ఇచ్చిన భూమిని, ఆస్తులను దొంగిలించడం తప్పు అని చెప్పినట్లు కనిపిస్తుంది. గణపతి దేవ చక్రవర్తి పాలనాకాలం నాటి కొండవర్తి శాసనం నాల్గవ భాగంలో ఈ విషయాలు ఇలా రాయబడ్డాయి.

"*శ్లో. 45. ఒక ఆవునుకాని, ఒక గురువిందను కాని, ఒక అంగుళము భూమిని కాని దొంగిలించినవాడు ప్రళయము వరకును నరకమున ననుభవించును.*

*శ్లో. 46. తాను కాని, ఇతరులు కాని యిచ్చిన భూమిని అపహరించువాడు అఱువదివేల సంవత్సరముల వరకును మలములో క్రిమియై పుట్టును.*

*శ్లో. 47. పన్నులు లేని దాన భూములకు పన్నులు గైకొనుట వేయి యావులను జంపిన పాపము గట్టుకొనుటయగును. పన్నులుకల ధాన భూములకు పన్నులు గైకొనకుండుట కోటి యావుల నిచ్చిన ఫలమందుట యగును.*

*శ్లో. 48. బుద్ధిమంతుడెవడను దేవస్వమునుగాని, బ్రహ్మస్వమునుగాని అపహరింపబడు వానిని రక్షించుటచే నభీష్టసిద్ధి వడయును."*

(తిరుమలరావు, పి 1973: 17)

పై శాసన సారాంశాలను బట్టి ఆనాడు దాన ధర్మాలు ఎంత విరివిగా జరిగేవో, వాటిని కాపాడడానికి ఎంత కట్టుదిట్టమైన చర్యలు ఉండేవో తెలుస్తుంది.

పాల్కురికి సోమనాథుడు శ్రీశైలం గొప్పతనాన్ని చెప్తూ అన్నదానం ఫలితాన్ని ఇలా చెప్తాడు.

*"వారణాసిని లక్ష వరప్రతతికి*
*నారనన్నము వెట్టినట్టి ఫలంబు*
*గయలోన రెండు లక్షలు భూసురులకు*
*బ్రియమార నన్నము వెట్టిన ఫలము*
*ననిచిన ద్విజులకన్నంబు గేదార*
*మున మూడు లక్షలకును బెట్టు ఫలము*
*నున్న తీర్థంబుల నాక్కొక్క కోటి*
*కన్నంబు విప్రుల కందించు ఫలము*
*నా కాంక్ష శ్రీగిరి యందొక్క జమ్మి*
*యాకు పట్టెడునంత యన్న మొక్కనికి*
*దానంబుసేయు నుధ్యత్ఫలంబునకు....."*

(పండితారాధ్య చరిత్ర, పర్వత ప్రకరణము)

దానం ఫలితాన్ని ఇంత గొప్పగా వర్ణించడాన్ని బట్టి, ఆనాడు ప్రజలలో కూడా దానగుణం ఉండేదని చెప్పవచ్చు. ఇది పరోక్షంగా సమాజంలోని ఆర్థిక అసమానతలకు సంకేతం. జంగములకు దానాలు చేయడం, అన్న పానాదులు అందించడం పరమ పుణ్య కార్యంగా ఆనాడు భావింపబడేదని శైవ వాఙ్మయం తెలియజేస్తుంది. విటుడు శివభక్తుడైతే వేశ్య కూడా ఎటువంటి కష్టమైన అనుభవించి అతనికి భోజన సౌకర్యాలు అందించడం ఆమె విధిగా ఉండేది.

సత్రాలు ఆంధ్రదేశంలో ఎప్పుడు ప్రారంభమయ్యాయో చెప్పలేం. కాని కాకతీయుల కాలంనాటికి సత్రాలు ఉన్నట్లు తెలుస్తుంది. కొన్ని నామమాత్రంగా డబ్బుతీసుకొని భోజన వసతి కల్పించేవి. అయితే, కొన్ని ఉచిత అన్నదానానికి సంబంధించినవి. రాజులు, ధనవంతులు ఈ సత్రాలను కట్టించేవాళ్లు. ఇటువంటివి నిర్మించడం పుణ్యంగా భావించేవారు. వారి అభీష్టాలు నెరవేరతాయని ఆ కాలంనాటి ప్రజలు నమ్మేవారు. మార్గమధ్యలలో సత్రాలు ఉండేవి. ఇవి బాటసారుల ఉపయోగార్థం ఉండేవి. శ్రీశైల యాత్ర చేసేవారికి ఈ సత్రాలు, చలి పందిళ్లు ఎంతగానో ఉపయోగపడేవని పండితారాధ్య చరిత్రలో కింది విధంగా చెప్పబడింది.

*"అలసిన చోటన యన్న పానాదు*
*లలసిన వారల కపుడ యిచ్చుచును*
*జలిపందిరులు సత్రశాలలు గుండ్లు*
*జెలమలు నంతంత జేయ బంచుచును*
*నంతంత బందిరులంతంత మఱుగు*
*లంతంత విడిదలలనువు సేయుచును*
*భంగిగా జెంచు సద్భక్తుల మాడ్కి*
*జంగమారాధనల్ సలుపుచు నడువ ......"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణము)

సత్రాలు నిర్మించడం కూడా దానాలలో ఒక భాగం. ఇవన్నీ ఆనాటి సమాజంలో ఉన్న మానవీయ కోణాలను ఆవిష్కరిస్తాయి. అంతేగాక భక్తి, మతం వంటివాటితో ప్రజలకున్న అనుబంధాన్ని తెలియజేస్తాయి.

## 5.6. ఆర్థిక సంబంధాలు

ఆనాటి సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు ఎక్కువగా ఉండేవి. ప్రధాన ఆదాయ వనరు భూమి. ఎక్కువమంది వ్యవసాయం మీద ఆధారపడి జీవించినప్పటికీ భూమి కొంతమంది చేతుల్లో ఉండడం ఆనాటికే స్థిరపడింది. వ్యవసాయం చేసే వారిలో ఎక్కువమంది వ్యవసాయ కూలీలుగా స్థిరపడ్డారు. కూలీలకు దినసరి వేతనం ఉండేది. అయితే రోజూ కూలి దొరకక కూలీల జీవనం దుర్భరంగా ఉండేది. ఆర్థికంగా దిగువ స్థానంలో ఉండిన కూలీల దైనందిన జీవనం కష్టంగా ఉండేది. కూలీలు సేవకుల్లా ఎలా బాధలు అనుభవించేవారో బసవపురాణంలోని కలనేషి బ్రహ్మయ్య కథలో ఇలా చెప్పబడింది.

*"ఇప్పాటనది యొక్క యొప్పుగానతని*
*జెప్పకు సెప్పకు సేకూలిగాని*
*పని వెలగొని చేయు బంట్లకు రాశి*
*గొనవచ్చునే తన కూలియే తక్క*

ఫలములు గఱుతిడు భక్తులకెట్టు
లలవడు లింగనిరంతర సుఖము
పదవులు గొదవులు వట్లను గొళ్ళు
మదనారి సద్భక్తమండలి కరుదె?
యంత యర్థంబైన నెత్తికొ మ్మనుచు
నడ రఁగఁ జేగు దియము ఱాల ప్రాకఁ
దడయ కొండొంటిలిఁ దాఁకింపఁ దడవఁ
దంగెడు పూవులు ధరణిఁ బ్రోవిడ్డ"

(బసవపురాణం - పంచమాశ్వాసము)

పై వాక్యాలను పరిశీలించినట్లైతే కాకతీయుల కాలంనాటికే సమాజంలో స్థిరపడి పోయిన భూస్వామ్య వ్యవస్థా లక్షణాలు తెలుస్తాయి. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన ఉన్నతశ్రేణి శ్రమకు దూరంగా ఉండి సుఖాలు అనుభవించడానికి అలవాటు పడ్డారని, అదే విధంగా రైతు కూలీలు వంటి ఉపశ్రేణి వర్గం శ్రమ చేస్తూ అవసరాలను కూడా తీర్చుకోలేని స్థితిలో ఉన్నారని చెప్పవచ్చు.

ఆ కాలంలో వర్తక సంఘాల ద్వారా వర్తకం జరిగేది. వర్తక సంఘాలతోపాటు సంతలు ఆనాడే ఉండేవి. ఇలా గ్రామీణ వాణిజ్య వ్యవస్థలో కొన్ని గుర్తించదగిన మార్పులు ఆనాడే మనకు ఏర్పడినట్లు కనిపిస్తుంది.

*"ప్రతి గ్రామానికీ కొన్ని పదార్థాలు(వస్తువులు) పంటగా గాని, చేతి పరిశ్రమలుగా గాని ఉత్పత్తి అయి తరుగు మిగులు పదార్థాల మార్పిడి కోసం వ్యాపారం తప్పనిసరి. కొన్ని గ్రామాలకు దగ్గరలో ఉండేటట్లు అక్కడక్కడ సంతలు నిర్వహించేవారు. ఆ రకంగా సంతలు జరిగే గ్రామాలను 'పెంటల'ని పిలిచేవారు. అవే కాలక్రమంలో పేటలుగా మారాయి. కాకతీయుల కాలంలో ప్రభుత్వమే సంతలను నిర్వహించింది. సంతలలో వర్తకులు సరుకులను నిల్వచేసుకోడానికి పాకలను, క్రయవిక్రయాలకు*

*అంగళ్లను నిర్మించి అద్దెకిచ్చేవారు. వర్తకులు సంఘాలుగా సరుకులను ఒక సంతనుంచి మరో సంతకూ ఆయా సంత దినాల నాటికి తీసుకొని వెళ్లేవారు. ఎడ్లను, గుర్రాలను, గాడిదలను, బండ్లను సరుకు రవాణాకు వాడేవారు. ఆనాటి వర్తక బాటలే కాలక్రమంలో పెద్దపెద్ద రహదారులుగా తయారయ్యాయి. వ్యాపార సంఘాలకు సొంత బండ్లు, ఎడ్లు, గుర్రాలు మొదలైనవి ఉన్నా అవి సరిపోని సందర్భాలలో అద్దెకు తీసుకొనేవారు. వీరు కూడా ఒకరకమైన సుంకం చెల్లించవలసి ఉండేది."*

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 86)

## 5.6.1. మేదరులు - వ్యాపారం

నేటి సమాజంలోని వస్తు విక్రయ కేంద్రాలకు ఆనాడే పునాదిపడ్డట్టు కనిపిస్తుంది. పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ స్వభావాలు ఆనాడే ఉన్నట్లు తెలుస్తోంది. సరుకులను అంగళ్లలో అమ్మడమూ, ఒకచోట నుండి మరో చోటకు రవాణా చేయడమూ, వాటిపై సుంకాలు విధించడమూ మొదలైనవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణాలు. ఇవే కొద్దిగా కాకతీయుల కాలంనాడు కనిపిస్తున్నాయి. ఈ అంశాన్ని తెలియజేస్తూ కూలీలు, వృత్తిపనివారు ఆర్థిక వ్యవస్థలో ఎలా భాగమయ్యారో ఇలా చెప్పబడింది.

*"వీఁగుచు జేటల వేమయ్యభువిని*
*దాఁగాక మఱియు మేదరులు గొందఱకు*
*జీవితంబులునేసి చేటలు సాలఁ*
*గావించి బండ్లను గడిపి యూరూర*
*నమ్మించి తెప్పించి యందుల లబ్ధి*
*నెమ్మితో జంగమ నివహార్పణంబు*
*సేయుచు .........................................."*

(పండితారాధ్య చరిత్ర, పురాతన ప్రకరణము)

వ్యవసాయంతో పాటు వృత్తులలో కూడా వ్యాపారధోరణి ప్రవేశించిన విధానం పైవాక్యాల వలన తెలుస్తుంది. మేదరులకు కొంత ధనం ఇచ్చి వారిచే

చేటలు అల్లించి ఊరూరా తిప్పి అమ్మించి లాభాన్ని ఆర్జించే లక్షణం పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావం. ఉత్పత్తి శక్తులపైన, ఉత్పత్తి అయిన వస్తువులపైన గుత్తాధిపత్యం తీసుకొని పెట్టుబడిపెట్టి లాభార్జన చేసే లక్షణం ఆనాడే ఉందని చేటల వేమయ్యగారి కథ ద్వారా తెలుస్తుంది.

## 5.6.2. కూలీలు

ఆనాటి సమాజంలో ఉన్నతశ్రేణి, శ్రమకు దూరంగా ఉంటూ శ్రమ ఫలితాలను అనుభవించడాన్ని శైవ వాఙ్మయం నిరసించింది. సమాజంలోని ఉపశ్రేణి వర్గాలు అంటే ఆర్థికంగా కిందిస్థాయిలో ఉండేవాళ్లు, కులపరంగా తక్కువగా చూడబడేవాళ్లు, శ్రమలో భాగమయినవాళ్లు కాబట్టి వాళ్ల ఆర్థిక ఫలాన్ని అనుభవించాలని శైవవాఙ్మయం తెలియజేసింది. అంతే కాకుండా శ్రమ గొప్పతనాన్ని, దానితత్వాన్ని గొప్పగా శివకవులు తమ రచనల ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంలో పాల్కురికి సోమన రాసిన కింది వాక్యాలు గుర్తించదగినవి.

*"కాయక్లేశ ముఖంబున*
*న్యాయంబునఁ బడయవలయు నర్థము సమయం*
*జేయునది భక్తులకున*
*న్యాయ వివర్జిత చరిత్ర నారయ పుత్రా!"*
*"ఎన్ని ముఖంబుల నర్థముఁ*
*బన్నుగఁ బడసియును దారు పడిసితి మనర*
*త్యున్నతిఁ గడువరు మడువరు*
*చెన్నటి పనులకు వ్యయంబు సేయరు భక్తుల్"*

*"చేయునెడ భక్తి పరులకు*
*న్యాయార్జితమైన యట్టి యరకానికిన*
*న్యాయార్జిత మగు మాడలు*
*వేయును సరిగావు భక్తివిధిఁద్రి పురారీ"*

(అనుభవసారము 144, 145, 146)

శ్రమచేయవలసిన ఆవశ్యకతను పై పద్యాలు వివరిస్తున్నాయి.

కూలి చేస్తూ శ్రమలో భాగమైన ఉపశ్రేణివర్గం కూలి దొరకక పడే బాధలను కూడా పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో అరివాళ నయనారి కథలో ఇలా చెప్పాడు.

*"కొడవలి గడియుంచు కొనుచుఁగై కూలి*
*వడి రాజనములకు నాడఁబాటు చేసి*
*పట్టిన నియమంబు ప్రతివాల్చుచుండ*
*నట్టి చోఁ గూలియుఁ బుట్టకయున్న*
*నిట్టుపవాస మేన్దినము లుండంగ*
*నెట్టకేలకు బియ్య మిరుసగల్గినను*
సరసరఁ గొనివచ్చు సంభ్రమంబునను
ధరఁదాఁకి పడిన నెత్తఁగ రాక ప్రాలు
నెరియల పాలైనఁ బురహర! నీకుఁ
గరమర్థి నర్పింపఁగా నేఁగుదెంచు
నత్తఱి విఛ్ఛిన్నమయ్యె నేనింకఁ
జత్తునకా కంచుసంశయం బుడిగి
వెడకచ్చ గొడవలి యెడఁచెట్టి మూఁపు
తడుపంట సంధించి తన్నంగఁ దడవఁ"

(బసవపురాణము. చతుర్థాశ్వాసము)

పేదలు దైనందిన జీవితం గడవడమే కష్టంగా ఉన్నా మత విధులు కూడా చేయాల్సి రావడం వల్ల మరింత కష్టాలకు లోనయ్యేవారని తెలుస్తుంది. శివకవులు అక్రమార్జన చేయకూడదని శివార్చనకు, జంగముల సేవకు ధనాన్ని వ్యయం చేయాలని చెప్పారు. దీనివలన వారికి శైవమత వ్యాప్తి పట్ల ఉన్న మక్కువ తెలుస్తుంది. అయినా క్రీ.శ. 12, 13 వ శతాబ్దాల నాటికే ఆర్థిక విధానం గురించి, ఉపశ్రేణి వర్గాల శ్రమ గురించి, ఆశ్రమ గొప్పతనం గురించి, దోపిడీ గురించి రచనల్లో చెప్పిన ఘనత శివకవులదే అని చెప్పాలి. పై అంశాలను కూలంకషంగా చర్చించడం కింది వాక్యాలలో కనిపిస్తుంది.

"*నిమ్న జాతులు ఆర్థికంగా వెనుకబడినవారు, కూలిచేసికొని బతికే వర్గం. అందుచేత కాయకష్టంలో ఉన్న విలువను వెలికితీసి ప్రబోధించడం ద్వారా అతడు వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచాడు. శ్రమించకుండా డబ్బు సంపాదించడం జరగదు. శ్రమలేకుండా సంపన్నుడవుతాడంటే అది అన్యాయార్జనే అని ఆనాటి భూస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించాడు. ఇంకా సోమనాథుడు, ఎన్ని విధాలుగా డబ్బు సంపాదించినా భక్తులైనవారు గర్వపడరు, విలాసాలనుభవించరు, డబ్బును దాచిపెట్టడం కూడా తప్పనిచెప్పడం ఇక్కడ గుర్తించదగింది. శ్రామికవర్గ ప్రయోజనాన్ని ఆకాంక్షించడంతో పాటు ఆర్థిక వ్యవస్థలోని లోటుపాట్లను కూడా పాల్కురికి సోమనాథుడు గుర్తించాడు. భక్తులు న్యాయంగా ఆర్జించిన అరకానికి, అన్యాయంగా ఆర్జించిన వేయిమాడలు సరికావు అని భక్తులు శ్రమించి ఆర్జించడంలోని విలువను ప్రకటించే వారికి మనోస్థైర్యాన్ని చేకూర్చాడు. ఇది ఆనాటికే స్థిరపడిన సంపన్నులు, శ్రామికులు అనే భేదానికి నిదర్శనం.*" (రాజు, ఎన్. ఎస్ 1991: 41, 42)

శివకవులు సమాజంలో ఆనాటికే నెలకొని ఉన్న ఆర్థిక వ్యవస్థ మూల స్వభావాన్ని గుర్తించడమే కాకుండా ఉపశ్రేణి వర్గాలు, ఉన్నతవర్గాల మధ్య సమానత్వం కోసం ఆర్థిక సూత్రాన్ని కూడా సూక్ష్మంగా తెలియజేసినట్లు వారి రచనల ద్వారా తెలుస్తుంది.

## 5.6.3. వ్యవసాయం

ఆనాటికి సమాజ ఆర్థికస్థితి వ్యవసాయంపై ఎక్కువ ఆధారపడి ఉంది. సమాజం అభివృద్ధి సాధించింది అని చెప్పడానికి వ్యవసాయాభివృద్ధి జరిగినట్లుగా ఆధారాలు ఉండడమే కారణం. కాకతీయులు వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. కాలువలు, చెరువులు తవ్వించారు. వీటిని గురించిన సమాచారం ఆనాటి శాసనాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

"*శా.శ.1130 (క్రీ.శ. 1208) లో గణపతి దేవుని పాలనా కాలంలో వేయించిన పిల్లల మర్రి శాసనం వలన రేచెర్ల బేదిరెడ్డి భార్య ఎరక సానమ్మ చేసిన ధర్మ కార్యాలు తెలుస్తున్నాయి. దాంట్లో ఎరక సముద్రం చెరువు కట్టించిన వివరం ఉంది (తెలంగాణా శాసనాలు - 1.11). శా.శ. 1175 (క్రీ.శ. 1253)లో వేయించిన*

*జలాలుపురం శాసనంలో ఒక దండనాథుడు చేసిన ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా తటాక కూపాలు తవ్వించినట్లుగా ఉంది. (తెలంగాణా శాసనాలు - 11.7) శా.శ. 1180 (క్రీ.శ. 1258)కి చెందిన రుద్రదేవమహారాజు పాలనా కాలంనాటి బూర్గుగడ్డ శాసనం చెన్నగోపీనాథుని ప్రతిష్ఠచేసిన దానాల వివరణలు ఉన్నాయి. ఇందులో పాలసముద్రం, అనుగసముద్రం, మంద్రాజు చెరువుల ప్రస్తావన; కుంచినేని కాలువ, లోంతుం కాలువ, అనుగుకాలువల వైనం ఉంది (తెలంగాణా శాసనాలు - 1.32) ఇలా కాకతీయుల కాలంలో వేయించిన చాలా శాసనాల్లో చెరువులు, కాలువలు నిర్మించినట్లుగా కనిపిస్తుంది.*" (రాజు, ఎన్. ఎస్ 1991 : 35)

ఈ విధంగా రాజుల దగ్గర నుండి అధికారంలో ఉన్న చిన్న అధికారి వరకు వ్యవసాయంపై దృష్టి ఉంచి చెరువులు, తటాకాలు నిర్మించారు.

వ్యవసాయం అభివృద్ధి పరిచేందుకు అడవులను నరికి పంటపొలాలుగా మార్చారు. గ్రామాలను, దేవాలయాలను, తటాకాలను అధికారులు, అంతఃపుర స్త్రీలు కూడా తమ పేర్ల మీద నిర్మించేవారు.

"*రాయలసీమ, తెలంగాణాలలో కాకతీయుల కాలంలో దుప్పిపాదు (దూపాడు), పాలమర్రి, ముత్యాలపాడు, దామగట్టిమల్యాల, మంచివరం, తాటిపల్లి, బయ్యారం, ధర్మకీర్తి పురం, కుందవరం, కొండిపర్తి, నరసింహ పురం మొదలైన నూతన గ్రామాలు అడవులస్థానే ఏర్పడ్డాయి. అంతేకాకుండా కాకతీయ ప్రభువులు, సామంతులు, ఉన్నతోద్యోగులు, అంతఃపుర స్త్రీలు అనేక తటాకాలు, కాలువలు నిర్మించారు. వాటిలో పాలంపేట, బయ్యారం, భద్రకాళి, ఘనపూర్, లక్నవరం, పాకాల చెరువులు, కేసముద్రం, బౌండ సముద్రం, విశ్వనాథ సముద్రం, కుంద సముద్రం, నామ సముద్రం, గంగ సముద్రం మొదలైన నీటి వనరులు చెప్పదగ్గవి.*" (కనకదుర్గ, పి 1992: 13)

స్త్రీలు వ్యవసాయం కోసం చెరువులు తవ్వించడం ఆనాడు గుర్తించదగ్గ గొప్ప పరిణామం. చారిత్రక పరిస్థితుల దృష్ట్యా స్త్రీలు కూడా ఉపశ్రేణి వర్గానికి చెందిన వారనే చెప్పాలి. పురుషాధిపత్యాన్ని బట్టి, ఆర్థిక వ్యవస్థలో స్త్రీల శ్రమ గుర్తింపు లేకపోవటాన్ని బట్టి స్త్రీలు ఉపశ్రేణి వర్గానికి చెందినవారని చెప్పవచ్చు.

అయితే కాకతీయుల కాలంలో అధికార వర్గంలా ఉన్న స్త్రీలు మాత్రమే వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలకు పూనుకొన్నారు. వీటి విశేషాలు కూడా ఆనాటి శాసనాల వలన తెలుస్తుంది.

"*శా.శ.1135 (క్రీ.శ. 1213) నాటి కుందవర శాసనంలో గణపతి దేవుని సోదరి కుందమాంబ శివాలయ ప్రతిష్ఠ, తటాక నిర్మాణం చేసి కుందవరం అనే అగ్రహారాన్ని ఏర్పాటు చేసినట్లు ఉంది. శా.శ. 1175 (క్రీ.శ. 1253) నాటి గణపతి దేవుని గణపవర శాసనంలో గణపతిదేవుని పేర ఆ గ్రామ నిర్మాణం జరిగిన వైనం ఉంది. దూపతి దేవుని పాలనాకాలానికి చెందిన బయ్యారం శాసనంలో గణపతి దేవుని సోదరి మైలాంబ, తండ్రి పేరున మహాదేవపురం, తల్లి పేరున బయ్యావరం, తనపేరున (ధర్మకీర్తి అనే బిరుదు నామంతో) ధర్మవరం అనే గ్రామాలను ప్రతిష్ఠించినట్లు ఉంది.*"

(వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి, పుచ్ఛా 1981: 8)

ఈ విధంగా ఆనాటి సమాజంలో వ్యవసాయాభివృద్ధి, గ్రామాలు నిర్మించడం, చెరువులు, తటాకాలు నిర్మించడం విరివిగా జరిగాయని శాసనాల ఆధారాలను బట్టి తెలుస్తుంది. అయితే ఈ కాలంలో గుర్తించదగిన గొప్ప అంశం వ్యవసాయ సంబంధమైన గ్రంథాలు రావడం" ఎలమంచిలి రాజైన మూడో ఉపేంద్రుని ఆస్థానకవి వ్యవసాయ శాస్త్రాన్ని పద్యాల్లో రాశాడు. ఇంకా రెండో ప్రతాపరుద్రుని కాలం వాడైన ఆరో నరసింహుడు వ్యవసాయం విస్తరించి అనేక రకాల పంటలు పుష్కలంగా పండటాన్ని వస్తువుగా తీసుకొని సంస్కృతంలో నిరోష్ఠ కావ్యం రాశాడు. క్రీ.శ. 1323 - 1330 లో ఫ్రయర్ జోర్డానెస్ "వండర్స్ ఆఫ్ ది ఈస్ట్" అనే పుస్తకంలో తెలుగుదేశంలోని వ్యవసాయ పంటల గురించి వర్ణించాడు." (ప్రమీలారెడ్డి, ఎం 2000: 101)

కాకతీయుల కాలంలో నేడు పండుతున్న పంటలలో ప్రధానమైన పంటలన్ని ఆనాడు పండేవి. ఆహారపు పంటలు, వాణిజ్యపంటలు, అడవిలో దొరికే వివిధ రకాల చెట్ల ఉత్పత్తులు ముఖ్యంగా ఆనాడు చెప్పుకోదగినవి.

*“వరి, గోధుమ, జొన్న, సజ్జ, కొర్ర, నవ ధాన్యాలు ప్రధాన ఆహార ధాన్యాలు, పప్పు ధాన్యాలు నేడున్నవన్నీ నాడుండేవి. నువ్వులు, ఆవాలు, మెంతులు, ఉల్లి, వెల్లి, పసుపు, అల్లం నాడుండేవి. మిరప లేదు. ధనియాలు శాసనాల్లో లేకున్నా నాడుండే దేశీయ పంటనే లవంగాలు, ఏలకులు మిరియాలు కేరళ, సింహళాల నుంచి దిగుమతి అయ్యేవి. ప్రత్తి పండేది.*

*ఫల వనాల్లో మామిడి, పనస, అరటి, కొబ్బరి, జామ, ఉసరిక, వెలగ, అల్ల నేరేడు, ఖర్జూర, పోకచెట్లు, తమ్మాలపాకు తీగెలూ పెంచేవారు. జనుము సాగుచేసేవారు. తాటి, ఈత, మంగ, మారేడు, నేరేడు, రేగు, కరక, తునికి పండ్ల కాయలు అడవుల్లో లభించేవి. విప్పపూవు నాటి ఆటవికులకు గ్రామీణులకు రుచ్యాహారం సారా తయారీకి ఉపయుక్తం.”* (మలయశ్రీ 1990: 57)

గ్రామాలలో ఉండే సాధారణ ప్రజలు వ్యవసాయం చేసుకొంటూ, అడవి ఉత్పత్తులను నమ్ముకొని బతికేవారని చెప్పవచ్చు. వారు వ్యవసాయంలోని వివిధ పనులలో నిమగ్నమై కూలీలుగా జీవితాన్ని గడిపేవారు. గ్రామీణ ఆర్థిక స్వయం వ్యవస్థలో భాగాలైన ఉపశ్రేణి వర్గాల జీవితం వ్యవసాయంలో భాగమై ఉండేది. అంటే వ్యవసాయ విధానమే కొంతమంది ప్రజల జీవన విధానం.

*“నాడు చెరువుల కాలువల ద్వారానే కాక, మోట బావుల ద్వారాను వ్యవసాయం సాగింది. ఎడ్లనాగళ్లు భూమిని దున్నుటకు ఉపయోగించారు. కొర్రు, జడ్డిగం (ధాన్యం విత్తడానికి) ఉపయోగించేవారు.*

*వరినాటు, కలుపు మార్పిడి సర్వసాధారణ విషయాలు. ధాన్యం గాదెలు పురులు, పాతరలలో నిలువ చేసుకొనేవారు.*

*ఇప్పుడు ముక్కారు పంటలు తీసినా అప్పుడు వానకాలం వేసవి అనే రెండు కాలాల్లో పంటలు పండేవని శాసనాల్లో ఉంది.*

*చేలను పక్షుల బారినుండి కాపాడడానికి వడిసెల రాళ్ళు రువ్వేవారు. జంతువుల నుంచి రక్షణకు ముళ్ళ కంప దడులు, బెదురు బొమ్మలు నిలిపేవారు. మంచెలు వేసి, వాటిపై కాపలాగా ఉండి, తప్పెటల చప్పుళ్ళతో వాటిని పారద్రోలేవారు."*

(మలయశ్రీ 1990: 56)

ఈ విధంగా వ్యవసాయం చేసే సాధారణ ప్రజల జీవన విధానం వ్యవసాయ సంబంధ పనులతో ముడిపడి ఉండేది. చెరువులు, తటాకాలు తవ్వడానికి, అడవులు నరికి పంట పొలాలుగా, గ్రామాలుగా మార్చడానికి శ్రామికులుగా ప్రజలు వేతనాలకు పనులు చేసేవారని అర్థమవుతుంది. వీరి రోజువారి వేతనాలు, దైనందిన జీవితాలు కావ్యాలలో గాని, శాసనాలలో గాని కనపడవు. అయినా ఆనాటి సమాజంలో జరిగిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలలో ఉపశ్రేణికి చెందిన ఇటువంటి శ్రామికుల పాత్ర ఎక్కువగా ఉందని చెప్పవచ్చు.

కాకతీయుల కాలంనాటి గ్రామీణ వ్యావసాయక ఆర్థిక వ్యవస్థలో రాజుకు, రైతుకు ప్రత్యక్ష సంబంధం లేదు. దీనివల్ల రైతులు ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఎక్కువ భూములు కలిగిన సామంతులు, కిందిస్థాయిలలో భూమిని కలిగిన దండనాయకులు వారివారి పరిధిలో శిస్తు వసూలు చేసుకొనే అధికారం కలిగి ఉండేవారు. రాజుకు ఇటువంటి దళారుల ద్వారా పన్నుల రూపంలో ధనం అందేది. మధ్య దళారులు పన్నుల వసూళ్లలో దుర్మార్గంగా వ్యవహరించడం, కఠినంగా పన్నులు వసూలు చేయడం వలన రైతులు అన్యాయాలకు గురయ్యేవారు.

శా.శ. 1125 (క్రీ.శ. 1203) నాటి కొండపర్తి శాసనంలోని 47వ శ్లోకంలో ఈ పన్నుల గురించి ఇలా రాయబడి ఉంది.

*"పన్నులు లేని దాన భూములకు పన్నులుగైకొనుట వేయి ఆవులను చంపిన పాపమును గట్టుకొనుట యగును. పన్నులుగల దాన భూములకు పన్నులుగైకొనకుండుట కోటియావుల నిచ్చిన ఫలమందుట యగును."*

(తిరుమలరావు, పి 1973: 17)

పై అంశాలన్నింటిని పరిశీలించిన తర్వాత ఆనాటి సమాజంలో వ్యవసాయాభివృద్ధి జరగడంలో భాగంగా ఫ్యూడల్ వ్యవస్థలోని దోపిడి స్వభావం కూడా ఉందనిపిస్తుంది. రైతులు, రైతు కూలీలు, ఇతర శ్రామికులు శ్రమిస్తూ శ్రమ ఫలితాన్ని పూర్తిగా అనుభవించలేక పోయేవారని తెలుస్తుంది.

## 5.6.4. ఉత్పత్తులు

సమాజాభివృద్ధిలో వాణిజ్యం కూడా ఒక ప్రధాన భాగం. కాకతీయుల కాలంలో ఆయా వృత్తి పనివారు మాత్రమే కాకుండా లోహాల ఉత్పత్తి, వస్తువులు తయారు చేసేవారు కూడా ఉన్నారు. బంగారం, వెండి, ఇనుము, రాగి, కంచు, తగరం వంటి లోహాలు ఆనాడు లభించేవి. వీటితో రాజాస్థానాలలో, దేవాలయాలలో, గృహాలలో ఉపయోగించు వివిధ అవసరమైన అలంకరణ వస్తువులను తయారు చేసేవారు. చేనేత పరిశ్రమ కూడా ఆనాడు చెప్పుకోదగినది. పట్టు వస్త్రాల తయారీ కూడా జరిగేది..

ఆనాడు లోహాలతో తయారు చేయబడిన ఆభరణాల గురించి పండితారాధ్య చరిత్రలో పాల్కురికి సోమనాథుడు వర్ణించాడు.

*"క్రంగు క్రంగను కాళ్ళ(గంచు మట్టియలు*
*నుంగరంబులు వద్ద యారులు వల్ల*
*గాజులు దగరంపు గడియముల్ పచ్చ*
*గాజు పూసలును --------------"*

(పండితారాధ్య చరిత్ర, దీక్షాప్రకరణము)

ఆ రోజులలో బంగారం వాడకం తక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. రసవాదం లాంటివి అందుకే ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని భావించవచ్చు. శివలింగాల తయారీకి పంచలోహాలు వాడినట్లు పండితారాధ్య చరిత్ర వలన తెలుస్తుంది.

*"మణిలింగములు రత్నమయ లింగములును*
*గణపతింప స్వర్ణ లింగంబులు రజిత*
*లింగంబులును దామ్రలంగముల్ గాంస్య*
*లింగంబులును లోహలింగముల్ సంద్ర*
*కాంత లింగంబులు౹గర మొప్పు సూర్య*
*కాంతలింగము, లయస్కాంత లింగములు*
*నమృత లింగములు స్వయంభు లింగములు"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణము)

పై వాక్యాలు శివలింగాల తయారీనే కాకుండా వాడుకలోని వివిధ లోహాలను, వాటితో ఆనాటి కళాకారులు తయారి చేసే కళాకృతులను తెలియజేస్తున్నాయి. అంతే కాకుండా ఆనాడు విగ్రహాల తయారులో దేవాలయాల నిర్మాణంతో కొంతమంది శ్రామికులు జీవనం సాగించేవారని కూడా తెలియజేస్తున్నాయి. దీనిని వృత్తి జీవనంగా చెప్పవచ్చు.

ఆనాడు సాధారణ స్త్రీల వేషధారణ గురించి తెలుసుకొంటే ఆమె వాడే అలంకరణ సామాగ్రితోపాటు అవి తయారుచేసే వారి జీవనాన్ని కొంత తెలుసుకోవచ్చు.

*"సామాన్య ప్రజల ఆభరణాలను గురించి పండితారాధ్య చరిత్రలో పాల్కురికి సోమనాథుడు వర్ణించాడు. వారు రాగి కుండలాలు, రాగి కుందులు, దొడ్డ రాగి కంటెలు, రాగి ఉంగరాలు, రాగి దండలు, రాగి జన్నిదాలు, రాగి ఉత్తెరలు, వలుద కొక్కెరలు, పాలెలు, సరిపెణ, నేవళంబులు, కీలు గొలుసులు, రాగి బడ్డాగాలు, కటి సూత్రాలు, తగరపు కడియాలు, కంచు మట్టెలు, వల్దయారులు, నల్లగాజులు, పచ్చగాజులు దేపూసలు, సంకు పూసలు, నల్లపూసలు, బన్నసరం, కప్పె, గుండ్లపేర, గజ్జెలందియలు, ముక్కెర, మట్టిగాజులు మొదలయినవి ధరించినట్లు పండితారాధ్య చరిత్రలో వర్ణించడం జరిగింది. బసవపురాణంలో కూడా వీటి ప్రస్తావన ఉంది."*

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 177)

పై ఆభరణ సామాగ్రిని బట్టి చూస్తే వీటిని తయారు చేయడం వెనుక కళాకారుల కృషి ఎంతో ఉన్నదని తెలుస్తుంది. వీటిని తయారు చేయడం ఒక వృత్తిగా స్వీకరించి జీవించేవారు ఉన్నారని అర్థమవుతుంది.

బసవపురాణంలో కూడా అలంకరణ సామాగ్రి ప్రస్తావన ఇలా కనిపిస్తుంది.

"*గుండకంబులుగ్రాల గూకటివ్రేల*
*మండనంబొలయ సొమ్మపు ఘంటలులీయ*
*రావిరేకయు దూల భావంబువోల*
*నావిధియు నదల హర్షంబు వొదల*
*నందెలు మ్రోయ మోక్షాంగన డాయ*
*సందేహ యుడుగ నాశ్చర్యంబు దాడుగఁ*
జూపఱు గీర్తింప సురలు శంకింపఁ
దాపసి వీక్షింపఁ దండ్రి మై వెంపఁ"

(బసవపురాణం, చతుర్థాశ్వాసం, సిరియాలుని కథ)

బసవపురాణంలో అద్దాన్ని వర్ణించడం ఉంది.

"*అద్దంబలోన ఫాలాక్షంబుఁగాంచి*"
"*శీలంబు భక్తు చేతియద్దంబు*" (బసవపురాణం ప్రథమాశ్వాసం)

దీనిని బట్టి ఆనాటికే గాజు పరిశ్రమ అభివృద్ధి చెంది ఉండవచ్చునని తెలుస్తుంది. పైగా ముఖాన్ని అద్దంలో చూసుకొనడాన్ని నాగరికతాభివృద్ధిలో భాగంగా ఆనాటి సమాజం సాధించిన ప్రగతిగా చెప్పుకోవచ్చు.

ఆనాటి ఉత్పత్తులలో కనిపించే వాటిలో మరొకటి బెల్లం, పంచదారల తయారి. పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో వీటిని ఇలా ప్రస్తావించాడు.

*"ఆకాంక తోడ జన్నావుల పాలు*
*సేకొనియష్టావ శేషంబుసేసి*
*చెఱకు కట్టెలపొడి సేరెఁడుసల్లి*
*మఱి యిష్టలింగ సమర్పణసేసి"* (బసవపురాణం, తృతీయాశ్వాసం)

పైన వాక్యాలు శివునికి నైవేద్యం సమర్పించు సందర్భంలోనివి. శివునికి పాలలో చెఱకు, కట్టెలపొడి చల్లాలని చెప్పబడింది. అనగా బెల్లంకాని పంచదార కాని అని అర్థమవుతుంది. అంటే ఆనాటి సమాజంలో చెరుకు నుండి బెల్లం లేదా చక్కెర తయారుచేయు విధానం ఉండేదని చెప్పవలసిన అవసరం ఉంది. ఆనాడు చెరకు లాంటి వాణిజ్య పంటను పండించేవారని, చక్కెర లేదా బెల్లం పరిశ్రమ కూడా ఉందని తెలుస్తుంది. వీటిలో పనిచేసే కూలీలు కూడా ఉంటారు. వీరిని శ్రామికవర్గంగా చెప్పకోవచ్చు.

ఇవన్నీ ఆనాటి ఆర్థిక పరిణామాన్ని తెలుపుతాయి. ఆర్థిక పరిణామంలో భాగంగా వృత్తికారులు, శ్రామికులు అనే ఉపశ్రేణి వర్గం ఎలా ఏర్పడిందో తెలియజేస్తాయి.

## 5.7. ఉపశ్రేణి వర్గాలు - సంస్కృతి

క్రీ.శ. 12, 13 శతాబ్దాల కాలంనాటి ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, ఆహార పదార్థాలు, వివాహాది కార్యక్రమాలు, ఆటలు, కళలు మొదలైనవన్నిటిని సంస్కృతిగా చెప్పుకోవచ్చు.

అయితే ఈ కాలం నాటికే భూస్వామ్య వ్యవస్థా లక్షణాలు సమాజంలో ఉన్నాయి. సమాజంలో ఉన్నతశ్రేణి, ఉపశ్రేణి అనే రెండు వర్గాలు ఉన్నట్లు కూడా వివరించడం జరిగింది. సాధారణంగా సమాజంలో ఉన్నతశ్రేణి ఆర్థికంగా, సాంఘికంగా ఎక్కువస్థాయిలో ఉండడం వల్ల వారి ఆచార సంప్రదాయాలు ఉపశ్రేణి వారి కంటే కొంత భిన్నంగా ఉంటాయి. లిఖిత సాహిత్యం ఆ శ్రేణి నుండే రావడం వలన వారి సంస్కృతే ఎక్కువగా సాహిత్యంలో కనిపిస్తుంది.

దీనికి భిన్నంగా శైవ వాఙ్మయాన్ని ఉన్నతశ్రేణికి సంబంధించినవారు రాసినప్పటికీ ఉపశ్రేణికి సంబంధించిన సాంస్కృతికాంశాలు వీరి రచనలలో కనిపిస్తున్నాయి. ఇది ప్రధానంగా గుర్తించాల్సిన అంశం. ఇక్కడ సంస్కృతి అంటే ఉపశ్రేణి వర్గాల సంస్కృతి విశేషాలకు ముఖ్య ప్రాధాన్యత ఇస్తూ పరిశీలించడం జరుగుతుంది.

## 5.7.1. క్రీడలు

క్రీడలు అనేవి ప్రజల వినోదానికి, శారీరక శ్రమకు ఉపకరిస్తాయి. ప్రతి సమాజంలోను క్రీడలు ఉంటాయి. ఇవి ప్రజల జీవన విధానంలో ప్రముఖపాత్ర వహించేవిగా ఉంటాయి.

శైవవాఙ్మయంలో క్రీడల గురించిన ప్రస్తావన ఎక్కువగానే కనిపిస్తుంది. ఈ క్రీడలు గ్రామీణ ప్రాంతంలోనివిగా ఉన్నాయి. పండితారాధ్య చరిత్రలో ఆటల గురించిన ప్రస్తావన ఇలా ఉంది.

*"పొందంగ రాగుంజు పోగుంజులాట*
*గుందెన గుడి గుడి గుంజంబులాట*
*యప్పల విందులయాట, వర్మాటుఁ*
*జప్పట్లు వెట్టుట, సరిగుంజులాట,*
*సేర బొంతలయాట, సిట్లపాట్లాట,*
*గోరంటలాట, దాగుడుమూతలాట*
*దీకొని దిగుదిగు దిక్కొనునాట*
*లాకాంక్ష నాతోడ నాడెడువాఁడు"*

(పండితారాధ్య చరిత్ర, పురాతనప్రకరణం నకరేశ్వర ముదిరాజయ్య కథ)

పై ఆటలన్నీ గ్రామాలలో నివసించే సాధారణ ప్రజలు ఆడుకొనేవి. ఇదే విధంగా బసవపురాణంలో బొమ్మలతో ఆడుకొనే విధానాన్ని గురించి ఇలా చెప్పబడింది.

*"మాతల్లి కొమ్మ! నీకొక మంచి బొమ్మయునిన్ని*
*బొమ్మ పొత్తికలనుబోయి తెచ్చెదము"*

(బసవపురాణం. తృతీయాశ్వాసం, గొడగూచికథ)

పై వాక్యాలను బట్టి ఆకాలంలో బొమ్మలను తయారుచేయడం, వాటికి పెళ్లిల్లు చేయడం వంటి బొమ్మల పెళ్లి ఆట కూడా ఉందని చెప్పవచ్చు.

పండితారాధ్య చరిత్ర, పురాతన ప్రకరణంలో జూదం గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. జూదం ఆడేవాళ్లు దేవుడిని ప్రార్థిస్తూ తమను గెలిపించమని వేడుకొంటారు. ఈ విషయం ఇలా వర్ణించబడింది.

*"దడయకయాదు సత్తాయనిపడని*
*నాకు నాతీ వంచన యెగెలుపనుచు"*
*"హరుభక్తి ప్రబలు నానాడు నిద్దుగను*
*త్రివిధ లింగములకు త్రివిధార్పణంబు"*
*"నాదిభక్తి విరుద్ధమైన జూదపువి*
*నోదంబు భక్తి వినోదమై పరగ"*

(పండితారాధ్య చరిత్ర, పండితప్రకరణము)

ఆనాడు కనిపించే మరొక ఆట 'వృషభక్రీడ'. ఇది ఒక విధమైన గుర్రపు పందేల వంటిది. ఎద్దులను అలంకరించి మైదానంలో వదులుతారు. అవి పరిగెడుతుంటే ప్రజలు ఆనందంతో ఏ ఎద్దు గెలుస్తుందోనని ఎదురు చూస్తారు. వీటిని గురించిన ప్రస్తావన బసవపురాణంలో ఉంది.

*"బెడబొబ్బలిడచు సంప్రీతి నార్చుచును*
*వెడలుమువెడలుము వృషభేంద్ర!యనుచు*
-------------------------------------
*అందుండి యూకించి యవనికి నుఱికి*
*నిలిచి నిట్రించి ఘణిల్లణిల్లనగ*

*నలరుచు అంకెలందందవైచుచును*
*వారి మల్లార్చుచు గాల ద్రవ్వుచును*
*నేల గోరాడుచు నీడ కుర్కుచును*
*నుడువీథి కెగయుచు నొడలు వెంపుచును*
*వడిగొని పఱచుచు నిడుజంగలిడుచు*
----------------------------------
----------------------------------"

(బసవపురాణం. ఐదవాశ్వాసం, ముసిడి చౌడయ్య కథ)

ఈ విధంగా ఎద్దులు పరిగెడుతుంటే ప్రజలు ఆనందిస్తారు. ఎద్దు వ్యవసాయంలో ప్రధాన జంతువు. ఇది ప్రజల వినోదంలో కూడా భాగం అవడాన్ని బట్టి ఆనాడు ప్రజలు శారీరక శ్రమకు, వినోదానికి ప్రాధాన్యం ఇచ్చేవారని తెలుస్తుంది. మరియు ఇది సామాన్య ప్రజల వినోద క్రీడ.

శైవ వాఙ్మయంలో కనపడే మరొక ఆట గంగిరెద్దుల ఆట. పశువులను అలంకరించడం దీనిలో కనిపిస్తుంది. ఈ పశువుల అలంకరణ 'బసవపురాణం'లో ఇలా ఉంది.

"*మెత్తని వస్త్రముకు మెయినిండఁగప్పి*
*యుత్త మాభరణంబు ఎరగజ్జియులును*
*నందెలు గంటలు నలవడఁ గూర్చి*
*పొందుగాఁబసిఁడి కొమ్ములు గొరి జియలు*
*వెట్టి ఫాలంబున బట్టంబు వెలయ*
*గట్టినందికి నలం కారంబుసేసి*"

(బసవపురాణం. ప్రథమాశ్వాసం)

వీరి ఆటలలో ఎక్కువ భాగం పశువులతో ముడిపడి ఉండడాన్ని బట్టి ఆనాటి ప్రజలు వ్యవసాయంతోను, పశుపోషణతోను జీవనం సాగించేవారని అర్థమవుతుంది. అదే విధంగా దైనందిన జీవితం పశువులతో ఎక్కువ మమేకమై ఉండేదని చెప్పవచ్చు.

వీరి కాలంలో కనిపించే మరో క్రీడ గెడాట. దేశదిమ్మరులైన ఒకతెగ ఈ ఆటను ఆడుతూ ఊరూరా తిరుగుతూ ఉంటుంది. గడపట్టుకొని, తాడుపై నడవడం ఈ క్రీడలో ప్రధానంగా కనిపిస్తుంది. ఇది సాహసంతో కూడుకొన్న క్రీడ. పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో ఈ క్రీడ గురించి ఇలా వర్ణించాడు.

*"అమరాంగనలు దివి నాడెడు మాడ్కె*
*అమరంగ గదలపై నాడేడువారు*
*ఆ వియద్గతి యక్షులాడెడు ------*
*------------------------ నట్టి*
*భావన మ్రోకులపై నాడువారు"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణము)

దీనిని బట్టి ఆ కాలంనాటికి ఇటువంటి ఆటను ఆడుతూ దేశదిమ్మరులుగా తిరిగే జాతి ఒకటి సమాజంలో ఉందని తెలుస్తుంది. వీరి జీవనవిధానం గురించిన ప్రస్తావన లేకపోయినా సమాజంలో అట్టడుగున గల వారిలో వీరూ ఒకరని తెలుస్తుంది.

ఇటువంటి ఆటలలో మరొకటి తోలు బొమ్మలాట తెరకట్టి తెరవెనుక దివిటీలు వెలిగించి, బొమ్మలను ఆడిస్తే వాటి నీడలు తెరపై కనిపిస్తాయి. ఇది పూర్తి గ్రామీణ జీవనానికి సంబంధించిన క్రీడ. దీని గురించి ప్రస్తావన పండితారాధ్య చరిత్రలో ఇలా ఉంది.

*"భారతాది కథల చీర మరుగల*
*నారంగ బొమ్మల నాడించువారు*
*నాదట గంధర్వయక్ష విద్యాధ*
*రాదులై పాడెడు నాడెడువారు"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణం)

ఇంతే కాకుండా వీధి భాగవతాలు, పగటి వేషగాళ్లు కూడా ఉన్నట్లు తెలుస్తుంది.

ముఖ్యంగా పైన చెప్పిన క్రీడలు ఉపశ్రేణి వర్గానికి వినోదాన్ని ఇచ్చేవిగా ఉండి వారి జీవన విధానంలో భాగాలై పోయినవి. ఉదాహరణకు గెడాట, తోలుబొమ్మలాటలు ఆటలు కావని ఆయా జాతుల లేదా వృత్తుల బతుకుతెరువుకు సంబంధించినవని ఊహించవచ్చు. అదే విధంగా పశువులకు సంబంధించిన ఆటలూ ఇటువంటివే.

## 5.7.2. పండుగలు - వినోదాలు

సంస్కృతిలో ఒక ప్రధానమైన అంశం పండుగలు. సంఘ జీవితాన్ని తెలియజేసే అంశాలలో పండగలు ఒకటి. బంధువులను, స్నేహితులను కలిసి సమాజంలోని వ్యక్తి తన ఆనందోత్సాహాన్ని, కలిమి లేములను పంచుకోడం ఎక్కువగా పండుగ రోజుల్లో జరుగుతుంది. అదేవిధంగా ఎప్పుడూ వ్యవసాయం, కుల వృత్తులతో వస్తూత్పత్తిలో మునిగి ఉండే గ్రామీణ ప్రజలు పండుగ రోజు విశ్రాంతితో, మిగిలిన వారితో కలిసి ఆనందాన్ని పంచుకొంటూ తమకున్న ఆర్థికస్థితిని బట్టి విందు వినోదాలలో పాలు పంచుకొంటూ ఉంటారు.

పండుగలు కొన్ని మత సంప్రదాయాన్ని బట్టి మరికొన్ని జీవనవిధానంలోని వ్యవసాయం లాంటి వాటిని బట్టి ఏర్పడి ఉంటాయి. ఆశాజీవి అయిన మనిషి తన కోరికలను తీర్చమని దైవానికి నివేదించుకోడం, మొక్కులు తీర్చకోడం వంటి నమ్మకాలు కూడా పండగలకు సంబంధించినవిగా భావించవచ్చు.

ముఖ్యంగా హిందూ సంప్రదాయంలో ఇటువంటివి ఎక్కువ. కాకతీయుల కాలంనాటి సమాజ స్వరూపాన్ని అర్థం చేసుకోడంలో భాగంగా ఆనాటి ప్రజల జీవన విధానంలోని పండగల, వినోదాల లాంటివి కూడా తెలుసుకోవాలి.

"పండితారాధ్య చరిత్ర పురాతన ప్రకరణంలోని మలహణుని కథలో ఆకాలంనాటి ప్రజలు ఆనందోత్సాహోలతో జరుపుకొనే పండుగల ప్రస్తావన ఉంది. అవి వీరభద్రునియాత్ర, శివరాత్రి, వసంతోత్సవం, దవన పున్నమి, నూలి పున్నమి, బాలభక్తుల పండుగ మొదలైనవి. ఆనాటి పిండివంటల్లో బూరెలు ముఖ్యమైనవిగా కనిపిస్తున్నాయి."
(రాజు, ఎన్. ఎస్ 1991: 80)

## 5.7.3. నోములు - వ్రతాలు

పండుగలతో పాటు ఆనాడు కనిపించే వాటిలో ముఖ్యమైనవి నోములు. నోముల గురించిన ప్రస్తావన బసవపురాణంలోను, పండితారాధ్య చరిత్రలోను కనబడుతుంది. నోములు, వ్రతాలు అనేవి మత సంబంధమైనవి.

స్త్రీలకు మతసంబంధమైన క్రతువుల్లో భాగంలేదు. కాని ఆమె కోర్కెలు నెరవేర్చుకోడానికి నోములు, వ్రతాలు చేయడం కాకతీయులకు పూర్వం నుండి కనిపిస్తుంది. కోర్కెలు భౌతికమైనవైనా తాత్త్వికమైనవైనా నోములు, వ్రతాల వలన తీరుతాయని స్త్రీ నమ్ముతుంది. ఉదాహరణకు, పిల్లలు పుట్టాలనే కోరిక, తన పసుపు, కుంకుమలు చనిపోయే వరకు ఉండాలనే కోరిక మొదలైనవి. ఈ నోములు వ్రతాలు అనేవి ఉన్నతశ్రేణి స్త్రీల నుండి క్రమంగా ఉపశ్రేణి స్త్రీల వరకు ఉన్నట్లు తెలుస్తుంది.

ఆనాటి స్త్రీలు పిల్లలు పుట్టడానికి నందికేశ్వరుని నోము నోచేవారు. ఉమామహేశ్వర పూజ, లక్ష్మీనారాయణ పూజ, శివునకు, గంగకు సంబంధించిన పూజలు చేసేవారు. కాటమరాజు కథలలో వీటికి సంబంధించిన ఆధారాలు మనకు ఎక్కువగా కనపడతాయి.

బసవపురాణంలోని మాదిరాజు, మాదంబలకు సంతానం కలగరు. అందువలన సంతానంకోసం మాదంబ నందికేశ్వరుని నోమునోస్తుంది. ఈ విషయాన్ని పాల్కురికి సోమనాథుడు ఇలా చెప్పాడు.

*"కొడుకులు లేమికి గడు దుఃఖి యగుచు*
*వేదనోము లన్నియు వేసరనోమి*
*యాద్యులు వొత్తంబులందెల్ల వెదకి*
*హృద్యంబుగా నందికేశ్వరునోము*
*కామ్యార్థ సిద్ధికి గారణం బనుచు*
*సమ్యగ్వ్రతస్థితి సతికిఁజెప్పుటయు*
*నమ్మహాత్ములు సెప్పినట్లుగా గుడికి*
*నిమ్ములఁజని నెంది కేశ్వరుఁజూచి"*

(బసవపురాణం, ప్రథమాశ్వాసం)

కవి ఇంకా నోము చేసే విధానం గురించి కూడా ఇలా చెప్తాడు.

*"నిమ్ముల జని నందికేశ్వరుజూచి*
*సర్వాంగముల ధర సంధిల్ల మ్రొక్కి*
*'సర్వజ్ఞ నందికేశ్వర! దయాంభోధి!'*
*యంచుబ్రస్తుతి చేసి యతిభక్తి మ్రొక్కి*
*యంచితవ్రత చర్యలాచరింపుచును*
*నిమ్ముల సోమవారమ్మదిగాగ*
*దొమ్మిది దినములుత్సకవృత్తి నోచి"*

(బసవపురాణం, ప్రథమాశ్వాసం)

ఇవే కాకుండా ఆనాడు మరికొన్ని వ్రతాలు చేసేవారు. వాటిలో జలశయన వ్రతం, శూన్యశయన వ్రతం, శుక్ల ద్వాదశి, కృష్ణ ద్వాదశి, విష్ణుక్రాంత, చెన్నకేశవ నోము, సారుంధతీయం, పార్వతీనోము ముఖ్యమైనవి. ఇవేకాక కొంతమంది దేవతలకు నైవేద్యం పెట్టి మొక్కేవారు. ఆ దేవతలు కామాక్షి, మహాకాళి, చండి, కాళి, అంబిక, వాధ్యవాసిన, అకవీర, నక్క జియ్యు మొదలైనవారు.

## 5.7.4. తిరునాళ్లు - జాతరులు

తిరునాళ్లు అనేవి పుణ్యక్షేత్రాలలో కొన్ని రోజులపాటు జరిగే ఉత్సవాలు. ఆయా పుణ్యక్షేత్రాన్ని బట్టి, కాలాన్ని బట్టి, దేవుడి మహిమను బట్టి ఎన్ని రోజులు తిరునాళ్లు చేయాలో నిర్ణయించబడి ఉంటుంది. ముఖ్యంగా మూడు లేదా ఐదు లేదా తొమ్మిది రోజులు ఇవి జరుగుతుంటాయి.

తిరునాళ్లు అనేవి భక్తి ప్రధానమైనవిగా మత ప్రధానమైనవిగా చెప్పవచ్చు. ఉపశ్రేణికి చెందిన కింది తరగతి ప్రజల జీవితాల్లోకి ఆ కాలం నాటికే ఇవి చొచ్చుకొని పోయాయి. అందువల్ల వారిలో ఆర్థికస్థితిని బట్టి కొంతమంది తిరునాళ్లకు వెళ్లడం, అలా వెళ్లడాన్ని గౌరవప్రదంగా భావించడం ఆనాటి నుండి కనిపిస్తుంది. ఇది సంస్కృతిలోని రెండు తరగతుల మధ్యగల ప్రభావంగా చెప్పవచ్చు.

ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలు, విశ్వాసాలు ఇటువంటి అంశాలపై ప్రభావాన్ని చూపుతాయి. అందువల్ల ధనం లేకపోయినా, ఎన్ని కష్టాలైనా భరించి సాధారణ ప్రజలు కూడా తిరునాళ్లకు వెళ్తారు. ఇటువంటి విశ్వాసంతో శ్రీశైల యాత్రకు వెళ్లే ప్రజలను పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ఇలా వర్ణించాడు. వీరికి కుల, మత భేదం లేదని చెప్పడం గుర్తించాల్సిన అంశం.

"*దోనయ్య శ్రీశైల యాత్రకు వెళ్లెటప్పుడు దారిలో అతనికి కనపడిన వారి గురించి సోమనాథుడు ఎవరినీ వదలకుండా వర్ణించాడు. వెళ్లేవారంతా కులమత భేధం లేకుండా తండోపతండాలుగా ఆడుతూ పాడుతూ వెళ్తున్నారట.*

*సంతసంబున బరిషత్కోటియునుని*
*రంతరగతి దాటియట్ల యాడుచును*

*ముందుగా దోనమయ్య జంగమ కోట్లు, వృద్ధ తపోధనుల నడకలు, మిండజంగములు, శీలవంతులు, విరక్తులు, శివయోగులు, అభ్యాసయోగులు, పుణ్యాంగనలు, జోగులు, పిచ్చుకకుంట్లు, చెంచులు మొదలైన వారినెందరిలో భాషాభేదం లేకుండా వారివారి వేష భాషలను తనివితీరా వర్ణించి, వారిని మన కళ్లముందు నిలబెట్టాడు.*

*జంగమకోట్లు పొడవయిన సంబువులు, పసిడిగొడుగులు, పావలు, వాగెలు, పాదరక్షలు, కౌపీనాలు ధరించి, పంచని జోడు కుప్పనాలు, సాత పూనిపట్టు వస్త్రాలను వల్లెవాటుగా వేసుకొని, మప్పసాల మీద పటికముసరం ధరించి, కావి పచ్చడాలు, కావి దుప్పట్లు, తావు మంజిల్లు ఖండంబు దోపులను, పొత్తి పచ్చడములు, చల్లడాలు దట్టి పచ్చడములను, రత్న కంబళులు మొదలయిలన వాటిని దాల్చి మెల్లని నడకతో మృదు భాషణలతో వరసబంతులు కట్టి పాడుతూ నడిచారట. అంటే వీరంతా ప్రతి సంవత్సరం కష్టనిష్ఠురాలకు ఓర్చి కాలి నడకతో అడవి ప్రాంతమని కూడా లక్ష్యపెట్టక, దండ ప్రమాణాలు చేస్తూ వచ్చేవారు."* (ప్రమీలారెడ్డి, ఎం 2000: 233, 234)

తిరునాళ్లకు వెళ్లే భక్తులను వర్ణిస్తూ నక్షత్ర పర్వతారోహణ చేసే విధానాన్ని, భక్తులు శ్రీశైల మల్లికార్జునునిపై పాడే పాటలను కవి ఇలా చెప్పాడు.

*"ఎక్కుచు మోకాళ్ల జేతులూనిదుచును*
*మగుచు వ్రాలుచు దొంగుచు జనుచు*
*జెంగుచు నొండొరు జెయ్యూది కొనుచు*
*జేదుకో చేదుకో శ్రీగిరినాథ*
*చేదుకోమల్లయ్య చేదుకోమ్మనుచు*
*చేదుకో! చేదుకో! శ్రీశైలనిలయ*
-----------------------------
*పరమోత్సవామృత పరిపూర్ణ పుణ్య*
*తరపరిషద్బాండ తతులు సంధిల్ల*
----------------------------
----------------------------
*నల్లనో! నల్లవో! నాగరాజ రాజ!*
*మల్లయా! మల్లయా! మహనీయతేజ!*
*పరమ పాతక కోట్లు భస్మమైతూలు*
*సిరిగిరి మల్లన్న శరణన్నజాలు*
*రాచోవ నెంత దూరం బైన నడువ*
*నే బోదు వల్లయ్య నేఁటేఁట గొలువ;"*

(పండితారాధ్య, పర్వతప్రకరణం)

పైన చెప్పబడిన పాటలు భక్తులైన గ్రామీణ జనులు పాడుకొనేవి. దీనిని బట్టి ఆనాటి సామాన్య ప్రజలలో ఆశువుగా పాటలు పాడుకొనే పద్ధతి ఉందని తెలుస్తుంది. అంతే కాకుండా బహుశా జానపద పాటలలో భక్తితో కూడిన కొన్ని పాటలు ప్రజల నోళ్లల్లో ఉండి ఉండొచ్చునని కూడా తెలుస్తుంది. ఇలానే శ్రీశైల యాత్రకు వెళ్లే భక్తజనులు ఆ దేవునిపై పాటకట్టి పాడారని చెప్పవచ్చు.

శ్రీశైలం తిరునాళ్లకు ఆంధ్రదేశం నుండే కాక ఇంకా ఇతర దేశాల నుండి అంటే ఇతర భాషల వాళ్ళు, రాష్ట్రాల వాళ్లు, జాతుల వాళ్లు కూడా వచ్చినట్లు పండితారాధ్య చరిత్రలో చెప్పబడింది.

*"వ్రన్నని కర్ణాట భాష సాంగముగ*
*నజగమ దేవయ్య బిజుమాడిరయ్య;*
*నిజభావ దేవయ్య నీవిత్త బన్ని*
*యల్లమ దేవయ్య! యెత్తలో పెలాది ?*
*బల్లద దేవయ్య! బన్నిరి నీవు;*
-------------------------
*మాగరహోనకో మఝు బాపహ్మణత*
*భాగవతేవటే భక్త తేహ్మణత*
------------------------
*అరులుగిరితి యెన్నె యరనేపిరానే*
*చిరిగిరి నిలయనే చివనెయణ్ణవనె"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణం)

పై విధంగా సోమనాథుడు కాశ్మీర, సింధు, గౌళ, తురుష్క, కొంకణ, మళవ, మగధ, బంగాళ, కాంభోజ, బర్బర, పాండ్య, కళింగ, సింహళిక, కరహాట, సౌరాష్ట్ర మొదలగు దేశాల వాళ్లు మాట్లాడే భాషలను ఈ సందర్భంగా వర్ణించాడు. దీనిని బట్టి ఆ కాలం నాటికి పై భాషలన్ని ఉన్నాయని, ప్రజల వ్యవహారానికి ఇవి తోడ్పడేవని అర్థం చేసుకోవచ్చు. పైగా సోమనాథుడికి పై భాషలతో పరిచయం ఉన్నదని తెలుస్తుంది.

వీటివలన ప్రజల సాంస్కృతిక స్వభావాన్ని అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించినట్లైతే పై భాషావాసుల మధ్య రాకపోకలు ఉండేవని, తిరునాళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలకు అందరూ హాజరయ్యే వాళ్లని తెలుస్తుంది. ఆనాటి అన్ని భాషా సమాజాలలోను హిందూ మతానికి సంబంధించి భక్తి విధానంలో సారుప్యత ఉందని కూడా చెప్పవచ్చు.

## 5.7.5. వ్యాధులు - వైద్యం

కాకతీయుల నాటి సమాజం ఆర్థికంగా అభివృద్ధి సాధించినా సమాజంలో మూఢ విశ్వాసాల లాంటివి ఎక్కువగానే ఉండేవి. రోగాలను తగ్గించడానికి స్థానికంగా ఉండే ఆకుల పసరులతో పాటు తాంత్రిక విద్యలను కూడా సామాన్య ప్రజలు ఆశ్రయించేవారు. ఇటువంటి వైద్య విధానాన్ని కొంతమంది వృత్తిగా కూడా స్వీకరించడం కాకతీయుల కాలంనాటికే సమాజంలో స్థిరపడింది. మల్కాపురం, బయ్యారం శాసనాల వలన కాకతీయుల వైద్యానికి ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుంది.

ఆనాటి ప్రజలలో ఉన్న నమ్మకాలను, దగ్గరగా ఉండే వివిధ వస్తువులు మందులుగా పనిచేస్తాయన్న దానిని పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలోని వెల్లగొండ మహాదేవయ్యగారి కథలో ఇలా చెప్పాడు.

"*లవి నీశ్వరుండు జలకమాడినట్టి*
*జలముల యెల్ల విషములకు మందు*
*భ్రమలేల యెండు శస్త్రవణ సంకు*
*లమునకు టీపత్తెలంబయౌషధము*"

(పండితారాధ్య చరిత్రము, పురాతన ప్రకరణం)

ఇదే విధంగా పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో (355-358) చెట్ల మాలికలకు సంబంధించినవి ఔషధాలుగా పనిచేస్తాయన్న విషయం చెప్పబడింది. పాల్కురికి సోమన బసవపురాణంలో కూడా ఆనాటి సమాజంలో

ఉన్న వ్యాధులు, చికిత్సా విధానాలు వర్ణించాడు. కన్నప్పకథలో శివలింగం కంటికి కన్నప్ప ప్రథమచికిత్స చేసిన విధానాన్ని సోమనాథుడు ఇలా చెప్పాడు.

ముందు కంటిలో నలక ఉందేమో చూడడం, నీళ్లతో కన్నును కడగడం, నాలుకతో కనుగుడ్డును తుడవడం మొదలైనవన్నీ కన్నప్ప చేస్తాడు. చివరకు కంటికి ఏమైనా జబ్బు వచ్చిందేమోనని ఆత్రుత పడతాడు.

"*గానోపు/నక్షిరోగంబ/ యేమేని*
*చెప్పజిత్రము/ గోడిజెప్ప వెర్గినదో?*
*తప్పవోనోపునో/ తడికంటి విధమొ?*
*నొన్పియో పొరగప్పెనా/ మాదతెవులా?*
*పువ్వు వట్రిల్ల నాపువు కంటిపోటా ?*
*మయిల వడ్డదియొ॥ దుర్మాంగ దోషంబొ?*
*అయిరయో వెండియు నక్షిరోరంభో?*
*కానోపు నిట్లనుమానంబు లేదు*" (బసవపురాణం, తృతీయాశ్వాసం)

పై విధమైన వ్యాధులన్ని పరిశీలించి చివరకు తన కన్నును శివలింగానికి పెడతాడు.

ఇంకా కంటికి వచ్చు రోగాల గురించి, చికిత్సా విధానం గురించి పండితారాధ్య చరిత్ర పర్వతప్రకరణంలో చెప్పబడి ఉంది.

"*తిమిరంబు రక్త*
*దోషంబు దుర్మాంస దోషంబు వాయు*
*దోషంబు బటలంబు దుర్దర్శి గృష్ణ*
*కాసయు నతిరక్త కాసయుశ్వేత*
*కాసయుననెడి రోగంబు కన్నులును*"

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణం)

పై విధముగా కంటి వ్యాధులే కాక కుష్ఠు రోగాలకు సంబంధించిన చర్చ కూడా పండితారాధ్య చర్చలో ఉంది.

శిశు రోగాల గురించి బసవపురాణంలో ఇలా చెప్పబడింది.

*"నఱిమియో? కోవయో? యంగిముల్లా*
*యేఱుగను మందు మ్రాకేమియు ననుచు"*

(బసవపురాణం, తృతీయాశ్వాసం)

ఈ విధంగా బెజ్జమహాదేవి శిశువుకు వచ్చిన జబ్బు తెలియక బాధపడింది.

ఆ రోజులలో కనిపించే మరొక రోగం 'వాయుదోషం'. వాయుదోషం వల్ల నేత్రాలు విప్పకపోవడం, శరీరం అష్టవంకర్లు తిరగడం కూడా జరుగుతుందట. ఈ వ్యాధి గురించి బసవపురాణంలోని తృతీయాశ్వాసంలో గల 'నాట్య నిమిత్తండి' కథలో ఇలా చెప్పబడింది.

*"నిలువులు వడి శివునేత్రత్రయంబు*
*వొలుపుగా ఱెప్పలు వొందకున్నవియు*
*మలహరు శిరమును నిలువక యొక్క*
*వలనిక యంతయు వ్రాలియున్నదియు*
*మృడ దేవు కెంజడ ముడివీడి నదియుఁ*
*గడుఁడోద్యమిది యేమిగారణం? బనుడు*
*నాశివ బ్రాహ్మణుఁ డల్లన నగుచు*
*నీశివునకు రోగ మిట్టు లైనదియు*
*వాయు దోషము దీని వారింపకున్నఁ*
*గాయజహరునకుఁ గడుఁ బ్రమాదంబు*
*దడసిన నీంకొండు దలఁచిన శివుని*
*యొడ లెల్లఁ గూడ నిప్పుడ కొంకుపోవు*
*దీనికి క్రౌషధం బే నెఱుంగుదును*
*బూని చేయింపుమా మానెడు నంచు"*

(బసవపురాణం, తృతీయాశ్వాసం)

ఇటువంటి వాయుదోషం తగ్గడానికి నాటు వైద్యానికి సంబంధించిన తైలంతో మర్దన చేయాలని కూడా సోమన సూచించాడు.

*"వాయు తైలంబుగూర్చి యౌషధము*
*లెనయాగ వండితి ననుచు నాముదము*
*నూనియ నొక్కింతనులి వెచ్చజేసి*
*చేనిచ్చె దత్క్రి యసెప్పచు నతఁడు"*

(బసవపురాణం, తృతీయాశ్వాసం)

ఇంకనూ పాము కాటునకు సంబంధించిన అనేక విషయాలూ ఆనాటి శైవ వాఙ్మయం ద్వారా తెలుస్తున్నాయి.

*"పండితారాధ్యం చరిత్ర మహిమ ప్రకరణంలో పండితారాధ్యునకు, ఊర్ధ్వనేత్రలాభ కథనం తరువాత కొన్ని విధాలైన నేత్రదోషాలు పేర్కోనబడ్డాయి. పాము కాటువంటి రుగ్మతలకు మంత్రాలతో తగ్గిస్తామని నమ్మించడం ద్వారా కూడ మతగురువులు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. సందర్భాన్ని పురస్కరించుకొని పాములలో భేదాలు, పాముకాటులోని భేదాలకు ఆనాడు చేసే ఔషధ క్రియలు వివరించాడు. ఈ విధంగా ప్రస్తావించబడిన రోగాలను, ఔషధ క్రియలను బట్టి జనుల ఆరోగ్యస్థితి గతులలో ఆనాటి సమాజం శ్రేయో మార్గంలో లేదని తెలుస్తోంది."* (రాజు, ఎన్. ఎస్ 1991: 81)

## 5.7.6. కళలు

ప్రాచీనకాలం నుండి భారతదేశం కళలకు ప్రాధాన్యం ఇచ్చిన దేశం. కళ అనేది మనిషి జీవితంలో ఒక భాగం. ఉపశ్రేణి వర్గానికి చెందిన సాధారణ ప్రజలు శ్రమను మరిచిపోవడానికి విందులు వినోద కార్యక్రమాలలో భాగంగా కళలను కూడా ప్రదర్శిస్తూ ఆనందించేవారు. కాకతీయుల కాలం నాటికే భూస్వామ్య వ్యవస్థా లక్షణాలు సమాజంలో బలంగా కనపడడం వల్ల కళలలో కూడా ఉన్నత శ్రేణికి, ఉప శ్రేణికి భేదం ఏర్పడింది. పై వర్గానికి చెందిన వారి

కళలు, శ్రమతో జీవితాన్ని గడిపే ఉపశ్రేణి వర్గాలకు చెందిన కళలు కొంత భేదాన్ని కలిగి ఉంటాయి. ఆ భేదమే కాలక్రమంలో జానపద వాఙ్మయం లిఖిత వాఙ్మయం లేదా ఆస్థాన, ఆస్థానేతర కళలుగా పరిణామం చెందడానికి కారణమయింది.

శైవ వాఙ్మయం దేశీ శాఖకు సంబంధించినది కావడం వలన అంటే కవులు ఉన్నతశ్రేణి వారు, కావ్యవస్తువు ఉపశ్రేణి వర్గాలకు చెందినది కావడం చేత పైన చెప్పిన రెండు వర్గాలకు చెందిన కళలు ఈ వాఙ్మయంలో కనిపిస్తున్నాయి.

ఈ విధంగా సోమనాథుడు వీణలను, తంత్రులను వర్ణించడం వలన ఆనాడు సంగీతానికున్న ప్రాముఖ్యం తెలుస్తుంది. గద్య, పద్యాలను చదువుతూ, ఒకరివి ఒకరు మెచ్చుకొంటూ, నమస్కరించుకొంటూ సాహిత్య పిపాసను ప్రజలు తీర్చుకొనే వారని బసవపురాణంలో ఇలా చెప్పబడి ఉంది.

*"గద్యపద్యాద్యన వద్య కావ్యముల*
*హృద్యంబుగా సత్కవీశ్వరుల్వొగడ*
*బరిహాస కుల్సేర బాఠకుల్ బట్లు*
*వరగుణాంకనలుగై వారముల్సేయ*
*గాయకుల్దాళముల్గదియించి మ్రొక్క"*

(బసవపురాణం, చతుర్థాశ్వాసం)

పండితారాధ్య చరిత్రలో శ్రీశైలానికి వెళ్లే భక్తుల గురించి వర్ణింపబడింది. శ్రీశైలానికి వెళ్లడం అంటే అడవులలో నడిచి వెళ్లడం. క్రూరమృగాలు, దొంగల భయం వలన ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్లేవారు. భక్తులు మార్గమధ్యంలో కాలక్షేపానికి వారివారి కళలను ప్రదర్శించుకొనేవారు. ఈ ప్రధాన కళలను గూర్చి పాల్కురికి సోమనాథుడు వివరంగా ఇలా వర్ణించాడు.

*"అప్పాట వెడయాట లాడెడువారు*
*వేడుకతోఁ జిందు వాడంగనుచ్చి*

*కోదంగి యాటలఁ గునిసెడువారు*
*భ్రమరముల్ సాళెముల్ బయన్ముల్ మెఱసి*
*రమణ బంబాంసి పేరణి యాడువారు*
*బ్రమధ పురాతన పటు చరిత్రములఁ*
*గ్రమ మొంద బహు నాటకము లాడువారు*
*లలితాంగ రస కళాలంకార రేఖ*
*లలవడ బహురూప మాడెడువారు*
*గరణముల్ మెరవణుల్ గతులుం జిత్రములు*
*నరుదుగ వెడ్డంగ మాడెడువారు*
*నమరాంగ నలుదివి నాడెడు మాడ్కి*
*నమరంగ గడలపై దాడెడువారు*
*నావియద్గతిఁ బక్షులాడెడునట్టి*
*భావన మ్రోకులపై నాడువారు*
*భారతాది కథలఁ జీరమఱుగుల*
*నారంగ బొమ్మల నాడించువారుఁ*
*గడునద్భుతంబుగఁ గంబ సూత్రంబు*
*లడరంగ బొమ్మల నాడించువారు*
*నాదట గంధర్వాయక్ష విద్యాధ*
*రాదులై పాడెడు నాడెడువారు"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణం)

ఈ విధంగా మృగ వ్యాధుని కథలో వర్ణించిన కళలన్ని జానపదులకు సంబంధించినవి అంటే ఉపశ్రేణి వర్గానికిచెందినవి. చిందు, కోడింగి, పేరిణి, నాటకాలు, వెడ్డంగమాడే ఆట, గడలపై ఆడే ఆట మొదలైన పైన చెప్పిన కళారూపాలు శ్రమ చేసేవాళ్లు ఆటవిడుపు కోసం ఆడేవి. ఇవన్నీ సంస్కృతిలో భాగం. సామాన్య ప్రజల సంస్కృతిలో ఉన్న ఇటువంటి కళారూపాలను తెలిపిన సాహిత్యం శైవవాఙ్మయం.

ఇవే కాకుండా ఆనాడు వ్యవసాయంలో కలుపు తీయడం, కోత కోయడం, మోట తోడడం మొదలైన పనులు చేసేటప్పుడు శ్రమను మర్చిపోవడానికి ప్రజలు పాటలు పాడుకొనేవారని తెలుస్తుంది. విసుర్రాయి (తిరుగలి) పాటలు చాలా ప్రసిద్ధిలో ఉన్నాయి. బసవపురాణంలోని నాల్గవ ఆశ్వాసంలో రోకటి పాటల గురించిన ప్రస్తావన కింది విధంగా ఉంది.

"*మేటియై చనుభక్త కూటువలందు*
*బాటలుగ గట్టి పాడెడు వారు*
*బ్రస్తుతోక్తుల గద్యపద్య కావ్యముల*
*విస్తారముగ జేసి వినుతించువారు*
*నటుగక సాంగ భాషాంగ క్రియాంగ*
*పటు నాటకంబుల నటియించువారు*
*మునుమాడి వీరు వారన నేల కూడి*
*కనుగొన తోళ్ల రోకళ్ల చాడెదరు*" (బసవపురాణం, చతుర్థాశ్వాసం)

భక్త కూటములు పై విధములైన పాటలు, పాడుకొంటూ, నాటకాలు ఆడుతూ యాత్రలు చేసేవారట. ఇవే కాకుండా ఆనాడు తుమ్మెద పదాలు, ప్రభాత పదాలు, పర్వత పదాలు, శంకర పదాలు, నివాళి పదాలు, వాలేశు పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు, సంజ పదాలు మొదలైనవి ఉన్నట్లు పండితారాధ్య చరిత్రలో చెప్పబడింది.

శివరాత్రి జాగరణ సందర్భంలోని యాత్రికుల వినోద కాలక్షేపాలను పండితారాధ్య చరిత్రలో కవి ఇలా వర్ణిస్తారు.

"*నాదట గంధర్వయక్ష విద్యాధ*
*రాదులై పాడెడు నాడెడువారు,*
*విధమున బ్రచ్ఛన్న వేషముల్ దాల్చి*
*యధికోత్సవము దులుకాడనట్లాడు*"

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణం)

వీటితోపాటు ఆనాడు చెప్పుకోదగిన మరో కళ శిల్పకళ. ఈ కళ దేవాలయాలలో, కనిపిస్తుంది. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, ఓరుగల్లులోని స్వయంభూ దేవాలయం, పాలంపేటలోని రామప్పగుడి ఆనాటి శిల్ప సౌందర్యాన్ని తెలిపే కట్టడాలలో కొన్ని మాత్రమే. ఆనాటి శిల్పులు ఉపశ్రేణి వర్గానికి చెందినవారనేది ముఖ్యాంశం. శిల్పకళ అనేది సామాన్య ప్రజలకు సంబంధించినది.

సామాన్య జీవితాలను గడిపిన శిల్పులలోని కళా ప్రతిభకు గీటురాళ్లు ఆనాటి కట్టడాలు. "*వాటి కుడ్యాలు, స్తంభాలు, ద్వారా బంధాలు, పై కప్పులు రమణీయ శిల్పాలతో నిండి ఉన్నాయి. నంది నిర్మాణంలో నాటి శిల్పులు అపూర్వ కళను ప్రదర్శించారు. ఆకు దీగెలు, అల్లిక పనివంటి కళా విన్యాసం గొప్పగా చూపించారు. శివలింగాలు, దేవీ దేవమూర్తులు మహదలంకార కళాశోభితాలు ప్రసన్నవదనాలు. అలంకార ఆభరణ సముదాయం మనోహరం. ఓరుగల్లు కీర్తితోరణ ద్వారాలు సమున్నతాలై గంభీరంగా శిల్పకళాకేతనాలుగా నికేతనాలుగా నిలిచి ఉన్నాయి. వాటి అగ్రభాగాన ఉభయ పార్శ్వములందలి హంగులు ముగ్ధమనోహరంగా ఉన్నాయి. ఆలయంపై కప్పుపద్మాలు, ప్రహరిపై గల ఏనుగుల బారులు, వీరులు, వీర నారులు, పూర్ణ కలశాలు, పూబోణులు - నృత్యభంగిమలు, వివిధ కళా విన్యాస మూర్తులు దర్శనీయమైనవి.*

*రామప్ప గుడిలోని స్తంభాలపై, దూలాలపై గల పౌరాణిక శివకేశవ గాధలు, నృత్య బృందాలు చూపరుల నాకట్టుకుంటాయి. స్తంభాగ్రాలపై కంబాలకు దూలాలకు మధ్య కోణాలపై నిలిపిన నిలువెత్తు పరిణామంలో నిలిపిన నాగిని నర్తకి ధనుర్ధారిణి మొదలగు పన్నెండు స్త్రీ పతిమలు కాకతీయ శిల్పానికి మణిదీపికలు.*

*దాసీజనం, నర్తకీమణులే కాక సింహాలపై స్వారీ చేసే మదగజాల నెదిరించే మానినుల శిల్పాలుండుట విశేషం. నరసింహ వక్త్రం ఒక అపూర్వ కళావిన్యాస రూపాన్ని ఈ యుగంలో సంతరించుకుంది. అశ్వ ప్రతిమలెక్కువగా లేకపోవడం గమనార్హం.*" (మలయశ్రీ 1990: 111) ఈ విధంగా ఆనాటి శిల్పులు శిల్ప కళారాధకులై శిల్పాలను చెక్కి కళలను నేటికీ నిలిపారు.

అయితే ముఖ్యంగా శైవ వాఙ్మయంలో గుర్తించాల్సిన విషయం ఒకటుంది. పాల్కురికి సోమనాథుడు పేర్కొన్న కళారూపాలు అధిక భాగం జానపదులైన ఉపశ్రేణి వర్గానికి చెందినవి. వీటిలో కొన్ని నేటికీ సమాజంలో అక్కడక్కడ మిగిలి ఉన్నాయి.

### 5.7.7. ఆహారం

మానవుల ముఖ్యావసరం ఆహారం. జంతువులను వేటాడి తినడంతో ప్రారంభమైన ఆహారపు అలవాటు క్రమంగా వ్యవసాయాభివృద్ధితో పంటలు పండించుకొని తినడం వరకు సాగింది. కాకతీయుల కాలంనాటి భూస్వామ్య వ్యవస్థలో వ్యవసాయం ప్రధానవృత్తి కాబట్టి ఆహారపు అలవాట్లు కూడా దానికి అనుకూలంగానే ఉన్నాయి. వరి, గోధుమ, జొన్న, సజ్జ, కొర్ర మొదలైనవి వారి ఆహారపు పంటలు.

శైవ వాఙ్మయంలో చాలా చోట్ల అంబలి ప్రస్తావన కనిపిస్తుంది.

"*పోయి చెన్నయయింటి పులియంబకళము*
*చేయి తీయల్ జుఱ్ఱిచిఱు తొండనంబి*"

ఇదే విధంగా మోళిగ మారయ్య కథలో కూడా అంబలి ప్రస్తావన ఇలా ఉంది.

"*బసవ! మారనియట్టి భక్తులు గలరె?*
*వసుధలో నీయింటి రసరసాయనము*
*లతని నగర గాంచు నంబకళంబు*
*ప్రతివచ్చునే యెన్ని భంగులనైన*" (బసవపురాణం, పంచమాశ్వాసం)

దీనిని బట్టి ఆరోజులలో 'అంబలి' ప్రధాన ఆహారం అని తెలుస్తుంది. అంటే వరి అన్నము వంటివి ఉన్నతశ్రేణి వారి ఆహారం కాగా 'అంబలి' కాచుకోవడం సామాన్య ప్రజల ఆహారంగా చెప్పవచ్చు.

ఇదే విధంగా పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో కూడా అంబలిని గురించి ఇలా ప్రస్తావించాడు.

*"చిక్కితిగాక మాచేత నీవింక*
*నెక్కడ వోయెదవిట్లు బోడలకు*
*బోడిగ నంబలి వోసిన విధము*
*నేడుగదా నీకు నిండారబండె*
*మంటి సఫలమయ్యె మన్న ఫలంబు"*

(పండితారాధ్య చరిత్ర, దీక్షాప్రకరణం)

నేటికీ గ్రామాలలో ఆర్థికంగా లేనివారు రాగులతో అంబలి కాచుకోవడం కనిపిస్తుంది. ఇది ఆనాటి ఉపశ్రేణి వర్గ ప్రజల ప్రధాన ఆహారమై ఉండవచ్చు.

శైవ వాఙ్మయంలో శివభక్తుల ఆధిక్యత ఎక్కువ. శివభక్తులైన మిండజంగాలుకు భక్తులు ఏమి కోరితే అది వండి పెట్టాలి. అదీ కాక శివభక్తులు అతిథిగా లేకుండా భోజనం చేయరు. అందువల్ల మిండజంగాలకు రుచికరమైన ఆహారం లభించేది. వారు తిని, తేన్పుతూ, తాంబూల సేవనం చేసేవారు. ఈ విషయాన్ని సోమనాథుడు బసవపురాణంలో వర్ణించాడు.

*"త్రేన్పులు గఱ్ఱు గఱ్ఱున వెడలఁ*
*జేకొని యారగించెనె కడుపార*
*సెట్టికిఁ గర్మంబుఁదిట్టు దేవరకుఁ*
*గట్టిల్లె నీంతియకాదె కావునను*
*భక్తుని మ్రింగిన పచ్చి రక్కసుఁడు*
*భక్తుని జంపఁ బాల్పడు సూనెగాఁడు*
*నిది యొక్క కథయుఁగా నిల రచించి*
*చదువు మూఢులకు ననంభ్యాతులకును*
*వెలియుఁ జుండో యని వ్రేసెఁజీతాళ*
*జుఱ్ఱు జుఱ్ఱున గొని సాగయుచుగఱ్ఱు*
*గఱ్ఱున ద్రేన్చుచు గాఱ్ఱ సాచుచును"* (బసవపురాణం, చతుర్థాశ్వాసం)

ఆ రోజులలో మాంసాహారం కూడా ప్రజల ఆహారపు అలవాట్లలో ఒకటి. అదీగాక జంగాలు ఏది అడిగితే భక్తులు అది తెచ్చి ఇవ్వాలి. కాబట్టి మాంసాహారం కూడా వండిపెట్టేవారు. బసవపురాణంలోని సిరియాళుని కథలో నరమాంసానికి సంబంధించిన అంశం వివరింపబడి ఉంది.

"*మన యింటఁ బండువుదినము నేఁడనుచుఁ*
*గనుఁగొని వధ్య శృంగారంబుసేసి*
*బాలుని యుక్తి విలోలు సిరాలు*
*లీల యుఁబోలెఁ దల్లి యును దండ్రియును*
*నిండారుమన యున నిహతుఁగావించి*
*ఖండించి నానా ప్రకారముల్గాఁగ*
*శాకంబు లాడఁగూర్చి*" జనులెగ్గకుండ

(బసవపురాణం, చతుర్థాశ్వాసం)

దీనిని బట్టి ఆరోజులలో మాంసాన్ని కూడా వివిధ రకాలుగా వండేవారని తెలుస్తుంది.

బసవపురాణంలోని కన్నప్పకథలో కన్నప్ప శివునికి ఆహార పదార్థాలను నైవేద్యంగా పెడతాడు. అవి ఋశ్యమృగాల పాలు, పచ్చి ధాన్య పాయసం, ఉడుము కొవ్వు నుంచి తీసిన నెయ్యి, ఇప్పపువ్వు తేనె, ఫలాలు, వెదురు పాలు, ఇనుప కడ్డీలకు గుచ్చి కాల్చిన మాంసం మొదలైనవి. వీటితోపాటు ఇలా ఆహార పదార్థాలను కవి వర్ణిస్తాడు.

"*మంచి మాంసముగ శోధించి శోధించి*
*పంచిన మాడ్కి ఖండించి ఖండించి*
*కాల్చుచు బక్వంబుగా ద్రిప్పిత్రిప్పి*
*ప్రేల్చుచు వెండియుఁ గ్రియకొల్పికొల్పి*
*తవిలి ఖండింపుచుఁ దాఁజవి సూచి*

చవియున్న లెస్స మాంసము దొప్పఁచెట్టి
చిఱుతయుఁ గలినంబు ఛిద్రంబు యెఱకు
కఱకును గారాకు గాకుండఁజూచి
యింపారి ననుపారి కంపు నింపారి
పెంపారి చాలనీప్పెడు బిల్వపత్రి
నలిదీటుకొనఁ గోసి తలసజ్జఁ జేసి
యలరు జంజుఱు వెండ్రుకల మీఁదఁదాల్చి
చక్కన మొగ లేటి సదమలోదకము
లక్కజంబుగ రెండు పుక్కిళ్ల బట్టి
దాపలి కరమునఁ జాపంబు శరము
లేపార వలచేత నిట మాంసమున్న
దొప్పయుఁబట్టి కన్నప్పఁ డేతించి
చెప్పఁగాలును దాంటి శివుమీంది పూజ
పోనూకి తెచ్చిన పుక్కిటి నీట
మానుగా శివునకు యజ్జ నంచార్చి
వటికి వెండ్రుకల పైఁబత్తిరి రాల్చి
మఱి దొప్పఁదెచ్చిన మాంసమర్పించి"

(బసవపురాణం, తృతీయాశ్వాసం)

(బసవపురాణం, ఏడో ఆశ్వాసం)

ఈ విధంగా మాంసాన్ని కాల్చి తినడం మన సమాజంలో ఉంది. పై విధమైన ఆహారపదార్థాలు ఆనాటి సమాజంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఉన్నత, ఉపశ్రేణి వర్గాల ప్రజల మధ్య ఆహారపు అలవాట్లలో కూడా భేదం ఉన్నట్లు తెలుస్తుంది. ఎక్కువగా సామాన్యజనులు, "కూలీలు, అన్నం, జొన్న అంబలి, గంజి, రొట్టె, కొర్రన్నం తినేవారు. ఇప్పటికీ జొన్న పేలాలు, వరి పేలాలు, పప్పు దినుసులు, గుగ్గిళ్ళు, సొండెలు, గుడాలు, ఆహారంగా తీసుకొనేవారు. ఆనాడు చేలలోని పచ్చి కంకులు (పాల కంకులు, పిసికిళ్ళు, కాపిళ్ళు అని కూడా అంటారు) తెచ్చి కాల్చుకొని (మొక్కజొన్న పొత్తుల వలె) తినేవారు. ఇప్పటికీ పల్లెలలో ఈ రివాజు ఉంది."

(ప్రమీలారెడ్డి, ఎం 2000: 201)

## 5.7.8. గృహ వాతావరణం

కాకతీయుల కాలంనాటి ఇళ్ళ నిర్మాణం, రాజ ప్రసాద నిర్మాణం, నగర నిర్మాణం, దేవాలయాల, కోటల నిర్మాణం గురించి శాసనాలలో చెప్పబడి ఉంది.

అయితే ఈనాటి వలే ఆనాడు కూడా ఆర్థిక వ్యత్యాసం వల్ల ప్రజలలో ఉన్నతవర్గానికి చెందినవారు భవనాలలో ఉంటే సామాన్య ప్రజలు మట్టితో కట్టిన ప్రహరీ గోడలు వెలిసి, గుడిసెలలో, దళ్ళతో కూడిన ఇళ్లలో, పూరి పాకలలో, వెదురు తడికలతో కూడిన ఇళ్లలో నివసించేవారు. ఉన్నతశ్రేణికి చెందినవారి గృహ వాతావరణం, సామాన్య ప్రజల గృహవాతావరణం పూర్తి భిన్నంగా ఉండేవని వారి నివాస గృహాలను బట్టే చెప్పవచ్చు.

బసవపురాణంలోని ద్విపద కళియారు కథలో ఇల్లు కట్టడానికి కావాల్సిన సామను తెప్పించడం గురించి ఇలా చెప్పబడింది.

*"వ్రాలిన కుసులును వసులు దూలములు*
*ఱాలు గుండ్లను నిస్సుసాల దెప్పించి*
*కోట కొమ్ములఁ దగుచీటఁబంచించి*
*కోట యీఁక మయునఁ బాటించియంత*
*లోఁతుగా నడబావి లోనఁగట్టించి*
*పాఁతర్లఁగొలుచు నేర్పడ సంగ్రహించి*
యగ్గడి చుట్టు బిల్వాశోక సరభి
గుగ్గలు క్రముకాది కుజములు వెట్టి
మరువంబు దవనంబు మాచిపత్త్రిరియు
వరుసను బహుపుష్పవాటికల్ నాఁటి"

(బసవపురాణం, తృతీయాశ్వాసం)

ఆనాడు వ్యవసాయ వృత్తి చేసేవారి ఇండ్లలో ధాన్యాన్ని నిలువ చేయడానికి గాదెలు ఉండేవి. ఇవి నేటికీ రైతుల ఇండ్లలో ఉన్నాయి. వీటి ప్రస్తావన బసవపురాణంలో ఇలా ఉంది.

*"కూడు మందునకైన గొలు చింతలేక*
*యాడ కాడకు గాదియలు వాడు వాజి*
దాసి మున్నపసినతవనిధి యట్లు
దాసయ్య దివుచుడుఁ దత్ క్షణమాత్ర
పరిభ వాద్భుత శోక పారవశ్యమున
దురపిల్లు దాసికి దుగ్గళవ్వనియె
కల వానియట్ల నిక్కంబు నీవాక్క
బలుసరితనమునఁ బుచ్చితి కొలుచుఁ
దలర నేనుఁగు పండ్లు దాఁబట్టిచూచు
మనుజుండు బ్రదుకునే మడియునకాక
నెట్టన శరణుల నిలుకడలదసి
పట్టి చూడంగ నీ ప్రాప్తియే చెపుమ" (బసవపురాణం, చతుర్థాశ్వాసం)

పండితారాధ్య చరిత్రలో కూడా గాదెల ప్రస్తావన ఉంది.

గ్రామాలలో శుభకార్యాలు జరిగినప్పుడు, విందులు, వినోద కార్యక్రమాలు జరిగినప్పుడు లేదా సంక్రాంతి వంటి పర్వదినాలప్పుడు ఇళ్లముందు ముగ్గులు వేయడం ఆనవాయితి. ఇది కాకతీయుల కాలం నుండి ఉంది. గృహ సంబంధ వాతావరణంలో ఇటువంటివి గృహానికి అలంకరణగా ఉండి శోభను కలిగించేవని బసవపురాణంలో కొన్ని సందర్భాలలో ముగ్గుల ప్రసక్తి చేయబడింది.

బసవని పెళ్లి సందర్భంలో ముగ్గుల గురించి ఇలా చెప్పబడింది.

*"గలయంగ వీథుల గస్తూరి యలుకుఁ*
*డెలమి ముక్తాలఁ బిలువుండు మీ రెదురు*
*వీండు వేగము తోడి తెండు తెండనుచు*
*నిట వచ్చునయ్యల కెదురు వచ్చుచును*
*నీట వచ్చునయ్యల కర్థిమ్రొక్కుచును*
*సింహాసనస్థులఁ జేసి యాకర్మ*
సంహారమూర్తుల చరణముల్గడిగి
యమిరళనమ పుష్పాంజలు లిచ్చి" (బసవపురాణం, ప్రథమాశ్వాసం)

ముగ్గులు వేయడాన్ని పుణ్యకార్యంగా భావించేవారు ఆనాటి ప్రజలు అని పండితారాధ్య చరిత్రలో పేర్కొనబడింది.

*"భువిని మ్రుగ్గులు వెట్టు పుణ్యులలోన*

*నవరత్నముల మ్రుగ్గులు కూడా పెట్టారు"*

(పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్రకరణము)

ఈ విధంగా గృహాల వాతావరణం ఉండేది. ఇవే కాకుండా ఆనాటి ఇళ్ల వాతావరణంలో అంటే ముఖ్యంగా గృహాలలో సామానులు భద్రపరచడానికి అటకలు, ధాన్యాన్ని భద్రపరచడానికి గాదెలు, బట్టలు ఆరవేయడానికి, ఇళ్లల్లో బట్టలు ఉంచడానికి దండెం, పాలు, పెరుగు లాంటివి భద్రపరచడానికి ఉట్లు సాధారణంగా ఉండేవని ఆనాటి శాసనాలు, సాహిత్యాల వలన తెలుస్తుంది.

ఇంకా ఆనాటి గృహవాతావరణాన్ని, గృహంలోని వస్తు సముదాయాన్ని ఎన్.ఎస్. రాజుగారు ఈ విధంగా తెలియజేశారు. "కావడి, పట్టె *మంచం, పెనం, ఉట్టె, కొడవలి, గొడ్డలి, పెట్టెలు, చాదె, మద్దెల, వాళగ్రోలు, చిట్టితాళము, గంటలు, తాళాలు, నులకత్రాను, మ్రోకు, బాన, ఉంగరాలు, గాజులు, పూసల దండలు, అద్దం, శంఖం, కంచు మట్టెలు, తగరపు కడియాలు, చిలక కొయ్య, సూదీ దారం, దీప స్తంభం, రుద్రాక్షలలో రకాలు, ముత్యాల హారం, ముక్కున ధరించే ముత్యం, కమ్మలు, పాదరక్షలు, కంబళి, కొలపాత్రలు మొదలైన గ్రామీణ జీవితానికి సంబంధించిన అనేక వస్తువులు శైవ వాఙ్మయంలో పేర్కొనబడ్డాయి. దీని వల్ల వారి జీవన విధానం తెలుసుకోవచ్చు."* (రాజు, ఎన్. ఎస్ 1991: 88)

## 5.7.9. మూఢనమ్మకాలు

ప్రజలలో విద్యావ్యాప్తి లేకపోవడం, మతం వల్ల ఏర్పడిన మూఢత్వం, భూస్వామ్య యుగ లక్షణాలు మొదలైన వాటివల్ల ప్రజల్లో ఎక్కువగా మూఢనమ్మకాలు ప్రబలుతుంటాయి. ఇవి సమాజ పరిణామంలో క్రమంగా ఒక తరం నుండి మరో తరానికి అందుతుంటాయి. కాకతీయుల కాలంనాటి

సమాజంలో ఇవి ఎక్కువగా పై కారణాల వల్ల కనిపిస్తున్నాయి. తాంత్రిక విద్యలకు ఆనాడు ప్రజలలో ఎక్కువ ప్రచారం ఉండేది. సామాన్య ప్రజలను మోసం చేయడానికి కొంతమంది సిద్ధులు, బైరాగులు నరబలులు, అవయవ ఖండనం వంటి చర్యలు కూడా చేసేవారని తెలుస్తుంది. దీనికి శైవంలో ప్రధాన శాఖైన కాపాలికా శైవం ప్రోత్సహించింది. వీరు మంత్ర తంత్ర విద్యలలో ఆరితేరినవారని ఆనాడు ఎక్కువ ప్రచారం ఉండేది. గ్రామ దేవతలను, శివుడిని శాంతింపజేసి కావలసిన కోరికలు నెరవేర్చుకోడానికి వీరు తంత్ర సంబంధ పూజలు చేసేవారు. ఇది జానపదులైన సాధారణ ప్రజలు నమ్మేవారు.

బసవపురాణం, పండితారాధ్య చరిత్రలలో చచ్చినవారిని బతికించడం, కాళ్ళు చేతులు తెప్పించడం, భక్తులు వీరావేశంతో తలలు నరుక్కోడం, కాళ్లు చేతులు తొలగించుకోడం కనిపిస్తాయి. శివమహిమ వలన అవి మరలా రావడం కూడా ఉంది. ఇది మూఢభక్తికి నిదర్శనాలు. ఉపశ్రేణి వర్గ ప్రజలను మతాలవైపు ఆకర్షింప చేయడానికి భక్తి భావనను కాల్పనికంగా వర్ణించడం ఇక్కడ గమనించాల్సిన విషయం.

పండితారాధ్య చరిత్రలోని వెల్లగొండ మహదేవయ్య పూజకు పుష్పాలు ఆలస్యంకాగా తన కాళ్లను ఖండించు కొంటాడు. ఈ సంఘటనను సోమనాథుడు ఇలా చెప్పాడు.

*"కాళ్ళు శివార్చోపకరణముల్ దాఁకఁ*
*గాళ్లను రెండు నక్షణమ గుత్తులకు*
*గడికండలుగఁ గొట్టి కలుషంబు వుట్టి*
*మృడుని ముందఱఁ జేట్టి మెఱవడిఁ బెట్టి*
-----------------------------------
-----------------------------------
*ఈ పాదములఁ దాల్చుటాపరమేశు*
*శ్రీపాదములు దాలిచినయట్లకాదె"*

(పండితారాధ్య చరిత్ర, పురాతన ప్రకరణము)

చివరకు మల్లికార్జున పండితారాధ్యుడు తన మల్లికార్జునుడు వల్ల ఆ ఖండింపబడిన కాళ్లను తిరిగి అతుక్కోనేటట్లు చేస్తారు. ఇది మూఢభక్తికి నిదర్శనం. ఈ ఒక్క సంఘటనే కాకుండా ఇలాంటివి శైవ వాఙ్మయంలో చాలా ఉన్నాయి.

శ్రీశైలంలోని వీరశైవులు మొక్కుబడులు తీర్చుకొంటారు. వారి మొక్కులు సాధారణమైనవి కావు. పైన చెప్పినట్లు క్రూరంగా కఠినంగా ఉంటాయి. ఇవి మూఢభక్తికి సంబంధించినవే. పండితారాధ్య చరిత్రలో మొక్కుబడుల గురించి సోమనాథుడు వివరంగా సూచించాడు.

*"పరులఁ గీర్తించుపాపంబు నాలుకల*
*హరుని గీర్తించుడన్యయమన్నట్లు*
*నాలుకల్ గ్రాసి పినాకిచే గ్రొత్త*
*నాలుకల్ వడసి వర్ణన సేయువారు;*
*నుదరార్థమై చేతులొరుల కెత్తుచును*
*నుదనారి కెత్త సన్మార్గ మన్నట్లు*
*సేతులు నఱికి యాశివునిచేఁ గ్రొత్త*
*సేతులు వడసి చెచ్చెఱ మ్రొక్కు వారుఁ*
*గలలోనఁ జంటి మొగము గానఁ డనుచు*
*నిల నిచ్చు క్రియఁజన్ను లిచ్చెడి వారు*
*దలలేని శివుఁడని తలగాని బ్రతుకు*
*దలలేదనెడు మాడ్కిఁదలలిచ్చువారు*
*గరళాంకు కృపలేని కర్మదేహములు*
*ధరియించి యన్కియుఁ దప్పిన్నయట్లు*
*నటులనిస్సార సంసార విరక్తి*
*నటుగూడఁ దనువుల నర్పించువారు"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణము)

పై విధమైన క్షుద్ర మొక్కుబడులు తీర్చుకొనే భక్తి విధానం సరైనది కాదు. ఆనాటి ఆంధ్రదేశ సమాజంలో ఇవి కొంత వరకైనా ఉండొచ్చు. కానీ కన్నడ దేశంలో వీరశైవం ప్రధానంగా వ్యాపించి ఉండడం వల్ల ఇటువంటివి అక్కడ ఎక్కువగా ఉండి ఉండవచ్చు.

మనిషికి గాలి సోకిందని, భూతాలు, దెయ్యాలు పట్టాయని వాటిని తొలగించడానికి భూతవైద్యులను ఆశ్రయించడం నేటికీ గ్రామీణ ప్రాంతాలలో చూస్తూనే ఉంటాం. బాబాలు, అమ్మ దేవతల దగ్గరకు వెళ్లి లేదా గుడికి వెళ్లి విభూతి తీసుకు వచ్చి గాలి సోకినవారి నుదుటన పెడతారు. ఇటువంటి విభూతి వాడడం ఆ కాలంలో కూడా ఉన్నట్లు బసవపురాణంలోని బెజ్జమహాదేవి కథలో ఇలా చెప్పబడింది.

*"కడవనంటిన యట్టి పిడుక విభూతి*
*యడరబుత్రుని నాసలారంగఁ బూయు*
*నెత్తు గ్రుంగెడునని మెత్తంగ వెఱచి*
*యత్తన్వి ఱొమ్మున నక్కున న దుయు*
*కాటుక యిడనింత గన్నగు ననుచుఁ*
*గాటుకయిడు మూడుగన్నులఁగలయఁ"*

(బసవపురాణం, తృతీయాశ్వాసం)

అని బెజ్జ మహాదేవి చిన్నపిల్లలకు విభూతి పెడుతుంది. వీరశైవం ప్రజలను తనవైపు తిప్పుకోవడానికి తాంత్రిక విద్యలను, మూఢనమ్మకాలను ఆశ్రయించింది. వైద్యం పేరుతో ప్రజలకు ఈ విధంగా దగ్గరవడానికి ప్రయత్నించింది. దేవతలకు తల ఇస్తున్నట్లు, కత్తిని కడుపులో గుచ్చుకొన్నట్లు, రక్తాన్ని త్రాగుతున్నట్లు ఆకాలంనాటి విగ్రహాలు కనపడుతున్నాయి. శాసనాలలో కూడా వీటికి ఆధారాలున్నాయి. ఇవి ప్రధానంగా విశ్వాసాలకు నిదర్శనమైనవి.

పండితారాధ్య చరిత్రలో మల్లికార్జున పండితుని శాపం వల్ల చందవోలు రాజు వ్రణంతో బాధపడతాడు. చందవోలు రాజు మల్లికార్జున పండితుని కళ్లు పోగొడతాడు. ఇటువంటి సంఘటనలు ఆనాడు జరగడానికి ప్రజలలోని మూఢనమ్మకం ప్రధాన కారణం.

కాకతీయుల కాలంనాటి సాంస్కృతిక విశేషాలలో మూఢనమ్మకాలలో శైవ వాఙ్మయం వల్ల తెలిసే మరొకటి రసవాదం. అంటే బంగారాన్ని తయారు చేసే విద్య. ఆనాడు విదేశీ వాణిజ్యంలో బంగారం ప్రధానమైన లోహం కావడం వల్ల దీనికి ప్రాముఖ్యత పెరిగింది. అందువల్ల బంగారాన్ని తయారు చేయడానికి రసవాదమనే విద్య ప్రజలలో వ్యాపించింది. రసవాదం ప్రధాన ఉద్దేశం ఇనుములాంటి తక్కువ రకం లోహాలను బంగారంగా మార్చడం.

పండితారాధ్య చరిత్రలోని చేటల వేమయ్య కథలో ఒక సిద్ధుడు బంగారం తయారు చేయడాన్ని సోమనాథుడు కింది విధంగా వర్ణించాడు. దీనిని బట్టి ఆనాడు ఈ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఉండేదని, ఇటువంటి సిద్ధులు ప్రజలను అమాయకులను చేసేవారని తెలుస్తుంది.

ఈ విద్య గురించి సోమనాథుడు ఇలా చెప్తారు.

*"వేమయ్యజూచు నాకాంక్ష*
*నుద్దతినొక రససిద్ధు డేతెంచి*
---------------------------
*రసము శోధించి చారణలు గావించి,*
*యసమౌషధంబుల రసతైలములను*
---------------------------
*అలరు పక్షచ్ఛేద నౌషధావళుల*
*బలుమరు నందు వేపనము గావించి,*
*వర మంత్ర మూలికా వ్రాత సారమున*
*గర మొప్పదద్ర నకల్కంబు పొదివి,*
*క్రమ మొందభాగ సంఖ్యను మిత్ర పంచ*
*కము, దాని కథరోత్తరముగ సంధించి*
----------------------------
----------------------------
*భువి జంత్రముల బుటంబుల నౌషధముల*
*దవులు బాషాణ సత్త్వంబు హేమంబు*

*గరమొప్ప వజ్ర సంఘము గ్రాసమిచ్చి*
*పరితృప్తి బొందించి పండిన యట్టి*
*చిరమూలికా బద్ధ వరరస ఘటిక*
*విరచింపగ సహస్ర వేదిగా ననుచు"*

(పండితారాధ్య చరిత్ర, పురాతనప్రకరణం)

ఈ విద్య గురించి ఆలోచించాలంటే ఆనాటి సమాజం భూస్వామ్య స్వభావాలను అవగతం చేసుకోవాలి. రసవాదం పేరుతో ఉపశ్రేణి వర్గాల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని మోసం చేసే ఒక విభాగపు ప్రజలు ఉండేవారని తెలుస్తుంది. వీరినే సిద్ధులు అని ముందు చెప్పడం జరిగింది. ఈ సిద్ధులకు చెందిన కొన్ని రకాల విద్యలను పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలోని కరవీరుని కథలో ఇలా చెప్పాడు.

*"మణిగణానీకమల్ మంత్రముల్ దేవ*
*గణికోప భోగముల్ గామ రూపములు*
*గామ దుఘంబుఁ గల్ప వృక్షములుఁ*
*గామితా లోక లోక ప్రవర్తనలు*
*సంజీవ సంధాన శల్యాదికరణు*
*లంజన రసరసాయన ధాతు కళలు*
*మృగ చోర రాక్షస మృత్యు విషాహి*
*ఖగ మహోర్వ్యా శని ఖడ్గసేనాగ్ని*
*పవన జలాతప వ్రతి పక్షరోగ*
*పవిన్యపస్తంభన పరిచిత కళలు*
*గారుడాదులుఁ బరకాయ ప్రవేశ*
*భూరిది వ్యౌషధంబులు మొదలైన*
*దుష్ట సిద్ధులఁ గోరు దుష్టార్థులకును"*

(పండితారాధ్య చరిత్ర, పర్వతప్రకరణము)

ఈ విధంగా ఆనాటి సమాజంలో ముఖ్యంగా ఉపశ్రేణి వర్గ ప్రజలలో మూఢ నమ్మకాలు ప్రబలి ఉండేవి. దీనికి ప్రధాన కారణాలు ఆర్థికంగాను, సాంస్కృతికంగాను విద్యాది విషయాలలోను వెనుకబాటు. దీనిని ఆసరాగా తీసుకొని మతవ్యాప్తి పేరుతో వీరిలోని మూఢత్వాన్ని పెంచుతూ సమాజంలోని కొంతమంది వీరిని దోచుకుంటూ ఆర్థికంగా, సాంస్కృతికంగా నిర్వీర్యం చేసేవారు. ఇది ఆనాటి సమాజ స్వరూపంలోని ఉపశ్రేణి వర్గ ప్రజల దుస్థితికి ప్రబల తార్కాణం.

## 5.8. ఉపశ్రేణి వర్గాలు - మతం

ప్రాచీన కాలం నుండి భారతదేశంలో వైదిక మతమే తన ప్రాభవాన్ని నిలుపుకొంది. రాజ్యాధికారానికి తన మద్దతు తెలుపుతూ, వర్గ స్వభావానికి అనుకూలమైన మార్పులకు సానుకూలంగా మారుతూ వచ్చింది. అనేక ఉప విభాగాలకు లోనై హిందూమతంగా మారినా దాని సహజ స్వభావ సిద్ధాంతానికి ఆ మతం దూరం కాలేదు. అందువల్లే మధ్యయుగ కాలంలో వచ్చిన బౌద్ధ, జైన మతాలు పూర్తిగా నిలదొక్కులేక పోయాయి.

కాకతీయుల కాలం మతం దృష్ట్యా ప్రాధాన్యత సంతరించుకున్న కాలం. జైన, బౌద్ధ మతాల క్షీణ దశ, హిందూ మతంలోని శైవ, వైష్ణ మతాలకు ప్రభువుల అండదండలు ఈ కాలంలోనే ఎక్కువగా కనిపిస్తాయి.

"*కాకతీయుల మత విధానము ఆంధ్రదేశ మత చరిత్రలోనే ప్రత్యేకతను సంతరించుకొన్నది. కాకతీయ ప్రభువు శైవ, వైష్ణవ మతాలనే కాక స్థానికంగా ప్రజలు కొలిచే చాముండి, కాకతి, ఎల్లమ్మ (ఏకవీర) వంటి దేవతలను కొలిచి ఆదరించారు. స్వయంగా పై దేవతలను కులదేవతలుగా ఆరాధించి యిటు ఆటవిక ప్రాంతాలలో మారుమూల ప్రదేశాలలో నివసించే ప్రజలను, అటు పౌరాణిక మతాలను ప్రోత్సహించి బ్రాహ్మణ మతాభిమానాలను సమన్వయ పరచి తద్వారా దేశ రాజకీయ సమైక్యతకు కృషి చేసినారు.*" (కనకదుర్గ, పి 1992: 85)

ఇటువంటి రాజకీయ పరిపాలనా సమన్వయం కోసం కాకతీయ ప్రభువులు ఎక్కువమంది ప్రజలు ఆచరించి, ఆదరించే మత ధర్మాలకు ప్రాధాన్యం ఇచ్చి వారు కూడా ఆచరించడానికి ప్రయత్నించారు. ఆనాటి శాసనాల్లో కాని, మతాన్ని ఆదరించి ఆచరించిన రాజులు, సామంతుల, దండనాయకులలో గాని వీర శైవ మత లక్షణాలు కనపడవు.

కాకతీయులు శైవమత అవలంబులుగా కనిపించినప్పటికీ సూర్యుడు, విఘ్నేశ్వరుడు, విష్ణువు దేవతల గుడులను ప్రతిష్టించారు. ముఖ్యంగా కాకతీయ కాలం నాడు వేయించిన హనుమకొండ శాసనం, బూర్గుగడ్డ శాసనం, కరీంనగర శాసనం మొదలైన వాటిని బట్టి వీరు పరమత సహనం కలవారని, వీరిపై వైష్ణవ మత ప్రభావం కూడా ఉందని తెలుస్తుంది. ఆనాడు బౌద్ధ, జైనులు అల్ప సంఖ్యాకులుగా ఉండి ఉంటారని కూడా తెలియవస్తుంది.

*"అమరంగ శైవ వైష్ణవ నిజారుహ బౌద్ధములైన యిచ్చతు*
*స్వమయములుం బ్రిధజ్మతము సంశయ హేతువుడైన మెల్లనే*
*కనుయని యైక్య భావమునం గల్మషహరుండు మల్లిరెడ్డి య*
*త్వమితగుణాఢ్యుం నీయతులితా యతనంబులు నిల్పెం బ్రీతితోనో"*

(వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి, పుచ్ఛా 1981: 112, బెక్కల్లు శాసనం - 16)

పై శాసన పద్యం వలన జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ మతాలు గొడవలు లేకుండా ఉండడానికి దేవుడు ఒక్కడేనని మల్లిరెడ్డి అనే అతను ప్రకటించినట్లు తెలుస్తోంది. అంటే ఆనాటి ప్రభువులు ఏ స్థాయివారైనా, ఏ మతానుయాయులైన పరమత సహనానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు అర్థం చేసుకోవచ్చు. ఓరుగల్లులో 5,500 శివాలయాలు, 1,300 వైష్ణాలయాలు, 2,400 మైలారు పోలేరుల గుళ్ళు ఉన్నట్లు ఏకామ్రనాథుడు ప్రతాపరుద్ర చరిత్రలో పేర్కొన్నాడు. దీనినిబట్టి ఆనాడు శైవ, వైష్ణవాలతో పాటు స్థానిక దేవతకు కూడా ప్రాధాన్యత ఉన్నట్లు చెప్పాలి.

అయితే 12, 13 శతాబ్దాల కాలంలో శైవ, వైష్ణవాల మధ్య సఖ్యత లేదు. భేదాలతో ఆయా మతస్తులు యుద్ధాలకు, గొడవలకు దిగేవారు అనే అభిప్రాయం చరిత్రకారులలో, సాహిత్యకారులలోనూ ఉంది. కానీ ఇది సరైన అభిప్రాయంకాదు. మతం, దాని సిద్ధాంతాలు సంపూర్ణంగా పాటించడం అనేది, దానికే కట్టుబడి ఉండడం అనేది సామాన్య ప్రజలకు సంబంధించిన అంశం కాదు. పాలక వర్గంలో శ్రమకు దూరంగా ఉంటూ మత సైద్ధాంతిక వాదాలతో జీవించే వారికి మాత్రమే సంబంధించినది. ముఖ్యంగా ఉపశ్రేణికి చెందిన శ్రామికజనం నిర్దుష్ట మత స్వభావంలో ఉండడం, ఆచరించడం వారి దైనందిన జీవితానికే కుదరదు. ఏదో కొద్దిమంది ఉన్నతశ్రేణి వర్గానికి చెందిన వారి మత గొడవలను సామాన్యుల జీవితాలకూ వర్తింపజేసి చరిత్రను, సాహిత్య చరిత్రనూ అలా చూడడం సబబుగాదు. ఈ విషయాన్నే ఎన్.ఎస్.రాజుగారు ఇలా నిరూపించారు. వారి అభిప్రాయం ఈ కింది విధంగా ఉంది. *"ఆనాడు మత సంబంధమైన తాత్త్విక చింతనలకు బ్రాహ్మణుడు పట్టుకొమ్మ. బ్రాహ్మణుడు మేధోజీవి అవడం దానికొక కారణం. ఆ కాలంలో శైవ మత శాఖలు శివుని కేంద్రంగా చేసికొని ద్వైతభక్తినీ, శివుడొక్కడే భగవంతుడు ఇతరులు కారు అనే భావాన్నీ ప్రచారం చేస్తున్నాయి. అప్పటికి వైష్ణవ భక్తి కూడా ప్రచారంలో ఉంది. ఈ సిద్ధాంతాలకు శంకరుని అద్వైతప్రతిగా నిలిచింది. ఈ వాదాల వివాదాలుగానీ, సమన్వయం గానీ విద్యావంతులకే పరిమితం కాని, సామాన్య ప్రజానీకానికి వీటితో పనిలేదు. వీరిది ఏదో ఒక భక్తి మార్గంపై ఆధారపడిన అనుసరణే! అందుచేత శైవ వైష్ణవ సిద్ధాంత విభేదాలు బ్రాహ్మణ వర్గంలో ఉండి ఉండవచ్చు. వారిలో ఆయా సిద్ధాంతాల ఏకత్వాన్ని సాధించడం కోసం తిక్కన హరిహరాద్వైతాన్ని ప్రచారం చేశాడని అనుకోడానికి వీలుంది. దీనిని, 14వ శతాబ్ది పూర్వార్ధంలో ఉన్న నాచన సోమన అనుసరించాడు. 'ఈ భేద వాదులు పరివాదాస్పద వాదమోద మదిరాపానం చేతవంత్తులై ఒకరు శివుడు గొప్ప అంటే, మరొకరు విష్ణువు గొప్ప అంటూ ఆభేదాన్ని గుర్తించరు. కైలాస పర్వతం మీద మునులు శివకేశవుల ఏకత్వాన్ని భావించారు. మురవైరి పురవైరులు వేరనడం భ్రాంతి మాత్రమే కాక ద్రోహం కూడా పదునాలుగు లోకాల సృష్టిలయాలను చేయవలసిన వీరిద్దరు చివరకు ఒక్కటైయుండి, భిన్నులనే వారిని వదరు బోతులునుగా చేస్తారు'. అని నాచన సోమన ఉత్తర హరివంశంలో ప్రకటించాడు. దీనిని బట్టి శైవ వైష్ణవ భేదాలున్నాయని, అవి కేవలం బ్రాహ్మణ కులానికే పరిమితమై ఉండి ఉంటాయని ఊహించవచ్చు. ఈనాడు బ్రాహ్మణులలో అధికులు అద్వైత మతానుయాయులు కావడం దీనికి నిదర్శనం. ఆనాడు*

*ప్రజాస్వామ్యంలో ఉన్నది సామరస్య భావమే. తిక్కన ప్రకటించిన హరిహరా ద్వైత్వం, తాను జీవిస్తున్న వర్గానికి చెందిన భావన అనికూడా ప్రతిపాదించబడింది. తిక్కనకు పూర్వమే హరిహరనాథ ఆరాధన కొన్ని ప్రాంతాలలో ఉందనే చారిత్రకుల అభిప్రాయాన్ని కూడా ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవచ్చు."* (రాజు, ఎన్. ఎస్ 1991: 51, 52)

## 5.8.1. వీరశైవం - ఆంధ్రదేశం

ఇటువంటిదే మరొక ప్రతిపాదన ఆంధ్రదేశ చరిత్రకారులలో ఉంది. ఆంద్రదేశంలో వీరశైవం ఉంది. దీని కారణంగా వీరశైవం మతానుయాయులు జైన, బౌద్ధ మతస్తులపై దాడులు చేశారు. ఇది కూడా సరైన ఆధారాలతో కూడిన ప్రతిపాదన కాదు.

క్రీ.శ. 12, 13 శతాబ్దులలో కన్నడదేశంలో వీరశైవ మతం బసవేశ్వరుని నాయకత్వాన విజృంభించి వ్యాపించింది. ఇది అన్య మతాలను తక్కువగా చూడడం కూడా కనిపిస్తుంది.

"*బసవేశ్వరుడు వైదిక పౌరాణిక మతాల్లోని భక్తిని, అ వైదిక మతాల్లోని సార్వజనిక సమానత్వాన్ని కలిపి ప్రబోధించి, మతాన్ని కుల, వర్గ రహితంగా అందరికి అందుబాటులోనికి తెచ్చేందుకు ప్రయత్నించాడు. ఈతడు తన మతాన్ని వ్యాప్తిచేయటానికి అన్యమతాలను కటు పదజాలంతో దూషించడమే కాకుండా కసాయి పనులు చేయించడానికి కూడా వెనుదీయలేదుట! జైన బౌద్ధ సమయాలను, వేద బ్రాహ్మణులను విపరీతంగా నిరసించి ఖండించాడు.*" (కనకదుర్గ, పి 1992: 95)

కాని ఈ వీరశైవ మత ప్రభావంతో ఆంధ్రదేశంలో వ్యాప్తి చేయడానికి ప్రయత్నించిన మల్లికార్జున పండితారాధ్యునికి, పాల్కురికి సోమనాథునికి అది పూర్తిగా సాధ్యపడలేదు. కారణం వీరి వద్ద అధికారం లేదు. బసవేశ్వరునికి అధికారం, రాజు అండదండలు ఉన్నాయి. మల్లికార్జున పండితారాధ్యుడు కళ్ళుకూడా పోగొట్టుకోవడం వెనుక అతనికి అధికారం లేకపోవడమే ముఖ్య కారణం. అయితే వీర శైవమత ప్రభావంతో మల్లికార్జున పండితారాధ్యుడు ఆ రోజుల్లో రాజసభలలోను పండిత తాత్విక చర్చల్లోను వేద, కర్మ, కాల, వేదాంత,

సాంఖ్య, యోగ, చార్వాక, పంచరాత్ర, బౌద్ధ, జైన వాదాలను తిరస్కరించి ఉండవచ్చు. ముందే చెప్పుకొన్నట్లు ఇది కేవలం పండితుల మధ్య జరిగిన పాండిత్య చర్చలేక తాత్విక చర్చ మాత్రమే. సామాన్య ప్రజలకు సంబంధం లేదు.

ఆంధ్రదేశంలో రాజులు ఏ మతాన్ని అవలంబించినా అన్యమతాల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండేవారు. కర్ణాటకలోని వీరశైవం ఆంధ్రదేశంలో పరమత సహనం వల్ల ఆరాధ్య శైవంగా మారిందని చెప్పవచ్చు. దీనిలో భక్తి ప్రధానంగా కుల వ్యవస్థను గుర్తిస్తుంది. అంటే సమాజ స్వరూపానికి మూలమైన ఆర్థికస్థితిలో ఎటుంటి మార్పు తీసుకు రాలేదని గుర్తించవచ్చు.

బసవపురాణంలోను, పండితారాధ్య చరిత్రలోను, వీరశైవులకు, జైన బౌద్ధులకు మధ్య సంఘర్షణలు, గొడవలు జరిగినట్లు చెప్పబడి ఉంది. అంతేగాక జైనులపై ఆంధ్రదేశంలోని వీరశైవులు దురాగతాలు జరిపినట్లు కూడా ఒక అభిప్రాయం ఉంది. దీనికి సరైన ఆధారాలు లేవు. ఈ విషయాన్ని చెప్తూ ఎన్. ఎస్. రాజు గారు తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశారు.

*"వీనికి తగిన ఆధారాలు శైవ వాఙ్మయంలో గాని ఆ కాలంనాటి శాసనాలలో గాని కనిపించలేదు. అప్పటికి బౌద్ధ జైనాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. 12వ శతాబ్దికి పూర్వం సంఘర్షణలు జరిగి ఉండవచ్చు. పండితారాధ్య చరిత్రవాద ప్రకరణం జైన వాద నిరసన సందర్భంగా పేర్కొనబడిన సంఘటనలు మల్లికార్జున పండితునకు పూర్వం జరిగినవి. అందులో పన్నెండుగురు శివభక్తుల కథలు ఉన్నాయి. అన్నిటా శివభక్తుల ఆధిక్యమూ, విజయమూ, జైనుల అల్పత్వమూ, ఓటమీ వర్ణించబడ్డాయి. వీటిలో ఒకటి రెండు తప్ప, కదమావన్నీ కన్నడ, తమిళ దేశాలకు చెందినవి. ఆంధ్రదేశంలో నిజంగా వీరశైవమతం విస్తృత పరిధిలో వ్యాపించలేదు. ఆ మతం కొద్దిగా తన ప్రభావాన్ని చూపింది. అందుచేత చెదురుమదురుగా సంఘటనలు జరిగి ఉంటాయి. అవే శైవ వాఙ్మయంలో కనిపిస్తున్నాయి. కాకతీయుల కాలంలో తరచుగా శైవులు జైనులను హింసించేవారని ప్రతిపాదించడానికి ఇవి బలమైన ఆధారాలు కావు."*

(రాజు, ఎన్. ఎస్ 1991: 54, 55)

దీనిని బట్టి ఆనాడు ఆంధ్రదేశంలో మతఘర్షణలు అంతగా లేవని చెప్పవచ్చు. ఉన్నా వీటికి ఉపశ్రేణి వర్గానికి చెందిన సామాన్య ప్రజలకు ఎటువంటి సంబంధం లేదు.

అయితే శైవ వాఙ్మయంలో వీరశైవ మతస్తుల యొక్క జీవనవిధానాన్ని, మతం యొక్క గొప్పతనాన్ని మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమన చెప్పారు.

## 5.8.2. వీరశైవం - ఉపశ్రేణి వర్గాల భక్తులు

కన్నడ దేశంలో వీరశైవం 12వ శతాబ్దానికి పూర్వమే ప్రారంభమై 12వ శతాబ్దానికి బసవని వల్ల ఉద్యమ స్వరూపాన్ని పొంది 13వ శతాబ్దానికల్లా కనుమరగైంది. అయితే కన్నడంలో ఈ ఉద్యమం నిమ్న కులాలలో అప్పటి వరకు ఉన్న మత వ్యవస్థ పట్ల, వర్ణ వ్యవస్థ పట్ల కలిగిన నిరసన ఫలితంగా ఉద్భవించింది. కాని ఉద్యమాన్ని తాత్వికంగా వ్యాపింపజేసింది ఉన్నతశ్రేణి వర్గానికి చెందిన బసవన. దీనిని తెలుగులో అందిపుచ్చుకొన్న మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు ఇద్దరు కూడా ఉన్నతశ్రేణికి చెంది బ్రాహ్మణ కులానికి చెందినవారే.

క్రీ.శ. 12, 13 శతాబ్దాల కాలంనాటి సామాజిక, చారిత్రక పరిస్థితులను బట్టి ఒక ఉద్యమం నిమ్న కులాలవారి ద్వారా వచ్చే స్థాయికి ఉపశ్రేణి వర్గం అభివృద్ధి చెందలేదు. వీరిలోని నిరసన భావనలను మాత్రమే ఉన్నతశ్రేణి వారు గుర్తించి తాత్వికంగా మత ఉద్యమాన్ని తీసుకు రావలసిన పరిస్థితి ఉంది. అందుకే బసవన దానిని గుర్తించాడు. తెలుగులో పండితారాధ్యుడు, సోమనాథుడు గుర్తించారు. వీరశైవాన్ని కుల, వర్ణ, వర్గ రహితంగా శివభక్తి సాధనంగా స్థాపించడానికి వీరు ప్రయత్నించారు, ప్రచారంచేశారు. ఈ క్రమంలో వీరు స్వతంత్రమైన భక్తి విధానాన్ని ఏర్పరచుకొన్నారు. అంతకుముందు శాస్త్రజ్ఞానాలను వీరశైవం ద్వారా అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించారు.

వీరశైవులు విభూతి పులుముకొంటారు. లింగాధారణ చేస్తారు. శివపాదోదకాన్ని, ప్రసాదాన్ని స్వీకరిస్తారు. స్మార్త శైవులు దీనిని ఆచరించారు. కాని దాక్షారామంలో స్మార్త శైవంలో పుట్టిన మల్లికార్జున పండితారాధ్యుడు వీర శైవ విధులను ఆచరించడం చూసి అక్కడున్న బ్రాహ్మణులు అడుగుతారు. అప్పుడు మల్లికార్జున పండితుడు వేద ప్రమాణాలతో విభూతి మహిమను, పాదోదక మహిమను, లింగార్చన మహిమను, లింగాధారణ మహిమను, ప్రసాదస్వీకార మహిమను చెప్పాడు. అద్వైతులను తిరస్కరించాడు. జైన, బౌద్ధ మతాలను ఖండించాడు. వీరశైవమే నిజమైన మతమని, శివభక్తుడే ఇతర మతస్తుల కంటే గొప్పవాడని చెప్తాడు. ఈ విషయమే ఈ కింది పద్యములో చెప్పబడింది.

"*తనకంటె వేఱ యీశ్వరుఁ*
*న లేఁడని పలుకునట్టి యద్వైతవిమూ*
*ఢునకును లోకాయతునకు*
*వినఁగా భేదంబు గలదె విష్ణువరేణ్యా!*" (శివతత్త్వ సారము - 45)

శివభక్తుడే నిజమైన భక్తుడనే భావం కింది పద్యంలో చెప్పబడింది.
"*ఒక వైష్ణవుడొక మీమాం*
*సకుడొక బౌద్ధుండు నొక్క - జైనుడు త్రిపురాం*
*తకు భక్తునట్లు నిజసా*
*క్షిక దృష్టాంత ప్రసిద్ధగీర్తన గనిరే!*" (శివతత్త్వ సారము - 242)

ఇలాగే వీరశైవ మత తత్వాన్ని, భక్తుల కథలను శైవ వాఙ్మయం వివరించింది. మత ధర్మాలను, భక్తులు, మతస్తులు అనుసరించాల్సిన విధులను కూడా సూచించింది.

"*పండితారాధ్య చరిత్రలో వీరశైవ ధర్మాన్ని, సిద్ధాంతాన్ని నిష్కర్షగా ప్రవచించడం జరిగింది. వీరశైవులు తమ కళ్లను, పుత్రులను, ప్రాణాలను సైతం ఇవ్వడానికి వెనుకాడరు. చూస్తే ఈ విషయం తెలుస్తుంది. కన్నప్ప, సిరియాళుడు,*

*నిమ్మవ్వ, కుమ్మర గండయ్య, ముసిడి చౌడయ్య, గోపూరి బ్రహ్మయ్య, వైజకవ్వ, శ్వపచయ్య కక్కయ్య, గుడ్డవ్వ మొదలైన ఎంతో మంది భక్తుల ప్రదర్శనలు ఈ విషయాలనే తెలుపుతున్నాయి."* (ప్రమీలారెడ్డి, ఎం 2000: 42)

శివభక్తులకు పరమాత్ముడంటే శివుడే, కర్మ సిద్ధాంతాన్ని నిరసిస్తూ శివతత్వానికి ప్రాధాన్యం ఇస్తారు. ఈ విషయాన్నే బసవపురాణంలో సోమనాథుడు ఇలా చెప్పాడు.

"*గత పూర్వజన్మ సంస్కారుఁడై తలఁప*
*వితత ద్విజత్వంబు పతితంబుగాదె?*
*నిర్మల గురు కృపాన్వీత జన్మునకు*
*గర్మ జన్మంబు దుష్కర్మంబు గాదె?*
*యగ్గురు పాదంబులర్పించునతని*
*కగ్గిలో హవి వేల్చుటది దప్పుగాదె*
మల హరాత్మ కమగు మంత్రంబు గఱచి
పలు మంత్రములు గొనఁచాపంబు గాదె?
శూలి భక్తుల కిత్తుట మఱి తప్పుగాదె?
కర్మ పాశంబు లొక్కటఁ దెగ నీల్గి
కర్మంబుతాళ్లు దాఁగట్టు కోఁదగునె?
రుద్రాక్ష భసితాదిముద్రలు దాల్చి
క్షుద్రముద్రలు దాల్పఁగూడునే చెపుమ?
యీరీతిఁ ద్రాటికి దూరమై యున్న
వీరమా హేశ్వరాచార దీక్షితుని
నిర్మిలోభయకర్మ నిర్మూలు నన్నుఁ
గర్మిఁబి ముంచుట ధర్మమే నీకుఁ?
గ్రచ్ఛఱఁ గన్నులఁ గానవుగాక
వచ్చునే బసవని వడుగు నేయంగ
బ్రహ్మశిరోహరుఁ బ్రమథై కవంశ్యు
బ్రహ్మవంశ్యుం డని భావించె దెట్లు?
జాతి గోత్రాతీతు సద్గురుజాతు

జాతి గోత్రక్రియాశ్రయుఁ జేసెదెట్లు?
లకులస్థుఁడై యున్న యభవుని భక్తు
నికి నేకులం బని నిర్ణయించెదవు?
కావున నెన్ని మార్గములను వడుగు
గావింపఁగా రాదు కథ లేమిచెప్ప"

(బసవపురాణం, ప్రథమాశ్వాసం)

## 5.8.3. అన్యమత నిరసన

వీరశైవమతం ఇతర మతాలను అంటే బ్రాహ్మణాధిక్యాన్ని, వైదికమతాన్ని, జైన, బౌద్ధ మతాలను నిరసించింది. వాటిలోని లోపాలను ఎత్తి చూపింది. ముఖ్యంగా బ్రాహ్మణులు రాజాదరణతో వైదిక మతాన్ని పెంచి పోషిస్తూ సమాజంలో వర్గ తత్వాన్ని ఎలా కలుగజేస్తున్నారో తెలుసుకొంది వీరశైవం. అందువల్లే నిమ్న జాతులను మతానికి దగ్గర జేయడానికి ప్రయత్నించారు.

ఈ కారణం వల్లే శైవ వాఙ్మయంలో బ్రాహ్మణులు ఆచరించె విధులను నిరసించడం కూడా కింది విధంగా ఉంది.

*"మల హరాత్మకమగు మంత్రంబుగఱచి*
*పలు మంత్రములు గొనఁబాపంబు గాదె?*
*శూలి భక్తులకెత్తు కేలది త్రాతి*
*మాలల కెత్తుట మఱి తప్పుగాదె?*
*కర్మ పాశంబు లాక్కటఁదెగనీల్గి*
*కర్మంబు త్రాళ్ళు దాఁగట్టుకోఁదగునే?"*

(బసవపురాణం, ప్రథమాశ్వాసం)

ఈ విధంగా యజ్ఞోపవీతం బ్రాహ్మణులకు అవసరమే కానీ శివభక్తులకు శివదీక్ష తర్వాత అటువంటి మంత్రాలు, యజ్ఞోపవీతం లాంటిది అక్కరలేదు. బ్రాహ్మణ ఆధిక్యాన్ని ఎదిరించాయి వీరశైవ వాఙ్మయ గ్రంథాలు.

*"అసమాక్షు గొలువని అగ్రజుడైన*
*వసుధ మాలల మాలవాడ కాకెట్లు*

-------------------------------

*నామాల కుక్కల నర్చింపదగునె*

-----------------------------

*వేద భరాక్రాంతుల నగబడిన*

*బ్రాహ్మణ గార్దంభుంబుల తోడ*" (బసవపురాణం, ప్రథమాశ్వాసం)

ఈ విధంగా వైదిక మతస్థులను తిట్టడానికి కూడా వీరశైవులు వెనుకాడేవారు కాదని తెలుస్తుంది. అయితే శైవవాఙ్మయ గ్రంథాల వలన ఒక్క విషయం పూర్తిగా అవగాహన అవుతుంది. వీరశైవమతం ఆచరణలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, ఉన్నతశ్రేణి ఆధిక్యతను తొలిగించ లేకపోయినప్పటికీ, శైవ వాఙ్మయ గ్రంథాలలో నిరసించింది. ఇది ఆనాటికి గొప్ప పరిణామం.

వీరశైవ మతస్థులు అన్యమతస్థుల పట్ల సహనం ప్రదర్శించరాదని, శైవుడైనా అతను స్మార్త శైవానికిగాక వీరశైవానికి చెందినప్పుడు శివదీక్షకు అర్హుడని పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ప్రకటించాడు.

*"విను శివరూపాయ విష్ణవేయనఁగఁ*
*జెనసె వెండయు యథా శివమయో విష్ణ*
*వన నొక్క చందమే నయ్యిరువురును?"*
*"విష్ణుండు శివుడు నా వఱె శివాయ*
*విష్ణు రూపాయ నా వెండియు నంద*
*విను శివరూపాయ విష్ణవే యనఁగ*
*మును మ్రోయుఁదత్సూక్తి వినవెయంటేనిఁ*
*దలఁపఁ బ్రక్షిప్త సూక్తముగాక శ్రుతులు*
*పలుకునె శివుని రూపమ విష్ణుఁడనుచుఁ*
*దవిలి మూర్తామూర్త తాత్త్వికంబైన*
*శివు దివ్య రూపంబుఁజెప్పెద వినుము"*

(పండితారాధ్య చరిత్ర, వాద - త్రివిక్రమ ఖండనము)

ఈ విధంగా శివుని ఆధిక్యాన్ని, విష్ణువు అల్పత్వాన్ని ప్రకటించాడు. విష్ణువు, శివుడు వేరువేరని ఖచ్చితంగా చెప్పాడు సోమనాథుడు.

ఈ విధంగా విష్ణువును తక్కువ చేయడమే గాక వీరశైవం బహు దేవతారాధనను ఖండించింది. బహుదేవతారాధన వైదిక మతం ఉన్న అంశాలలో ప్రధానమైంది. దీనిని కూడా వీరశైవం తన గ్రంథాల ద్వారా చెప్పడం గుర్తించ దగిన అంశం. సోమనాథుడు బసవపురాణంలో ఇలా ఈ అంశాన్ని చెప్పాడు.

*"సహజలింగైక్య నిష్ఠాయుక్తి భక్తి*
*బహు దేవతా సేవ బ్రాహ్మణ పథము*
*కులసతి యట్లు నిశ్చల యుక్తి భక్తి*
*వెలయాలి యట్టు లవ్వి ప్రమార్గంబు"*
*"ఇలవేలుపైన సర్వేశ్వరుఁడుండ*
*బలు వేలుపులఁ గొల్వబాడి యే చెపురు?"*

(బసవపురాణం, ప్రథమాశ్వాసం)

ఇంతే కాకుండా జైనులను రాళ్లతో కొట్టి హింసించినట్టు, శైవేతరులు రాసిన గ్రంథాలను తగలబెట్టినట్టు, శివనింద చేసిన వారిని చంపాలనట్టు శైవ వాఙ్మయంలో పేర్కొనబడింది.

దీని ద్వారా ప్రజలను ఆకర్షించి మతంలో చేర్చడం కోసం సామాన్యులను రెచ్చగొట్టడం ఆనాటి సమాజంలో ఉన్నట్లు తెలుస్తోంది.

## 5.8.4. మతస్వేచ్ఛ

శైవవాఙ్మయం చెప్పిన వీరశైవ మతాంశాలలో గుర్తించదగిన మరో అంశం స్త్రీకి మతస్వేచ్ఛ. శివభక్తులు కాని భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉంది. ఈ సందర్భంలో శివభక్తుడు కాని భర్తను భార్య వదిలివేయ వచ్చని, అది తప్పు కాదని శైవ సాహిత్యంలో పేర్కొనబడింది.

*"వీరశైవం కులం కట్టుబాట్లు తెంచినట్లుగానే కుటుంబంలోని భార్యభర్తల మధ్య కూడ ప్రవేశించి స్త్రీకి స్వేచ్ఛను ప్రకటించింది. ఇది మహిళలకు అభ్యుదయకరమైన మార్గం అని భ్రమించకూడదు. ఇది మతావేశంతో వచ్చిందే కాని, వ్యవస్థలో స్త్రీ స్థానం ప్రాతిపదికగా రాలేదు. దీనివల్ల ఆనాడు స్త్రీకి మేలు కంటె హెచ్చుగా కీడు కలిగి ఉంటుంది. హిందూ కుటుంబ వ్యవస్థ చాలా పటిష్ఠమైంది. పతిభక్తి, పతివ్రతా ధర్మం నెలకొని ఉన్నాయి. అందువల్ల వీరశైవం చేసిన ప్రబోధం బహుళ ప్రచారంలోకి వచ్చి ఉండదు."*

(రాజు, ఎన్. ఎస్ 1991: 64)

ఆనాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా కూడా ఇది వాస్తవం. మతావేశంతో ప్రకటించిన స్త్రీ స్వేచ్ఛ అయినా ఇటువంటి ఆలోచనను చెప్పడం శైవవాఙ్మయంలోని గొప్ప అంశం. ఈ పై భావాలను ప్రతిపాదించే శివతత్త్వ సారంలోని పద్యాలు కింది విధంగా ఉన్నాయి.

*"శివభక్తుఁడ వగుమని పతి*
*కవిరతమును బుద్ధి చెప్పనగు శివభక్తిం*
*దవిలిన సతి కతఁడొడఁబడఁ*
*డవు నేనయునతని మీఱ నగుభక్తి మెయిన్.*
*పురుషునకు భక్తిలేదని*
*పురేషేచ్ఛకు నడవజనమ పురహర భక్తిన్*
*బరగు సతి పురుషు మీఱియుఁ*
*బురహుఁ గొలుచునది సిత్తమున విడిచిపతిన్*
*పురుష ప్రతి కూలత్వ*
*స్థిర దోషము సతికి దుర్గతిం జేయదుత*
*త్పురుషుఁద భక్తుఁడ యేనిం*
*బురుషుని మీక్షియును శివునిఁ బూజించునెడన్"* (శివతత్త్వ సారము)

ఇటువంటి అంశవే బసవపురాణంలోని వైజకవ్వ కథలో ప్రస్తావించబడింది. ఈ కథలో భార్య శైవ మతస్థురాలు, భర్త జైనుడు. శివుడు,

జంగమ వేషంలో వచ్చి ఆ ఇంట్లో విందారగిస్తాడు. భార్య తన ఆజ్ఞను తిరస్కరించిందని ఇంట్లో నుండి పొమ్మని భర్త కొడతాడు. ఆ దెబ్బలు ఆమె భర్త వలన విందారగించిన జైనగురువుకు తగులుతాయి. ఈ విధంగా వీరశైవం అన్యమతాల, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని తిరస్కరించింది. శివభక్తులకు స్వేచ్ఛను ప్రకటించింది. శివ ధూషణ చేసిన వారిని శిక్షించమని చెప్పింది. 12, 13 శతాబ్దులలో కుటుంబ వ్యవహారాల్లోకి చొచ్చుకుని పోయింది. వీరశైవ దృక్పథంతో వచ్చిన వాఙ్మయంలో వాస్తవ జీవితంపై ఉన్న మత ప్రభావం తెలుస్తుంది. ఆంధ్రదేశంలో వీరశైవం పూర్తి ఉద్యమ స్వరూపాన్ని పొందలేకపోయినా ఉపశ్రేణి వర్గాలలో మతానికి ఉన్న స్థానం తెలుస్తుంది.

## 5.9. మిండ జంగాలు

వీరశైవమతంలో జంగముడైన విటులను మిండజంగాలు అంటారు. వీరికి మతానుయాయులలో గౌరవప్రదమైన స్థానం ఉంది.

ఆనాడు వేశ్యావృత్తి అగౌరవంగా లేదు. అలాగే మిండజంగాలు కూడా పూజార్హత కలిగినవారే. "*వీరశైవం శివసాధులకు వ్యభిచారం తప్పుకాదంది. కల్యాణిలో బిజ్జలుని కాలంలో వేలాది మిండ జంగములుండేవారు. వారికి బసవన వేశ్యలు పంపించేవాడట.*" ఇలా వేశ్యల ఇండ్లల్లో మిండజంగాలు ఉండి పూజలు అందుకొనేవారు.

"*ముప్పూట నోగిరంబులు(బదార్థములు(*
*దప్పక కావళ్ల నెప్పుడు(బంప*
*వెండి వేశ్యలయిండ్ల నుండి భోగించు*
*మిండ జంగములు పండ్రెందు వేలనిన*
*నున్న జంగమ సంఖ్యమున్ను రూపించి*
*యేన్నంగ శక్యమే యీశునకైన*
నునుచు భక్తానీక యచ్చెరువంద
న నయంబు భూతి శాసను లాది గాఁగ

నెల్లభక్తావళి కీప్సి తార్థములు
సెల్లించుచును భక్తి సేయుచున్నెడను
బరమేశు భక్తియ ప్రాణమై పరుగు
తరుణి మానాగాంబ వరతనూ భవుఁడు"

(బసవపురాణం - ద్వితీయాశ్వాసం)

మిండ జంగాలకు భోజన సదుపాయాలను చేకూర్చేవారని పైవాక్యాల వలన తెలుస్తుంది. దీనిని బట్టి శివ భక్తులైన విటులకు కూడా సకల సౌకర్యాలు ఉండేవని అర్థమవుతుంది.

* * *

# 6. ముగింపు

శైవవాఙ్మయంలో ప్రధానంగా క్రీ.శ. 12, 13 శతాబ్దాల నాటి సమాజంలోని ప్రజల జీవన విధానాలు ఉన్నాయి. చరిత్ర రచనకు సాహిత్యమూ ఉపకరిస్తుంది అన్నదానికి ఈ శివకవుల రచనలు ఉదాహరణలు. చరిత్ర ఉన్నత శ్రేణికి సంబంధించిందే కాదు, ఉపశ్రేణికి సంబంధించినది కూడా అన్న దృష్టితో సాహిత్యాన్ని చూడవలసిన అవసరాన్ని గుర్తించాలి.

తెలుగు లిఖిత సాహిత్యాన్ని తీసుకొంటే చారిత్రక పరిశోధకులు భావించినట్లు తెలుగు సాహిత్య మంతా ఎక్కువ ఆస్థాన సాహిత్యమే. అంటే సమాజంలో ఉన్నతశ్రేణి వర్గాల జీవన విధానాలను, వారి కళలను, వారి సాంస్కృతిక జీవితాన్ని తెలిపేది. జానపద సాహిత్యం లేదా ఆస్థానేతర సాహిత్యం ఇటీవలి కాలం వరకు సాహిత్యంగా గుర్తింపును పొందలేదు. కాని ఆస్థాన సాహిత్యమైనా ఉపశ్రేణి వర్గాల జీవన విధానానికి ప్రాధాన్యం ఇచ్చి స్థానాన్ని కల్పించిన సాహిత్యశాఖ ఒకటి తెలుగు సాహిత్య చరిత్రలో ఉంది.

ఈ శాఖ ఉన్నతశ్రేణి వర్గం నుండి వెలువడిన ఉపశ్రేణి వర్గాలకు సంబంధించిన శాఖ. దీనికి సంబంధించి తాత్విక చారిత్రక కారణాలు ఉన్నాయి. ఉన్నతశ్రేణికి సంబంధించిన సాంస్కృతిక, మత ఆచారాలలోకి ఉపశ్రేణి వర్గాలను మార్చడం. అదే విధంగా సమాజంలో రెండు వర్గాలు ఉన్నప్పుడు ఒక వర్గ సంస్కృతి గొప్పది అని గుర్తింపు ఏర్పడిన తర్వాత కింది వర్గం పై వర్గ ప్రభావానికి లోనుకాకుండా ఉండదు. ఇలాంటి క్రమంలో ఉపశ్రేణి వర్గం తన సంస్కృతిని కోల్పేయే ప్రమాదం ఉంది.

ఇదే విధంగా ఉన్నతశ్రేణి ఉపశ్రేణి వర్గంలో ఉన్న లోపాలను గుర్తించి, వారి అభ్యున్నతికి ప్రాధాన్యం ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. అయితే ఈ ప్రయత్నం ఉన్నతశ్రేణిలో ఎవరైతే మొత్తం సమాజ పురోగతిని కాంక్షిస్తారో వారే చేస్తారు. వారు మత ప్రవక్తలు కావచ్చు, తాత్వికులు కావచ్చు, సాహిత్యకారులూ కావచ్చు.

అయితే సాహిత్యం కళాభివ్యక్తి కాబట్టి తప్పక పై లక్షణాలు సాహిత్యంలోనూ కనపడతాయి. ఈ విధమైన నేపథ్యంతో శివకవుల రచనలను అధ్యయనం చేయడం జరిగింది. శివకవులు మత ప్రచారం కోసం సాహిత్యాన్ని సాధనంగా వాడుకొన్నారు. వీరికి మతవ్యాప్తి ముఖ్యం. వీరు ఎన్నుకొన్న వీరశైవం ఆనాటి కాలానికి అభ్యుదయమే. అది సమాజంలోని అసమానతలను ప్రశ్నించింది. బ్రాహ్మణ ఆధిపత్యం నుండి నిమ్నకులాల అస్పృశ్యత వరకు ఈ మతం పట్టించుకొంది. శైవభక్తికి మించిన సమానత్వం లేదంది.

శైవ వాఙ్మయం కూడా ఇదే చెప్పింది. శివభక్తుడైతే చాలు కులంతో పనిలేదంది. శివభక్తుడు కాని బ్రాహ్మణుని కంటే శివభక్తుడైన నిమ్న కులస్థుడే ఉన్నతుడంది. కింది కులాల సామాజిక జీవితాన్ని చెప్తూనే శివభక్తిని కూడా చెప్పింది. తెలుగు లిఖిత సాహిత్యంలో ఆ కాలం నాటికి ఈ విధంగానైనా ఉపశ్రేణి వర్గాల గురించి పట్టించుకొన్న సాహిత్యం శైవసాహిత్యమే.

శైవ వాఙ్మయానికి అంటే శివకవులు ఎవరు? ఎందుకు? అనే ప్రశ్నలకు లక్ష్య నిర్దేశం చేసి వారి రచనలనే పరిశోధన పరిధిలోకి తీసుకోడం జరిగింది. ఈ రచనలలో ఉన్న ఉపశ్రేణి వర్గాల జీవితాలను అధ్యయనం చేయడంతో పాటు ఆకాలానికి చెందిన చరిత్ర గ్రంథాల ఆధారంగా ఉపశ్రేణి వర్గాల చరిత్రనూ క్లుప్తంగా పరిచయం చేయడం పరిశోధనా క్రమంలో భాగం.

చరిత్రకు, శివకవుల రచనలకు మధ్య సమన్వయాన్ని సాధిస్తూ అంటే చారిత్రక ఆధారాలను పరిధిలోకి తీసుకొంటూ శైవ వాఙ్మయాన్ని, అందులోని ఉపశ్రేణి వర్గాల ప్రజల జీవితాలను పరిశీలించడం మరో ముఖ్య భాగం. లక్ష్యం ఏదైనా పరిశోధనకు సాహిత్యం ఆధారం. దీనిలో సమాజ స్వరూప స్వభావాన్ని చూపడానికి ప్రయత్నం చేయడం జరిగింది. ఈ ప్రయత్నం ఉపశ్రేణి వర్గాలకు ప్రాతినిధ్యం వహించేది. వ్యవసాయం, స్త్రీలు, కులవ్యవస్థ, కులాధిపత్యం, మతం ఇలాంటివన్నీ సమాజంలోని ఉపశ్రేణి వర్గ ప్రజల జీవితాలతో ఎలా మమేకమై ఉంటాయి, వారిపై ఎలా ప్రభావాన్ని చూపుతాయి అన్న అంశాల చర్చ ఈ పరిశోధనలో కనిపిస్తుంది.

పై లక్ష్యాలను, లక్షణాలను దృష్టిలో ఉంచుకొని ఈ పరిశోధన చేయడానికి ప్రధానంగా కొన్ని అధ్యాయాలుగా విషయాలను విభజించాను.

మొదటి అధ్యాయం 'పరిచయం'. దీనిలో పరిశోధన చేయబోయే అంశాలను క్లుప్తంగా పరిచయం చేయడం జరిగింది.

రెండవ అధ్యాయం 'సాహిత్యం - సమాజం - మతం'. దీనిలో సాహిత్యం, సమాజం పరస్పరం సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఒకదానిని మరొకటి ప్రభావితం చేసుకుంటూ ఉంటాయి. సృజనకారుడయిన రచయిత సమాజంలో ఒక వ్యక్తి. అతడు సమాజంలోని విషయాల పట్ల స్పందించి రచన చేస్తాడు. ఆ రచన సమాజంపై ప్రభావం చూపి, అభివృద్ధికి కారణమవుతుంది.

ఏ సాహిత్యమైనా సమాజాన్ని వీడి ఉండదు. తనకు ఎటువంటి రచన కావాలో ఆ సమాజమే సృష్టించుకుంటుంది. ఆ కాలం నాటి పరిస్థితులు, చారిత్రక అవసరాలు, వర్తమానం ఆశించే భవిష్యత్తు, రచయిత జీవన విధానం, అతడి స్థాయి మొదలైన వన్నీ సమాజం రచనపై చూపే ప్రభావాలు. సాహిత్యానికి పరమావధి ప్రజలను జ్ఞానవంతులుగా చేసి ప్రగతి మార్గంలో నడపడం.

'సాహిత్యం - సమాజం - మతం' అనే ఈ అధ్యాయం సాహిత్యానికి, సమాజానికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది. శివకవుల రచనలలో మతం ప్రధాన విషయం కాబట్టి మతానికి, సాహిత్యానికి, సమాజానికి ఉన్న అంతర్గత సంబంధాలను స్థూలంగా పరిచయం చేయడం జరిగింది. అదేవిధంగా తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన సామాజిక మత అంశాలను కూడా క్లుప్తంగా పరిచయం చేయడం జరిగింది.

దీనిలోని ఉపవిభాగాలు :- సాహిత్యం - సమాజం, తెలుగు సాహిత్యం - సమాజం, ప్రాచీన సాహిత్యం - సమాజం, సాహిత్యం - మతం, తెలుగు సాహిత్యం - మతం, ప్రాచీన సాహిత్యం - మతం, ఆధునిక సాహిత్యం - మతం.

మూడవ అధ్యాయం 'శైవమతం - శైవసాహిత్యం'. ఈ అధ్యాయం శైవమతానికి, శైవసాహిత్యానికి సంబంధించింది. ఆదిమ మానవుడు ప్రకృతిని అర్థం చేసుకొనే క్రమంలో ఒక అతీంద్రియ లేదా అలౌకిక శక్తిని సృష్టించుకున్నాడు. అధికార వర్గం బలపడిన తర్వాత మానవ జీవన క్రమంలో అర్థంకాని అంశాలను ఆ అతీంద్రియ శక్తికి ఆపాదించడంతో పాటు దేవుడిపేర కొన్ని క్రతువులు చేయడం ప్రారంభమైంది. కాలక్రమంలో కొన్ని రకాల కార్యక్రమాలు ఏర్పడి మతంగా రూపొందాయి. దేవుడి రూపకల్పన, మతాల ఆవిర్భావం వేరువేరు మానవ తెగలలో వేరువేరు ప్రాంతాలలో భిన్న రకాలుగా ఏర్పడ్డాయి.

ప్రజలలోని మత ప్రాధాన్యతను గుర్తించిన అధికారవర్గం, మత కార్యక్రమాలను నిర్దేశిస్తూ, కొన్ని సైద్ధాంతిక నియమాలను బ్రాహ్మణులచే ఏర్పాటు చేయించింది. అవి కాలక్రమంలో బలపడుతూనే మార్పునూ పొందాయి. ఇలా మతం దైనందిన జీవితాల నుండి విడదీయలేని ప్రాధాన్యతను సంతరించుకుంది.

మతాల పరిణామంలో భాగంగా వాటితో అనేకశాఖలు ఏర్పడ్డాయి. మతం ప్రజల జీవితాలను నిర్దేశించే శక్తిగా కూడా ఎదిగింది. మతం సమాజంలో ఒక ప్రధాన భాగమైంది. ఇదే విధంగా శైవమతం కూడా ఆవిర్భవించింది. శైవమత వ్యాప్తికి శైవసాహిత్యం తోడ్పడింది.

ఈ అధ్యాయంలో శైవమతానికి, శైవసాహిత్యానికి మధ్యగల సంబంధాలు, శివకవులను నిర్ధారించడం అనే అంశాలు పరిశీలించబడ్డాయి. తర్వాత తెలుగు సాహిత్యంలో శివకవుల ప్రాధాన్యతను, శైవసాహిత్య లక్షణాలను తెలుపుతూ శివకవుల రచనలను పరిచయం చేయడం జరిగింది.

దీనిలోని ఉపవిభాగాలు :- శైవమతం - తత్త్వం, శైవమతం - దక్షిణ భారత దేశంలో వ్యాప్తి, శివకవులు, శివకవులు - తెలుగు సాహిత్యం, శైవసాహిత్యం - లక్షణాలు, శివకవులు - రచనల పరిచయం.

నాలుగవ అధ్యాయం 'క్రీ.శ. 12, 13 శతాబ్దాల సమాజం - ఉపశ్రేణి వర్గాల పరిచయం'. ఈ అధ్యాయంలో ప్రధానంగా శివకవులనాటి సమాజం అంటే క్రీ.శ. 12, 13 శతాబ్దాల కాలంనాటి సమాజ స్వరూప పరిశీలన జరిగింది. ఈ కాలంలో ఆంధ్రదేశాన్ని కాకతీయులు పాలించారు. అందువల్ల ఆకాలంనాటి చరిత్ర ఆధారంగా ఉపశ్రేణి వర్గాల సామాజిక జీవితాన్ని క్లుప్తంగా పరిచయం చేయడం జరిగింది. ఆ కాలంలో భిన్న మతాలు, కులాలు, వారి ఆచార సంప్రదాయాలు అంటే సాంస్కృతిక అంశాలను స్థూలంగా పరిచయం చేయడం ఈ అధ్యాయంలో గమనించవచ్చు.

కాకతీయుల పాలనలోని ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించడం ద్వారా ఉపశ్రేణివర్గాల ప్రజల సంస్కృతిని తెలుసుకోవచ్చు. దీనిలో భాగంగా ఈ పరిశీలనలో ఆ కాలంనాటి మతం గురించి, ఏ ఏ మతాలు ఉన్నాయో అధ్యయనం చేయడం జరిగింది. ఆ కాలంలో శైవం, వైష్ణవం, జైనం, బౌద్ధం అనే మతాలు ఉన్నట్లుగా ఈ అధ్యయనం ద్వారా తెలిసింది. ఈ శతాబ్ధాలలో జానపద దేవతల గురించి, మంత్రాలు - తాంత్రిక విద్యలు - నమ్మకాలను గురించి, వర్గ కులాలను గురించి, దీనిలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, బోయలు, చెంచులు, పుళిందులు, గొల్లలు, కాపు/రెడ్డి, కమ్మ, కుమ్మరి, కాసె, సాలెలు, మేదరులు, మంగలి, చాకలి, వడ్రంగి, పిచ్చుక కుంట్లు, దూదేకులు, కాయస్థులు, కుట్టుపనివారు, పంచములు/దళితులు లను గురించి, వీరి జీవన విధానాలను గురించి, అధ్యయనం చేశాను.

ఈ కాలంలో ఉన్నటువంటి అలంకార సామాగ్రి, ఆహార పదార్థాలు, తూనికలు-కొలతలు, ఆటలు-వినోదాలు, పండుగలు-ఉత్సవాలు-జాతర్లు, వైద్యవిదానం, చెరువులు, నేరాలు-శిక్షలు గురించి కూడా తెలుసుకోవడం జరిగింది. ఇదేవిధంగా ఈ కాలంలో సాంఘీక దురాచారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో దొంగతనం, వేశ్యావృత్తి, మద్యపానం ఎక్కువగా ఉన్నట్లు ఈ అధ్యయనం ద్వారా తెలుసుకోడం జరిగింది.

పై విధమైన అంశాలలో తెలుగు సాహిత్య చరిత్రను చూసినప్పుడు దిగువశ్రేణి వారికి చెందిన జీవిత విశేషాలు అక్కడక్కడ కనిపిస్తాయి. శైవసాహిత్యం దీనికి గనివంటిది. పాల్కురికి సోమన వంటి వారి రచనలలో సామాన్యుల జీవిత విశేషాలు పుష్కలంగా కనిపిస్తాయి. దానిని ఆధారం చేసుకొని ఆ కాలంనాటి జన జీవితానికి సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విశేషాలను ఈ అధ్యయనంలో చర్చించడం జరిగింది. ముఖ్యంగా శైవ వాఙ్మయంలో కనిపించే ప్రజల జీవితం ఆధారంగా ఆ కాలంనాటి సామాజిక చరిత్ర నిర్మాణానికి దోహదం చేసే అంశాలను ప్రతిపాదించడం జరిగింది. అందుకు మూలమైన 12, 13 శతాబ్దాల కాలంనాటి చరిత్ర ఆధారంగా దిగువశ్రేణి వారి జీవన స్థితిగతులను పరిశీలించడం ఈ అధ్యాయంలో జరిగింది.

ఐదవ అధ్యాయం 'శైవవాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల జీవనం'. ఈ అధ్యాయంలో ముఖ్యంగా శివకవుల రచనల ఆధారంగా 12, 13 శతాబ్ధాలలోని సామాజిక చరిత్రను వివరించడం జరిగింది. సమాజంలోని ఉపశ్రేణి వర్గానికి చెందిన అంశాలన్నీ శివకవుల రచనలలో కనిపిస్తున్నాయి. ఇవన్నీ సామాన్యుల జీవన విధానాన్ని తెలియజేసేవి. శైవవాఙ్మయంలో ఉపశ్రేణి వర్గాల జీవితం ప్రతిఫలించిన విధానం ఈ అధ్యయనంలో చర్చించిన అంశం. శైవవాఙ్మయం వెలువడిన 12, 13 శతాబ్దాల కాలంనాటి సమాజంలోని కింది కులాలు, వారి జీవితం, వారి సంస్కృతి వంటి అంశాలను పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుల రచనలలో ఏ విధంగా ఉన్నాయో చూపడం ఇక్కడ జరిగింది.

కింది కులాలతోపాటు వ్యవసాయంలో కూలీలుగా ఉంటూ, జీవితాన్ని దుర్భరంగా అనుభవించేవారు, అంటరాని కులాలుగా జీవితాన్ని గడిపేవారు, వేశ్యలుగా ఉంటూ కష్టాలు అనుభవించిన స్త్రీలు ఇలా ఇటువంటి వారి వాస్తవ జీవితాలు శైవవాఙ్మయంలో కనిపిస్తున్నాయి. ఇవన్నీ వీరి రచనలలో ఎలా విశ్లేషించబడ్డాయో, కవిత్వీకరించబడి ఉన్నాయో పరిశీలించడం ఈ అధ్యాయం యొక్క ప్రధాన లక్ష్యం.

ఈ క్రమంలో భాగంగానే ఈ అధ్యాయంలో కులవ్యవస్థ, కులాలు-వృత్తులు దీనిలో బోయలు, వెట్టివారిని గురించి తర్వాత కులం-విద్య, కులం-దేవాలయం, కులం-అస్పృశ్యత, అంత్యకులజులు వీరిలో సూరసానమ్మ, చాకలి మాచయ్య, శివనాగయ్య వంటివారిని గురించి, కులం-శైవం గురించి వివరించబడింది. అదే విధంగా స్త్రీకి సంబంధించి, వేశ్యల గురించి, వేశ్యావృత్తిని గురించి చర్చించడం జరిగింది. దొంగతనాలు, కొలతలు, దానాలు, ఆర్థిక సంబందాలు, మేదరులు-వ్యాపారం, కూలీలు, వ్యవసాయం, ఉత్పత్తులు గురించి పరిశీలించడం జరిగింది. ఉపశ్రేణి వర్గాల-సంస్కృతిలో క్రీడలు, పండగలు-వినోదాలు, నోములు-వ్రతాలు, తిరునాళ్లు-జాతరులు, వ్యాధులు-వైద్యం, కళలు, గృహ వాతావరణం, మూఢనమ్మకాలు వంటివి అలాగే ఉపశ్రేణి వర్గాలు-మతంలో వీరశైవం, వీరశైవంలో ఉపశ్రేణికి చెందిన భక్తులు, అన్యమత నిరసన, మతస్వేచ్ఛ వంటివాని గురించి అలాగే మిండజంగాలు గురించి స్థూలంగా పరిశీలించడం జరిగింది.

ఆరవ అధ్యాయం 'ముగింపు'.

ఈ విధంగా సాహిత్యం ఆధారంగా సమాజ స్వభావాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేసిన పరిశోధనలు ఉన్నాయి. కాని ఉపశ్రేణి వర్గ ప్రజల జీవనాన్ని ప్రతిఫలించే మొత్తం తెలుగు సాహిత్యం ఆధారంగా కాకపోయినా ఈ వర్గ దృక్పథాన్ని కలిగి ఉన్న సాహిత్యం నుండైనా ఇటువంటి పరిశోధనలు ఇంకా రావాల్సి ఉంది.

ఉదాహరణకు శతక సాహిత్యం, భక్తి సాహిత్యం మొదలైనవి ఉపశ్రేణి వర్గాలను స్పృశించే సాహిత్యాన్ని సృష్టించాయి. కావున వీటిని పరిధిగా ఎంచుకుని ఇటువంటి పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.

* * *

# ఉపయుక్త గ్రంథ సూచి


1. ఆనందారామం, సి. 1987. సమాజం-సాహిత్యం. సికింద్రాబాదు : యం. శేషాచలం & కో.
2. ఆరుద్ర. 1977 సమగ్ర ఆంధ్ర సాహిత్యం. మొదటి సంపుటం. మచిలీపట్టణం : ఎమ్. శేషాచలం అండ్ కంపెనీ.
3. ఎహ్రెన్ బర్గ్, ఇల్యా 1989. రచయితా-శిల్పమూ. తుమ్మల వెంకటరామయ్య (అనుబంధం) హైదరాబాదు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. కనకదుర్గ. పి. 1992. కాకతీయులనాటి సామాజిక జీవనము : విజయవాడ : శ్రీమానస పబ్లికేషన్స్
5. కోదండరామయ్య. తిమ్మావజ్జల. 2001, దేశి కవిత్వోద్యమ స్థాపకుడు పాల్కురికి సోమనాథుడు. (ప్రథమ, ద్వితీయ సంపుటాలు). తిరుపతి : శ్రీ కోదండరామ మిత్ర మండలి.
6. క్రిష్టోఫర్ కాడ్వెల్ 2000. భ్రమ-వాస్తవం కవిత్వ మూలాల అధ్యయనం. పొట్లూరి వెంకటేశ్వరరావు (అనుబంధం) ఖమ్మం : సాహితి స్రవంతి ప్రచురణ.
7. చంద్రశేఖరరెడ్డి. డి. (సంపుటి) 1994 తెలుగు సాహిత్యం చారిత్రక నేపథ్యం హైదరాబాదు. ఆంధ్ర సారస్వత పరిషత్.
8. తమ్మయ్య బండారు వ్యాసావళి. కాకినాడ : శ్రీ నిర్మల శైవసాహిత్య గ్రంథమాలిక. కీలక నామ సంవత్సరం.
9. తమ్మయ్య. బండారు. 1969. శివశ్రీ బండారు తమ్మయ్య గారి వ్యాసావళి - కాకినాడ : శ్రీ నిర్మల శైవసాహితీ గ్రంథమాల
10. నారాయణరావు, వేల్చేరు. 1987 తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. హైదరాబాద్ : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్.
11. పాల్కురికి సోమనాథుడు. 2002. బసవపురాణం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.
12. ప్రమీలారెడ్డి. ఎం. 2000. కాకతీయ యుగ సాహిత్యంలో సంస్కృతి. బోస్తన్ - యు. ఎస్. ఎ. : ధీర సాహిత్య సాంస్కృతిక ప్రచురంబు

13. బలరామమూర్తి, ఏటుకూరి. 1966. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర. విజయవాడ. విశాలాంధ్ర ప్రచురణాలయం.

14. మలయశ్రీ. 1990. కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం. హైదరాబాద్ : హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

15. మల్లికార్జున పండితారాధ్యుడు. (12 వ శతాబ్దం) శివతత్త్వ సారము. వెంకటరావు, నిడదవోలు (పీఠికాకర్త). కృష్ణా పత్రిక ప్రచురణలు

16. రంగనాథాచార్యులు. కె.కె. (సంపుటి). 1983 తెలుగులో తొలి సమాజ కవులు. హైదరాబాదు : ఆంధ్ర సారస్వత పరిషత్తు

17. రంగనాధాచార్యులు, కె.కె. 1990. తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక హైదరాబాద్ : ఆంద్ర సార్వస్వత పరిషత్.

18. రమణారెడ్డి. కె.వి. 1997. ప్రాచీన భారతీయ సాహిత్యంలో సామాజిక ప్రతిబింబం ..... : విరసం ప్రచురణ

19. రమాపతిరావు, అక్కిరాజు (వచకర్త). 2001. బసవపురాణం (వచనం). ఓం నమశ్శివాయ సాహితీ సాంస్కృతిక పరిషత్. హైదరాబాదు.

20. రాజు. ఎన్. ఎస్. 1991. శివకవుల రచనలు - సమాజం. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

21. రామకృష్ణయ్య. కోరాడ. 1971. దక్షిణదేశ భాషా సారస్వతములు-దేశి అమలాపురం : కోదాడ నాగేశ్వరరావు.

22. రామకృష్ణశాస్త్రి, శిష్టా. 1948. వీరశైవాంధ్ర వాఙ్మయము. తిరుపతి. తిరుమల తిరుపతి దేవస్థానములు.

23. లక్ష్మీకాంతం, పింగళి. 1976. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

24. లక్ష్మీరంజనం, ఖండవల్లి. 1949. కాకతీయ యుగము. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

25. వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి, పుచ్చా (సంకలన కర్త). 1981. కాకతీయ శాసన సాహిత్యము. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు

26. వెంకటరావు, నిడదవోలు. 1951 ఉదాహరణ వాఙ్మయ చరిత్ర సంగ్రహము మద్రాసు : వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్

27. వెంకటరావు, నిడదవోలు. వీరశైవవాఙ్మయం. సారస్వత వ్యాసములు. (మొ. సంపుటం) సుబ్రహ్మణ్యం, జి.వి. (సంకలనకర్త). హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి

28. వేంకటావధాని, దివాకర్ల 1985 ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము. హైదరాబాదు : ఆంధ్ర సారస్వత పరిషత్తు.

29. శివశంకర్, పాపినేని 1996. సాహిత్యం మౌలిక భావనలు గుంటూరు. పాపినేని ప్రచురణలు

30. సత్యనారాయణ, కంభంపాటి. 1993. ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర హైదరాబాద్ : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్.

31. శివకుమార్, హరి. 2000. కాకతీయుల వైభవము, సాహిత్యము-కళలు-శిల్పము. న్యూఢిల్లీ : మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్

32. సుబ్రహ్మణ్యం, జి. వి. 1994. సాహిత్యంలో చర్చనీయాంశాలు. హైదరాబాదు : తెలుగు అకాడమీ

33. సుశీల, టి. 1979 ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. హైదరాబాదు : గ్రంథకర్త.

34. సుశీల. టి. 1979. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర.. హైదరాబాద్ : ప్రగతి గీతా ప్రెస్.

ENGLISH :

1. Nandimath,S.C 1979. A hand Book of Virasaivism. Motilal Banarsidass. Bungalow Road. Delhi.
2. Rohan A. Dunuwila. 1985. Saiva Siddhanta Thelogys. Motilal Banarsidars: Bungalow Road, Delhi.
3. Sivaraman, K 1973. Saivism in philosophical perspective. Motilal Banarsidass. Bungalow Road, Delhi.
4. Tagore, G. V 1996, Saivism. D.K. Print World (P) Ltd. New Delhi - 110015.
5. Thimma Reddy, K. 1994. Saivism. Telugu University Hyderabad.

* * *

# శైవ వాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల అధ్యయనం

ప్రాచీన సాహిత్యాన్ని సామాజిక దృష్టితో పరిశీలించాల్సిన అవసరం ఈ పరిశోధన ద్వారా గుర్తింపబడింది. చరిత్రలో ఉపశ్రేణి వర్గాల ప్రాధాన్యాన్ని తెలుసుకోవలసిన ఆవశ్యకతను సమాజ శాస్త్ర అధ్యయనాలు గుర్తించాయి. ఇటువంటి ఉపశ్రేణి వర్గాల గురించిన సాహిత్యం లిఖితంగా వెలువడలేదు. కానీ దేశి సాహిత్యశాఖలో ఈ విధమైన అంశాలు కొన్ని సూచన మాత్రంగా కనిపిస్తున్నాయి. సాహిత్యం ఉపశ్రేణి వర్గాల చరిత్ర రచనకు దోహదకారి కాగలదు అన్న వాస్తవాన్ని ఈ పరిశోధన తెలియజేయగలదు. దేశి సాహిత్యశాఖలో చెప్పుకోదగిన సాహిత్య ఉద్యమంగా శివకవుల రచనలను గుర్తించవచ్చు. అందువల్ల వీరి రచనల ఆధారంగా ఉపశ్రేణివర్గాల సామాజిక జీవితాన్ని పరిశీలించే ప్రయత్నం ఈ పరిశోధనలో కనిపిస్తుంది. పరిశోధనలో అవసరాన్ని బట్టి చరిత్ర రచనలలోని అంశాలనూ తీసుకోడం జరిగింది. 'ఉపశ్రేణి' అన్న పదాన్ని ఆంగ్లంలో అనే పదానికి సమానార్థకంగా గ్రహించటం జరిగింది.

భూస్వామ్య వ్యవస్థ స్థిరపడిన తర్వాత సమాజం రెండు వర్గాలుగా కనిపిస్తుంది. ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో పురోగమిస్తున్న వర్గాన్ని ఉన్నతశ్రేణి వర్గంగాను, పై రంగాలలో దిగువ స్థాయిలో ఉండి శ్రమజీవనాన్ని గడుపుతూ, పై వర్గాలను అనుసరించడానికి ప్రయత్నించే వర్గాన్ని ఉపశ్రేణిగాను ఈ పరిశోధలో తీసుకోడం జరిగింది. ఉన్నతశ్రేణి కంటే భిన్నమైన సామాజిక, సాంస్కృతిక జీవన విధానం ఉపశ్రేణికి ఉంటుంది.

శివకవుల రచనల ఆధారంగా శైవ వాఙ్మయ పరిధిని నిర్ణయించడం కూడా ఈ పరిశోధనలో గుర్తించాల్సిన మరో అంశం. శైవ వాఙ్మయంలో ఉపశ్రేణి వర్గాల సామాజిక, సాంస్కృతిక జీవనం ఎలా ప్రతిఫలించింది అన్న అంశం ప్రధానంగా ఈ పరిశోధనలో అధ్యయనం చేయబడింది.

శైవ వాఙ్మయానికి అంటే శివకవులు ఎవరు ? ఎందుకు ? అనే ప్రశ్నలకు లక్ష్యనిర్దేశం చేసి వారి రచనలనే పరిశోధన పరిధిలోకి తీసుకోడం జరిగింది. ఈ రచనలలో ఉన్న ఉపశ్రేణి వర్గాల జీవితాలను అధ్యయనం చేయడంతో పాటు ఆ కాలానికి చెందిన చరిత్ర గ్రంథాల ఆధారంగా ఉపశ్రేణి వర్గాల చరిత్రనూ క్లుప్తంగా పరిచయం చేయడం పరిశోధనా క్రమంలో భాగం.

చరిత్రకు, శివకవుల రచనలకు మధ్య సమన్వయాన్ని సాధిస్తూ అంటే చారిత్రక ఆధారాలను పరిధిలోకి తీసుకుంటూ శైవ వాఙ్మయాన్ని, అందులోని ఉపశ్రేణి వర్గాల ప్రజల జీవితాలను పరిశీలించడం మరో ముఖ్యభాగం. లక్ష్యం ఏదైనా పరిశోధనలో సాహిత్యం ఆధారంగా సమాజ స్వరూప స్వభావాన్ని చూపడానికి ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నం ఉపశ్రేణి వర్గాలకు ప్రాతినిధ్యం వహించేది. వ్యవసాయం, స్త్రీలు, కులవ్యవస్థ, కులాధిపత్యం, మతం ఇలాంటివన్నీ సమాజంలోని ఉపశ్రేణి వర్గప్రజల జీవితాలతో ఎలా మమేకమై ఉంటాయి. వారిపై ఎలా ప్రభావాన్ని చూపుతాయి, ఎలా ప్రభావితం అవుతాయి. అన్న అంశాలు చర్చ ఈ పరిశోధనలో కనిపిస్తుంది.

పై లక్ష్యాలను, లక్షణాలను దృష్టిలో ఉంచుకొని ఈ పరిశోధన చేయడానికి ప్రధానంగా కొన్ని అధ్యాయాలుగా విషయాలను విభజించాను. అవి.

1. సాహిత్యం - సమాజం - మతం
2. శైవమతం - శైవ సాహిత్యం
3. క్రీ.శ. 12, 13 శతాబ్దాల సమాజం - ఉపశ్రేణి వర్గాల పరిచయం
4. శైవ వాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల జీవనం

పై అధ్యాయాలలోని విషయాలు క్లుప్తంగా క్రింది విధంగా ఉన్నాయి.

### 1. సాహిత్యం - సమాజం - మతం

సాహిత్యం, సమాజం పరస్పరం సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఒకదానిని మరొకటి ప్రభావితం చేసుకుంటూ ఉంటాయి. సృజనకారుడయిన రచయిత సమాజంలో ఒక వ్యక్తి. అతడు సమాజంలోని విషయాల పట్ల స్పందించి

రచన చేస్తాడు. ఆ రచన సమాజంపై ప్రభావం చూపి, అభివృద్ధికి కారణమవుతుంది.

ఏ సాహిత్యమైనా సమాజాన్ని వీడి ఉండదు. తనకు ఎటువంటి రచన కావాలో ఆ సమాజమే సృష్టించుకుంటుంది. ఆ కాలం నాటి పరిస్థితులు, చారిత్రక అవసరాలు, వర్తమానం ఆశించే భవిష్యత్తు, రచయిత జీవన విధానం, అతడి స్థాయి మొదలైన వన్నీ సమాజం రచనపై చూపే ప్రభావాలు. సాహిత్యానికి పరమావధి ప్రజలను జ్ఞానవంతులుగా చేసి ప్రగతి మార్గంలో నడపడం.

'సాహిత్యం - సమాజం - మతం' అనే ఈ అధ్యాయం సాహిత్యానికి, సమాజానికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది. శివకవుల రచనలలో మతం ప్రధాన విషయం కాబట్టి మతానికి, సాహిత్యానికి, సమాజానికి ఉన్న అంతర్గత సంబంధాలను స్థూలంగా పరిచయం చేయడం జరిగింది. అదేవిధంగా తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన సామాజిక మత అంశాలను కూడా క్లుప్తంగా పరిచయం చేయడం జరిగింది.

దీనిలోని ఉపవిభాగాలు :- సాహిత్యం - సమాజం, తెలుగు సాహిత్యం - సమాజం, ప్రాచీన సాహిత్యం - సమాజం, సాహిత్యం - మతం, తెలుగు సాహిత్యం - మతం, ప్రాచీన సాహిత్యం - మతం, ఆధునిక సాహిత్యం - మతం.

## 2. శైవమతం - శైవసాహిత్యం

ఈ అధ్యాయం శైవమతానికి, శైవసాహిత్యానికి సంబంధించింది. ఆదిమ మానవుడు ప్రకృతిని అర్థం చేసుకొనే క్రమంలో ఒక అతీంద్రియ లేదా అలౌకిక శక్తిని సృష్టించుకున్నాడు. అధికార వర్గం బలపడిన తర్వాత మానవ జీవన క్రమంలో అర్థంకాని అంశాలను ఆ అతీంద్రియ శక్తికి ఆపాదించడంతో పాటు దేవుడిపేర కొన్ని క్రతువులు చేయడం ప్రారంభమైంది. కాలక్రమంలో కొన్ని రకాల కార్యక్రమాలు ఏర్పడి మతంగా రూపొందాయి. దేవుడి రూపకల్పన, మతాల ఆవిర్భావం వేరువేరు మానవ తెగలలో వేరువేరు ప్రాంతాలలో భిన్న రకాలుగా ఏర్పడ్డాయి.

ప్రజలలోని మత ప్రాధాన్యతను గుర్తించిన అధికారవర్గం, మత కార్యక్రమాలను నిర్దేశిస్తూ, కొన్ని సైద్ధాంతిక నియమాలను బ్రాహ్మణులచే ఏర్పాటు చేయించింది. అవి కాలక్రమంలో బలపడుతూనే మార్పునూ పొందాయి. ఇలా మతం దైనందిన జీవితాల నుండి విడదీయలేని ప్రాధాన్యతను సంతరించుకుంది.

మతాల పరిణామంలో భాగంగా వాటితో అనేకశాఖలు ఏర్పడ్డాయి. మతం ప్రజల జీవితాలను నిర్దేశించే శక్తిగా కూడా ఎదిగింది. మతం సమాజంలో ఒక ప్రధాన భాగమైంది. ఇదే విధంగా శైవమతం కూడా ఆవిర్భవించింది. శైవమత వ్యాప్తికి శైవసాహిత్యం తోడ్పడింది.

ఈ అధ్యాయంలో శైవమతానికి, శైవసాహిత్యానికి మధ్యగల సంబంధాలు, శివకవులను నిర్ధారించడం అనే అంశాలు పరిశీలించబడ్డాయి. తర్వాత తెలుగు సాహిత్యంలో శివకవుల ప్రాధాన్యతను, శైవసాహిత్య లక్షణాలను తెలుపుతూ శివకవుల రచనలను పరిచయం చేయడం జరిగింది.

దీనిలోని ఉపవిభాగాలు :- శైవమతం - తత్త్వం, శైవమతం - దక్షిణ భారత దేశంలో వ్యాప్తి, శివకవులు, శివకవులు - తెలుగు సాహిత్యం, శైవసాహిత్యం - లక్షణాలు, శివకవులు - రచనల పరిచయం.

### 3. క్రీ.శ. 12, 13 శతాబ్దాల సమాజం - ఉపశ్రేణి వర్గాల పరిచయం

మూడవ అధ్యాయం క్రీ.శ. 12, 13 శతాబ్దాల సమాజం ఉపశ్రేణి వర్గాల పరిచయం. ఈ అధ్యాయంలో ప్రధానంగా శివకవులనాటి సమాజం అంటే క్రీ.శ. 12, 13 శతాబ్దాల కాలంనాటి సమాజ స్వరూప పరిశీలన జరిగింది. ఈ కాలంలో ఆంధ్రదేశాన్ని కాకతీయులు పాలించారు. అందువల్ల ఆకాలంనాటి చరిత్ర ఆధారంగా ఉపశ్రేణి వర్గాల సామాజిక జీవితాన్ని క్లుప్తంగా పరిచయం చేయడం జరిగింది. ఆ కాలంలో భిన్న మతాలు, కులాలు, వారి ఆచార సంప్రదాయాలు అంటే సాంస్కృతిక అంశాలను స్థూలంగా పరిచయం చేయడం ఈ అధ్యాయంలో గమనించవచ్చు.

దక్షిణ భారత దేశంలో 12 వ శ॥ చివరి కాలానికి చాళుక్యులు చోళులు తమ ప్రాభవాన్ని కోల్పోయారు. అందువల్ల కొంతమంది ప్రాంతీయ పాలకులు విజృంభించడం ప్రారంభమైంది. కాకతీయ వంశానికి చెందిన గణపతి దేవుడు, వెలనాటి వంశానికి చెందిన పృథ్వీశ్వరుడు ప్రాంతీయ రాజ్యాలను స్థాపించిన వారిలో ముఖ్యులు. గణపతి దేవుడు పృథ్వీశ్వరుల్ని ఓడించి ఆ రాజ్యాన్ని కాకతీయరాజ్యంలో కలుపుకొన్నాడు. గణపతిదేవుడు ఈ రాజకీయ కుటుంబంలో ప్రసిద్ధుడు. తన రాజ్యాన్ని కంజీవరం వరకు విస్తరింపచేశాడు.

గణపతి దేవుని తర్వాత అతని కూతురు రుద్రమాంబ రాజ్యాన్ని విస్తరించి పాలించింది. తరువాత రుద్రమాంబ మనుమడు రెండవ ప్రతాపరుద్రుడు ఎక్కువకాలం రాజ్యపాలన చేశాడు. (1296 - 1323) చివరకు మాలిక్ కాఫరు, ఉల్లాఖాను వంటి తురుష్కుల దండయాత్రల వలన కాకతీయ సామ్రాజ్యం అంతమైంది.

13వ శతాబ్దిలో ఆంధ్రదేశ సమాజ స్థితిగతులను నిర్దేశించిన రాజవంశం కాకతీయులది. వీరి శాసనాలు, నాణేలు, సాహిత్యం ద్వారా ఆనాటి సమాజాన్ని తెలుసుకోవచ్చు. వీరి కాలంలోని క్షత్రియులు, బ్రాహ్మణులు వంటి ఉన్నత వర్గాల గురించి కాకుండా కింది వర్గాల, కులాల ప్రజల జీవనస్థితిని తెలుసుకోవలసి ఉంది. సమాజ స్వరూప స్వభావాలను తెలుసుకోవాలంటే ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేయాలి. సమాజంలో ఎప్పుడూ పై వర్గ సంస్కృతే ఆ సమాజ సంస్కృతిగా ప్రచారంలో ఉంటుంది. కానీ దీనికి కొంత భిన్నంగాను, కొంత సమానంగానూ కింది వర్గాల సంస్కృతి ఉంటుంది. సమాజంలో జీవ లక్షణం కలిగి, ఎక్కువమంది ఆచరణీయులను కలిగిన సంస్కృతి కింది వర్గాలవారిది.

ఆర్థిక, రాజకీయ అంశాలపై ఆధిపత్యం పై వర్గాలకే ఉన్నా సంస్కృతి ప్రజల జీవన విధానంలో పూర్తిగా ముడిపడి ఉంటుంది. ఇప్పటి చరిత్ర సాహిత్యం (లిఖిత) ఎక్కువ భాగం పై వర్గాల జీవితాలను ప్రతిబింబించే విధంగా ఉంటుంది.

12, 13 శతాబ్దాల ఆంధ్రదేశ చరిత్ర కూడా ఎక్కువగా పై వర్గాలకు సంబంధించినదిగా కనబడుతుంది. అయితే ఉపశ్రేణి తరగతుల చరిత్రను తెలుసుకోవలసిన అవసరం ఆధునికంగా ఏర్పడింది. ఈ పరిణామంలో భాగంగా సాహిత్యాన్ని, శాసనాలను, చారిత్రక అంశాలను దృష్టితో ఉంచుకొని 12, 13 వ శతాబ్దాల ఉపశ్రేణి వర్గాల స్వరూప స్వభావాల్ని అంచనా వేయడానికి ప్రయత్నించవచ్చు.

కాకతీయుల పాలనలోని ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించడం ద్వారా ఉపశ్రేణివర్గాల ప్రజల సంస్కృతిని తెలుసుకోవచ్చు. దీనిలో భాగంగా ఈ పరిశీలనలో ఆ కాలంనాటి మతం గురించి, ఏ ఏ మతాలు ఉన్నాయో అధ్యయనం చేయడం జరిగింది. ఆ కాలంలో శైవం, వైష్ణవం, జైనం, బౌద్ధం అనే మతాలు ఉన్నట్లుగా ఈ అధ్యయనం ద్వారా తెలిసింది. ఈ శతాబ్ధాలలో జానపద దేవతల గురించి, మంత్రాలు - తాంత్రిక విద్యలు - నమ్మకాలను గురించి, వర్గ కులాలను గురించి, దీనిలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, బోయలు, చెంచులు, పుళిందులు, గొల్లలు, కాపు/రెడ్డి, కమ్మ, కుమ్మరి, కాసె, సాలెలు, మేదరులు, మంగలి, చాకలి, వడ్రంగి, పిచ్చుక కుంట్లు, దూదేకులు, కాయస్థులు, కుట్టుపనివారు, పంచములు/దళితులు లను గురించి, వీరి జీవన విధానాలను గురించి, అధ్యయనం చేశాను.

ఈ కాలంలో ఉన్నటువంటి అలంకార సామాగ్రి, ఆహార పదార్ధాలు, తూనికలు-కొలతలు, ఆటలు-వినోదాలు, పండుగలు-ఉత్సవాలు-జాతర్లు, వైద్యవిదానం, చెరువులు, నేరాలు-శిక్షలు గురించి కూడా తెలుసుకోవడం జరిగింది. ఇదేవిధంగా ఈ కాలంలో సాంఘీక దురాచారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో దొంగతనం, వేశ్యావృత్తి, మద్యపానం ఎక్కువగా ఉన్నట్లు ఈ అధ్యయనం ద్వారా తెలుసుకోడం జరిగింది.

పై విధమైన అంశాలలో తెలుగు సాహిత్య చరిత్రను చూసినప్పుడు దిగువశ్రేణి వారికి చెందిన జీవిత విశేషాలు అక్కడక్కడ కనిపిస్తాయి. శైవసాహిత్యం దీనికి గనివంటిది. పాల్కుర్కి సోమన వంటి వారి రచనలలో సామాన్యుల

జీవిత విశేషాలు పుష్కలంగా కనిపిస్తాయి. దానిని ఆధారం చేసుకొని ఆ కాలంనాటి జన జీవితానికి సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విశేషాలను ఈ అధ్యయనంలో చర్చించడం జరిగింది. ముఖ్యంగా శైవ వాఙ్మయంలో కనిపించే ప్రజల జీవితం ఆధారంగా ఆ కాలంనాటి సామాజిక చరిత్ర నిర్మాణానికి దోహదం చేసే అంశాలను ప్రతిపాదించడం జరిగింది. అందుకు మూలమైన 12, 13 శతాబ్దాల కాలంనాటి చరిత్ర ఆధారంగా దిగువశ్రేణి వారి జీవన స్థితిగతులను పరిశీలించడం ఈ అధ్యాయంలో జరిగింది.

**4. శైవవాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల జీవనం**

ఈ అధ్యాయంలో ముఖ్యంగా శివకవుల రచనల ఆధారంగా 12, 13 శతాబ్ధాలలోని సామాజిక చరిత్రను వివరించడం జరిగింది. సమాజంలోని ఉపశ్రేణి వర్గానికి చెందిన అంశాలన్నీ శివకవుల రచనలలో కనిపిస్తున్నాయి. ఇవన్నీ సామాన్యుల జీవన విధానాన్ని తెలియజేసేవి. శైవవాఙ్మయంలో ఉపశ్రేణి వర్గాల జీవితం ప్రతిఫలించిన విధానం ఈ అధ్యయనంలో చర్చించిన అంశం. శైవవాఙ్మయం వెలువడిన 12, 13 శతాబ్దాల కాలంనాటి సమాజంలోని కింది కులాలు, వారి జీవితం, వారి సంస్కృతి వంటి అంశాలను పాల్కుర్కి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుల రచనలలో ఏ విధంగా ఉన్నాయో చూపడం ఇక్కడ జరిగింది.

కింది కులాలతోపాటు వ్యవసాయంలో కూలీలుగా ఉంటూ, జీవితాన్ని దుర్భరంగా అనుభవించేవారు, అంటరాని కులాలుగా జీవితాన్ని గడిపేవారు, వేశ్యలుగా ఉంటూ కష్టాలు అనుభవించిన స్త్రీలు ఇలా ఇటువంటి వారి వాస్తవ జీవితాలు శైవవాఙ్మయంలో కనిపిస్తున్నాయి. ఇవన్నీ వీరి రచనలలో ఎలా విశ్లేషించబడ్డాయో, కవిత్వీకరించబడి ఉన్నాయో పరిశీలించడం ఈ అధ్యాయం యొక్క ప్రధాన లక్ష్యం.

ఈ క్రమంలో భాగంగానే ఈ అధ్యాయంలో కులవ్యవస్థ, కులాలు-వృత్తులు దీనిలో బోయలు, వెట్టివారిని గురించి తర్వాత కులం-విద్య, కులం-దేవాలయం, కులం-అస్పృశ్యత, అంత్యకులజులు వీరిలో సూరసానమ్మ,

చాకలి మాచయ్య, శివనాగయ్య వంటివారిని గురించి, కులం-శైవం గురించి వివరించబడింది. అదే విధంగా స్త్రీకి సంబంధించి, వేశ్యల గురించి, వేశ్యావృత్తిని గురించి చర్చించడం జరిగింది. దొంగతనాలు, కొలతలు, దానాలు, ఆర్థిక సంబందాలు, మేదరులు-వ్యాపారం, కూలీలు, వ్యవసాయం, ఉత్పత్తులు గురించి పరిశీలించడం జరిగింది. ఉపశ్రేణి వర్గాల-సంస్కృతిలో క్రీడలు, పండగలు-వినోదాలు, నోములు-వ్రతాలు, తిరునాళ్లు-జాతరులు, వ్యాధులు-వైద్యం, కళలు, గృహ వాతావరణం, మూఢనమ్మకాలు వంటివి అలాగే ఉపశ్రేణి వర్గాలు-మతంలో వీరశైవం, వీరశైవంలో ఉపశ్రేణికి చెందిన భక్తులు, అన్యమత నిరసన, మతస్వేచ్ఛ వంటివాని గురించి అలాగే మిండజంగాలు గురించి స్థూలంగా పరిశీలించడం జరిగింది. ఉదాహరణకు పరిశీలించిన కొన్ని అంశాలను ఈ క్రింద వివరిస్తున్నాను.

**కులాలు**

కాకతీయుల కాలంనాటికి వృత్తులన్నీ శూద్రులే చేసేవారు. గ్రామంలో అవసరమైన అన్ని వస్తువులను తయారు చేయడంలో శూద్రకులాలు ముందుండేవి. గ్రామం యొక్క ఆర్థిక స్థిరత్వం వీరిపై ఆధారపడి ఉండేది. శైవవాఙ్మయంలో వివిధ వృత్తులు చేస్తూ జీవనాన్ని గడిపే అనేక శూద్ర కులాల ప్రస్తావన కనిపిస్తుంది.

బసవపురాణంలో మడివాలు మాచయ్య కథలో పాల్కురికి సోమనాధుడు ఆ కాలంలోని కులాలను, వారి వారి వృత్తులను ప్రస్తావనకు తెస్తాడు. ఇవి బహుశా కాకతీయుల సమకాలీన సమాజంలో ప్రధానమైనవి కావచ్చు. వాటి వివరణ బసవపురాణం చతుర్థాశ్వాసంలో ఉంది.

ఇక్కడ పేర్కొనబడిన కులాలు, ఆయా వృత్తులు ఎక్కువ భాగం సామాజికంగా కింది వర్గానికి చెందినవి. శ్రమకు సంబంధించినవి. ఆర్థిక విధానంలో ప్రధానపాత్ర వహించేవి. ఇటువంటి ఉపశ్రేణి వర్గానికి చెందిన కులాల ప్రస్తావన ఆనాటి శైవసాహిత్యంలో విస్తృతంగా కనిపిస్తుంది.

**దానాలు**

పాల్కురికి సోమనాథుడు శ్రీశైలం గొప్పతనాన్ని చెప్తూ అన్నధానం ఫలితాన్ని పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణంలో చెప్తాడు.

**కూలీలు**

ఆనాటి సమాజంలో ఉన్నతశ్రేణి, శ్రమకు దూరంగా ఉంటూ శ్రమ ఫలితాలను అనుభవించడాన్ని శైవవాఙ్మయం నిరసించింది. సమాజంలో ఉపశ్రేణి వర్గాలు అంటే ఆర్థికంగా కింది స్థాయిలో ఉండేవాళ్ళు, కులపరంగా తక్కువగా చూడబడేవాళ్ళు, శ్రమలో భాగమైన వాళ్ళు కాబట్టి వాళ్ళు ఆర్థిక ఫలాన్ని అనుభవించాలని శైవవాఙ్మయం తెలియజేసింది. అంతేకాకుండా శ్రమ గొప్పదనాన్ని, దాని తత్వాన్ని గొప్పగా శివకవులు తమ రచనల ద్వారా తెలియజేశారు. పాల్కుర్కి సోమన రాసిన అనుభవ సారములోని 144, 145, 146 పద్యాలు శ్రమ చేయవలసిన ఆవశ్యకతను వివరిస్తున్నాయి.

**మేదరులు - వ్యాపారం**

నేటి సమాజంలోని వస్తువిక్రయ కేంద్రాలకు ఆనాడే పునాదిపడ్డట్టు కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ స్వభావాలు ఆనాడే ఉన్నట్లు తెలుస్తొంది. సరుకులను అంగళ్లలో అమ్మడమూ, ఒకచోటనుండి మరోచోటకు రవాణా చేయడమూ, వాటిపై సుంకాలు విధించడమూ మొదలైనవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణాలే. ఇవేకొద్దిగా కాకతీయుల కాలంనాడు కనిపిస్తున్నాయి. ఈ అంశాన్ని తెలియజేస్తూ కూలీలు, వృత్తిపనివారలు ఆర్థిక వ్యవస్థలో ఎలా భాగమయ్యారో పండితారాధ్య చరిత్ర పురాతన ప్రకరణంలో చెప్పబడింది.

వ్యవసాయంతో పాటు వృత్తులలో కూడా వ్యాపార ధోరణి ప్రవేశించిన విధానం పై వాక్యాల వలన తెలుస్తుంది. మేదరులకు కొంత ధనం ఇచ్చి వారిచే చేటలు అల్లించి ఊరూరా తిప్పి అమ్మించి లాభాన్ని ఆర్జించే లక్షణం పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావం. ఉత్పత్తి శక్తులపైనా, ఉత్పత్తి అయిన వస్తువులపైనా గుత్తాధిపత్యం తీసుకొని పెట్టుబడిపెట్టి లాభార్జన చేసే లక్షణం ఆనాడే ఉందని చేటల వేమయ్యగరి కథద్వారా తెలుస్తుంది.

## మతస్వేచ్ఛ

శైవవాఙ్మయం చెప్పిన వీరశైవ మతాంశాలలో గుర్తించదగిన మరో అంశం స్త్రీకి మతస్వేచ్ఛ ఉండడం. శివభక్తులు కాని భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉంది. ఈ సందర్భంలో శివభక్తుడు కాని భర్తను భార్య వదిలివేయవచ్చని, అది తప్పుకాదని శైవసాహిత్యంలో పేర్కొనబడింది.

ఆనాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా కూడా ఇది వాస్తవం. మతావేశంతో ప్రకటించిన స్త్రీ స్వేచ్ఛ అయినా ఇటువంటి ఆలోచనను చెప్పటం శైవవాఙ్మయంలోని గొప్ప అంశంగా గుర్తించాలి. పై భావనను ప్రతిపాదించే విధంగా శివతత్త్వ సారంలోని పద్యాలు ఉన్నాయి.

## దొంగతనాలు

పాల్కుర్కి సోమనాథుడు వర్ణించిన ఈ క్రింది చిన్న కథ వలన ఆనాడు దొంగతనాలు ఎలా ఉండేవో తెలుస్తుంది. దొంగలు దేవాలయంలో దొంగతనానికి ప్రవేశిస్తారు. బసవదండ నాయకుడ్ని చూసి వంకాయల్ని కట్టుకొంగుల్లో శివలింగాలవలే దాచుకుంటారు. అవి బసవన మహిమవల్ల శివలింగాలుగా మరిపోతాయి. దొంగతనం ఎంత సర్వసాధారణమైన విషయమో బసవనపురాణం ద్వితీయాశ్వాసంలో చెప్పబడి ఉంది.

## మిండజంగాలు

వీరశైవమతంలో జంగముడైన విటులను మిండజంగాలు అంటారు. వీరికి మతానుయాయులలో గౌరవప్రదమైన స్థానం ఉంది. వేశ్యలు మిండజంగాలకు భోజన సదుపాయాలను చేకూర్చేవారని పై వాక్యాల వలన తెలుస్తుంది. భక్తులైన విటులకు కూడా సకల సౌకర్యాలతో వేశ్యలు సేవలు చేసేవారని బసవపురాణం ద్వితీయాశ్వాసంలో ఉంది.

ఈ విధంగా శైవవాఙ్మయం-ఉపశ్రేణి వర్గాల అధ్యయనం అనే ఈ పరిశోధనను నాలుగు అధ్యాయాలుగాను, ప్రతి అధ్యాయం కొన్ని ఉప విభాగాలుగా విశ్లేషించడం జరిగింది.

# ఉపయుక్త గ్రంథ సూచి

1. ఆనందారామం, సి. 1987. సమాజం-సాహిత్యం. సికింద్రాబాదు : యం. శేషాచలం & కో.
2. ఆరుద్ర. 1977 సమగ్ర ఆంధ్ర సాహిత్యం. మొదటి సంపుటం. మచిలీపట్టణం : ఎమ్. శేషాచలం అండ్ కంపెనీ.
3. ఎహ్రెన్ బర్గ్, ఇల్యా 1989. రచయితా-శిల్పమూ. తుమ్మల వెంకటరామయ్య (అనుబంధం) హైదరాబాదు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. కనకదుర్గ. పి. 1992. కాకతీయులనాటి సామాజిక జీవనము : విజయవాడ : శ్రీమానస పబ్లికేషన్స్
5. కోదండరామయ్య. తిమ్మావజ్ఝల. 2001, దేశి కవిత్వోద్యమ స్థాపకుడు పాల్కురికి సోమనాథుడు. (ప్రథమ, ద్వితీయ సంపుటాలు). తిరుపతి : శ్రీ కోదండరామ మిత్ర మండలి.
6. క్రిష్టోఫర్ కాడ్వెల్ 2000. భ్రమ-వాస్తవం కవిత్వ మూలాల అధ్యయనం. పాట్లూరి వెంకటేశ్వరరావు (అనుబంధం) ఖమ్మం : సాహితి స్రవంతి ప్రచురణ.
7. చంద్రశేఖరరెడ్డి. డి. (సంపుటి) 1994 తెలుగు సాహిత్యం చారిత్రక నేపథ్యం హైదరాబాదు. ఆంధ్ర సారస్వత పరిషత్.
8. తమ్మయ్య బండారు వ్యాసావళి. కాకినాడ : శ్రీ నిర్మల శైవసాహిత్య గ్రంథమాలిక. కీలక నామ సంవత్సరం.
9. తమ్మయ్య. బండారు. 1969. శివశ్రీ బండారు తమ్మయ్య గారి వ్యాసావళి - కాకినాడ : శ్రీ నిర్మల శైవసాహితీ గ్రంథమాల
10. నారాయణరావు, వేల్చేరు. 1987 తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. హైదరాబాద్ : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్.
11. పాల్కురికి సోమనాథుడు. 2002. బసవపురాణం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.
12. ప్రమీలారెడ్డి. ఎం. 2000. కాకతీయ యుగ సాహిత్యంలో సంస్కృతి. బోస్టన్ - యు. ఎస్. ఎ. : ధీర సాహిత్య సాంస్కృతిక ప్రచురంబు

13. బలరామమూర్తి, ఏటుకూరి. 1966. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర. విజయవాడ. విశాలాంధ్ర ప్రచురణాలయం.

14. మలయశ్రీ. 1990. కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం. హైదరాబాద్ : హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

15. మల్లికార్జున పండితారాధ్యుడు. (12 వ శతాబ్దం) శివతత్త్వ సారము. వెంకటరావు, నిడదవోలు (పీఠికాకర్త). కృష్ణా పత్రిక ప్రచురణలు

16. రంగనాథాచార్యులు. కె.కె. (సంపుటి). 1983 తెలుగులో తొలి సమాజ కవులు. హైదరాబాదు : ఆంధ్ర సారస్వత పరిషత్తు

17. రంగనాధాచార్యులు, కె.కె. 1990. తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక హైదరాబాద్ : ఆంద్ర సార్వస్వత పరిషత్.

18. రమణారెడ్డి. కె.వి. 1997. ప్రాచీన భారతీయ సాహిత్యంలో సామాజిక ప్రతిబింబం ..... : విరసం ప్రచురణ

19. రమాపతిరావు, అక్కిరాజు (వచకర్త). 2001. బసవపురాణం (వచనం). ఓం నమశ్శివాయ సాహితీ సాంస్కృతిక పరిషత్. హైదరాబాదు.

20. రాజు. ఎన్. ఎస్. 1991. శివకవుల రచనలు - సమాజం. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

21. రామకృష్ణయ్య. కోరాడ. 1971. దక్షిణదేశ భాషా సారస్వతములు-దేశి అమలాపురం : కోదాడ నాగేశ్వరరావు.

22. రామకృష్ణశాస్త్రి, శిష్టా. 1948. వీరశైవాంధ్ర వాఙ్మయము. తిరుపతి. తిరుమల తిరుపతి దేవస్థానములు.

23. లక్ష్మీకాంతం, పింగళి. 1976. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

24. లక్ష్మీరంజనం, ఖండవల్లి. 1949. కాకతీయ యుగము. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

25. వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి, పుచ్చా (సంకలన కర్త). 1981. కాకతీయ శాసన సాహిత్యము. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు

26. వెంకటరావు, నిడదవోలు. 1951 ఉదాహరణ వాఙ్మయ చరిత్ర సంగ్రహము మద్రాసు : వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్

27. వెంకటరావు, నిడదవోలు. వీరశైవవాఙ్మయం. సారస్వత వ్యాసములు. (మొ. సంపుటం) సుబ్రహ్మణ్యం, జి.వి. (సంకలనకర్త). హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి

28. వేంకటావధాని, దివాకర్ల 1985 ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము. హైదరాబాదు : ఆంధ్ర సారస్వత పరిషత్తు.

29. శివశంకర్, పాపినేని 1996. సాహిత్యం మౌలిక భావనలు గుంటూరు. పాపినేని ప్రచురణలు

30. సత్యనారాయణ, కంభంపాటి. 1993. ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర హైదరాబాద్ : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్.

31. శివకుమార్, హరి. 2000. కాకతీయుల వైభవము, సాహిత్యము-కళలు-శిల్పము. న్యూఢిల్లీ : మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్

32. సుబ్రహ్మణ్యం, జి. వి. 1994. సాహిత్యంలో చర్చనీయాంశాలు. హైదరాబాదు : తెలుగు అకాడమీ

33. సుశీల, టి. 1979 ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. హైదరాబాదు : గ్రంథకర్త.

34. సుశీల. టి. 1979. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర.. హైదరాబాద్ : ప్రగతి గీతా ప్రెస్.

ENGLISH :

1. Nandimath,S.C 1979. A hand Book of Virasaivism. Motilal Banarsidass. Bungalow Road. Delhi.
2. Rohan A. Dunuwila. 1985. Saiva Siddhanta Thelogys. Motilal Banarsidars: Bungalow Road, Delhi.
3. Sivaraman, K 1973. Saivism in philosophical perspective. Motilal Banarsidass. Bungalow Road, Delhi.
4. Tagore, G. V 1996, Saivism. D.K. Print World (P) Ltd. New Delhi - 110015.
5. Thimma Reddy, K. 1994. Saivism. Telugu University Hyderabad.

* * *

# శైవ వాఙ్మయం - ఉపశ్రేణి వర్గాల అధ్యయనం

**SYNOPSIS OF THE Ph.D.**

**A thesis is submitted to University of Hyderabad in partial fulfillment of requirement for the award of the Degree of Doctor of Philosophy in the Telugu**


*పరిశోధన*

పి. నీరజ

*పర్యవేక్షణ*

ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు


తెలుగులో పి.హెచ్.డి. పట్టా కొరకు

హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన

సిద్ధాంత గ్రంథ ప్రణాళిక

2009

## SYNOPSIS OF THE Ph.D.

**A thesis is submitted to University of Hyderabad in partial fulfillment of requirement for the award of the degree of Doctor of Philosophy in the Telugu**